ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

విజయవాడ 12-12-2025 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 122 | రూ. 6-50 పేజీలు 16 | www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఐటీ హబ్‌గా విశాఖ
నేటి నుండే కాగ్నిజెంట్
కార్యకలాపాలు ప్రారంభం
#ChooseSpeedChooseAP
రాష్ట్ర యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం

ఐటీ హబ్‌గా విశాఖ
నేటి నుండే కాగ్నిజెంట్
కార్యకలాపాలు ప్రారంభం
#ChooseSpeedChooseAP
రాష్ట్ర యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం

ఐటీ హబ్‌గా విశాఖ

నేటి నుండే కాగ్నిజెంట్ కార్యకలాపాలు ప్రారంభం



#ChooseSpeedChooseAP

ఈ సంస్థల ద్వారా
రూ.3,740.31 కోట్ల పెట్టుబడులు
41,967 ఉద్యోగాలు

గౌ॥ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి
శ్రీ నారా చంద్రబాబు నాయుడు
గౌ॥ ఐటీ, ఎలక్ట్రానిక్స్ & విద్యాశాఖల మంత్రి
శ్రీ నారా లోకేష్ గార్లచే

విశాఖలో నేడు కాగ్నిజెంట్ కార్యాలయానికి ప్రారంభోత్సవం
మరియు 9 ఐటీ, ఐటీ ఆధారిత సర్వీస్ సంస్థల
నూతన కార్యాలయ భవనాలకు శంకుస్థాపన

తేదీ : డిసెంబర్ 12, 2025 సమయం : ఉదయం 9:00 గంటలకు
స్థలం : ఐటీ జోన్, మధురవాడ

cognizant, SATTVA, motherson, FLUENTGRID, ACN, Nonrel, Tech Tammina, imaginnovate, QUARKS




జారీచేసిన వారు: సంచాలకులు, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

రాష్ట్ర యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం

(c) eenadu

ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడిన మోదీ

పలు రంగాల్లో పరస్పర సహకారం పెంపుపై చర్చ



దిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం ఫోన్‌లో మాట్లాడారు. ద్వైపాక్షిక ఆర్థిక బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవడం సహా పలు అంశాలపై చర్చించారు. వాణిజ్యం, క్రిటికల్ సాంకేతికతలు, ఇంధనం, రక్షణ, భద్రత వంటి రంగాల్లో పరస్పర సహకారాన్ని విస్తరించుకోవడంపై సమాలోచనలు జరిపారు. ఉమ్మడి ప్రయోజనాలతో ముడిపడి ఉన్న అంశాల్లో మరింత కలిసికట్టుగా పనిచేయాలని మోదీ, ట్రంప్ నిర్ణయించుకున్నారు. భారత్-అమెరికా సమగ్ర అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యంలో పురోగతిని వారు సమీక్షించారు. అన్ని రంగాల్లో ద్వైపాక్షిక సహకారం నిలకడగా బలోపేతం పుంజుకుంటుండటంపై సంతృప్తి వ్యక్తం చేశారు.

జోర్డాన్, ఇథియోపియా, ఒమన్‌లలో పర్యటించనున్న ప్రధాని

ప్రధాని మోదీ ఈ నెల 15 నుంచి 18 వరకు విదేశాల్లో పర్యటించనున్నారు. ఆయన 15న జోర్డాన్‌కు వెళ్తారు. అక్కణ్నుంచి 16న ఇథియోపియాకు చేరుకుంటారు. 17న ఒమన్‌కు వెళ్లి.. 18న స్వదేశానికి తిరుగు ప్రయాణమవుతారు. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై ఆయా దేశాల అధినేతలతో మోదీ చర్చలు జరుపుతారు.

విదేశీ విద్యార్థులు వెళ్లిపోవడం అమెరికాకు సిగ్గుచేటు

- ఇక్కడి ప్రఖ్యాత విద్యాసంస్థల్లో చదివి స్వదేశాలకు వెళ్లడంతో నష్టపోతున్నాం
- ట్రంప్ వ్యాఖ్యలు
- మిలియన్ డాలర్ల గోల్డ్ కార్డును ప్రారంభించిన అధ్యక్షుడు



న్యూయార్క్, వాషింగ్టన్: అమెరికాలోని ప్రఖ్యాత విద్యా సంస్థల్లో చదువుకున్న భారత్, చైనావంటి దేశాలకు చెందిన విద్యార్థులు తిరిగి స్వదేశాలకు వెళ్లిపోవడం తమకే సిగ్గుచేటని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. 'అత్యుత్తమ కళాశాలల నుంచి గ్రాడ్యుయేట్లు అయిన వారు స్వదేశాలైన భారత్‌కు, చైనాకు, ఫ్రాన్స్‌కు వెళ్లాల్సి వస్తోంది. మిగిలిన దేశాలవారూ ఎక్కడి నుంచి వచ్చారో అక్కడికే వెళ్లిపోతున్నారు. వారు ఇక్కడ ఉండటం చాలా కష్టంగా మారింది. ఇది మనకు సిగ్గుచేటు' అని ఆయన పేర్కొన్నారు. బుధవారం శ్వేతసౌధంలో వాణిజ్య ప్రముఖులతో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో రూ.9 కోట్ల విలువైన గోల్డ్ కార్డును (గోల్డెన్ వీసా కార్డు) ట్రంప్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐబీఎం సీఈవో అరవింద్ కృష్ణ, డెల్ సీఈవో మైఖేల్ డెల్ తదితరులు పాల్గొన్నారు. గోల్డ్ కార్డు వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చిందని, వార్టన్, హార్వర్డ్, మిట్‌ల వంటి అత్యుత్తమ అమెరికా విశ్వవిద్యాలయాల నుంచి తాము ఉద్యోగాల్లో నియమించుకున్న విద్యార్థుల కోసం ఈ కార్డును కంపెనీలు కొనుగోలు చేయవచ్చని ట్రంప్ తెలిపారు. 'అత్యుత్తమ కళాశాలల్లో చదువుకున్న విదేశీ విద్యార్థులను తమ సంస్థలో నియమించుకోవడం ఇబ్బందిగా మారిందని యాపిల్ సీఈవో టిమ్ కుక్ చాలాసార్లు నాతో చెప్పారు. ఇది నిజంగానే సమస్యే. గోల్డ్ కార్డుద్వారా ఆ సమస్యకు పరిష్కారం చూపించాం. అంతేకాదు.. ఈ కార్డువల్ల సమకూరే బిలియన్ల కొద్దీ డాలర్లను దేశం కోసం వినియోగిస్తాం. గోల్డ్ కార్డుద్వారా వారిని దేశంలో శాశ్వతంగా ఉంచుకోవచ్చు' అని ట్రంప్ వివరించారు.

ఇదీ గోల్డ్ కార్డు

గోల్డ్ కార్డుకు trumpcard.gov లో దరఖాస్తు చేయవచ్చు. ఈ కార్డును వ్యక్తిగతంగా తీసుకుంటే రూ.9 కోట్లు (మిలియన్ డాలర్లు) చెల్లించాలి. అదే కంపెనీ తీసుకుంటే రూ.18 కోట్లు (2 మిలియన్ డాలర్లు) చెల్లించాలి. ఈ వివరాలను అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ తెలిపారు. ఈ కార్డు తీసుకున్నవారు ఐదేళ్ల తర్వాత పౌరులుగా మారతారు. ఈ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలంటే హోంలాండ్ సర్వీసెస్ ఫీజుగా తొలుత 15,000 డాలర్లు చెల్లించాలి. ఆమోదం పొందాక మిలియన్ డాలర్లు చెల్లించాలి.



అరుణాచల్ ప్రదేశ్‌లో ట్రక్కు లోయలో పడి 18 మంది మృతి

డిబ్రూగఢ్: అరుణాచల్‌ప్రదేశ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకొంది.. ఈ విషయం 3 రోజుల తర్వాత బాహ్య ప్రపంచానికి తెలిసింది. అస్సాంలోని తిన్‌సుకియా ప్రాంతానికి చెందిన కూలీలను తీసుకెళుతున్న ఓ ట్రక్కు వెయ్యి అడుగుల లోతైన లోయలో పడిపోవడంతో కనీసం 18 మంది ప్రాణాలు కోల్పోయారు. సోమవారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. అత్యంత ప్రయాసపడిన తర్వాత బుధవారం సాయంత్రానికి ఓ వ్యక్తి ప్రమాదం నుంచి బయటపడి రాగలిగారు. ఓ టీ ఎస్టేట్‌కు చెందిన 22 మంది కార్మికులతో ప్రయాణిస్తున్న ట్రక్కు.. అరుణాచల్‌లోని అంజా జిల్లాలో ప్రమాదానికి గురైంది. ఇతరులు చేరుకోలేనంత దుర్గమంగా ఆ ప్రాంతం ఉండటంతో ఎవరికీ దీని గురించి తెలియలేదు. మృత్యుంజయుడైన బుధేశ్వర్ దీప్ అనే కార్మికుడు అతి కష్టంమీద సమీపంలోని 'బోర్డర్ రోడ్స్ టాస్క్ ఫోర్స్' (బీఆర్‌టీఎఫ్) లేబర్ క్యాంప్‌నకు వచ్చి ఘటన గురించి చెప్పడంతో యంత్రాంగం అప్రమత్తమైంది. గురువారం ఉదయం సైన్యం సహాయంతో సహాయక చర్యలు ప్రారంభించారు. నాలుగు గంటలు ప్రయత్నించి, అతికష్టం మీద ట్రక్కును గుర్తించారు. 18 మృతదేహాలు కనుగొన్నామని, మరో ముగ్గురి కోసం గాలిస్తున్నామని అధికారులు తెలిపారు.

జన్మనివ్వడం కోసమే వస్తానంటే రానివ్వం: అమెరికా

ఇంటర్నెట్ డెస్క్: అమెరికా వలస విధానాన్ని కఠినతరం చేస్తున్న ట్రంప్ యంత్రాంగం.. ఇతర వీసాలతోపాటు పర్యాటక వీసాల జారీ విషయంలోనూ అనేక జాగ్రత్తలు తీసుకుంటోంది. ఈ క్రమంలో పుట్టబోయే చిన్నారికి పౌరసత్వం అనేది అమెరికా పర్యటన ఉద్దేశమని తాము భావిస్తే.. అటువంటి వీసా దరఖాస్తులను తిరస్కరిస్తామని భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం వెల్లడించింది. ఈ మేరకు సోషల్ మీడియాలో అలర్ట్ జారీ చేసింది.

ఫిబ్రవరి 12న బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికలు

ఢాకా: బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికలు వచ్చే ఏడాది ఫిబ్రవరి 12న జరగనున్నాయి. ఎన్నికల కమిషనరు నసీరుద్దీన్ ఈ విషయం తెలిపారు. నామినేషన్లు సమర్పించడానికి ఈ నెల 29 చివరి తేదీకాగా, ఉపసంహరణకు జనవరి 20వరకూ సమయమిచ్చినట్లు పేర్కొన్నారు. గత ఏడాది జనవరిలో జరిగిన ఎన్నికల్లో హసీనా విజయం సాధించగా.. ఆమెకు వ్యతిరేకంగా అల్లర్లు చెలరేగడంతో 6 నెలల్లోనే ప్రభుత్వం కుప్పకూలిన విషయం తెలిసిందే.

హిమాలయ సానువుల్లో మళ్లీ దూన్ బాస్మతి



హిమాలయ పర్వత సానువుల్లోని డూన్ లోయలో పండే 'దూన్ బాస్మతి' బియ్యం ప్రత్యేకమైన సువాసన, అద్భుతమైన రుచికి ప్రసిద్ధి. సాగు భూమి తగ్గటం, మార్కెట్లో కొత్తరకాలు వెల్లువెత్తడంతో క్రమంగా కనుమరుగైన ఈ బియ్యం సాగును పునరుద్ధరించేందుకు ఉత్తరాఖండ్ ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక చేపట్టింది. ఇందులో భాగంగా దేహ్రాదూన్ జిల్లాలోని సాహస్‌పూర్, వికాస్‌నగర్ రైతులను సంప్రదాయ టైప్-3 దూన్ బాస్మతి సాగుకు ఎంపిక చేశారు. విత్తనాల ఎంపిక మొదలు నాటడం, ఆధునిక సాంకేతికత, వాతావరణ ఆధారిత సాగు శిక్షణ, మార్కెట్ అనుసంధానం వరకు ఈ రైతులకు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయశాఖలు మార్గనిర్దేశం చేశాయి. దేహ్రాదూన్ జిల్లా అధికార యంత్రాంగం ఈ ప్రాజెక్టును ప్రత్యక్షంగా పర్యవేక్షించగా.. ఇప్పుడే సాగు పంటలు కూడా అందుతున్నాయి. కిలో రూ.65 లెక్కన రైతుల నుంచి 200 క్వింటాళ్ల దూన్ బాస్మతి బియ్యాన్ని రూ.13 లక్షలకు అధికారులు కొనుగోలు చేశారు. స్వయం సహాయక సంఘాల మహిళలను ఇందులో భాగస్వాములను చేసి, వచ్చే ఏడాదికల్లా బియ్యం ఉత్పత్తిని మరింతగా పెంచనున్నట్లు దేహ్రాదూన్ చీఫ్ డెవలప్‌మెంట్ అధికారి అభినవ్ షా తెలిపారు.

ప్రయాణికులకు రూ.10 వేల వోచర్లు

- ఇండిగో సంస్థ ప్రకటన
- 3-5 తేదీల మధ్య ఇబ్బందిపడ్డ వారికి పరిహారం

దిల్లీ, ముంబయి: నిర్వహణ లోపాల కారణంగా విమాన సర్వీసులు రద్దయి విమానాశ్రయాల్లో ఇబ్బందిపడ్డ ప్రయాణికులకు ఇండిగో సంస్థ వోచర్ల రూపంలో పరిహారం ప్రకటించింది. ఈ నెల 3వ తేదీ నుంచి 5వ తేదీ మధ్యలో ఇబ్బందిపడ్డ వారికి రూ.10,000 చొప్పున ప్రయాణ వోచర్లను ఇవ్వాలని నిర్ణయించింది. వీటిని ఏడాదిలో ఎప్పుడైనా టికెట్లు బుక్ చేసుకునేందుకు వినియోగించుకోవచ్చని గురువారం వెల్లడించింది. అయితే ఎంత మందికి ఈ వోచర్లను ఇచ్చేదీ ప్రకటించలేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. ఇస్తామన్న రూ.5,000 నుంచి రూ.10,000 పరిహారానికి ఇది అదనమని వివరించింది.

■ గురువారం 1,950 విమాన సర్వీసులను నడిపినట్లు ఇండిగో సంస్థ ప్రకటించింది. 3 లక్షల మందిని గమ్యస్థానాలకు చేర్చామని తెలిపింది. గురువారం దిల్లీ, బెంగళూరుల్లో 200 విమాన సర్వీసులు రద్దయ్యాయి.

■ డీజీసీఏ విచారణ కమిటీ ఎదుట గురువారం ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్ విచారణకు హాజరయ్యారు. శుక్రవారం మళ్లీ రావాల్సిందిగా ఆయనను కమిటీ ఆదేశించింది. విమాన సేవల అంతరాయాలకు సంబంధించి ఆయనను కమిటీ పలు ప్రశ్నలు అడిగినట్లు సమాచారం.

■ ఇండిగో కార్యాలయాల్లో డీజీసీఏ అధికారుల పర్యవేక్షణ ప్రారంభమైంది. గురువారం ముంబయిలోని ప్రధాన కార్యాలయానికి వెళ్లిన అధికారులు.. ఆపరేషన్స్‌ను, టికెట్ల డబ్బు రిఫండ్‌లను పర్యవేక్షించారు.

ఇతరుల గురించి అతిగా ఊహించుకోకండి



చాలా మంది కొత్తగా ప్రయత్నించకపోవడానికి కారణం వైఫల్యాలకు భయపడటే కాదు. తమ వైఫల్యాలను చూసి ఇతరులు తమను అనుమానిస్తారేమోనని వాళ్లే అతిగా ఊహించుకుంటుంటారు. అయితే మీ గురించి పట్టించుకునే తీరిక ఎవ్వరికీ లేదు. ఎవరి జీవితంలోని సమస్యలతో వారు బిజీగా ఉన్నారని తెలుసుకోండి. అందుకే నిర్భయంగా ప్రయత్నించండి.

– డేనియల్ ఆరోన్, ఆర్కిటెక్ట్

19 నుంచి ప్రజా సమస్యల పరిష్కార వారం: కేంద్రం

దిల్లీ: దేశవ్యాప్తంగా ఈ నెల 19 నుంచి 25 వరకు ప్రజా సమస్యల పరిష్కార వారాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహించనుంది. 'ప్రశాసన్ గావ్ కీ ఓర్' పేరుతో నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా అధికారులు, సిబ్బంది ఇంటింటికీ తిరిగి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించడంతోపాటు ప్రజా సేవల మెరుగుదలకు చర్యలు చేపడతారు. సుపరిపాలన-2025లో భాగంగా దీనిని చేపడుతున్నట్లు గురువారం సిబ్బంది, ప్రజా సమస్యలు, పెన్షన్ల మంత్రిత్వశాఖ అధికారిక ప్రకటన విడుదల చేసింది. కేంద్రీకృత ప్రజా సమస్యల పరిష్కారం, పర్యవేక్షణ వ్యవస్థ (సీపీజీఆర్ఏఎంఎస్), రాష్ట్రాల పోర్టళ్లలో నమోదు చేసిన సమస్యలను ఈ వారంలో పరిష్కరిస్తారు.

ప్రజాగ్రహానికి తలొగ్గి బల్గేరియా సర్కారు రాజీనామా

సోఫియా: అవినీతి, ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్త నిర్వహణపై దేశవ్యాప్తంగా ప్రజాగ్రహం వెల్లువెత్తడంతో బల్గేరియాలోని సంకీర్ణ ప్రభుత్వం గురువారం పైదొలగింది. ప్రతిపక్షం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరగడానికి కొద్దిసేపటి ముందు జీఈఆర్‌బీ పార్టీ నేతృత్వంలోని ప్రభుత్వం రాజీనామా చేసింది. అవిశ్వాసానికి ముందే రాజీనామా చేస్తున్నామని ప్రధాని రోసెన్ జెలియాజ్కోవ్ ప్రకటించారు. పన్నుల పెంపు, సామాజిక భద్రత చందా పెంపు బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రతిపాదించింది. దీంతో దేశవ్యాప్తంగా నిరసన వెల్లువెత్తింది. చివరకు ప్రభుత్వం బడ్జెట్‌ను ఉపసంహరించుకుంది. అయినా ఆందోళనలు ఆగలేదు. విద్యార్థులు ఆందోళనలకు దిగారు. లక్ష మంది ర్యాలీలో పాల్గొన్నారు. దీంతో ప్రభుత్వం తలొగ్గింది.

వంటగది సాధనాలతో సిద్ధంగా ఉండండి



- సర్‌పై మహిళలకు పిలుపునిచ్చిన మమతా బెనర్జీ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై ఆగ్రహంతో ఉన్న సీఎం మమతా బెనర్జీ తాజాగా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఓటరు జాబితాలో పేర్ల తొలగింపునకు గురైతే మహిళలు వంటగదిలోని సాధనాలతో సిద్ధంగా ఉండాలంటూ రెచ్చగొట్టేలా పిలుపునిచ్చారు. "ఓటరు జాబితాలో మీ పేరు లేకపోతే.. వంటగదిలో వాడే పరికరాలు ఉన్నాయి కదా..! వంట చేసేటప్పుడు వినియోగించే ఆ సాధనాలు మీ బలం. వాటితో మహిళలు ముందుండి పోరాడతారు. మగవాళ్లు వారి వెనక ఉంటారు. మహిళలా లేక భాజపానా..? ఎవరు బలవంతులో చూడాలని అనుకుంటున్నాను" అని నదియా జిల్లాలో నిర్వహించిన ర్యాలీలో మమత పేర్కొన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లోపు రాష్ట్రంలో సర్ ప్రక్రియ ద్వారా 1.5 కోట్ల మంది ఓటర్లను ఓటరు జాబితా నుంచి తొలగించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షాను 'ప్రమాదకారి'గా మమత పేర్కొన్నారు. సర్ ప్రక్రియకు సంబంధించి తాను ఫారమ్‌ను నింపలేదని మమత చెప్పారు. "ఓ బీఎల్‌వో సర్ ఎన్యూమరేషన్ ఫారమ్‌తో నా ఇంటికి వచ్చారు. కానీ నేను దాన్ని తీసుకోలేదు. విద్రోహకారుల పార్టీకి (భాజపాను ఉద్దేశించి) నేను పౌరసత్వాన్ని నిరూపించుకోవాలా?" అని ఆమె ప్రశ్నించారు.

యుద్ధం ముగింపునకు ఉక్రెయిన్ శాంతి ప్రణాళిక

- అమెరికాకు అందజేశామన్న జెలెన్‌స్కీ



జెలెన్‌స్కీ


కీవ్: యుద్ధం ముగింపునకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళికపై అసంతృప్తితో ఉన్న ఉక్రెయిన్.. సొంతంగా 20 పాయింట్ల శాంతి ప్రణాళికను రూపొందించింది. దాన్ని అమెరికాకు బుధవారమే అందజేసినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. రష్యాకు డాన్‌బాస్ ప్రాంతాన్ని అప్పగించడం తమకు ఎంతమాత్రమూ అంగీకారయోగ్యం కాదని స్పష్టం చేశారు. యుద్ధం ముగిశాక.. ఉక్రెయిన్ పునర్నిర్మాణం, ఆర్థిక అభివృద్ధికి సంబంధించిన విస్తృత ప్రణాళికపై అమెరికాతో చర్చిస్తామన్నారు. యుద్ధం ముగింపు దిశగా కీవ్‌కు మద్దతుగా ఉన్న 30 దేశాల అగ్ర నాయకులతో జెలెన్‌స్కీ వీడియో సమావేశం నిర్వహించనున్నారు. నూతన శాంతి ప్రతిపాదనలపై వారితో విస్తృతంగా చర్చించే అవకాశముంది.

ఎన్నికలకు సిద్ధమే

ఉక్రెయిన్‌లో అధ్యక్ష ఎన్నికలు జరగాలని, వాటిని ఆపేందుకు యుద్ధాన్ని సాకుగా వాడుకుంటున్నారని ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై జెలెన్‌స్కీ స్పందించారు. మిత్ర దేశాలు తమ భద్రతకు హామీ ఇస్తే.. రానున్న 60-90 రోజుల్లో ఉక్రెయిన్‌లో ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రస్తుతం తమ దేశంలో మార్షల్ లా అమల్లో ఉందని గుర్తుచేశారు. మరోవైపు రష్యా దాడులు కొనసాగుతుండగా, ఎన్నికలు ఎలా నిర్వహిస్తామని ప్రశ్నించారు. సైనికులు ఎలా ఓటు వేస్తారు? ఆక్రమిత ప్రాంతాల్లో ప్రజలు ఎన్నికల్లో ఎలా పాల్గొంటారు? అనే ప్రశ్నలకు సమాధానం కావాలని జెలెన్‌స్కీ పేర్కొన్నారు.

ఆక్రమణదారులను ఖాళీ చేయించడంలో రాష్ట్ర అద్దె చట్టాలపై కేంద్ర శాసనమే చెల్లుతుంది

- సుప్రీంకోర్టు కీలక తీర్పు



దిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థలు(పీఎస్‌యూ) తమ ఆస్తులను తిరిగి పొందడానికి దోహదపడే కీలకమైన నిర్ణయాన్ని సుప్రీంకోర్టు గురువారం వెలువరించింది. ఏదైనా ఆస్తిపై వివాదం తలెత్తితే... రాష్ట్రాలు తీసుకొచ్చిన అద్దె చట్టాల కన్నా కేంద్ర ప్రభుత్వం 1971లో చేసిన ప్రభుత్వ ప్రాంగణాల (ఆక్రమణదారులను ఖాళీ చేయించడం) శాసనానిదే పైచేయి అవుతుందని త్రిసభ్య ధర్మాసనం తీర్పునిచ్చింది. ప్రభుత్వ ప్రాంగణాల చట్టం.. వెనుకటి తేదీ నుంచి కూడా వర్తిస్తుందని తెలిపింది. జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ), జాతీయ బ్యాంకులు వంటి ప్రభుత్వ రంగ సంస్థల భూముల్లో 1958 నుంచి తిష్ఠ వేసిన వ్యక్తులనూ ఖాళీ చేయించటానికి ఈ చట్టం ఉపకరిస్తుందని పేర్కొంది. ఈ విషయంలో రాష్ట్రాల అద్దె చట్టాల్లోని నిబంధనలు అవరోధంకాబోవని స్పష్టం చేసింది. త్రిసభ్య ధర్మాసనంలో జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.అంజరియా సభ్యులుగా ఉన్నారు. ప్రభుత్వ ప్రాంగణాల చట్టం, రాష్ట్ర అద్దె నియంత్రణ చట్టాల్లోని నిబంధనలకు సంబంధించి ఏర్పడిన ఓ వివాదంలో 2015 మార్చి 17న సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును త్రిసభ్య ధర్మాసనం తప్పుపట్టింది. ఇలాంటి వివాదంలో అయిదుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పునకు భిన్నంగా ద్విసభ్య ధర్మాసన నిర్ణయం ఉందని ఆక్షేపించింది.

భర్త చనిపోయిన 23 ఏళ్లకు పరిహారం

మేం కోరేది పేదల ముఖంపై చిరునవ్వునే: సీజేఐ

దిల్లీ: భర్తను కోల్పోయిన మహిళకు 23 ఏళ్ల తర్వాత రైల్వే నుంచి పరిహారం అందింది. సుప్రీంకోర్టు జోక్యంతో పోలీసు వ్యవస్థ, రైల్వే కలిసి ఆమె ఆచూకీని ఎట్టకేలకు గుర్తించి రూ.8.92 లక్షల పరిహారం చెల్లించగలిగాయి. దీనిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం గురువారం సంబంధిత వర్గాలను అభినందించింది. 2002 మార్చి 21న విజయ్‌సింగ్ అనే వ్యక్తి బిహార్‌లోని భక్తియార్‌పుర్ రైల్వేస్టేషన్ నుంచి టికెట్ తీసుకుని భాగల్పూర్-దానాపుర్ ఇంటర్‌సిటీ రైల్లో పట్నా వెళ్తూ.. కదులుతున్న రైలు నుంచి జారిపడి ప్రాణాలు కోల్పోయారు. మృతుడికి మతిస్థిమితం లేదంటూ రైల్వే ప్రమాద క్లెయిముల ట్రైబ్యునల్, పట్నా హైకోర్టు అతడి భార్య సన్యోక్తా దేవి వినతిని తిరస్కరించాయి. 2023లో హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది. బాధితురాలికి వడ్డీతో సహా పరిహారం ఇవ్వాల్సిందేనని ఈ ఏడాది అక్టోబరు 6న స్పష్టంచేసింది. బిహార్‌లోని మారుమూల గ్రామం నుంచి ఆమె ఇల్లు మారిపోవడం, ఎవరికీ ఆచూకీ తెలియకపోవడంతో ఆ పరిహారం ఇవ్వడం సమస్యగా మారింది. అనేక ప్రభుత్వ విభాగాలు రంగంలో దిగి ఆమెను గుర్తించి, పరిహారాన్ని ఇవ్వగలిగాయి. ఈ విషయంలో ధర్మాసనం సంబంధిత వర్గాలను అభినందించింది. 'పేదవాళ్ల ముఖంపై చిరునవ్వునే తప్ప తాము కోరుకునేది మరొకటి ఉండదని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

అమిత్ షా ఒత్తిడిలో ఉన్నట్లున్నారు: రాహుల్



దిల్లీ: లోక్‌సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రసంగం చూస్తే ఆయన ఒత్తిడిలో ఉన్నట్లనిపించిందని విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. గురువారం పార్లమెంటు ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ''అమిత్ షా వాడిన భాష, ఆయన చేతులు వణుకుతుండటం అంతా చూసే ఉంటారు. మానసికంగా ఆయన ఒత్తిడి ఎదుర్కొంటున్నట్లు స్పష్టంగా కనిపించింది. నేను సంధించిన ఏ ప్రశ్నకూ ఆయన నేరుగా సమాధానం చెప్పలేదు. దేనికీ ఆధారం చూపించలేదు'' అని విమర్శించారు. విలేకరుల సమావేశాల్లో తాను బహిరంగంగా చేసిన ఆరోపణలపై చర్చకు రావాలని మంత్రికి సవాల్ విసిరినా సమాధానం రాలేదని, వాస్తవాలేమిటో ప్రజలకు తెలుసునని చెప్పారు.

ప్రభుత్వరంగ సంస్థల్ని బలహీనపరిచే కుట్ర

దేశంలో ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)లను బలహీనపరచి, వాటి ఆస్తులను పెట్టుబడిదారులకు ఉచితంగా కట్టబెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. పీఎస్‌యూలను విచ్ఛిన్నం చేసే కుట్ర దేశ భవిష్యత్తుకు హానికరమని అన్నారు. 'భారత్ ఇమ్యూనోలాజికల్స్ అండ్ బయోలాజికల్స్ కార్పొరేషన్ లిమిటెడ్' (బీఐబీసీఓఎల్) ఉద్యోగుల్ని పార్లమెంటులోని తన కార్యాలయంలో ఆయన కలుసుకున్నారు. వారికి కొన్ని నెలలుగా జీతాలు అందడం లేదని చెప్పారు. వ్యాక్సిన్లు తయారు చేసే ఏకైక ప్రభుత్వరంగ సంస్థగా ఇది ఉండేదని, పోలియో వంటి వ్యాధులను నివారించడంలో కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు.

రాహుల్ వ్యాఖ్యలను ఖండించిన భాజపా

అమిత్ షాపై రాహుల్ విమర్శలను కేంద్ర మంత్రి, భాజపా అగ్రనేత గిరిరాజ్ సింగ్ తిప్పికొట్టారు. కొట్టి పారిపోయే సూత్రాన్ని రాహుల్ గాంధీ అవలంబిస్తారని విమర్శించారు. ప్రధాని, హోంమంత్రి మాట్లాడుతున్నప్పుడు రాహుల్ లోక్‌సభ నుంచి బయటకు వెళ్లిపోతారని తప్పుబట్టారు.

హెల్త్‌కేర్ సబ్సిడీల పొడిగింపునకు సెనెట్ నో

వాషింగ్టన్: హెల్త్‌కేర్ సబ్సిడీల పొడిగింపునకు అమెరికా సెనెట్ అంగీకరించలేదు. దీంతో జనవరి 1 నుంచి లక్షల మంది అమెరికన్లపై ఆరోగ్య బీమా భారం భారీగా పెరగనుంది. మరో మూడేళ్ల పాటు సబ్సిడీలను కొనసాగించేందుకు డెమోక్రాట్లు ప్రవేశపెట్టిన 'ఎఫర్డబుల్ కేర్ యాక్ట్ ట్యాక్స్ క్రెడిట్స్' బిల్లును గురువారం సెనెట్ తిరస్కరించింది. ప్రస్తుతం తాత్కాలికంగా సబ్సిడీలకు కొనసాగింపు ఇద్దామని కొంత మంది రిపబ్లికన్లు ప్రతిపాదించినా చివరకు బిల్లు ఆమోదం పొందలేకపోయింది. రిపబ్లికన్ల వాదన మరోలా ఉంది. ఎఫర్డబుల్ కేర్ యాక్ట్ ప్రణాళికలు భారీ వ్యయంతో కూడుకుని ఉన్నాయని, వాటిని పూర్తిగా పునర్వ్యవస్థీకరించాల్సి ఉందని అంటున్నారు. హెల్త్ సేవింగ్స్ ఖాతాల ద్వారా నగదును నేరుగా ప్రజల ఖాతాల్లోకే వేస్తామని, ఇన్సూరెన్సు కంపెనీలకు చెల్లించబోమని చెబుతున్నారు.

5 రాష్ట్రాల్లో సర్ గడువు పొడిగింపు

- అండమాన్ నికోబార్ దీవుల్లోనూ..

దిల్లీ: దేశవ్యాప్తంగా ఐదు రాష్ట్రాలతో పాటు ఓ కేంద్రపాలిత ప్రాంతంలో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) గడువును ఎన్నికల సంఘం (ఈసీ) గురువారం పొడిగించింది. ఆయా రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్య ఎన్నికల అధికారుల నుంచి వచ్చిన వినతులను పరిగణనలోకి తీసుకొని ఈ నిర్ణయం తీసుకుంది. ముందుగా నిర్దేశించిన షెడ్యూలు ప్రకారం తమిళనాడు, గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తర్‌ప్రదేశ్, అండమాన్ నికోబార్ దీవుల్లో సర్ ప్రక్రియ గురువారంతో ముగియాలి. వాటిలో ముసాయిదా ఓటరు జాబితాలను ఈ నెల 16న ప్రచురించాలి. అయితే- తమిళనాడు, గుజరాత్‌లలో సర్ గడువును ఈ నెల 14 వరకు పొడిగిస్తున్నట్లు ఈసీ తాజాగా ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ రెండు రాష్ట్రాల్లో ముసాయిదా ఓటరు జాబితాలను 19న ప్రచురించనున్నట్లు తెలిపింది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, అండమాన్ నికోబార్ దీవుల్లో గడువును 18 వరకు పొడిగించింది. వాటి ముసాయిదా జాబితాలను 23న ప్రచురించనున్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో గడువును ఈ నెల 26 వరకు పొడిగించారు. అక్కడ 31న ముసాయిదా జాబితా విడుదలవుతుంది. మరోవైపు- గోవా, పుదుచ్చేరి, లక్షద్వీప్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్‌లలో సర్ గడువు గురువారంతో ముగిసింది. వాటి ముసాయిదా జాబితాలను 16న ప్రచురించనున్నారు. కేరళలో ప్రత్యేక సమగ్ర సవరణ గడువు 18 వరకు ఉంది. ఆ రాష్ట్రంలో ముసాయిదా ఓటరు జాబితా 23న విడుదలవుతుంది.

వీసా నిబంధనల ఉల్లంఘన.. చైనా జాతీయుడిని స్వదేశానికి పంపిన అధికారులు

శ్రీనగర్: వీసా నిబంధనలను ఉల్లంఘించి, ఎలాంటి అనుమతి లేకుండా లద్దాఖ్, జమ్మూకశ్మీర్ వంటి అత్యంత కీలకమైన ప్రదేశాల్లో పర్యటించిన చైనా జాతీయుడు హు కాంగ్‌తాయ్(29)ను భారత అధికారులు తిరిగి హాంగ్‌కాంగ్‌కు పంపి, బ్లాక్ లిస్టులో చేర్చారు. అతని మొబైల్ ఫోన్‌కు ఫోరెన్సిక్ పరీక్ష పూర్తయ్యాక ఈ చర్య తీసుకున్నట్లు అధికారులు గురువారం తెలిపారు. చైనా పౌరుడైన హు కాంగ్‌తాయ్.. టూరిస్టు వీసాపై గత నెల 19న దిల్లీకి వచ్చాడు. నిబంధనల ప్రకారం వారణాసి, ఆగ్రా, జైపుర్, గయ వంటి ప్రాంతాల్లోని బౌద్ధ క్షేత్రాలను మాత్రమే అతడు సందర్శించాలి. కానీ అతడు ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎఫ్ఆర్ఆర్‌వో)లో నమోదు చేసుకోకుండానే లద్దాఖ్‌లోని లేహ్, జన్స్కర్‌తోపాటు కశ్మీర్ లోయలోని పలు వ్యూహాత్మక ప్రాంతాల్లో పర్యటించాడు. జన్స్కర్ ప్రాంతంలో మూడు రోజులపాటు పర్యటించి, రక్షణపరంగా అత్యంత ముఖ్యమైన ప్రాంతాలను సందర్శించాడు. అతడి ఇంటర్నెట్ బ్రౌజింగ్ హిస్టరీలో సీఆర్‌పీఎఫ్ మోహరింపులు, ఆర్టికల్ 370, భద్రతా ఏర్పాట్లు వంటి విషయాలపై సెర్చ్ చేసినట్లు కనిపించిందని అధికారులు పేర్కొన్నారు. అమెరికాలో తొమ్మిదేళ్లపాటు ఉన్నానని, బోస్టన్ యూనివర్సిటీలో చదువుకున్నానని అతడు దర్యాప్తులో వెల్లడించినట్లు పేర్కొన్నారు.

వకీల్‌సాబ్ వ్యవసాయం భలేగుంది!



ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ జిల్లా నార్వర్‌పూర్‌కు చెందిన అవినాశ్ కుమార్ మౌర్య కూరగాయల సాగుతో ఏటా రూ.40 లక్షల టర్నోవరు సాధిస్తున్నారు. న్యాయవాద విద్య అభ్యసించిన ఈ యువరైతు ఉద్యోగ అవకాశాలు వదులుకొని వ్యవసాయం వైపు మొగ్గుచూపడం విశేషం. గోరఖ్‌పూర్ సివిల్ కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తూ.. మరోవైపు తనకున్న 35 ఎకరాల పొలంలో పలురకాల కూరగాయలు సాగు చేస్తున్నారు. 2017లో ఈ రంగంలోకి వచ్చిన అవినాశ్ ఆరంభ కష్టనష్టాలను అధిగమించి.. ఉద్యాన శాఖ అధికారుల సూచనలతో, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొంటున్నారు. ఎకరం భూమిలో దోస పాదులు వేయగా, మంచి దిగుబడితో మూడు నెలల్లోనే దాదాపు రూ.10 లక్షల ఆదాయం వచ్చింది. ఉద్యానశాఖ సెమినార్లకు హాజరై ఇతర రైతులకు అవగాహన కూడా కల్పిస్తున్న అవినాశ్ దాదాపు 25 మందికి ఉపాధి చూపుతున్నారు. యువరైతులకు ఆదర్శంగా నిలుస్తున్న అవినాశ్‌ను డిసెంబరు 23న చౌధరీ చరణ్‌సింగ్ జయంతి నాడు రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సత్కరించనున్నారు.

శ్రీలంక సీజేకు సుప్రీంకోర్టులో సాదర స్వాగతం

- గౌరవార్థం ప్రత్యేక ధర్మాసనం ఏర్పాటు

దిల్లీ: అధికారిక పర్యటన నిమిత్తం దిల్లీ చేరుకున్న శ్రీలంక సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రీతి పద్మన్ సురసేనకి భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని బృందం సుప్రీంకోర్టులో సాదర స్వాగతం పలికింది. జస్టిస్ ప్రీతి పద్మన్ జులై 27న శ్రీలంక ప్రధాన న్యాయమూర్తి బాధ్యతలు చేపట్టారు. ఆయన వెంట 9 మంది శ్రీలంక జడ్జీల బృందం కూడా గురువారం దిల్లీ చేరుకుంది. ఈ సందర్భంగా భారత సుప్రీంకోర్టులో వారి గౌరవార్థం ప్రత్యేక ధర్మాసనం ఏర్పాటైంది. ఈ ధర్మాసనంలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చితో పాటు జస్టిస్ ప్రీతి పద్మన్ సురసేన కూడా ఆశీనులయ్యారు. అతిథులకు స్వాగతం పలుకుతూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ప్రసంగించారు. రెండు దేశాల మధ్య ఉన్న చారిత్రక బంధాన్ని ఇద్దరు ప్రధాన న్యాయమూర్తులు గుర్తు చేశారు. శ్రీలంక జడ్జీల బృందం భోపాల్‌లోని నేషనల్ జ్యుడీషియల్ అకాడమీని సందర్శించి మూడు రోజుల పాటు అక్కడే ఉంటుందని జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు.

(c) eenadu

ఈనాడు

విజయవాడ 12-12-2025 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 122

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

Joyalukkas
World's favourite jeweller

జోయాలుక్కాస్
వరల్డ్స్ ఫేవరేట్ జ్యువెలర్




(c) eenadu

ఇటు బౌలర్లు.. అటు బ్యాటర్లు

చేతులెత్తేశారు..

రెండో టీ20లో దక్షిణాఫ్రికా చేతిలో భారత్ ఓటమి

తొలి టీ20లో బ్యాటుతో తడబడ్డా హార్దిక్ మెరుపులతో పైచేయి సాధించిన టీమ్ఇండియా.. ఈసారి పరాభవం తప్పించుకోలేకపోయింది. బంతితో డికాక్‌ను నియంత్రించలేక దక్షిణాఫ్రికాకు కొండంత స్కోరునిచ్చిన టీమ్ఇండియా.. ఛేదనలో చతికిలపడి రెండో టీ20లో ఓటమి చవిచూసింది. కెప్టెన్ సూర్య, వైస్ కెప్టెన్ గిల్ మళ్లీ విఫలమయ్యారు. తిలక్ వర్మ పోరాటం వృథా అయింది. సిరీస్‌ను దక్షిణాఫ్రికా 1-1తో సమం చేసింది.


డికాక్ 90


అక్షర్ 21
తిలక్ 62

ముల్లాన్‌పుర్

బ్యాటుతో, బంతితో విఫలమైన టీమ్ఇండియా.. రెండో టీ20లో 51 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా చేతిలో పరాజయంపాలైంది. డికాక్ (90; 46 బంతుల్లో 5×4, 7×6) విరుచుకుపడడంతో గురువారం మొదట దక్షిణాఫ్రికా 4 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది. అర్ష్‌దీప్, బుమ్రా ధారాళంగా పరుగులిచ్చారు. వరుణ్ చక్రవర్తి (2/29) కట్టుదిట్టంగా బౌలింగ్ చేశాడు. ఛేదనలో టీమ్ఇండియా తేలిపోయింది. మరిన్ని విమర్శలకు తావిస్తూ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (5), వైస్ కెప్టెన్ గిల్ (0) మళ్లీ నిరాశపరిచారు. తిలక్ వర్మ (62; 34 బంతుల్లో 2×4, 5×6) గట్టిగానే పోరాడినా.. అది సరిపోలేదు. బార్ట్‌మన్ (4/24), యాన్సెన్ (2/25), ఎంగిడి (2/26) భారత్‌ను దెబ్బతీశారు. మూడో టీ20 ఆదివారం ధర్మశాలలో జరుగుతుంది.

ఛేదనలో తేలిపోయారు: ఛేదనలో టీమ్ఇండియా తడబాటుకు గురైంది. గెలవాలంటే బలమైన ఆరంభం అవసరం కాగా.. ఆ జట్టు 32 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి చిక్కుల్లో పడింది. టీ20ల్లో తన బ్యాటింగ్ చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో గిల్ వైఫల్యం కొనసాగింది. అతడు ఖాతా అయినా తెరవకుండానే తొలి ఓవర్లో ఎంగిడి బౌలింగ్‌లో వెనుదిరిగాడు. సూర్య కూడా అంతే. పేలవ ఫామ్‌ను కొనసాగిస్తూ నాలుగో ఓవర్లో యాన్సెన్‌కు దొరికిపోయాడు. యాన్సెన్ తన అంతకుముందు ఓవర్లో అభిషేక్ (17)ను వెనక్కి పంపాడు. భారత్ చకచకా మూడు వికెట్లు కోల్పోయిన స్థితిలో తిలక్ నిలబడ్డాడు. బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందొచ్చిన అక్షర్ పటేల్ (21; 21 బంతుల్లో 1×4, 1×6)తో కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించాడు. కాసేపు వికెట్ల పతనం ఆగినా.. అక్షర్ ప్రమోషన్ సత్ఫలితాన్నివ్వలేదు. అక్షర్ ధాటిగా ఆడలేకపోయాడు. పరుగుల కోసం కష్టపడ్డాడు. చివరికి ఓ సిక్స్‌తో జోరందుకునే ప్రయత్నం చేసినా.. ఆ వెంటనే వెనుదిరిగాడు. అయితే తిలక్ ధాటిగా బ్యాటింగ్ చేశాడు. సిపమ్లా, లిండ్, ఎంగిడి ఓవర్లలో సిక్స్‌లు బాదాడు. అతడికి హార్దిక్ (20; 23 బంతుల్లో 1×6) అండగా నిలవడంతో భారత్ కాస్త కోలుకుంది. కానీ దూకుడు లోపించడంతో హార్దిక్ ఇన్నింగ్స్‌తో పెద్దగా ఉపయోగం లేకపోయింది. సాధించాల్సిన రన్‌రేట్ విపరీతంగా పెరిగిపోయింది. 15వ ఓవర్లో హార్దిక్ నిష్క్రమించే సమయానికి స్కోరు 118 పరుగులు. ఆఖరి అయిదు ఓవర్లలో 91 పరుగులు చేయాల్సిన స్థితిలో భారత్ ఓటమి దాదాపుగా ఖాయమైపోయింది. తిలక్ వర్మ, జితేశ్ శర్మ (27; 17 బంతుల్లో 2×4, 2×6) కొన్ని చక్కని షాట్లు ఆడినా ఆ దూకుడు ఓటమి అంతరాన్ని తగ్గించడానికి ఉపయోగపడిందంతే. 18వ ఓవర్లో 157/5తో నిలిచిన భారత్.. 5 పరుగుల వ్యవధిలో మిగతా అయిదు వికెట్లు చేజార్చుకుంది. తిలక్ చివరి వికెట్‌గా వెనుదిరిగాడు.

అతడు అలవోకగా..: దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌లో ఓపెనర్ డికాక్ ఆటే హైలైట్. తొలి మ్యాచ్‌లో విఫలమైన అతడు ఈసారి చెలరేగిపోయాడు. విధ్వంసక బ్యాటింగ్‌తో జట్టు భారీ స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. దక్షిణాఫ్రికా టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగగా.. హెండ్రిక్స్ (8)తో కలిసి డికాక్ పరుగుల వేటను ఆరంభించాడు. అలవోకగా షాట్లు ఆడిన అతడు.. మొత్తం ఏడు సిక్స్‌లు బాదేశాడు. అందులో ఎక్కువగా డీప్ స్క్వేర్ లెగ్ ప్రాంతంలోకి కొట్టాడు. తొలి ఓవర్లో అర్ష్‌దీప్ బౌలింగ్‌లో సిక్స్‌తో మొదలైంది డికాక్ జోరు. ఆ తర్వాత ఏ దశలోనూ తగ్గకుండా భారత బౌలర్లందరినీ సునాయాసంగా ఎదుర్కొన్నాడు. ఐపీఎల్ వేలానికి కొన్ని రోజుల ముందు ఈ ఇన్నింగ్స్.. డికాక్‌పై ఫ్రాంఛైజీల్లో ఆసక్తిని పెంచుతుందనడంలో సందేహం లేదు. డికాక్ జోరుతో పవర్ ప్లే ముగిసేసరికి 53/1తో నిలిచింది దక్షిణాఫ్రికా. హెండ్రిక్స్‌ను వరుణ్ ఔట్ చేశాడు. బుమ్రా తన తొలి ఓవర్లో ఒక్క పరుగే ఇచ్చినా... రెండో ఓవర్లో 16 పరుగులు సమర్పించుకున్నాడు. మార్‌క్రమ్ (29) అండగా నిలవగా.. డికాక్ మోత కొనసాగించడంతో దక్షిణాఫ్రికా 10 ఓవర్లలో 90/1తో నిలిచింది. డికాక్ 26 బంతుల్లోనే అర్ధశతకం సాధించడం విశేషం. మరోవైపు ఎదుర్కొన్న తొలి 22 బంతుల్లో 18 పరుగులే చేసిన మార్‌క్రమ్.. వరుణ్ ఓవర్లో వరుసగా రెండు సిక్స్‌లు దంచేశాడు. కానీ అదే ఓవర్లో వెనుదిరిగాడు. అయినా డికాక్ ధాటైన బ్యాటింగ్‌ను కొనసాగించడంతో సఫారీ జట్టు 15వ ఓవర్లో 150 దాటింది. డికాక్ తేలికగా శతకం పూర్తి చేసేలా కనిపించాడు. కానీ 16వ ఓవర్లో వికెట్‌కీపర్ జితేశ్ శర్మ అద్భుత రీతిలో అతణ్ని రనౌట్ చేశాడు. ఆ ఓవర్లో వరుణ్ నాలుగు పరుగులే ఇవ్వడం, తర్వాతి ఓవర్లో అక్షర్ కూడా 4 పరుగులే ఇచ్చి బ్రెవిస్ (14)ను వెనక్కి పంపడంతో దక్షిణాఫ్రికాకు భారత్ కాస్త కళ్లెం వేసినట్లనిపించింది. కానీ డొనోవన్ ఫెరీరా (30 నాటౌట్; 16 బంతుల్లో 1×4, 3×6), మిల్లర్ (20 నాటౌట్; 12 బంతుల్లో 2×4, 1×6) విరుచుకుపడడంతో ఆఖరి మూడు ఓవర్లలో దక్షిణాఫ్రికా 49 పరుగులు రాబట్టింది. ఈ జంట అభేద్యమైన అయిదో వికెట్‌కు 25 బంతుల్లోనే 53 పరుగులు జోడించింది.

అర్ష్‌దీప్.. ఏడు వైడ్లు

ఈ మ్యాచ్‌లో అర్ష్‌దీప్ బౌలింగ్ అత్యంత పేలవం. అతడు నాలుగు ఓవర్లలో 13.50 ఎకానమీతో 54 పరుగులిచ్చాడు. ఇన్నింగ్స్ 11వ ఓవర్లో ఏకంగా ఏడు వైడ్లు వేశాడు. ఇన్నింగ్స్‌లో అతడు మొత్తం 9 వైడ్లు వేశాడు.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ రనౌట్ 90; హెండ్రిక్స్ (బి) వరుణ్ 8; మార్‌క్రమ్ (సి) అక్షర్ (బి) వరుణ్ 29; బ్రెవిస్ (సి) తిలక్ (బి) అక్షర్ 14; ఫెరీరా నాటౌట్ 30; మిల్లర్ నాటౌట్ 20; ఎక్స్‌ట్రాలు 22 **మొత్తం:** (20 ఓవర్లలో 4 వికెట్లకు) **213; వికెట్ల పతనం:** 1-38, 2-121, 3-156, 4-160; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-54-0; బుమ్రా 4-0-45-0; వరుణ్ 4-0-29-2; అక్షర్ 3-0-27-1; హార్దిక్ 3-0-34-0; దూబె 2-0-18-0

భారత్ ఇన్నింగ్స్: అభిషేక్ శర్మ (సి) డికాక్ (బి) యాన్సెన్ 17; శుభ్‌మన్ గిల్ (సి) హెండ్రిక్స్ (బి) ఎంగిడి 0; అక్షర్ (సి) హెండ్రిక్స్ (బి) బార్ట్‌మన్ 21; సూర్యకుమార్ (సి) డికాక్ (బి) యాన్సెన్ 5; తిలక్ వర్మ (సి) మార్‌క్రమ్ (బి) ఎంగిడి 62; హార్దిక్ (సి) బ్రెవిస్ (బి) సిపమ్లా 20; జితేశ్ (సి) బార్ట్‌మన్ (బి) సిపమ్లా 27; దూబె (బి) బార్ట్‌మన్1; అర్ష్‌దీప్ (సి) మిల్లర్ (బి) బార్ట్‌మ్యాన్ 4; వరుణ్ చక్రవర్తి (సి) మార్‌క్రమ్ (బి) బార్ట్‌మన్ 0; బుమ్రా నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 5 **మొత్తం:** (19.1 ఓవర్లలో ఆలౌట్) **162; వికెట్ల పతనం:** 1-9, 2-19, 3-32, 4-67, 5-118, 6-157, 7-158, 8-162, 9-162; **బౌలింగ్:** ఎంగిడి 3.1-0-26-2; యాన్సెన్ 4-0-25-2; సిపమ్లా 4-0-46-2; ఫెరీరా 1-0-14-0; బార్ట్‌మన్ 4-0-24-4; లిండ్ 3-0-23-0

భారత జట్టులో సింధు, లక్ష్యసేన్

ఆసియా టీమ్ ఛాంపియన్‌షిప్


సింధు

దిల్లీ: చైనాలో ఫిబ్రవరి 3న ఆరంభమయ్యే ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ ఛాంపియన్‌షిప్‌లో పోటీపడే భారత జట్టులో పి.వి.సింధు, లక్ష్యసేన్ ఆడనున్నారు. మహిళల విభాగంలో భారత్ డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలో దిగుతోంది. పురుషుల్లో గత టోర్నీలో కాంస్యం గెలిచింది. "ర్యాంకింగ్, ప్రదర్శన, అనుభవం ఆధారంగా భారత జట్లను ఎంపిక చేశాం. మహిళల్లో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్‌కు సింధు కీలకం" అని భారత బ్యాడ్మింటన్ సంఘం వెల్లడించింది. మహిళల సింగిల్స్‌లో సింధుతో పాటు తన్వి శర్మ, ఉన్నతి హుడా, రక్షిత శ్రీ, మాళ్విక బాన్సోద్ జట్టులో ఉన్నారు. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి, ట్రీసా జాలీ, ప్రియ, శ్రుతి మిశ్రా, తనీషా క్రాస్టో సభ్యులు. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్, కిదాంబి శ్రీకాంత్, ప్రణయ్, ఆయుష్ శెట్టి, తరుణ్ మన్నెపల్లి ఆడనున్నారు. డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్, చిరాగ్, పృథ్వీ, సాయి కార్తీక్, హరిహరన్ పోటీలో ఉన్నారు.

ఆ విషయంపై కపిల్ ఏమన్నాడంటే..

దిల్లీ: భారత క్రికెట్‌కు ఏది మంచిదనుకుంటే బీసీసీఐ అది చేయాలని మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్ అన్నాడు. టెస్టులు, పరిమిత ఓవర్ల క్రికెట్లో టీమ్ఇండియాకు వేరు వేరు కోచ్‌లు ఉండాలా అన్న ప్రశ్నకు అతడిలా స్పందించాడు. "నాకు తెలియదు.. జవాబు చెప్పలేను. క్రికెట్‌కు ఏది మంచిదైతే బీసీసీఐ అది చేయాలి" అని అన్నాడు. తాను ఆడే రోజుల్లో కంటే ఈ సోషల్ మీడియా కాలంలో అథ్లెట్‌గా ఉండడం కష్టమన్న అభిప్రాయాన్ని కపిల్ కొట్టిపారేశాడు. "అథ్లెట్‌గా ఉండడం అప్పుడూ కష్టమే.. ఇప్పుడే కష్టమే. అప్పుడూ తేలికే.. ఇప్పుడూ తేలికే. మన ఆలోచన తీరుపై అంతా ఆధారపడి ఉంటుంది" అని అన్నాడు. అన్ని ఫార్మాట్ల క్రికెట్‌ను తాను ఆస్వాదిస్తానని చెప్పాడు.

ఛాంపియన్

ప్రపంచకప్ టికెట్లు రూ.100 నుంచి..

ముంబయి: భారత్-శ్రీలంక ఉమ్మడిగా ఆతిథ్యమిచ్చే టీ20 ప్రపంచకప్‌లో మన దేశంలో టికెట్ ధరలు రూ.100 నుంచి మొదలవుతున్నాయి. శ్రీలంకలో ఈ ధర ఆ దేశ కరెన్సీలో 1000 రూపాయలు (సుమారు రూ.292)గా ఉంది. గురువారమే తొలి దశ టికెట్ల అమ్మకం షురూ అయింది. అందరికి ప్రపంచకప్ వినోదం అందించాలన్న లక్ష్యంతో తక్కువ ధరకే టికెట్లను అమ్ముతున్నట్లు ఐసీసీ తెలిపింది. ఫిబ్రవరి 7న ఆరంభమయ్యే ప్రపంచకప్‌నకు భారత్‌లో అహ్మదాబాద్, చెన్నై, దిల్లీ, ముంబయి, కోల్‌కతా, లంకలో కొలంబో, కాండీ ఆతిథ్యం ఇవ్వనున్నాయి. 20 దేశాలు పాల్గొనే ఈ టోర్నీలో మొత్తం 55 మ్యాచ్‌లు జరుగుతాయి.


స్టేడియంలో స్టాండ్లకు యువరాజ్, హర్మన్‌ప్రీత్ పేర్లు


హర్మన్‌ప్రీత్, యువరాజ్‌లతో పంజాబ్ సీఎం భగవంత్ మాన్

ముల్లాన్‌పుర్: రెండో టీ20కి ఆతిథ్యమిచ్చిన న్యూ చండీగఢ్ స్టేడియంలోని స్టాండ్లకు యువరాజ్ సింగ్, హర్మన్‌ప్రీత్ కౌర్‌ల పేర్లు పెట్టారు. యువరాజ్ 2011లో వన్డే ప్రపంచకప్ నెగ్గిన భారత జట్టు సభ్యుడు. ఇటీవలే తొలి ప్రపంచకప్ సాధించిన భారత మహిళల జట్టుకు హర్మన్‌ప్రీత్ కెప్టెన్. యువీ, హర్మన్‌లు ఇద్దరూ పంజాబ్ క్రికెటర్లు. దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌కు ముందు యువరాజ్. . భారత ఆటగాళ్లతో మాట్లాడుతూ కనిపించాడు.

కోల్‌కతాకు ఫుట్‌బాల్ దిగ్గజాలు రావడం కొత్త కాదు.. గోవాలో ఆట ఆదరణకు కొదవ లేదు.. కేరళలో ఫుట్‌బాల్‌ను ఆరాధించే వాళ్లకు లెక్కే లేదు.. ముంబయి, దిల్లీలోనూ ఫుట్‌బాల్ ప్రేమికులు తక్కువేమీ కాదు.. దిగ్గజ ఫుట్‌బాలర్ లియోనెల్ మెస్సి అక్కడ పర్యటిస్తే ఆశ్చర్యమేం లేదు. కానీ.. హైదరాబాద్‌కు ఎందుకు వస్తున్నాడు? కోల్‌కతా, దిల్లీ, ముంబయితో పాటు హైదరాబాద్‌ను వేదికగా ఎందుకు ఎంచుకున్నాడు? ఎందుకంటే భాగ్యనగరానికి ఫుట్‌బాల్‌లో ఘనమైన చరిత్ర.. ఆటతో బలమైన అనుబంధం ఉంది.

అల హైదరాబాద్‌లో..


బలరాం

ఈనాడు - హైదరాబాద్

హైదరాబాద్ అంటే చాయ్, బిర్యానీ, చార్మినార్, క్రికెట్ మాత్రమే కాదు ఫుట్‌బాల్ కూడా. 1950-60 మధ్య ఫుట్‌బాల్ అంటే హైదరాబాద్.. హైదరాబాద్ అంటే ఫుట్‌బాల్ అన్నట్లు ఉండేది. అప్పట్లో భారత ఫుట్‌బాల్‌కు కేంద్రం హైదరాబాదే. భారత ఫుట్‌బాల్ చరిత్రలో 1956 ఒలింపిక్స్ ప్రదర్శనే అత్యుత్తమం. మెల్‌బోర్న్‌లో జరిగిన ఆ విశ్వ క్రీడల్లో భారత్ నాలుగో స్థానంలో నిలిచింది. అప్పటి జట్టులో ఎనిమిది మంది (కోచ్ అదనం) హైదరాబాదీలు ఉన్నారంటే భారత ఫుట్‌బాల్లో ఈ నగరం ఎంత కీలక పాత్ర పోషించిందో అర్థం చేసుకోవచ్చు. ఆ జట్టుకు సయ్యద్ అబ్దుల్ రహీం (ఎస్.ఎ.రహీం) కోచ్ కాగా.. ఎస్.కె.అజీజుద్దీన్, నూర్ మహ్మద్, తులసీదాస్ బలరాం, పీటర్ తంగరాజ్, ఎస్.ఎ.సలాం, ఎస్.ఎ.లతీఫ్, హమీద్ హుస్సేన్, జుబేర్ ఖాన్ జట్టు సభ్యులు. అప్పట్లో హైదరాబాద్ ఫుట్‌బాల్ స్టార్లకు ఉన్న ఆకర్షణ అంతాఇంతా కాదు. 1960లలో అప్పటి లాల్ బాగ్ మైదానం ప్రస్తుత ఎల్బీ స్టేడియం (ఫతే మైదాన్)లో ప్రేక్షకులు పైకప్పుల మీద కూర్చొని మ్యాచ్‌లు చూసేవాళ్లంటే చాలామంది నమ్మకపోవచ్చు. 1936 బెర్లిన్ ఒలింపిక్స్‌లో మహ్మద్ సలీం బూట్లు లేకుండా గోల్ సాధించడం చరిత్రలో నిలిచిపోయింది. భారత జట్టుకు ఫుట్‌బాలర్లను అందించే కార్ఖానాగా హైదరాబాద్ వెలుగొందింది.


నయీముద్దీన్, హబీబ్, విక్టర్ అమల్‌రాజ్


తంగరాజ్

హైదరాబాద్ నుంచి కోల్‌కతా

నయీముద్దీన్, మహ్మద్ అక్బర్, షబ్బీర్ అలీ, మహ్మద్ హబీబ్, ఫరీద్, లతీఫుద్దీన్ నజాం.. వీళ్లంతా ఎవరని హైదరాబాద్‌లో అడిగితే చాలామంది సమాధానం చెప్పలేకపోవచ్చు. కాని బెంగాల్‌లో ఆరా తీస్తే ఫుట్‌బాల్ స్టార్లని చెబుతారు. తమ అభిమాన క్రీడాకారులని అంటారు. మెస్సి, క్రిస్టియానో రొనాల్డో మాదిరిగా వీరిని ఆరాధించే వాళ్లు ఎంతో మంది ఉంటారక్కడ. వీళ్లంతా మన హైదరాబాదీలే. అయితే ఆంధ్రప్రదేశ్‌లో ఏపీ పోలీస్ జట్టు ఒక్కటే ఉండటం.. లీగ్‌లు లేకపోవడంతో హైదరాబాదీలు బెంగాల్‌కు తరలివెళ్లారు. కోల్‌కతాలో క్లబ్ వ్యవస్థ పటిష్ఠంగా ఉండటంతో హైదరాబాద్ స్టార్లంతా బెంగాల్ బాట పట్టారు. మహ్మడాన్ స్పోర్టింగ్ క్లబ్ (ఎంఎస్‌సీ), మోహన్ బగాన్ క్లబ్ (ఎంబీసీ), ఈస్ట్ బెంగాల్ క్లబ్ (ఈబీసీ), బెంగాల్ తరపున బరిలో దిగారు. 1970ల నుంచి భారత ఫుట్‌బాల్‌కు బెంగాల్ కేంద్రంగా మారిపోయింది. కానీ 1960 నుంచి 1980ల వరకు బెంగాల్ క్లబ్‌ల తరపున ఆడిన ఆటగాళ్లలో అత్యధికులు హైదరాబాదీలే కావడం విశేషం. అబ్దుల్ సలాం (మహ్మడాన్), తంగరాజ్ (బెంగాల్), బలరాం (బెంగాల్), కన్నన్ (ఈస్ట్ బెంగాల్), జాన్ విక్టర్ (మహ్మడాన్, ఈస్ట్ బెంగాల్, బెంగాల్), నయీముద్దీన్ (మహ్మడాన్, ఈస్ట్ బెంగాల్, మోహన్ బగాన్), మహ్మద్ హబీబ్ (ఈస్ట్ బెంగాల్, మోహన్ బగాన్, మహ్మడాన్, బెంగాల్), మహ్మద్ అక్బర్ (మహ్మడాన్, మోహన్ బగాల్, ఈస్ట్ బెంగాల్), లతీఫుద్దీన్ నజాం (బెంగాల్, మహ్మడాన్, ఈస్ట్ బెంగాల్), సజ్జాద్ (బెంగాల్), షబ్బీర్ అలీ (బెంగాల్, మహ్మడాన్, ఈస్ట్ బెంగాల్), ఫరీద్ (మహ్మడాన్, మోహన్ బగాన్, ఈస్ట్ బెంగాల్), విక్టర్ అమల్ రాజ్ (మహ్మడాన్, ఈస్ట్ బెంగాల్, మోహన్ బగాన్) జాతీయ.. అంతర్జాతీయ స్థాయిలో ఓ వెలుగు వెలిగిన హైదరాబాదీ ఫుట్‌బాలర్లు. 1950 నుంచి 1962 వరకు భారత్‌కు చీఫ్ కోచ్‌గా వ్యవహరించిన ఎస్.ఎ.రహీం ఎంతోమంది నాణ్యమైన ఫుట్‌బాలర్లను దేశానికి అందించాడు. అనంతరం నయీముద్దీన్ భారత్, బంగ్లాదేశ్‌తో పాటు ప్రతిష్ఠాత్మక క్లబ్‌లకు కోచ్‌గా వ్యవహరించాడు. అర్జున, ద్రోణాచార్య అవార్డులు అందుకున్నాడు. హబీబ్‌కు అర్జున పురస్కారం లభించింది. భారత కోచ్‌గా పనిచేసిన షబ్బీర్ అలీకి ధ్యాన్‌చంద్ అవార్డు దక్కింది. లెక్కకు మించి అంతర్జాతీయ ఫుట్‌బాలర్లను అందించిన గడ్డగా చరిత్రలో హైదరాబాద్‌ది ఎప్పటికీ ప్రత్యేక స్థానమే.

దిగ్గజ హైదరాబాదీ ఫుట్‌బాలర్లు

మహ్మద్ సలీం	(1936 బెర్లిన్ ఒలింపిక్స్)
సయ్యద్ అబ్దుల్ రహీం	(కోచ్- 1956 ఒలింపిక్స్ నాలుగో స్థానం, 1951.. 1962 ఆసియా క్రీడల్లో స్వర్ణాలు)
జుబైర్ ఖాన్	(1956 మెల్‌బోర్న్ ఒలింపిక్స్)
ఎస్.ఎ.హకీం	(1960 రోమ్ ఒలింపిక్స్)
జుల్ఫికరుద్దీన్ షేక్	(1960 రోమ్ ఒలింపిక్స్)
హామిద్ హుస్సేన్	(1956, 1960 ఒలింపిక్స్.. 1964 ఆసియా కప్ రన్నరప్)
పీటర్ తంగరాజ్	1956, 1960 ఒలింపిక్స్.. 1962 ఆసియా క్రీడల్లో స్వర్ణం)
తులసీదాస్ బలరాం	(1956, 1960 ఒలింపిక్స్.. 1962 ఆసియా క్రీడల్లో స్వర్ణం)
మహ్మద్ సలీం	(1948 లండన్ ఒలింపిక్స్)
ఎస్.కె.అజీజుద్దీన్	(1956 ఒలింపిక్స్)
ధర్మలింగం కన్నన్	(1960 రోమ్ ఒలింపిక్స్)
షబ్బీర్ అలీ	(1979 ఆసియా కప్ కెప్టెన్, ఫాస్టెస్ట్ హ్యాట్రిక్ రికార్డ్)
విక్టర్ అమల్‌రాజ్	(భారత మాజీ కెప్టెన్)
సయ్యద్ నయీముద్దీన్	(1964-71 భారత కెప్టెన్, మాజీ కోచ్)
మహ్మద్ యూసుఫ్	(భారత మాజీ ఆటగాడు)
మహ్మద్ హబీబ్	(1970-80ల్లో భారత స్టార్ స్ట్రైకర్)

పిచ్ భద్రం.. మజా ఖాయం

ఉప్పల్‌లో 50 మీటర్ల పొడవుతో ఫుట్‌బాల్ మైదానం

ఈనాడు - హైదరాబాద్



ఉప్పల్ స్టేడియం అనగానే క్రికెట్ అభిమానులకు గుర్తొచ్చేది ఐపీఎలే. అత్యధిక స్కోర్లు.. శతకాలు.. భారీ భాగస్వామ్యాలు.. రికార్డులతో ఐపీఎల్‌లో ఉప్పల్ స్టేడియం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. దేశంలోనే అత్యుత్తమ మైదానంగా ఐపీఎల్‌లో ఎన్నోసార్లు అవార్డులు అందుకుంది. బీసీసీఐ వ్యవస్థాపక మెంబర్‌గా.. ప్రముఖ టెస్టు వేదికగా హైదరాబాద్‌కు గొప్ప చరిత్రే ఉంది. అయితే మొదటిసారిగా ఉప్పల్‌లో క్రికెట్‌కు బదులు ఫుట్‌బాల్ అభిమానులతో నిండిపోనుంది. 'ద గోట్ టూర్'లో భాగంగా అర్జెంటీనా సాకర్ దిగ్గజం లియోనెల్ మెస్సి హైదరాబాద్‌కు వస్తుండమే ఇందుకు కారణం. అయితే టెస్టు వేదిక ఉప్పల్ స్టేడియంలో ఫుట్‌బాల్ మ్యాచ్ నిర్వహిస్తే పిచ్ పరిస్థితేంటి? ఆటగాళ్లు స్పైక్స్ బూట్లు ధరించి పరుగెత్తితే వికెట్లు పాడవుతాయి కదా? అసలు అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఫుట్‌బాల్ మ్యాచ్ నిర్వహించడమేంటి? అన్న ప్రశ్నలు తలెత్తక మానవు. స్టేడియంలోని అయిదు పిచ్‌లకు, మైదానానికి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అన్ని చర్యలు తీసుకుంటోంది. నిజానికి ఇది '7 ఎ సైడ్' ఫుట్‌బాల్ మ్యాచ్ కావడంతో మైదానం మొత్తం అవసరం లేదని తెలుస్తోంది. స్టేడియంలో కొంత భాగంలో మాత్రమే ఫుట్‌బాల్ మ్యాచ్ నిర్వహిస్తారు. సౌత్ స్టాండ్ ముందు.. క్రికెటర్లు కూర్చొనే డగౌట్ల దగ్గరి నుంచి 35 మీటర్ల వెడల్పు.. 50 మీటర్ల పొడవుతో ఫుట్‌బాల్ కోర్టును ఏర్పాటు చేయనున్నారు! 35 మీటర్ల వెడల్పునకే పరిమితమవడంతో ఫుట్‌బాల్ కోర్టు.. పిచ్‌లకు 20 అడుగుల దూరం ఉండనుంది. అయిదు పిచ్‌లను భద్రంగా ఉంచేందుకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోనున్నారు. శనివారం పూర్తిగా పిచ్‌లను కప్పి ఉంచుతారు. ఆటగాళ్లు పిచ్‌లపై పరుగెత్తినా ఇబ్బంది ఉండదని సమాచారం. నిర్వాహకులు ప్రకటించిన దాని ప్రకారం ఎగ్జిబిషన్ మ్యాచ్ 20 నిమిషాల పాటు జరుగనుంది. పిల్లలు ఈ మ్యాచ్ ఆడతారు కాబట్టి పిచ్‌లపై పెద్దగా ప్రభావం పడకపోవచ్చని హెచ్‌సీఏ భావిస్తోంది. చిన్నారులకు మెస్సి చిట్కాలు అందించే ఫుట్‌బాల్ క్లినిక్‌లో పరుగెత్తే అవసరం ఉండదు. మిగతా కార్యక్రమాలు పిచ్ దగ్గర లేకుండా జాగ్రత్త పడుతున్నట్లు క్రికెట్ వర్గాలు తెలిపాయి. ఏదేమైనా సిక్సర్లు.. బౌండరీలతో అలరించిన ఉప్పల్ స్టేడియం శనివారం గోల్స్‌తో సందడి చేయనుంది.

ఆస్ట్రేలియా అండర్-19 జట్టులో ఆర్యన్, జాన్

మెల్‌బోర్న్: అండర్-19 ప్రపంచకప్‌లో పాల్గొనే ఆస్ట్రేలియా జట్టులో భారత సంతతికి చెందిన ఆర్యన్ శర్మ, జాన్ జేమ్స్‌లకు చోటు దక్కింది. ఆర్యన్ స్లో లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్, జేమ్స్ మీడియం పేస్ ఆల్‌రౌండర్. ఈ సెప్టెంబర్‌లో భారత్-ఆస్ట్రేలియా యూత్ టెస్టు సిరీస్‌లోనూ ఆర్యన్, జేమ్స్ ఆడారు. నితీష్ శామ్యూల్, నాడెన్ కోరె (శ్రీలంక), అలెక్స్ లీ యంగ్ (చైనా) కూడా ఆస్ట్రేలియా అండర్-19 జట్టులో ఉన్నారు. ఆసీస్ జట్టుకు అలివర్ పియెక్ కెప్టెన్. నమీబియా, జింబాబ్వే ఉమ్మడిగా ఆతిథ్యమిచ్చే ఈ టోర్నీ జనవరి 15న ఆరంభం కానుంది. ఈ కప్‌లో గ్రూప్-ఎలో ఐర్లాండ్, జపాన్, శ్రీలంకతో కలిసి డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియా ఆడనుంది. **ఆస్ట్రేలియా జట్టు:** అలివర్ పియెక్ (కెప్టెన్), కాసీ బార్టన్, నాడెన్ కోరె, జేడెన్ డ్రేపర్, బెన్ గోర్డాన్, స్టీవెన్ హోగన్, థామస్ హోగన్, జాన్ జేమ్స్, చార్లెస్ లాచ్‌మండ్, విల్ మల్‌జుక్, నితీష్ శామ్యూల్, హేడెన్ సీలర్, ఆర్యన్ శర్మ, విలియమ్ టేలర్, అలెక్స్ లీ యంగ్.

నేటి నుంచే అండర్-19 ఆసియాకప్

తొలి మ్యాచ్‌లో యూఏఈతో భారత్ ఢీ

దుబాయ్: కుర్రాళ్ల సమరానికి వేళైంది. అండర్-19 ఆసియాకప్ శుక్రవారం ఆరంభం కానుంది. టోర్నీలో ఎనిమిది జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. యూఏఈ, పాకిస్థాన్, మలేసియాతో పాటు భారత్ గ్రూప్-ఎలో ఉంది. డిఫెండింగ్ ఛాంపియన్ బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్, నేపాల్, శ్రీలంకలు గ్రూప్-బిలో తలపడనున్నాయి. గ్రూపులో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్లో ప్రవేశిస్తాయి. డిసెంబరు 21న ఫైనల్ జరుగుతుంది. శుక్రవారం టోర్నీ తొలి మ్యాచ్‌లో యూఏఈతో ఆయుష్ మాత్రే నేతృత్వంలోని భారత జట్టు తలపడుతుంది. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ జట్టులో ఉన్నాడు. భారత్ ఆదివారం పాకిస్థాన్‌తో తలపడనుంది. పాకిస్థాన్ ఆటగాళ్లతో కరచాలనం చేయొద్దన్న విధానాన్ని బీసీసీఐ కొనసాగిస్తుందా లేదా అన్నది ఆసక్తికరం.

విండీస్‌పై కివీస్‌కు ఆధిక్యం


డెవాన్ కాన్వే

వెల్లింగ్టన్: వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టులో న్యూజిలాండ్ ఆధిక్యం సంపాదించింది. ఓవర్‌నైట్ స్కోరు 24/0తో రెండో రోజు ఉదయం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన కివీస్ 278 పరుగులకు ఆలౌటైంది. డెవాన్ కాన్వే (60; 108 బంతుల్లో 8×4), మిచెల్ హే (61; 93 బంతుల్లో 9×4, 1×6) రాణించడంతో 73 పరుగుల ఆధిక్యం లభించింది. విండీస్ బౌలర్లలో ఆండర్సన్ ఫిలిప్ (3/70), కీమర్ రోచ్ (2/43) మెరిశారు. గురువారం ఆట ముగిసే సమయానికి విండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 10 ఓవర్లలో 2 వికెట్లకు 32 పరుగులు సాధించింది. ప్రస్తుతం విండీస్ మరో 41 పరుగులు వెనుకంజలో ఉండగా.. బ్రెండన్ కింగ్ (15 బ్యాటింగ్), కావెమ్ హాడ్జ్ (3 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో విండీస్ 205 పరుగులకు ఆలౌటైన సంగతి తెలిసిందే.

(c) eenadu



ఈనాడు

విజయవాడ 12-12-2025 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 122

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

Hyundai
December Delight
ఈ ఆఫర్ ఇంకా స్టాక్ రేపు ఉండొచ్చు
లేదా ఉండకపోవచ్చు.
HYUNDAI

2024 జూన్ 2 నుంచి

అమరావతిని ఏపీ రాజధానిగా గుర్తించండి

ఆ మేరకు రాష్ట్ర విభజన చట్టాన్ని సవరించండి

కేంద్రానికి లేఖ రాసిన ప్రభుత్వం

బడ్జెట్ సమావేశాల్లో సభ ముందుకు బిల్లు!

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ నూతన రాజధానిగా అమరావతిని 2024 జూన్ 2 నుంచి చేరుస్తూ విభజన చట్టంలోని సెక్షన్ 5(2)ను సవరించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. అమరావతి రాజధానికి చట్టబద్ధత కల్పిస్తూ విభజన చట్టాన్ని సవరించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరిన నేపథ్యంలో ఎప్పటి నుంచి దాన్ని అమల్లోకి తేవాలో స్పష్టత ఇవ్వాలంటూ కేంద్ర హోం శాఖ ఈ నెల 1న రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆ అంశంపై స్పష్టత ఇస్తూ కేంద్ర హోం శాఖకు తాజాగా లేఖ పంపారు. 2024 జూన్ 2 నుంచి అమరావతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా ఉంటుందని విభజన (మిగతా 10లో)

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE
Vencobb FRESH CHICKEN Vencobb No. 1 Tastiest Chicken
సూచించిన నేటి గుడ్లు & చికెన్ విజయవాడ జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹ 90	ఫారం దగ్గర లైవ్ బర్డ్	120 కిలో	డ్రస్డ్ స్కిన్‌తో	213 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్	147 కిలో	స్కిన్‌లెస్	243 కిలో

Conditions Apply.
వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

2030 నాటికి అతి పెద్ద డెవలపర్ కమ్యూనిటీగా భారత్

మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల

ప్రపంచ కంప్యూటర్‌గా 'అజూర్'కు రూపం 2లో

లక్ష మందికి ఉపాధి

వివిధ ప్రాజెక్టులకు మంత్రివర్గం పచ్చజెండా

రూ.16,060 కోట్ల పెట్టుబడులకు ఆమోదం

- క్వాంటమ్ వ్యాలీలోకి కొత్తగా మరో 7 ప్రాజెక్టులు
- బీసీలకు సౌరవిద్యుత్తు ప్రాజెక్టులకు అదనపు రాయితీ
- 27.2 లక్షల మందికి రూ.20 వేలు చొప్పున ఇచ్చేందుకు ఆమోదం
- రెవెన్యూ వివాదాలను ఏడాదిలోగా పరిష్కరించాలి
- సీఎం చంద్రబాబు మార్గనిర్దేశం



సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు, అధికారులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో లక్ష మందికి పైగా ఉపాధి కల్పించే ప్రాజెక్టులకు మంత్రిమండలి గురువారం ఆమోదముద్ర వేసింది. ఇందులో క్వాంటమ్ కంప్యూటర్స్, ఐటీ, సౌరశక్తి, కెమికల్, ఫార్మా, ఆహారశుద్ధి, బయోఫ్యూయల్స్ రంగాల్లో పెట్టుబడులు ఉన్నాయి. ఇవి కాక ఆతిథ్య రంగంలో హోటళ్లు, కన్వెన్షన్ హాళ్ల నిర్మాణం వంటివి ఉన్నాయి. ఇంతకుముందు ఎస్ఐపీబీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రిమండలి ముందు ఉంచి ఆమోదించారు. మొత్తం రూ.16,060 కోట్ల విలువైన పెట్టుబడులకు పచ్చజెండా ఊపారు. అమరావతిలో ఏర్పాటు కాబోతున్న క్వాంటమ్ వ్యాలీలోకి కొత్త ప్రాజెక్టులు రానున్నాయి. దాదాపు 7 క్వాంటమ్ కంప్యూటింగ్ ప్రాజెక్టులు చేపట్టేందుకు పెట్టుబడులు వస్తున్నాయి. అమరావతిలో లోక్‌భవన్ నిర్మాణానికి ఎల్-1 టెండర్‌ను ఆమోదించి పనులు చేపట్టేందుకు ఆమోదించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో గురువారం మంత్రిమండలి సమావేశమై కీలక నిర్ణయాలు తీసుకుంది. సమాచార, పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి వీటిని విలేకర్లకు వెల్లడించారు.

బీసీలకు సౌర విద్యుత్తు సబ్సిడీకి రూ.5,445 కోట్లు

ఆంధ్రప్రదేశ్ నూతన పునరుత్పాదక, ఇంధన అభివృద్ధి సంస్థ ప్రతిపాదన మేరకు 200 యూనిట్ల వరకు గృహ విద్యుత్తు వినియోగించే వెనుకబడిన తరగతుల వినియోగదారులకు 2 కిలోవాట్ల సామర్థ్యం ఉన్న రూఫ్‌టాప్ సౌర విద్యుత్తు ప్లాంట్ ఏర్పాటుకు రాష్ట్రం రూ.20,000 సబ్సిడీ ఇవ్వడానికి మంత్రిమండలి ఆమోదం తెలియజేసింది. కేంద్ర సాయానికి ఇది అదనం. ఈ పథకానికి రూ.5,445 కోట్ల అంచనా వ్యయంగా లెక్కించారు.

■ రెవెన్యూశాఖకు సంబంధించి ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో ఏడాదిలోగా వాటిని పరిష్కరించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. రికార్డుల ట్యాంపరింగ్, వారసత్వ ఆస్తులు కుటుంబంలో అందరికీ దక్కకుండా బలవంతులే తీసుకోవడం వంటి వివాదాలు, ఆధారాలు ఉన్నవి రెవెన్యూ అధికారులు పరిష్కరించాల్సి ఉంటుంది. రికార్డులన్నింటినీ పరిశీలించి అవసరమైనవి సరిదిద్ది, మళ్లీ వాటిని ట్యాంపరింగ్ చేయకుండా (మిగతా 11లో)

రుషికొండ ప్యాలెస్‌పై తేల్చరేం?

మంత్రివర్గ ఉపసంఘం జాప్యంపై సీఎం అసహనం

చేనేతలకు ఉచిత విద్యుత్ పథకం వెంటనే అమల్లోకి తేవాలని ఆదేశం

లోపలి పేజీల్లో

చేసిన మంచిని వివరిస్తే గెలుపు మనదే

ప్రతిపక్షంలో ఉన్నప్పటి కంటే ఎక్కువగా కష్టపడాలి

కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

చంద్రబాబుతో కలిసి వెళ్లడం మంచి పరిణామం



ఏపీ పాలనపై మంచి ఫీడ్‌బ్యాక్ వస్తోంది

జగన్ విమర్శలకు మీరూ దీటుగా కౌంటర్ ఇవ్వాలి

- భాజపా ఎంపీలతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ
- తెలంగాణలో పార్టీ వ్యవహారశైలిపై పెదవి విరుపు

ఈనాడు, దిల్లీ: 'ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబుతో కలిసి ముందుకు సాగడం మంచి పరిణామం. అక్కడ పార్టీ, ప్రభుత్వం పూర్తి సమన్వయంతో నడుస్తున్నాయి' అని భాజపా ఎంపీలతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. పార్లమెంటు జరిగే సమయంలో వివిధ రాష్ట్రాల ఎంపీలతో అల్పాహారం సందర్భంగా ఆయన గురువారం ఉదయం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అండమాన్ నికోబార్ దీవులకు చెందిన ఎంపీలతో సుమారు అరగంట పాటు భేటీ అయ్యారు. ఆయా రాష్ట్రాల్లో రాజకీయ పరిస్థితుల గురించి తెలుసుకొని పార్టీ ఎంపీలు వ్యవహరించాల్సిన తీరుపై మార్గనిర్దేశం చేశారు. "ఆంధ్రప్రదేశ్‌లో పూర్తి సమన్వయంతో వెళ్తున్నారు. పరిపాలనపై కూడా మంచి ఫీడ్‌బ్యాక్ వచ్చింది. పెట్టుబడులు ఎక్కువగా ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్తున్నాయి. ఇది శుభ పరిణామం. రాష్ట్రాభివృద్ధికి దోహదం చేస్తుంది" అని వ్యాఖ్యానించినట్లు తెలిసింది. అలాగే జగన్, ఆయన పార్టీ సామాజిక మాధ్యమాల్లో చేస్తున్న విమర్శలకు భాజపా ఎంపీలు, ఇతర నాయకులు కూడా దీటుగా కౌంటర్ ఇవ్వాలని దిశానిర్దేశం (మిగతా 10లో)

పారిశ్రామికవేత్తలకు 21 రోజుల్లో అనుమతులిస్తాం

కెనడాలో మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: ఏఐ, క్లీన్‌టెక్, పునరుత్పాదక విద్యుత్, మౌలిక సదుపాయాల రంగంలో పెట్టుబడులకు కెనడా సహకారం అందించాలని మంత్రి లోకేశ్ కోరారు. ఆ దేశ పర్యటనలో భాగంగా టొరంటో కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా కపిధ్వజ ప్రతాప్‌సింగ్‌తో మంత్రి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. 'ఏపీకి పెట్టుబడులతో వచ్చే పారిశ్రామికవేత్తలకు సింగిల్ విండో విధానంలో 21 రోజుల్లో అన్ని అనుమతులూ ఇస్తాం. పెట్టుబడిదారుల అనుకూల విధానాలను అనుసరించడంతో 18 నెలల్లో రూ.23.5 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధిలో మీ వంతు సహకారాన్ని అందించాలి' అని కోరారు. తమ వంతు సహకారాన్ని అందిస్తామని ప్రతాప్‌సింగ్ హామీ ఇచ్చారు. ఏపీలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్ల ఏర్పాటుకు అత్యుత్తమ ప్రోత్సాహకాలు అందిస్తున్నామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. కెనడా-ఇండియా బిజినెస్ కౌన్సిల్ (సీఐబీసీ) ప్రెసిడెంట్ విక్టర్ థామస్‌తో ఆయన (మిగతా 10లో)



టొరంటోలో కెనడా-ఇండియా బిజినెస్ కౌన్సిల్ ప్రెసిడెంట్ విక్టర్ థామస్‌కు అరకు కాఫీ ఉత్పత్తులు అందిస్తున్న మంత్రి లోకేశ్

ఈ పడవకు హైడ్రోజనే ఇంధనం

వారణాసిలో ప్రారంభించిన కేంద్ర మంత్రి సోనోవాల్



గంగానది జలాలపై తొలి హైడ్రోజన్ దేశీయ వాణిజ్య నౌక

వారణాసి: అంతర్గత జల రవాణాలో మన దేశం కీలక ముందడుగు వేసింది. హైడ్రోజన్‌తో నడిచే తొలి స్వదేశీ పడవను గురువారం గంగానది జలాలపై ఆవిష్కరించింది. వారణాసిలో నమో ఘాట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఓడరేవులు, నౌకాయానం, జల రవాణా శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ దీని వాణిజ్య పరమైన కార్యకలాపాలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... హైడ్రోజన్ శక్తితో పడవలు, ఓడలు నడుపుతున్న చైనా, నార్వే, నెదర్లాండ్స్, జపాన్ దేశాల సరసన భారత్ నిలవడం గర్వకారణమన్నారు. "సుస్థిర ఇంధన వనరులపై నిబద్ధతకు, దేశంలో వృద్ధి చెందుతున్న సాంకేతిక సామర్థ్యాలకు ఇది ప్రతిబింబం. సాంకేతిక పురోగతిలో మాత్రమే కాకుండా స్వదేశీ సాధనాలు, హరిత ఇంధనంలో మనం ముందుకెళ్తున్న తీరుకు ఇదో నిదర్శనం. దేశ అభివృద్ధిలో అంతర్గత జలరవాణా (మిగతా 10లో)



కోర్టుకు వస్తున్న పిన్నెల్లి సోదరులు

జంట హత్యల కేసులో పిన్నెల్లి సోదరులకు 14 రోజుల రిమాండ్

నెల్లూరు కారాగారానికి తరలింపు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, వెల్దుర్తి: పల్నాడు జిల్లా మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డిలకు మాచర్ల అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో వారిని నెల్లూరులోని (మిగతా 10లో)

జల సంరక్షణలో రాష్ట్రానికి మొదటి స్థానం

ఈనాడు, అమరావతి: గ్రామాల్లో జల సంరక్షణకు సంబంధించి 'జల సంచాయ్-జన భాగిదారి' కార్యక్రమం అమల్లో జాతీయ స్థాయిలో ఏపీ మొదటి స్థానంలో నిలిచింది. మిగతా రాష్ట్రాల కంటే అత్యధికంగా ఈ ఏడాది 4,20,146 పనులు ప్రారంభించి, ఇప్పటివరకు 2,99,114 పూర్తి చేసింది. మిగతా 1,21,032 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. కార్యక్రమం అమలును సమీక్షించిన కేంద్ర ప్రభుత్వం మొదటి పది రాష్ట్రాలను ఎంపిక చేసింది. వాటిలో ఏపీ మొదటి స్థానంలో నిలిచినట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు గురువారం వెల్లడించారు. భూగర్భ జలాల పెంపుదల కోసం గ్రామాల్లో పలు కార్యక్రమాలు చేపట్టినట్లు వారు వివరించారు. బిహార్, గుజరాత్‌లు వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచినట్లు చెప్పారు. కాగా, గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యక్రమం అమల్లోనూ జాతీయ స్థాయిలో ఏపీ మొదటి స్థానంలో నిలిచినట్లు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే.





వెండి కిలో రూ.2,00,000

ఈనాడు వాణిజ్య విభాగం: బంగారంతో పోటీపడుతూ వెండి ధర పైపైకి దూసుకెళ్తోంది. హైదరాబాద్ బులియన్ విపణిలో గురువారం రాత్రి 11.55 గంటలకు కిలో వెండి ధర రూ.2,00,100 (అన్ని పన్నులతో కలిపి) వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ విపణిలో ఔన్సు (31.10 గ్రాముల) వెండి ధర ఎన్నడూ లేనంత గరిష్ఠస్థాయి 64.24 డాలర్లకు చేరడం, దేశీయంగా డాలర్ విలువ కూడా జీవనకాల గరిష్ఠమైన రూ.90.32 కావడంతో వెండి ధరలకు రెక్కలొచ్చాయి. దేశీయంగా గిరాకీకి తగ్గట్లు వెండి సరఫరా లేకపోవడమూ ధర మరింత పెరిగేందుకు కారణమవుతున్నట్లు బులియన్ వర్గాలు చెబుతున్నాయి. బుధవారం హైదరాబాద్‌లో (మిగతా 10లో)

తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో తొలివిడతలో హస్తం హవా

రెండువేలకు పైగా సర్పంచి స్థానాల్లో కాంగ్రెస్ మద్దతుదారుల విజయం 10లో



(c) eenadu

సప్త గిరులకు సహజ సిరులు



పచ్చదనం పునరుద్ధరణకు 'దశాబ్ది ప్రణాళిక'

- తిరుమలలో సంపంగి, పారిజాతం, పొగడ పరిమళాలు
- శాస్త్రీయ పద్ధతిలో నీటి సంరక్షణ.. మట్టి సారం పెంపు

ఈనాడు డిజిటల్, తిరుపతి: తిరుమల గిరులు వచ్చే పదేళ్లలో సరికొత్త పరిమళాలు, పచ్చదన అందాలను సంతరించుకోనున్నాయి. ఆధ్యాత్మికతకు, ఆహ్లాదానికి పెద్దపీట వేస్తూ శేషాచలం సహజత్వాన్ని కాపాడుకునేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం నడుం బిగించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల తిరుమలకు వచ్చిన సందర్భంగా ఏడుకొండల్లో పచ్చదనం పెంచాలని, అన్ని రుతువుల్లోనూ పూల సౌందర్యం కన్పించేలా విభిన్న జాతుల మొక్కలు నాటాలని అధికారులకు సూచించారు. ఈ మేరకు 2025-35 కాలానికి అటవీ విభాగం రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను తితిదే బోర్డు ఇటీవల ఆమోదించింది. నీటి సంరక్షణ చర్యల్లో భాగంగా అడవిలో తేమను కాపాడేందుకు కొండవాలు ప్రాంతాల్లో కందకాలు, చెక్‌డ్యామ్‌లు, రాతి కట్టడాలు నిర్మించనున్నారు. ఎగువ ప్రాంతాల్లో 15-25% వాలున్న చోట సమతల కందకాలు తవ్వుతారు.

3 దశల్లో కొత్తందాలు



తిరుమల పరిధిలో మొత్తం 2,719.95 హెక్టార్ల అటవీ భూమి ఉంది. ఇందులో 89.4% అటవీ విస్తీర్ణం ఉన్నప్పటికీ, మూడు దశాబ్దాల కిందట నాటిన అకేషియా, సెన్నా స్పెక్టబిలిస్ వంటి విదేశీ జాతి వృక్షాలు నేడు గుదిబండగా మారాయి. 576 హెక్టార్లలో విస్తరించిన ఈ చెట్లు స్థానిక జాతి మొక్కలు పెరగకుండా అడ్డుకోవడమే కాకుండా భూమిలోని సారాన్ని, సూక్ష్మజీవ వ్యవస్థ (సాయిల్ మైక్రో-ఎకాలజీ)ను దెబ్బతీస్తున్నాయి. ఈ వృక్షాలను తొలగించి, వాటి స్థానంలో దేశీయ మొక్కలు నాటుతారు. ఇంత భారీవృక్షాలను ఒక్కసారిగా తొలగిస్తే కొండచరియలు విరిగిపడే ప్రమాదమున్నందున దశల వారీగా కొట్టివేయనున్నారు. పదేళ్ల తర్వాత అకేషియా తోటలు కేవలం 50 హెక్టార్లలోపే పరిమితమవుతాయి.

మొదటి దశ (2025-27): 60-70 హెక్టార్లలో ప్రయోగాత్మకంగా గిర్డిలింగ్ (అకేషియా చెట్టు కాండం చుట్టూ బెరడు తొలగించి, ఎండబెట్టడం), సెలెక్టివ్ ఫెల్లింగ్ (ఎంపిక చేసిన చెట్ల నరికివేత).

విస్తరణ (2027-31): 300 హెక్టార్ల మేర దేశీయ మొక్కల పెంపకం, ఎకో టూరిజం జోన్ల అభివృద్ధి.

స్థిరీకరణ (2031-35): మిగిలిన ప్రాంతానికి విస్తరింపజేసి అడవి పూర్తిస్థాయిలో కోలుకునేలా చర్యలు.

1,500కు పైగా మొక్కలతో దివ్యౌషధ వనం

గరుడాద్రినగర్ టోల్‌గేటు సమీపంలో 3.5 ఎకరాల్లో దివ్యౌషధ వనాన్ని స్టేట్ ఆఫ్ ఆర్ట్ నాణ్యతతో తీర్చిదిద్దనున్నారు. ఇందుకు రూ.4.25 కోట్లు వెచ్చించనున్నారు. ఇక్కడ 1,500కు పైగా ఆయుర్వేద, పురాతన వారసత్వ జీవావరణ మొక్కలు పెంచనున్నారు. ఆ మొక్కల పత్రాలు, పుష్పాలు, ఫలాల ఉపయోగాన్ని బట్టి ఆయుర్వేద, సుగంధ, సువాసన, పూజ, ప్రసాద వనాలుగా వర్గీకరించారు. ఔషధవనం, జీవరాశివనం, కల్పవృక్ష ధామం, ఔషధి కుండం, పవిత్ర వృక్షాలు, హెర్బల్ పెవిలియన్, మూలికా వనం, రుతువనం, మసాల దినుసుల మొక్కల వనం, అరుదైన వృక్షాల వనం. ఇలా రకాన్ని బట్టి స్థలాలు కేటాయించారు. సందర్శకులకు ఆయా మొక్కల సమస్త సమాచారం తెలిసేలా బోర్డులు పెట్టనున్నారు.

ఏడాది పొడవునా వర్ణరంజితంగా..

భక్తులకు కనువిందు చేసేలా, ఆధ్యాత్మిక అనుభూతిని పంచేలా, వేర్వేరు రుతువుల్లో పూసే దేశీయ మొక్కలు నాటుతారు. తిరుమల క్షేత్రం ఏడాది పొడవునా పూలవనంలా కన్పించనుంది.

సుగంధభరిత పుష్పాలు: మార్చి-మే నెలల్లో వికసించే పసుపు పచ్చని సంపంగి, మే-జులైలో పూసే పొగడ, డిసెంబరు-ఫిబ్రవరిలో విచ్చుకునే పారిజాతం, వేసవిలో ఆకట్టుకునే రేల (గోల్డెన్ షవర్), అశోక, మోదుగ వంటివి నాటనున్నారు.

భారీ వృక్షజాతులు: రావి, మర్రి, జువ్వి

పండ్ల మొక్కలు: నేరేడు, ఉసిరి, తాని, టేకు

ఔషధ మొక్కలు: సర్వగంధ, తులసి, తిప్పతీగ, శతావరి

అడవిలోనే కాకుండా తితిదే ఆధీనంలోని శ్రీవారి క్షేత్ర పరిధిలో (4 చ.కి.మీ.)నూ భారీ మార్పులు రానున్నాయి. ఆళ్వార్ తీర్థం, నవగ్రహ వనాలను 'పవిత్ర వనాలు'గా పునరుద్ధరించనున్నారు. కాటేజీలు, రోడ్ల వెంట మల్లె, శంఖుపుష్పం వంటి తీగ జాతి మొక్కలతో వర్టికల్ గార్డెన్స్ తీర్చిదిద్దుతారు. తిరుమలలో ప్రస్తుతం ఏటా 10,019 టన్నులుగా ఉన్న కర్బన ఉద్గారాల నియంత్రణ సామర్థ్యం.. 2035 నాటికి 13,500 టన్నులకు పెరుగుతుందని అంచనా.

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం

– తితిదే ఛైర్మన్ బీఆర్‌నాయుడు

స్టేట్ ఆఫ్ ఆర్ట్ సాంకేతికతో దివ్యౌషధ వనాన్ని ఏర్పాటుచేస్తున్నాం. సీఎం చంద్రబాబు సూచనలతో దీనికి నిధులు మంజూరుచేసి, తితిదే బోర్డులో తీర్మానించాం. త్వరలోనే పనులు ప్రారంభించి, 2026లోగా భక్తులకు అందుబాటులోకి తెస్తాం. ప్రత్యేక థీమ్‌తో నిర్మించే ఈ వనానికి ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, పార్కింగ్ ఏరియా, అవగాహన కేంద్రం వైవిధ్యంగా ఉండేలా అటవీ, ఉద్యాన విభాగాలు ప్రణాళికలు రచిస్తున్నాయి.

మావోయిస్టు నేత ఆజాద్ కేసుల విచారణకు ప్రత్యేక కోర్టు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: మావోయిస్టు నేత ఆజాద్ ఎలియాస్ దున్న కేశవరావు (52)పై నమోదైన కేసులు త్వరగా విచారించేందుకు ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు రాష్ట్ర హోంశాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రత్యేక కోర్టును ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లాలోని పర్లాఖెముండిలో ఏర్పాటు చేయనున్నారు. ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేయాలని హైకోర్టు, సుప్రీంకోర్టు ఇదివరకే ఉత్తర్వులు జారీ చేశాయి. ఆజాద్ ప్రస్తుతం కారాగారంలో ఉన్నారు. ఆయనపై 37 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. 2008 కొంధమాల్ జిల్లాలో స్వామి లక్ష్మణానంద సరస్వతి హత్య కేసు, ఆర్.ఉదయగిరి కారాగారం, నయాగఢ్ ఠాణాలపై దాడుల ఘటనల్లో 13 మంది పోలీసులు, ఒక పౌరుడు మృతి చెందారు. లక్ష్మణానంద హత్య అనంతరం కొంధమాల్ జిల్లాలో జరిగిన అల్లర్లలో 39 మంది పౌరులు మృతి చెందారు. గృహ దహనాలూ జరిగిన సంగతి తెలిసిందే. ఆజాద్‌ను 2011 మే 18న ఆంధ్రప్రదేశ్ పోలీసుల వద్ద లొంగిపోయిన తరవాత ఆయనను 2011 జూన్ 11న ఒడిశా పోలీసులకు అప్పగించారు.

శాసనమండలి ఛైర్మన్ అప్పీల్‌పై ధర్మాసనం విచారణ

ఈనాడు, అమరావతి: ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తూ జయమంగళ వెంకటరమణ ఇచ్చిన లేఖపై నాలుగు వారాల్లో విచారణను ముగించి నిర్ణయం ప్రకటించాలని హైకోర్టు సింగిల్ జడ్జి తనను ఆదేశించడాన్ని సవాలు చేస్తూ శాసనమండలి ఛైర్మన్ మోషేనురాజు దాఖలుచేసిన అప్పీల్‌పై ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. అప్పీల్‌దారు తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ సింగిల్ జడ్జి ఉత్తర్వులు సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధం అన్నారు. సీనియర్ న్యాయవాది వాదనలు వినిపిస్తారని.. అందుకు సమయం ఇవ్వాలని కోరారు.

★ జయమంగళ తరఫు న్యాయవాది ఎన్.అశ్వినీకుమార్ స్పందిస్తూ.. కోర్టు ఆదేశాల నేపథ్యంలో రాజీనామా లేఖలను సమర్పించిన ఎమ్మెల్సీలను పిలిచి ఛైర్మన్ విచారణ జరిపారని, నిర్ణయం వెల్లడించాల్సి ఉందనిచెప్పారు. ఈ దశలో అప్పీలు దాఖలు సరికాదన్నారు. ఇరువైపుల వాదనలు విన్న ధర్మాసనం.. తదుపరి వాదనల కొనసాగింపునకు విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ ఎన్.జయసూర్యతో కూడిన ధర్మాసనం గురువారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

గంటకోసారి ఒంటికాలిపై నిల్చోండి



గంటకోసారి ఒక నిమిషం పాటు ఒంటికాలిపై నిల్చోండి. ఫోన్లో మెసేజులు చూసుకొనే వ్యవధిలోనే ఈ పని చేయొచ్చు. దీనివల్ల శరీరంపై నియంత్రణ సాధించొచ్చు. నాడీవ్యవస్థ మెరుగైన పనితీరుకు ఇది దోహదపడుతుంది.

– లోరీ షెమెక్, హెల్త్ ఎక్స్‌పర్ట్

గౌతమ్‌రెడ్డి ప్రొటెస్ట్ పిటిషన్ తిరస్కరణ

విచారణ అర్హత లేదని తేల్చిన విజయవాడ ఏసీబీ కోర్టు

ఈనాడు, అమరావతి: ఫైబర్‌నెట్ మాజీ ఛైర్మన్, వైకాపా నేత గౌతమ్‌రెడ్డికి కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. సీఎం చంద్రబాబుపై వైకాపా ప్రభుత్వ హయాంలో నమోదు చేసిన ఫైబర్‌నెట్ కేసు మూసివేతపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ గౌతమ్‌రెడ్డి వేసిన పిటిషన్‌ను విజయవాడ ఏసీబీ కోర్టు తిరస్కరించింది. ఈ మేరకు న్యాయాధికారి భాస్కరరావు గురువారం సాయంత్రం ఉత్తర్వులిచ్చారు. 'గత ప్రభుత్వ హయాంలో గౌతమ్‌రెడ్డి ఫైబర్‌నెట్ ఛైర్మన్‌గా పనిచేశారు. ఇది రాజకీయపరమైన నామినేటెడ్ పదవి మాత్రమే. అసలు ఫిర్యాదుదారే కాని గౌతమ్‌రెడ్డికి ప్రొటెస్ట్ పిటిషన్ దాఖలు చేసే అధికారం లేదు. ఇందులో జోక్యం చేసుకునే అధికారం మూడో పక్షానికి లేదు' అని సీఐడీ తరఫు న్యాయవాది ఉన్నం అఖిల్‌చౌదరి వాదనలు వినిపించారు. ఈ వాదనలతో ఏకీభవిస్తూ ఏసీబీ కోర్టు న్యాయాధికారి భాస్కరరావు పిటిషన్‌ను తిరస్కరించారు.

విశాఖలో కుక్క కాటుతో.. తొమ్మిదో తరగతి విద్యార్థి మృతి

మధురవాడ, న్యూస్‌టుడే: కుక్క దాడికి గురైన ఓ బాలుడు మృతిచెందాడు. విశాఖలో ఈ ఘటన చోటుచేసుకుంది. మధురవాడ వాంబే కాలనీకి చెందిన చిరుద్యోగి సింహాచలం కుమారుడు బి.లలిత్(15) స్థానికంగా ఓ విద్యాలయంలో 9వ తరగతి చదువుతున్నాడు. గత నెల 26న ఆ బాలుడిపై వీధి కుక్క దాడి చేసి కరిచింది. కాలికి గాయమవడంతో స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. క్రమం తప్పకుండా చికిత్స అందించినా ఫలితం లేకపోయింది. గురువారం ఉదయం ఆ బాలుడు మృతిచెందాడు.

EDUCATION

★ Admissions Guidance. Last Chance. MBBS, BVSC & AH, BDS, BAMS, BHMS, BNYS. ✆ 87544 23689.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ శాఖ
నెం.08/2025–26, ఇ-ప్రొక్యూర్మెంట్ టెండరు ప్రకటన తేది:09.12.2025
పర్యవేక్షక ఇంజనీరు, పంచాయతీరాజ్ సర్కిల్, ఒంగోలు పరిధిలోని 2 పనులకు అంచనా విలువ: **రూ.480.00 లక్షలకు** ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండర్లు లభ్యమగు **తేది: 15.12.2025, సా.5గం.** నుండి లభ్యమగును. ఇతర వివరాలను http://www.eprocurement.gov.in లో పొందగలరు.
DIPR No.18351/CL/ADVT/1/1/2021-22 సం/- పర్యవేక్షక ఇంజనీరు, పంచాయతీరాజ్ సర్కిల్, ఒంగోలు

ఆంధ్రప్రదేశ్ వైద్యసేవలు & మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ
ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కార్యాలయం, APMSIDC డివిజన్,
1వ అంతస్తు, ఆర్‌డిఎస్ బిల్డింగ్, ఎస్ఎంఎస్ కాంప్లెక్స్, ఎన్‌హెచ్ 16 సర్వీసు రోడ్డు, గుణదల, విజయవాడ
ఫోన్: 8978680814, ఇమెయిల్ ఐడి: eeapmsidc.krishnadt@gmail.com
Tender Notice No.07/EE/APMSIDC/Krishna-Dt/VJA/DB/2025-26 dt: 11.12.2025.
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా ఇ-టెండర్లు "కృష్ణా, ఎన్‌టీఆర్, మరియు ఏలూరు జిల్లాలలో (8 పనులు) ప్రభుత్వ ఆయుష్ డిస్పెన్సరీల నిర్మాణం/ పునరుద్ధరణ మరియు సిహెచ్‌సి కంకిపాడు (1 నం.)కు మరమ్మతులు మరియు కొత్త జీజీహెచ్, విజయవాడ (1 నం.)కు మరమ్మతు పని" కొరకు కోరబడుతున్నవి. అదనపు వివరాలను వెబ్‌సైట్ http://www.tender.apeprocurement.gov.inను చూడండి మరియు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, ఏపిఎంఎస్ఐడిసి విజయవాడను 89786 80818పై సంప్రదించండి.
సం/– ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, ఏపిఎంఎస్ఐడిసి డివిజన్, విజయవాడ
DIPR No.4661PP/CL/ADVT/1/1/2021-22

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
ప్రజారోగ్య మరియు మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ
ఎపి ఇ– ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
టెండరు ప్రకటన నెం. 1845/CRDA/VJA/TO/2025-1, తేది: 10-12-2025
పని పేరు మరియు వ్యయం: 1) బల్లెంవారి వీధి నుండి పోరంకి- నిడమానూరు మెయిన్ రోడ్ వరకు మహానాడు రోడ్డు విస్తరణ కొరకు బిటి హాట్ మిక్స్ రోడ్డు మరియు వీధి దీపాలతో సెంట్రల్ డివైడర్‌ను ఏర్పాటు చేయుట - **రూ.33.55 కోట్లు.** 2) బల్లెంవారి వీధి రోడ్డువద్ద బందర్ రోడ్డు నుండి హెచ్‌టి లైన్ రోడ్డు కూడలి వరకు బిటి హాట్ మిక్స్ రోడ్డు వేయుట, వెడల్పు చేయుట మరియు వీధి దీపాలతో సెంట్రల్ డివైడర్‌ను ఏర్పాటు చేయుట - **రూ.29.80 కోట్లు.** 3) బల్లెంవారి వీధి కూడలి నుండి హెచ్‌టి లైన్ రోడ్డు నుండి నిడమానూరు మెయిన్ రోడ్ వరకు బిటి హాట్ మిక్స్ రోడ్డు వేయుట, వెడల్పు చేయుట మరియు వీధి దీపాలతో సెంట్రల్ డివైడర్‌ను ఏర్పాటు చేయుట - **రూ.34.95 కోట్లు.**
టెండరు డాక్యుమెంట్ లభించు వ్యవధి: 15-12-2025 ఉ.11 గం. నుండి 30-12-2025, 17 గం. (ఐఎస్‌టి) వరకు. తదుపరి వివరాలను https://apeprocurement.gov.in/login.html నందు చూడవచ్చును. ఫోన్ నెం.9849905736.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, పి.హెచ్.&ఎం.ఇ.సర్కిల్, గుంటూరు
DIPR No. 18357/CL/ADVT/1/1/2021-22

GOVERNMENT OF ANDHRA PRADESH
DEPARTMENT OF MINES AND GEOLOGY
Sri Anjaneya Towers, Ibrahimpatnam, Vijayawada, Andhra Pradesh-521 456
NIT No. 2796169/P-T7/2025 10-12-2025
TENDER NOTICE
Department of Mines & Geology, Government of Andhra Pradesh is conducting auction for grant of 02 Mining Leases and 03 Composite Licences for Manganese blocks in the state of Andhra Pradesh through electronic auction (e-auction). Interested individuals / firms who are desirous to participate in the tenders may visit https://www.mines.ap.gov.in/ miningportal/ for further details. Tender documents are available on the website of AP e-Procurement portal (https://tender.apeprocurement.gov.in/) from 11 AM on 12-12-2025 onwards. For further queries, please contact Sri G. Srinivas Chowdhary, DD Mines, Ph: 91006 88811
BALA CHANDRA SEKHAR W, DIRECTOR
DIPR No. 4659PP/CL/Advt/1/1/2021-22

SPORTS AUTHORITY OF ANDHRA PRADESH
IGMC STADIUM, LABBIPET, BANDAR ROAD, VIJAYAWADA
Tenders are hereby invited from reputed and experienced companies for the following tenders.

S. No.	Tender ID	Name of the Work	Estimate Contract Value (in Rs.)
1	873946	Completion of Incomplete Kreeda Vikasa Kendra at Banaganapalli, Nandyal District. (Part-1)	31,27,926/-
2	873948	-DO- (Part-4)	30,39,873/-
3	873949	-DO- (Part-5)	28,28,561/-
4	873951	-DO- (Part-6)	27,84,085/-
5	873953	-DO- (Part-7)	17,16,807/-
Bid Starting Date 11-12-2025. Bid End Date: 19-12-2025			
1	874527	Completion of Incomplete Kreeda Vikasa Kendra at Banaganapalli, Nandyal District. (Part-2)	30,93,233/-
2	874530	-DO- (Part-3)	31,14,034/-

Bid Starting date: 12-12-2025. Bid End date: 22-12-2025.
Tender documents are available on e-procurement platform tender.apeprocurement.gov.in. Tenders will be opened in the presence of company representatives who attend the evaluation. For further details contact: 85010 74922.
Sd/- Vice Chairman and Managing Director
DIPR No.4662PP/CL/ADVT/1/1/2021-22

2030 నాటికి అతి పెద్ద డెవలపర్ కమ్యూనిటీగా భారత్

- మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల
- ప్రపంచ కంప్యూటర్‌గా 'అజూర్'కు రూపం



బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే: శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రపంచంలోనే అతి పెద్ద డెవలపర్ కమ్యూనిటీగా 2030 నాటికి భారత్ అవతరిస్తుందని మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల అన్నారు. భారత్‌లో మైక్రోసాఫ్ట్ సేవలు విస్తృతమవుతున్నాయని తెలిపారు. దేశంలో 2030 నాటికి 57.5 మిలియన్ల డెవలపర్లు ఉంటారని అంచనా వేశారు. కృత్రిమ మేధ (ఏఐ)ను ఉపయోగించి సామాజిక సమస్యల పరిష్కారాలు కనుగొనేందుకు ఇది గొప్ప అవకాశమని పేర్కొన్నారు. ప్రపంచ కంప్యూటర్‌గా 'అజూర్'ను రూపొందిస్తున్నామని తెలిపారు. గురువారం బెంగళూరులో నిర్వహించిన ఓ కార్యక్రమంలో సత్య నాదెళ్ల కీలక వ్యాఖ్యలు చేశారు. 'భారత్‌లో అత్యుత్తమ మౌలిక వసతులను ఏర్పాటు చేయడానికి మేం ఎంతో ఉత్సాహంగా ఉన్నాం. 17.5 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతున్నాం. అంటే ఆసియాలో మైక్రోసాఫ్ట్ పెట్టిన అత్యంత పెద్దది ఇదే. మేం ప్రపంచ కంప్యూటర్‌గా అజూర్‌ను నిర్మిస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా 70కి పైగా డేటా సెంటర్లు ఉన్నాయి. రిలయన్స్ జియోతో భాగస్వామ్యం ద్వారా మరింత విస్తరిస్తాం. 2026లో కొత్త డేటాసెంటర్ పనిచేయడం ప్రారంభిస్తుంది. ఇది పూర్తిగా 100 శాతం సస్టైనబుల్ ఎనర్జీతో పనిచేస్తుంది' అని ఆయన వివరించారు.

భద్రతా ముఖ్యమే..

ఏఐ విస్తరించే యుగంలో డిజిటల్ సార్వభౌమాధికారం, సైబర్ భద్రత ప్రాముఖ్యాన్ని సత్య నాదెళ్ల వివరించారు. 'సార్వభౌమాధికారంతో పాటు భద్రత కూడా అదే స్థాయిలో ఉండాలి. సైబర్ భద్రత అనేది సిగ్నల్ గేమ్. సరైన గ్లోబల్ ఇంటెలిజెన్స్ లేకుండా, స్వయం నియంత్రణ ఉన్నా ప్రమాదం తప్పదు. రోజూ ట్రిలియన్ల సంఖ్యలో సిగ్నళ్లను ప్రాసెస్ చేసి అజూర్ నుంచి విండోస్ వరకు అన్ని ప్లాట్‌ఫారాలను రక్షిస్తోంది. ఇది ఓపెన్-సోర్స్ వెర్షన్ కంట్రోల్ సిస్టమ్ అయిన గిట్ పై నిర్మిస్తాం' అని సత్య నాదెళ్ల దిశానిర్దేశం చేశారు.

★ కృత్రిమ మేధ (ఏఐ) మౌలిక సదుపాయాలు, నైపుణ్య సామర్థ్యాల కోసం 2030 నాటికి 17.5 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.1.58 లక్షల కోట్ల) పెట్టుబడులను సత్య నాదెళ్ల ప్రకటించారు. భారత్‌లో ఏఐ రంగానికి సంబంధించి, గత రెండు నెలల్లో వచ్చిన మూడో అతి పెద్ద పెట్టుబడి ప్రకటన ఇదే. దేశంలో యువతకు ఉద్యోగ అవకాశాలు, ఏఐలో నైపుణ్యాలు కల్పించేందుకు మైక్రోసాఫ్ట్‌తో ప్రారంభ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ పేర్కొంది. దిల్లీలో కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల సమక్షంలో ఈ ఒప్పందంపై సంతకాలు చేయడం మరో పరిణామం. ఒప్పందంలో భాగంగా మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ కెరీర్ సర్వీస్ (ఎన్‌సీఎస్) ప్లాట్‌ఫామ్‌పైకి మైక్రోసాఫ్ట్ అంతర్జాతీయ నెట్‌వర్క్‌కు చెందిన 15,000కు పైగా సంస్థలు, భాగస్వాములను తీసుకురానుంది.

తితిదే డైరీలు, క్యాలెండర్లు పొందండిలా



తిరుమల, న్యూస్‌టుడే: కొత్త ఏడాది క్యాలెండర్లు, డైరీలకు దేశవిదేశాల్లోని శ్రీవారి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోందని తితిదే గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. భక్తుల సౌకర్యార్థం 12 పేజీల క్యాలెండర్ రూ.130, డీలక్స్ డైరీ రూ.150, చిన్న డైరీ రూ.120, టేబుల్ టాప్ క్యాలెండర్ రూ.75, ఆరు పేజీల 3డీ డిజిటల్ క్యాలెండర్ రూ.450, శ్రీవారి పెద్ద క్యాలెండర్ రూ.20, శ్రీపద్మావతి అమ్మవారి క్యాలెండర్ రూ.20, శ్రీవారు, శ్రీపద్మావతి అమ్మవారి క్యాలెండర్ రూ.15, తెలుగు పంచాంగం క్యాలెండర్ రూ.30, తితిదే స్థానికాలయాల క్యాలెండర్ రూ.130లకు అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది.

★ తిరుపతిలోని తితిదే పరిపాలనా భవనం ఎదుట, శ్రీగోవిందరాజ స్వామివారి ఆలయ సమీపంలోని ధ్యానమందిరం, శ్రీనివాసం, విష్ణు నివాసం, తిరుచానూరులోని తితిదే పబ్లికేషన్ స్టాళ్లలో అందుబాటులో ఉన్నాయి.

ఇతర ప్రాంతాల్లో: చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, వైజాగ్‌లోని శ్రీవారి ఆలయాలు, ముంబయి, దిల్లీ, వేలూరు, కాంచీపురంలోని సమాచార కేంద్రాలు, నెల్లూరు, రాజమహేంద్రవరం, కాకినాడ, కర్నూలులోని తితిదే కల్యాణ మండపాల్లో విక్రయిస్తున్నారు. ఒంటిమిట్టలోని శ్రీకోదండరామస్వామివారి ఆలయం, దేవుని కడపలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాలతోపాటు తితిదే అనుబంధ ఆలయాల్లోనూ అందుబాటులో ఉంచారు.

ఆన్‌లైన్‌లోనూ బుక్ చేసుకోవచ్చు

భక్తులు డైరీలు, క్యాలెండర్లను తితిదే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయవచ్చు. 12 పేజీల క్యాలెండర్, డీలక్స్ డైరీ, చిన్న డైరీ, టేబుల్ టాప్ క్యాలెండర్, ఆరు పేజీల 3డీ డిజిటల్ క్యాలెండర్లను www.tirumala.org, ttdevasthanams.ap.gov.in లో బుక్ చేసుకున్న భక్తులకు తితిదే తపాలాశాఖ ద్వారా పంపుతుంది.

డీడీ తీసి పంపినా..

భక్తులు డీడీ తీసి పంపినా తితిదే క్యాలెండర్, డైరీలు పొందవచ్చు. ఇందుకోసం 'కార్యనిర్వహణాధికారి, తితిదే, తిరుపతి' పేరిట ఏదైనా జాతీయ బ్యాంకులో డీడీ తీసి కవరింగ్ లెటర్‌తో కలిపి 'డిప్యూటీ ఈవో, పుస్తక ప్రచురణల విక్రయ విభాగం, ప్రెస్ కాంపౌండ్, కేటీ రోడ్, తిరుపతి' చిరునామాకు పంపాల్సి ఉంటుంది. రవాణా ఛార్జీలను అదనంగా తపాలాశాఖకు చెల్లించాల్సి ఉంటుంది.

★ క్యాలెండర్, డైరీలకు సంబంధించిన ఇతర సమాచారం కోసం 0877-2264209ను సంప్రదించాలని తితిదే సూచించింది.

పింఛను, జీపీఎఫ్ సేవల డిజిటలైజేషన్‌పై సమావేశం నేడు

ఈనాడు, అమరావతి: రాష్ట్రప్రభుత్వ ఉద్యోగుల పింఛను ప్రయోజనాలు, ఆంధ్రప్రదేశ్ జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (ఏపీజీపీఎఫ్) సేవలు మరింత పారదర్శకంగా, వేగంగా అందించే చర్యలను ప్రభుత్వం చేపట్టింది. ఈ క్రమంలో ఆర్థికశాఖ రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రాసెసింగ్ సిస్టమ్ (ఆర్‌బీపీఎస్), డిజిటలైజ్డ్ ఏపీజీపీఎఫ్ సేవల ఐటీ అప్లికేషన్లు అభివృద్ధి చేసింది. నిధి పోర్టల్ ద్వారా వీటని అందుబాటులోకి తేనుంది. ఈ కొత్త ఐటీ అప్లికేషన్ల అమలు, కార్యకలాపాలపై చర్చించేందుకు శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు సచివాలయం రెండోబ్లాకులో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆర్థికశాఖ (హెచ్ఆర్) విభాగం కార్యదర్శి వాడరేవు వినయ్‌చంద్ సర్క్యులర్ జారీచేశారు. ప్రతి ఉద్యోగ సంఘం నుంచి ఇద్దరు ప్రతినిధులే సమావేశానికి రావాలని, ఆర్‌బీపీఎస్, ఏపీజీపీఎఫ్ సేవలపై సూచనలు, అభిప్రాయాలు అందించాలని కోరారు.



గ్రహం అనుగ్రహం 12–12–2025 శుక్రవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, మార్గశిర మాసం, బహుళపక్షం

అష్టమి: సా. 6-50 తదుపరి నవమి; **పుబ్బ:** ఉ.8-33 తదుపరి ఉత్తర **వర్జ్యం:** సా.4-02 నుంచి 5-42 వరకు; **అమృత ఘడియలు:** రా.2-01 నుంచి 3-41 వరకు; **దుర్ముహూర్తం:** ఉ. 8-35 నుంచి 9-19 వరకు తిరిగి మ.12-15 నుంచి 12-59 వరకు; **రాహుకాలం:** ఉ.10-30 నుంచి 12-00 వరకు; **సూర్యోదయం:** ఉ. 6.24; **సూర్యాస్తమయం:** సా. 5.23

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	6.2	29.3
హైదరాబాద్	12.2	29.6
కర్నూలు	15.2	31.4
అనంతపురం	16.0	30.5
విశాఖపట్నం	16.6	29.0
శ్రీకాకుళం	17.0	28.0
విజయనగరం	17.0	28.0
కడప	17.0	28.0
రాజమహేంద్రవరం	17.0	35.0
విజయవాడ	17.5	30.0
నరసాపురం	18.0	32.7
గుంటూరు	19.0	29.0
ఒంగోలు	20.4	30.7
నెల్లూరు	21.0	30.1
తాడేపల్లిగూడెం	27.0	30.0



MALLA REDDY ENGINEERING COLLEGE AND MANAGEMENT SCIENCES
AN UGC AUTONOMOUS INSTITUTION
Accredited by NBA (UG: CSE, IT, ECE & EEE) & NAAC (Approved by AICTE, New Delhi and Affiliated to JNTU Hyderabad)
Medchal, Medchal Malkajgiri Dist, Hyderabad – 591 401 www.mrem.ac.in, Ph: 9346009797, 9346009393
WALK IN INTERVIEWS AT VIJAYAWADA
on 14th DECEMBER 2025 at 10.00 am to 6.00 pm)
PRINCIPAL, PROFESSORS, ASSOC.PROFESSORS AND ASST.PROFESSOR
For CSE, CSE (AIML), CSE (DS) IT, ECE, MECH, EEE, CIVIL, MBA, English, Physics, Mathematics and Chemistry.
Qualifications and Salary: As per AICTE Norms
High Salary for Deserving Candidates
Venue. Hotel DV Manor, MG Road, Near Benz Circle, Vijayawada - 520010
All original Certificates and one set of Xerox Copies and Experience Certificates along with Pan Card and Aadhaar Card.
Note: If you unable to attend the walk in interview, Send your resume to hr@mrem.ac.in

Address: LIC Colony, 2nd Line, Stambalagaruvu, Guntur
Contact: 94413 26683, 0863 2233815
VIGNAN HIGH SCHOOL GUNTUR
WALK-IN-INTERVIEW
Required Teachers for Class VI to X
1. Physics 2. Chemistry 3. Social Science 4. General Science 5. Art Teacher
Required Hindi Teachers for Class UKG, I & II
Qualification:
Physics, Chemistry - M.Sc; B.Ed | Social Science - M.A; B.Ed
General Science - B.Sc; B.Ed | Art Teacher - BFA
Hindi Teacher - HPT

Date & Time	Location	Venue
21-12-2025 (Sunday) 9:00 AM	Guntur	VIGNAN High School LIC Colony, 2nd Line, Stambalagaruvu, Guntur

Dr. L. Rathaiah, Chairman - VIGNAN Institutions, Guntur
Contact: 94413 26683, 0863 2233815

SBI
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సెంట్రల్ రిక్రూట్‌మెంట్ & ప్రమోషన్ డిపార్ట్‌మెంట్
కార్పొరేట్ సెంటర్, ముంబై
ఇమెయిల్ : crpd@sbi.co.in
అప్లై చేయడానికి QRని స్కాన్ చేయండి
కాంట్రాక్టు ప్రాతిపదికన స్పెషలిస్టు అధికారుల నియామకం
భారతీయ స్టేట్ బ్యాంకు రెగ్యులర్ / కాంట్రాక్టు ప్రాతిపదికన క్రింద పేర్కొనిన స్పెషలిస్టు ఉద్యోగాల కొరకు భారత పౌరుల నుండి దరఖాస్తులు కోరుచున్నది:

ప్రకటన నం. CRPD/SCO/2025-26/17	
పదవి పేరు	ఖాళీ
వీపీ వెల్త్ (ఎస్ఆర్ఎమ్)	506
ఏవిపి వెల్త్ (ఆర్ఎం)	206
కస్టమర్ రిలేషన్షిప్ ఎగ్జిక్యూటివ్	284


అర్హతా ప్రమాణాలు (వయస్సు, అర్హతా, అనుభవం, ఉద్యోగ ప్రొఫైల్ మొదలైనవి), చెల్లించవలసిన ఫీజు మరియు ఇతర వివరాల కోసం బ్యాంక్ వెబ్‌సైట్ https://sbi.bank.in/web/careers/current-openings లో లాగ్‌ఆన్ అయ్యి, ఆన్‌లైన్‌లో దరఖాస్తును నింపి ఆన్‌లైన్ ఫీజు లింక్ ద్వారా దరఖాస్తు ఫీజును చెల్లించండి. దరఖాస్తు మరియు ఫీజు చెల్లింపు వివరాలతో పాటు అర్హతలను నిర్ధారించు కొనుటకు మరియు పూర్తి వివరాల కొరకు ప్రకటనను చూడండి. ఏవైనా సందేహాలు ఉన్నచో, దయచేసి మాకు – "CONTACT US" —> "Post Your Query" లింకు ద్వారా వ్రాసి పంపండి. ఈ లింకు మీకు బ్యాంకు వెబ్ సైట్ (https://sbi.bank.in/web/careers/post-your-query) లో లభించును.
- ఆన్ లైన్ లో దరఖాస్తు చేయుటకు మరియు ఫీజు చెల్లింపు తేదీ : 02.12.2025 నుండి 23.12.2025 వరకు.

స్థలం: ముంబై
తేదీ: 02.12.2025
మహానిర్వహణాధికారి (ఆర్‌పి & పీఎం)

CITY CHALAPATHI Institute of Technology AUTONOMOUS
MOTHADAKA, Guntur
95055 05566/88866 30355
www.city.ac.in
WALK-IN-INTERVIEW
We require well accomplished academic professionals to work at
Chalapathi Institute of Engineering & Technology, Lam, Guntur / Chalapathi Institute of Technology, Mothadaka, Guntur

Department	Position	Pay & Qualification
CSE/CSE-AI/AI&ML/ DS/CS/IT/ECE/MATHS/ PHYSICS/CHEMISTRY	Professors / Associate Professors / Asst. Professors / Lab Technicians / Lab Programmers and Non Teaching Staff - Computer Operators, Admin. Officers, Assistants, Aptitude, Reasoning, Communication Trainers	As per AICTE Norms, Retired persons with Ph.D Qualification can also apply

Interested candidates may walk in along with all original certificates at Chalapathi Institute of Technology, Mothadaka on 13/12/25.
Those who are unable to attend for walk-in can send your cv to principal@city.ac.in
Date: 12-12-2025
Note: Doctorates are required for all the Departments
*Salary is negotiable for the experienced candidates.
Sd./ Secretary
Chalapathi Educational Society



రామోజీ ఫిల్మ్‌సిటీలో లారా విలియమ్స్‌కు స్వాగతం పలుకుతున్న రామోజీ గ్రూపు సీఎండీ సిహెచ్.కిరణ్, ఫిల్మ్‌సిటీ ఎండీ సిహెచ్.విజయేశ్వరి. చిత్రంలో అలెగ్జాండర్ మెక్‌లారెన్, హబీబ్

రామోజీ ఫిల్మ్‌సిటీని సందర్శించిన అమెరికా కాన్సుల్ జనరల్ లారా

ఈనాడు, హైదరాబాద్: అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ గురువారం రామోజీ ఫిల్మ్‌సిటీని సందర్శించారు. తెలుగు మాట్లాడే ప్రజల భావప్రకటనా స్వేచ్ఛను, మీడియా రంగంలో సహకారాన్ని మరింత పెంపొందించడంపై రామోజీ గ్రూపు ఛైర్మన్-మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్.కిరణ్, రామోజీ ఫిల్మ్‌సిటీ మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్.విజయేశ్వరిలతో ఆమె చర్చలు జరిపారు. రామోజీ ఫిల్మ్‌సిటీలోని పర్యాటక ప్రదేశాలను సందర్శించి, అక్కడి అందాలకు మంత్రముగ్ధరాలయ్యారు. బాహుబలి సెట్టింగును పరిశీలించి, చలన చిత్రాల నిర్మాణం గురించి అడిగి తెలుసుకున్నారు. ఫిల్మ్‌సిటీలోని పలు ఆకర్షణల్ని తిలకించిన తర్వాత మీడియా స్ట్రీట్‌కు వెళ్లారు. ఈటీవీ కార్యాలయంలో న్యూస్‌రూంను, స్టూడియోలను పరిశీలించారు. టీవీ ప్రసారాలు, సాంకేతిక వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంపాదకవర్గంలోని సీనియర్లతో సమావేశమయ్యారు. "ఇది చాలా అద్భుతమైన అనుభవం. ఇక్కడి సాంకేతికత, కళాత్మకత కట్టిపడేశాయి. నాకు ఆతిథ్యమిచ్చిన రామోజీ ఫిల్మ్‌సిటీ, ఈటీవీలకు కృతజ్ఞతలు. రామోజీరావు తీర్చిదిద్దిన ఈ ప్రాంతం ఎంతో ఆకట్టుకునేలా ఉంది. ఇక్కడ పనిచేస్తున్నవారి అంకితభావం, వారిలో కనిపించిన ఆనందం నన్ను ఆకర్షించాయి. ఇదంతా ప్రత్యక్షంగా చూడటం చాలా సంతోషంగా ఉంది. భారత్-అమెరికా అనేక విషయాల్లో సారూప్యతను పంచుకుంటాయి. అందులో పత్రికా స్వేచ్ఛ ఒకటి" అని లారా పేర్కొన్నారు. ఆమె వెంట హైదరాబాద్‌లోని అమెరికా కాన్సుల్ జనరల్ కార్యాలయ ప్రజా వ్యవహారాల అధికారి అలెగ్జాండర్ మెక్‌లారెన్, పబ్లిక్ డిప్లమసీ అధికారి అబ్దుల్ రెహ్మాన్ హబీబ్ ఉన్నారు.

భవానీ దీక్షల విరమణ ప్రారంభం





అమ్మవారి ఉత్సవ విగ్రహం ★ విజయవాడలోని ఇంద్రకీలాద్రి కింద కనకదుర్గానగర్‌లో హోమగుండాలను వెలిగించి భవానీ దీక్షల విరమణను ప్రారంభిస్తున్న దుర్గ గుడి ఛైర్మన్ గాంధీ, ఈవో శీనా నాయక్, పండితులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణకు దీక్షాధారులు గురువారం పెద్దఎత్తున తరలివచ్చారు. గిరిప్రదక్షిణ అనంతరం భవానీలు దుర్గమ్మను దర్శించుకున్నారు. దుర్గమ్మ నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఉదయం 6.30 గంటలకు వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య కనకదుర్గానగర్‌లోని హోమగుండాల్లో అగ్నిప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. దుర్గ గుడి పాలక మండలి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనా నాయక్ ఇరుముడి సమర్పణ కేంద్రాలు పరిశీలించారు. మొదటి రోజు 60 వేల మంది మాల విరమణ చేశారని అధికారులు తెలిపారు.



అమ్మవారిని దర్శించుకొని మెట్ల మార్గం ద్వారా ఇరుముళ్లు సమర్పించేందుకు మహామండపం వద్దకు వస్తున్న భవానీలు

మహిళలు, బాలల భద్రత కోసం ప్రత్యేక విభాగం

నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా



మహిళలు, బాలల భద్రత విభాగం నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా. చిత్రంలో సీఐడీ విభాగాధిపతి రవిశంకర్ అయ్యన్నార్, ఐజీలు రాజకుమారి, ఎం.రవిప్రకాశ్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో మహిళలు, బాలల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా అన్నారు. వారిపై జరిగే నేరాల విషయంలో సత్వరం స్పందన కోసం రాష్ట్రవ్యాప్తంగా 164 శక్తి బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. శక్తి వాట్సప్ నంబర్ 79934 85111కు అందే ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఐజీ బి.రాజకుమారి నేతృత్వంలో ప్రత్యేకంగా మహిళలు, బాలల భద్రత విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ విభాగం కోసం తాడేపల్లిలో ఏర్పాటుచేసిన నూతన కార్యాలయాన్ని డీజీపీ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు, బాలలపై ఎక్కువగా నేరాలు జరిగే ఆస్కారమున్న ప్రాంతాల్ని గుర్తించి... అక్కడ గస్తీ పెంచామని చెప్పారు. శక్తి యాప్, టోల్‌ఫ్రీ నంబర్లు 100, 112, 181, 1098కి బాధితుల నుంచి అందే కాల్స్, ఫిర్యాదుల వివరాలు ఎప్పటికప్పుడు కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి శక్తి బృందాలకు చేరుతున్నాయని, క్షేత్రస్థాయిలో వారు వెంటనే స్పందిస్తున్నారని వివరించారు. మహిళలు, బాలలపై జరిగిన నేరాలకు సంబంధించి 2024 జూన్ నుంచి ఇప్పటివరకూ 410 కేసుల్లో నిందితులకు శిక్షలు పడ్డాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐడీ విభాగాధిపతి రవిశంకర్ అయ్యన్నార్, శాంతిభద్రతల విభాగం అదనపు డీజీ మధుసూదన్‌రెడ్డి, పీ అండ్ ఎల్ విభాగం ఐజీ ఎం.రవిప్రకాశ్, మహిళలు, బాలల భద్రత విభాగం ఐజీ రవికుమార్, ఎస్పీలు వి.రత్న, ఎస్.శ్రీదేవిరావు పాల్గొన్నారు.

కొత్త ప్రాజెక్టులు నిర్మించకుండా తెలంగాణను నిలువరించాలి

- కేంద్ర జల్ శక్తి శాఖ, జల సంఘం, కృష్ణా బోర్డులకు ఏపీ లేఖ

ఈనాడు, అమరావతి: కృష్ణా పరీవాహక ప్రాంతంలో కొత్త ప్రాజెక్టులను నిర్మించకుండా తెలంగాణను అడ్డుకోవాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ మేరకు జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ కేంద్ర జల్ శక్తి కార్యదర్శికి తాజాగా లేఖ రాశారు. "కృష్ణా పరీవాహక ప్రాంతంలో 16 ప్రాజెక్టులకు సంబంధించి డీపీఆర్‌ల తయారీకి తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇది ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో నష్టం కలిగిస్తుంది. రాష్ట్ర విభజన చట్టానికి ఇది పూర్తిగా విరుద్ధం. పైగా ప్రస్తుతం ఈ అంశాలు ట్రైబ్యునల్ పరిధిలో ఉన్నాయి. కేంద్రం.. ట్రైబ్యునల్‌కు అదనపు అంశాల కింద కొన్ని అంశాలు పరిశీలించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో తెలంగాణ 16 కొత్త ప్రాజెక్టులకు డీపీఆర్ తయారీకి పూనుకోవడం కోర్టు ఉల్లంఘన కిందకు వస్తుంది" అని అందులో పేర్కొన్నారు. కేంద్ర జలసంఘం ఛైర్మన్‌కు, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఛైర్మన్‌కు సైతం ఆ లేఖలు పంపారు. అందులో వివరాలు ఇవీ..

★ రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ ఇప్పటికే 42 కొత్త ప్రాజెక్టులను చేపట్టింది. ఈ అంశంపై కృష్ణా బోర్డుకు ఫిర్యాదు చేశాం. కేంద్ర జల్ శక్తికి, కేంద్ర జల సంఘానికి కూడా ఫిర్యాదులు ఇచ్చాం. ఆ ప్రతులూ ఇక్కడ జత చేస్తున్నాం.

★ రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఏ రాష్ట్రమైనా కొత్త ప్రాజెక్టులు చేపట్టాలంటే కృష్ణా బోర్డు, కేంద్ర జల సంఘం ముందుంచిన తర్వాత ఎపెక్స్ కౌన్సిల్ ఆమోదం మేరకే వాటిని చేపట్టవలసి ఉంటుంది.

★ కేంద్ర జల సంఘం సాంకేతికంగా, ఆర్థికంగా మదింపు చేయని, కేంద్ర జల వనరుల శాఖ నుంచి సాంకేతిక సలహా కమిటీ ఆమోదం పొందని ఏ ప్రాజెక్టు అయినా కొత్త ప్రాజెక్టుగానే పరిగణిస్తామని రెండో ఎపెక్స్ కౌన్సిల్ సమావేశం తేల్చి చెప్పింది. రాష్ట్ర విభజనకు ముందు చేపట్టినా, తర్వాత చేపట్టినా అలాంటి ప్రాజెక్టు కొత్త ప్రాజెక్టుగానే పరిగణిస్తామని ఎపెక్స్ కౌన్సిల్ పేర్కొంది.

★ తెలంగాణ కొత్తగా నోటిఫై చేసిన 16 సాగునీటి ప్రాజెక్టులూ కొత్తవే.

★ ఈ నేపథ్యంలో కొత్త ప్రాజెక్టులకు ఎలాంటి హైడ్రాలాజికల్ అనుమతులూ ఇవ్వకుండా చూడాలి.

★ ఎపెక్స్ కౌన్సిల్ ఆమోదం లేకుండా కొత్త ప్రాజెక్టులు చేపట్టవద్దని తెలంగాణ రాష్ట్రాన్ని కేంద్ర జల్ శక్తి కార్యదర్శి ఆదేశించాలి.

నేడు కాగ్నిజెంట్ శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి భూమిపూజ

- సత్వా గ్రూప్ క్యాంపస్.. ఏడు ఐటీ కంపెనీలకూ..
- శంకుస్థాపన చేయనున్న సీఎం.. మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: విశాఖలో ప్రముఖ ఐటీ సంస్థ కాగ్నిజెంట్ శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి సీఎం చంద్రబాబు శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. 'కాపులుప్పాడ ఐటీ హిల్స్‌లో 21.31 ఎకరాలను సంస్థకు కేటాయించాం. అందులో ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఐటీ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఐటీ క్యాంపస్‌ను సంస్థ మూడు దశల్లో రూ.1,583 కోట్లతో నిర్మించనుంది. తద్వారా 8,000 మందికి ఉపాధి లభిస్తుంది. 2029 నాటికి మొదటిదశ పూర్తి చేయడం ద్వారా 3,000 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. 2033 నాటికి మూడు దశలను సంస్థ పూర్తి చేస్తుంది' అని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. వెయ్యి సీటింగ్ కెపాసిటీతో ఏర్పాటు చేసిన తాత్కాలిక క్యాంపస్‌ను మంత్రి లోకేశ్ ప్రారంభిస్తారు.

సత్వా క్యాంపస్‌కు శంకుస్థాపన

విశాఖలోని మధురవాడలో హిల్-4లో సత్వా గ్రూప్ నిర్మించనున్న వాంటేజ్ వైజాగ్ క్యాంపస్‌కు మంత్రి లోకేశ్ శంకుస్థాపన చేస్తారని ప్రభుత్వం తెలిపింది. 'ఆ సంస్థ రూ.1,500 కోట్ల పెట్టుబడితో 30 ఎకరాల్లో క్యాంపస్ నిర్మిస్తోంది. దీని ద్వారా ప్రత్యక్షంగా 25,000 మందికి, పరోక్షంగా 50,000 మందికి ఉపాధి లభిస్తుంది. ప్రపంచస్థాయి ప్రమాణాలతో గ్రేడ్-ఎ కార్యాలయాలు, ప్రీమియం నివాసాలు, ఇంటిగ్రేటెడ్ రిటైల్, హాస్పిటాలిటీ సౌకర్యాలు, స్మార్ట్ మొబిలిటీ, పునరుత్పాదక విద్యుత్, పట్టణ జీవన విధానానికి అనుగుణంగా మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయి. మూడేళ్లలో మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐటీ స్పేస్‌ను సంస్థ అభివృద్ధి చేయనుంది' అని తెలిపింది.

మరో ఏడు ఐటీ కంపెనీలకూ..

వీటితో పాటు మరో ఏడు ఐటీ సంస్థల క్యాంపస్‌ల నిర్మాణానికి మంత్రి లోకేశ్ భూమిపూజ చేయనున్నారు.

◆ టెక్ తమ్మిన (శ్రీతమ్మిన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్): మధురవాడలోని ఎస్పీఎల్-4 హిల్ నం-2లో రూ.62 కోట్ల పెట్టుబడి.. 500 మందికి ఉపాధి అవకాశాలు.

◆ నాన్ రెల్ టెక్నాలజీస్: నాన్ ఐటీ సెజ్ హిల్ నం-2లో రూ.50.60 కోట్ల పెట్టుబడి.. 567 మందికి ఉపాధి.

◆ ఏసీఎన్ ఇన్ఫోటెక్: ఐటీ సెజ్ హిల్ నం-2లో రూ.30 కోట్ల పెట్టుబడి.. 600 మందికి ఉపాధి.

◆ ఇమాజిన్నోవేట్ టెక్ సొల్యూషన్స్: భీమిలిలోని కాపులుప్పాడలో రూ.140 కోట్ల పెట్టుబడి.. 2,600 మందికి ఉపాధి.

◆ ఫ్లూయెంట్ గ్రిడ్ లిమిటెడ్: భీమిలిలోని కాపులుప్పాడలో రూ.150 కోట్ల పెట్టుబడి.. 2,000 మందికి ఉపాధి.

◆ మదర్సన్ టెక్నాలజీ సర్వీసెస్: కాపులుప్పాడ ఫేజ్-1 ఐటీ పార్క్‌లో రూ.109.73 కోట్ల పెట్టుబడి.. 1,775 మందికి ఉపాధి.

◆ క్వార్క్స్ టెక్నో సాఫ్ట్: కాపులుప్పాడలో రూ.115 కోట్ల పెట్టుబడి.. 2,000 మందికి ఉపాధి.

సల్మాన్ ఖాన్‌కు ఊరట

- ఆయన ప్రైవసీ హక్కులకు రక్షణ కల్పించండి
- జూనియర్ ఎన్టీఆర్ పిటిషన్‌ను ఫిర్యాదుగా తీసుకోండి
- దిల్లీ హైకోర్టు ఆదేశం

దిల్లీ: బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ ప్రైవసీ హక్కులను కాపాడాలని సామాజిక మాధ్యమాలను దిల్లీ హైకోర్టు ఆదేశించింది. ఆయన ఫిర్యాదులపై 3 రోజుల్లోగా చర్యలు తీసుకోవాలని సూచించింది. అజయ్ దేవ్‌గణ్‌కూ ఇదే విధమైన ఊరట కల్పించింది. అయితే కోర్టుకు వచ్చే ముందు సంబంధిత సామాజిక మాధ్యమ సంస్థలకు ఫిర్యాదు చేయాలని సూచించింది. తెలుగు నటుడు జూనియర్ ఎన్టీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఫిర్యాదుగా తీసుకోవాలని ఆ సంస్థలకు సూచించింది. గురువారం జస్టిస్ మన్‌మీత్ ప్రీతమ్ సింగ్ అరోడా ధర్మాసనం ఈ ఆదేశాలిచ్చింది. తన పేరు, చిత్రాలు, వ్యక్తిగత సమాచారాన్ని తన అనుమతి లేకుండా సామాజిక మాధ్యమాలు, ఈకామర్స్ వెబ్‌సైట్లలో కొంత మంది వాడుతున్నారని, ఈ విషయంలో తన ప్రైవసీ హక్కులను కాపాడాలని, వాటిని అడ్డుకునేలా ఆదేశాలివ్వాలని కోరుతూ సల్మాన్ ఖాన్ దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన ధర్మాసనం ఆయనకు అనుకూలంగా ఉత్తర్వులిచ్చింది. సల్మాన్ ఖాన్ పిటిషన్‌ను సమాచార, సాంకేతిక (మాధ్యమాల మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా నైతిక ప్రవర్తనా నియమావళి) నిబంధనలు-2021 కింద ఫిర్యాదుగా స్వీకరించాలని సామాజిక మాధ్యమ సంస్థలకు ఆదేశాలిచ్చింది. ఇలా పేరు, చిత్రాలను వాడుకుంటున్న ఇతర సంస్థలపై వివరణాత్మక మధ్యంతర ఉత్తర్వులను విడిగా జారీ చేస్తామని స్పష్టం చేసింది.

తెలుగు భాషాభివృద్ధికి కృషి

అధికార భాషా సంఘం ఛైర్మన్ త్రివిక్రమరావు



త్రివిక్రమరావుతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మంత్రి దుర్గేష్. వేదికపై గుమ్మడి గోపాలకృష్ణ, యార్లగడ్డ వెంకట్రావు, టి.డి.జనార్దన్, నన్నపనేని రాజకుమారి, లంకా దినకర్ తదితరులు

విజయవాడ(భవానీపురం), న్యూస్‌టుడే: తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తానని మండలి కృష్ణారావు అధికార భాషా సంఘం నూతన ఛైర్మన్ పి.త్రివిక్రమరావు పేర్కొన్నారు. విజయవాడలోని హరిత సమావేశ మందిరంలో గురువారం ఆయన చేత మంత్రి కందుల దుర్గేష్ ప్రమాణ స్వీకారం చేయించారు. త్రివిక్రమరావు మాట్లాడుతూ.. అధికార భాషా సంఘానికి సారథిగా, వారధిగా పనిచేస్తానన్నారు. ప్రభుత్వ యంత్రాంగంలో తెలుగు వినియోగాన్ని పెంచే కార్యక్రమాల నిర్వహణకు అందరి సలహాలు, సూచనలు తీసుకుని ముందుకెళ్తానని ప్రకటించారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. పలు సంస్థలు, అకాడమీల ఛైర్మన్ పదవుల్లో ఆయా రంగాల్లో సేవలందించిన వారినే ప్రభుత్వం నియమించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, సామాజిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ పోతుల బాలకోటయ్య, 20 సూత్రాల కార్యక్రమం అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ ఫరూక్ షబ్లీ, టి.డి.జనార్దన్, నన్నపనేని రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.



'ఊ'..కొట్టిస్తున్న చలి!

జి.మాడుగులలో 3.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత



అల్లూరి సీతారామరాజు జిల్లా సొలభం గ్రామంలో వరి కుప్పల వద్ద మంచు గడ్డలు ★ సొలభంలో ఆకులపై ఏర్పడిన మంచు తుంపర్లు

ఈనాడు, విశాఖపట్నం, జి.మాడుగుల, చింతపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రజలను చలి గజగజలాడిస్తోంది. ఏజెన్సీతోపాటు మైదాన ప్రాంతాల్లోనూ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. బుధవారం రాత్రి రాష్ట్రంలోనే అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో కనిష్ఠ ఉష్ణోగ్రత 3.2 డిగ్రీలుగా నమోదైంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఇదే అత్యల్పం. మరోవైపు అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడలో 3.6, అరకులోయ- 3.9, ముంచంగిపుట్టు- 4.4, హుకుంపేట- 5.4, చింతపల్లి- 6.5, పాడేరు- 6.7, పెదబయలులో 7.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. ఉష్ణోగ్రతలు క్షీణిస్తుండటంతో పంట పొలాల వద్ద మంచుగడ్డలు పరచుకొని తెల్లటి పొరలు ఏర్పడుతున్నాయి. ఒడిశా, తెలంగాణ, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో చలిగాలులు వీచే అవకాశముందని భారత వాతావరణ విభాగం పేర్కొంది. వీటి ప్రభావంతో రాబోయే రోజుల్లో రాష్ట్రంలో చలి తీవ్రత పెరగనుంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి మృతి



గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే పిడతల రాంభూపాల్‌రెడ్డి (89) గురువారం తెల్లవారుజామున హైదరాబాద్‌లోని స్వగృహంలో మృతి చెందారు. ఆయన 1994లో తెలుగుదేశం పార్టీ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రాంభూపాల్ రెడ్డి భౌతికదేహాన్ని గురువారం మధ్యాహ్నం హైదరాబాద్‌లో మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. శుక్రవారం ఉదయం రాచర్ల మండలం అనుమలవీడులో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుమారుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

అల్లూరి జిల్లాలో రెండు కాఫీ పల్పింగ్ యూనిట్లు

ఈనాడు, అమరావతి: అల్లూరి సీతారామరాజు జిల్లాలో రెండు కాఫీ పల్పింగ్ యూనిట్ల ఏర్పాటుకుగాను రూ.3.50కోట్లు విడుదలకు ప్రభుత్వం పరిపాలన అనుమతులిచ్చింది. గురువారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. పల్పింగ్ యూనిట్లు జి.మాడుగుల, జీకే వీధిలో ఏర్పాటు కానున్నాయి.




ఈనాడు

జనభారత ఉన్నతికి సమ్మిళిత ప్రగతి

ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఇండియా విరాజిల్లుతోంది. త్వరలోనే మరో అంచె పైకి చేరడానికి వడివడిగా అడుగులు వేస్తోంది. జీడీపీ పరంగా దేశం సాధిస్తున్న వృద్ధి ఆనందదాయకమైనదే. అయినప్పటికీ ఆ ప్రగతి ఫలాల పంపిణీలో పొడచూపుతున్న అంతరాలను అసమానతల నివేదిక తాజాగా మరోసారి వెలుగులోకి తెచ్చింది. ఆ నివేదిక ప్రకారం- శ్రీమంతులైన ఒకశాతం భారతీయుల చేతుల్లో ఏకంగా 40శాతం సంపద పోగుపడితే, దిగువనున్న యాభైశాతం ప్రజల దగ్గర కేవలం 6.4శాతమే మిగిలింది. ఆదాయాల పరంగానూ పరిస్థితి అలాగే ఉంది. 1980లో దేశీయ ఆదాయంలో ఎగువన ఉన్న పదిశాతం జనాభా వాటా దాదాపు 30శాతం ఉంటే- గతేడాది చివరికి అది అంతకు రెట్టింపయ్యింది. అదే సమయంలో కింది స్థాయిలోని పదిశాతం ప్రజల వాటా పాతిక శాతం నుంచి 15శాతానికి తెగ్గోసుకుపోయింది. సంవత్సరాలు గడచిపోతున్నప్పటికీ ఈ రెండు వర్గాల ఆదాయ అంతరాల్లో ఎలాంటి మార్పూ లేదన్న నివేదికాంశాలు- అభివృద్ధిని అందరికీ సమంగా చేరువకానివ్వని, సామాన్య ప్రజల రాబడిని పెంచని వ్యవస్థాగత సమస్యలకు అద్దంపడుతున్నాయి. పేదరికమనే అడ్డుగోడను బద్దలుకొట్టుకుని భారతీయులందరూ కలిసికట్టుగా ఎదగాలన్నది జాతినిర్మాతల ఆశయాల్లో ప్రధానమైనది. స్వాతంత్ర్యం సిద్ధించినప్పటి నుంచి ఆ దిశగా బలమైన అడుగులు పడకపోవడమే ఆర్థిక అసమానతల ప్రజ్వలనానికి కారణమవుతోంది!

కొద్దిమంది గుప్పిట్లోనే విపరీతంగా కేంద్రీకృతమయ్యే సంపద ఎప్పటికీ దేశాభివృద్ధికి కొలమానం కాదు! జనజీవన ప్రమాణాలు మెరుగుపడటం, మౌలిక వసతులు విస్తృతం కావడం, ప్రజల కొనుగోలు శక్తి ఇనుమడించడం.. ఇవే ఒక దేశ ప్రగతికి నిజమైన తూనికరాళ్లు. కానీ, నానాటికీ చుక్కలనంటుతున్న ధరలు, కట్టుతప్పుతున్న జీవన వ్యయాలకు తగినట్లు ఆదాయాలు పెరగక ఎన్నో కుటుంబాలు రుణ ఊబిలో కూరుకుపోతున్నాయి. ఎఫ్ఏవో నివేదిక ప్రకారం 74శాతం భారతీయులకు పౌష్టికాహారం ఇంకా అందని వరమే! పెద్ద పెద్ద డిగ్రీలు ఎన్ని ఉన్నా, కొలువుకు తగ్గ నైపుణ్యాలు కొరవడి ఉపాధి వేటలో యువత చతికిలపడుతోంది. ప్రజారోగ్య వ్యవస్థలో వసతుల లేమి మూలంగా అందరికీ ప్రైవేటే దిక్కవుతోంది. అక్కడి ఖర్చుల దెబ్బకు ఏటా ఎంతోమంది కొత్తగా పేదరికంలోకి జారిపోతున్నారు. ఆరుగాలం కష్టిస్తున్నా సాగు గిట్టుబాటు కాక అన్నదాతలు ఆత్మహత్యలకు ఒడిగడుతున్నారు. వీళ్లందరి బతుకుల్లో వెలుగులు నిండినప్పుడే దేశం నిజంగా సంపన్నమైనది అవుతుంది.

విద్య, వైద్యం, గృహవసతి, ఉపాధి పరంగా ధనిక, పేద వర్గాల మధ్య దూరాన్ని బాగా పెంచేసే అసమానతలు సమాజంలో అశాంతికి కారణమవుతాయి. సరైన చదువు, చేతిలో తగిన పనిలేని వ్యక్తుల మనసుల్లో విద్వేషాన్ని పెంచి చట్టవ్యతిరేక పనులకు పురిగొల్పుతాయి. అంతిమంగా దేశ సౌభాగ్యాన్ని, ఆనందమయ జీవనాన్ని అవి కబళిస్తాయి. వీటన్నింటినీ గుర్తెరిగే సింగపూర్ తొలి ప్రధాని లీ క్వాన్ యూ స్థానికంగా ప్రతి ఒక్క కుటుంబానికీ ఇల్లు, ఉద్యోగం ఉండేలా ప్రణాళికాబద్ధంగా పరిశ్రమించారు. ప్రజారోగ్యంపై ప్రభుత్వ వ్యయాన్ని పెంచి సామాన్య కుటుంబాలకు దన్నుగా నిలిచారు. నైపుణ్య ఆధారిత ప్రపంచంలో అగ్రరాజ్యాలతో పోటీపడే స్థాయిలో సింగపూర్‌ను ఆయన మేటి విద్యావ్యవస్థ ద్వారా తీర్చిదిద్దారు. అలాంటి మేలిమి కార్యాచరణ భారతావనిలో కొరవడింది. దీనికితోడు దేశీయంగా వేళ్లూనుకుపోయిన కులమత లింగ వివక్షలూ ఆర్థిక అసమానతలకు ఆజ్యంపోస్తున్నాయి. వాటిని రూపుమాపుతూ, యువశక్తులను సద్వినియోగం చేసుకునేలా ఉపాధికల్పనకు ప్రభుత్వాలు ఊతమివ్వాలి. సమ్మిళిత ప్రగతికి చేయూతనిచ్చే సమర్థ విధానాలకు కట్టుబడాలి. అప్పుడే నిజమైన వికసిత భారతం సిద్ధిస్తుంది!



చనిపోయాక ఎక్కడికి వెళ్తాం, ఏం చేస్తాం అన్నది కాదు ప్రశ్న. ప్రాణం ఉన్నంతకాలం నిజంగా బతుకుతున్నామా అన్నది ఆలోచించాలి. జీవితానికి ఒక ప్రయోజనం ఉండటం ముఖ్యం.

– రజనీష్

దయాసముద్రుడు

దేవుడు దయాసముద్రుడు. సముద్రంలో జలమే కాదు- ఆ నీళ్లలో రకరకాల జీవరాశులు, రాళ్లూ రత్నాలు, ముత్యాలు... ఇంకెన్నో ఉంటాయి. ఆ దేవుడి దయకోసం రుషులు తపస్సు చేస్తారు. పామరులు పూజిస్తారు. యోగ జీవులు ముక్తి కోసం, భోగ జీవులు భుక్తి కోసం పాటుపడటం సహజం. ఏ కోరిక లేకుండా లోకకల్యాణం కోసం శ్రమించే కర్మజీవే ఆ పరమాత్మకు ప్రేమపాత్రుడు. కర్మ యోగమే శ్రేష్ఠమని, తనకు కర్మ చేయాల్సిన అవసరం లేకపోయినా, లౌకిక దృష్టితో స్వయంగా పనులు చేస్తున్నానని శ్రీకృష్ణ పరమాత్మ చెప్పాడు. 'నమే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన...' ముల్లోకాల్లో నేను చేయాల్సిన పని అంటూ ఏదీ లేదు. పొందదగినదీ, పొందలేనిదీ అంటూ ఏమీ లేవు. అలాగని పనిచేయడం ఆపేస్తే- నన్ను చూసి మిగిలిన వాళ్లూ అలా ఖాళీగా ఉంటారంటూ అర్జునుడికి బోధించాడు కృష్ణుడు. లోకానికి ఆదర్శప్రాయుడిగా నిలిచాడు.



అంతర్యామి

ఎవరి కర్తవ్యాన్ని వారు నిష్ఠగా చేయాలి. నిజాయతీగా కష్టపడాలి. చేసే పనులన్నింటినీ ఆ పరమాత్ముడికి అర్పితం చేయాలి. ఆ బ్రహ్మాది దేవతలకైనా, పిపీలికాది అల్పజీవులకైనా దేవుడి దయ కావాలి. అందుకు తమ వంతు ప్రయత్నం చేయాలి. గాలిలో దీపం పెట్టి, 'దేవుడా నీ దయ!' అంటే సరిపోదు. లోపల ఉన్న జ్ఞానజ్యోతిని వెలిగించుకోవాలి. తైలధారలా ధ్యానయోగ సాధన సాగితే ఆ పరమాత్మ దయవల్ల జ్ఞానదీపం వెలుగుతుంది. భక్తుల కోసం భగవంతుడు మూడు మార్గాలు చూపించాడు. భక్తి, జ్ఞాన, కర్మ మార్గాలు ముక్తి మందిరానికి దారిదీపాలు. దేవుడి దయతో జీవుడు మాయా సంసారం నుంచి బయటికి రాగలడు. భూరి నైవేద్యాలు, భారీ ఆహార్యాలు, మంగళవాద్యాలు, పటాటోపాలు, పల్లకీ ఊరేగింపులు... ఇవేవి దేవుడికి అవసరం లేదు. మనసా, వాచా, కర్మణా... స్మరించి; శరణు కోరితే ఆ భగవంతుడు తప్పక అక్కున చేర్చుకుంటాడు. 'పత్రం, పుష్పం, ఫలం, తోయం' అన్నారు. భక్తితో ఒక గరిటెడు నీళ్లు సమర్పిస్తే గంపెడు సిరిసంపదలు ప్రసాదిస్తాడు. ఒక్క తులసీదళంతోనే రుక్మిణి తులాభారం తూచి కృష్ణుణ్ని తనవాడిగా నిరూపించింది. మాయలో పడ్డ సత్యభామకు జ్ఞానోదయం అయింది.

భూత దయ మానవత్వానికి చిరునామాలాంటిది. కలవాడు లేనివాడిపైనా, కన్నబిడ్డలు తల్లిదండ్రులపైనా, రాజ్యాధికారులు ప్రజలపైన, బలవంతులు బడుగుజీవులపైనా... చూపాల్సింది దయ. ఆ దేవదేవుడికి అది ఇష్టమైనది. ఇక దేవుడి దయవల్లే పంచభూతాలు, గ్రహనక్షత్రాలు, తమ వంతు సేవలు అందజేస్తున్నాయి. ఆయన ఆజ్ఞకులోబడి ప్రవర్తిస్తున్నాయి. నీటిలోని చందమామ ప్రతిబింబం అలల వలలోపడి చెదిరిపోయే చందాన, పరమాత్మ ప్రతిరూపమైన మానవుడు ప్రలోభాలకు లోనై, కలవరపాటుకు గురవుతాడు. దారిచూపడమే కాదు, దారితప్పిన వారిని తన దారికి రప్పించుకోవడానికి కూడా ఆ దయామయుడు వేచి ఉంటాడు.

– ఉప్పు రాఘవేంద్రరావు

ఇంతకీ ఎవరిది లాభం సర్?

దేశంలో సంచలనంగా మారిన 'సర్'పై మొత్తానికి ఓ స్పష్టత వచ్చింది. ఈ ప్రక్రియ నిరాటంకంగా కొనసాగాల్సిందేనని సుప్రీంకోర్టు తాజాగా స్పష్టం చేసింది. దీనిపై సహకారం కొరవడితే తమ దృష్టికి తీసుకురావాలంటూ స్పష్టీకరించింది. ఈ క్రమంలో ఇటీవలి బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 'సర్' ప్రభావం ఏ పార్టీపై ఎంతమేర ఉందనే విశ్లేషణ ఆసక్తికరం.

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) పేరిట చేపట్టిన ప్రక్షాళన కార్యక్రమం బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అత్యంత వివాదాస్పద అంశమైంది. అధికార ఎన్డీయే, విపక్ష మహా గఠ్‌బంధన్ కూటముల ఆరోపణలు, ప్రత్యారోపణలతో దుమ్మెత్తి పోసుకున్నాయి. ఓటర్ల జాబితాల నుంచి విదేశీ చొరబాటుదారులను తొలగించేందుకు 'సర్' ప్రక్రియ అవసరమంటూ ఎన్డీయే పక్షాలు స్పష్టంచేశాయి. కాంగ్రెస్, ఆర్జేడీలు మాత్రం ఇదంతా ఓట్‌చోరీ కుట్రలో భాగమంటూ ఆరోపించాయి. బాజపాకు అనుకూలంగా ఉండేలా ఎన్నికల సంఘం పనిచేస్తోందంటూ ఆక్షేపించాయి. ఇది ఎన్నికల ప్రచారంలో ఆరోపణలకే పరిమితం కాలేదు. సుప్రీంకోర్టు కూడా జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. ఒకవైపు, జాబితాల నుంచి పేర్ల తొలగింపుపై రాజకీయ పక్షాల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని ఎన్నికల సంఘం ప్రకటించింది. మరోవైపు, తాము లేవనెత్తిన అభ్యంతరాలను తిరస్కరించారంటూ కాంగ్రెస్ పేర్కొంది. ఇదంతా ఒక ఎత్తయితే, అయిదు లక్షల నకిలీ ఓటర్లను ఏరివేయడంలో 'సర్' విఫలమైందంటూ 'ఏడీఆర్' పేర్కొనడం గమనార్హం!





మరోవైపు, 174 సీట్లలో గెలుపు మార్జిన్లు తొలగించిన ఓట్లకన్నా తక్కువగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో 91 సీట్లు 2025లో చేతులు మారాయి. వీటిలో 75 సీట్లను ఎన్డీయే గెలిచింది. ఎంజీబీ కేవలం 15 గెలవగా, ఒకటి చిన్నపార్టీకి వెళ్లింది. 2025లో కుర్హానీ నియోజకవర్గంలో బాజపా తొమ్మిదివేలకుపైగా ఓట్ల ఆధిక్యంతో గెలిచింది. ఈ సెగ్మెంట్‌లో 24 వేలదాకా తొలగింపులు చోటుచేసుకున్నాయి. అధిక తొలగింపులు ఉన్న ఈ సెగ్మెంట్ గతంలో ఆర్జేడీ చేతుల్లో ఉండగా, తీవ్ర పోటీలో ఈసారి ఎన్డీయే చేతికి వచ్చింది. సందేశ్ సెగ్మెంట్‌లో జేడీయూ కేవలం 27 ఓట్లతో గెలిచింది. ఇక్కడ పాతికవేలకుపైగా తొలగింపులు నమోదయ్యాయి. 2020లో ఈ సీటు ఆర్జేడీ చేతుల్లో ఉండగా, ఈసారి అత్యల్ప తేడాతో జేడీయూ సొంతమైంది. మాతిహాని సెగ్మెంటును ఆర్జేడీ అయిదువేలపైగా ఓట్లతో గెలిచింది. ఇక్కడ ముప్ఫై యివేలకుపైగా తొలగింపులు రికార్డయ్యాయి. 2020లో ఎల్జేపీ చేతుల్లో ఉన్న ఈ సెగ్మెంట్ ఇప్పుడు ఆర్జేడీ పరమైంది. అత్యధిక ఓట్ల తొలగింపు చోటుచేసుకున్న నియోజకవర్గాలు, అత్యంత పోటీ ఉన్న సెగ్మెంట్లను పరిశీలిస్తే- ఎస్ఐఆర్ ప్రక్రియతో మహా గఠ్‌బంధన్ కూడా లబ్ధి పొందినట్లు స్పష్టమవుతోంది. అయితే, తీవ్రస్థాయి పోటీ ఉండే నియోజకవర్గాల్లో ఓటర్ల తొలగింపు అనేది గెలుపోటములపై తప్పకుండా ప్రభావం చూపుతుందనేది విపక్షాల ఆక్షేపణ!

ప్రత్యేక ప్రయోజనం దక్కిందా?

ఇంత వివాదాస్పదంగా మారిన 'సర్'తో బిహార్‌లో లాభం ఎవరికి? మరెవరు నష్టపోయారు? బిహార్ ఎన్నికల జాబితా ప్రక్షాళన మునుపెన్నడూ లేని రీతిలో సాగింది. 'సర్' ప్రక్రియలో భాగంగా ఎక్కువగా, తక్కువగా తొలగింపులు జరిగిన అయిదు నియోజకవర్గాల్లో నాలుగింటిని ఎన్డీయే గెలిచింది. రికార్డు స్థాయిలో అత్యధిక తొలగింపులు జరిగిన సెగ్మెంట్లలో ఒకటైన కిషన్‌గంజ్‌లో కాంగ్రెస్ విజయం సాధించింది. అత్యల్ప తొలగింపులు జరిగిన నియోజక వర్గాల్లో రెండోస్థానంలో ఉన్న చన్‌పటియాను కూడా హస్తం పార్టీ గెలుచుకుంది. ఈ లెక్కన అత్యధిక ఓట్ల తొలగింపు సమానమైన చోట, అత్యల్పంగా తొలగింపు జరిగిన చోట కూడా కాంగ్రెస్‌కు గెలుపు సాధ్యమైంది. మరోవైపు, ఎక్కువ తొలగింపులు జరిగిన అయిదు నియోజక వర్గాల్లో బాజపా- గోపాల్‌గంజ్, పూర్ణియా, మోతీహారి వంటి సెగ్మెంట్లను గెలిచింది. జేడీయూ వైకుంఠ్‌పూర్‌ను గెలిచింది. తక్కువ తొలగింపులు జరిగిన అయిదు నియోజక వర్గాల్లో భాజపా, ఎల్జేపీఆర్వీ చెరో రెండు గెలిచాయి. కొత్తగా ఓటర్లు అయిదు సెగ్మెంట్లలో ఎన్డీయే నాలుగింటిని గెలిచింది. తక్కువగా చేర్చిన సెగ్మెంట్లలోనూ దాదాపు ఇలాంటి పరిస్థితే. ఈ క్రమంలో ఎస్ఐఆర్ ప్రక్రియతో ఫలితాలను కలిపి విశ్లేషిస్తే ఏ పక్షానికీ పూర్తిస్థాయిలో మొగ్గు ఉన్నట్లు కనిపించడం లేదు. చాలా నియోజకవర్గాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ ఎన్డీయేకు ప్రత్యేక ప్రయోజనమేమీ కల్పించలేదని, విపక్షాలూ గెలిచాయని సీనియర్ రాజకీయ పరిశీలకులు సునీల్‌పాండే వివరించారు.

నిర్ణయాత్మకంగా మారిందా?

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ద్వారా నకిలీ ఎంట్రీలు, చనిపోయిన ఓటర్లు, స్థలాలు మారినవారు తదితరుల పేర్లను తొలగించడమే తమ ఉద్దేశమని భారత ఎన్నికల సంఘం(ఈసీ) పేర్కొంది. అయితే, కొన్ని జిల్లాల్లో అత్యధిక సంఖ్యలో తొలగింపులు నమోదయ్యాయని, అసలైన ఓటర్ల పేర్లు పోయాయని విపక్షాలు ఆరోపించాయి. తగిన తనిఖీలు లేకుండానే కొన్ని వర్గాల ఓట్లు పోయాయనే విమర్శలున్నాయి. ఇలాంటి ఆరోపణలన్నింటినీ తిరస్కరించిన ఈసీ- తొలగింపులన్నీ సాధారణ ప్రక్రియలో భాగమేనని పేర్కొంది. వేగంగా సాగుతున్న పట్టణీకరణ, చదువులు, జీవనోపాధి, ఇతరత్రా కారణాలపై ఒకచోట నుంచి మరొక చోటికి తరచూ వలస వెళ్లడం సాధారణమవుతోంది. కొంతమంది ఒకచోట ఓటరు జాబితాలో నమోదై, మరోచోట కూడా ఓటు పొందుతున్నారు. అయినప్పటికీ పాత ఓటును తొలగించుకోవట్లేదు. ఇలాంటి సమస్యలతో ఓటర్ల జాబితాల్లో మార్పుచేర్పులు తప్పడం లేదని కేంద్రం ఇటీవల పార్లమెంటులో వెల్లడించింది. ఈసీ విధుల నిర్వహణకు సహకరించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంటుందని సుప్రీం ధర్మాసనం తాజాగా స్పష్టం చేయడం గమనార్హం. ఓటర్ల జాబితా సవరణపై ఎవరి వాదనలు ఎలా ఉన్నా- మొత్తంగా బిహార్ ఎన్నికల్లో 'సర్' ప్రక్రియ పూర్తిస్థాయిలో నిర్ణయాత్మకంగా పనిచేసిందా అంటే కాదనే సమాధానమే వస్తుంది. ఇతర రాష్ట్రాల్లో అది ఎలాంటి ప్రభావం చూపిస్తుందన్నది కాలమే చెబుతుంది.

– శ్రీనివాస్ దరెగోని

శివశంకరి... ప్రఖ్యాత తమిళ రచయిత్రి. బ్యాంకులో పీఆర్‌వోగా ఉద్యోగం చేశారు. రచయిత్రిగా 36 నవలలు, 150 కథలూ, మరెన్నో ఇతర రచనలూ చేశారు. సామాజిక చైతన్యం గల రచయిత్రి కావడం వల్లనేమో శివశంకరి తరచుగా ఇంటర్వ్యూల్లో ఆర్థిక విషయాల గురించి హెచ్చరిస్తుంటారు. వాస్తవానికి దగ్గరగా ఉండే సలహాలు ఇస్తుంటారు. అలా ఆమె చెప్పిన కొన్ని సూచనలు:

ఎమర్జెన్సీ ఫండ్: సంపాదన మొదలెట్టగానే ప్రతి ఒక్కరూ చేయాల్సిన పని ముందుగా కొంత మొత్తం ఎమర్జెన్సీ ఫండ్‌గా దాచిపెట్టుకోవడం. ప్రతి నెలా అందులో వెయ్యడమే కానీ తియ్యడం ఉండకూడదు. దీన్ని సేవింగ్స్ కింద లెక్కపెట్టకూడదు. ఊహించని, అత్యవసర పరిస్థితులు వచ్చినపుడు 'అయ్యో డబ్బెలా' అని వెతుక్కోకుండా, ఒకరి ముందు చేయిచాచకుండా దాన్ని ఉపయోగించుకోవచ్చు.

ఆ మూడింటి తరవాతే...



బీమా: ఎమర్జెన్సీ ఫండ్ తరవాత ప్రాధాన్యం... జీవిత, ఆరోగ్య బీమాలది. వ్యక్తిగతంగానూ, కుటుంబసభ్యులకు కూడా ఈ పాలసీలను తప్పనిసరిగా తీసుకోవాలి. ఇవి రెండూ చేశారంటే భవిష్యత్తుకు ఒకలాంటి ధీమా వస్తుంది.

పొదుపు, మదుపు: ఇప్పుడిక వర్తమానానికి వద్దాం. కొంత సొమ్ము పొదుపు ఖాతాలోకి మళ్లించాలి. ఇలా సేవ్ చేసుకున్నదాంతో వెకేషన్‌కి వెళ్లడం లాంటి కోరికలు తీర్చుకోవచ్చు. మరికొంత మొత్తం మదుపు చేసుకోవాలి. ఇక్కడ అత్యాశకు పోకుండా, కనిపించిన ప్రతి యాప్‌నీ నమ్మకుండా, ఫైనాన్షియల్ అడ్వైజర్ సలహా తీసుకుని పకడ్బందీగా ప్లాన్ చేసుకోవాలి. వేర్వేరు పోర్టుఫోలియోల్లో క్రమానుగత పెట్టుబడులు పెట్టాలి. ఇలా దాచుకున్నదే దీర్ఘకాలంలో స్థిరాస్తులు ఏర్పరచుకోవడానికి, పిల్లల పై చదువులకు అక్కరకొస్తుంది.

క్రమశిక్షణ: పై మూడు అంశాలనూ ఉద్యోగంలో చేరిన మొదటి నెల నుంచీ పాటించాలి. అలా పాటించగలిగినప్పుడు వచ్చే ఆర్థిక భద్రతకు ఏదీ సాటి రాదు. జీతం రాగానే ఆటోమేటిక్‌గా ఆయా ఖాతాల్లోకి నిర్ణీత మొత్తం వెళ్లిపోయే ఏర్పాటు చేసుకోవాలి. అలా కాకుండా స్వయంగా చేయాలంటే... తెలిసిందేగా మనిషి బుద్ధి ఎలా ఉంటుందో? ఈ నెల ఒక్కసారికీ వదిలేసి నెక్స్ట్ మంత్ నుంచి వేద్దాం... అని వాయిదా వేయడం మొదలెడతారు. ఒకసారి అది అలవాటు అయిందీ అంటే వదిలించుకోవడం కష్టం. అందుకే ఆర్థిక క్రమశిక్షణని కటువుగా కాదు, నిర్దాక్షిణ్యంగానే అమలుచేయాలి. ఆ క్రమశిక్షణ ఉంటేనే లక్ష్యాలను నెరవేర్చుకోవడం సాధ్యమవుతుంది.

ఫెయిల్యూర్: ఫైనాన్షియల్ ఫెయిల్యూర్ కూడా లవ్ ఫెయిల్యూర్ లాంటిదే. తరచూ ఈ రెండింటి కారణంగానే ఆత్మహత్యలాంటి తీవ్రమైన నిర్ణయాలు తీసుకునే వారిని చూస్తుంటాం. ప్రేమ రెండు మనసుల్ని కలపాలి. అవతలి వ్యక్తికి ఆసక్తి లేనప్పుడు మన దారి మనం చూసుకోవాలి. అలాగే ఆర్థిక విషయాల్లో గెలవడానికి కాసింత క్రమశిక్షణ సరిపోతుంది. ఈ రెండు మౌలిక విషయాలను గుర్తుపెట్టుకుంటే ఎందులోనూ ఫెయిల్యూర్ ప్రసక్తే రాదు, జీవితం ప్రశాంతంగా గడిచిపోతుంది. ఇక, ఉద్యోగంలో చేరిన నాటి నుంచే రిటైర్‌మెంట్ తరవాత జీవితం గురించి ప్రణాళిక వేసుకోగలిగిన వారికి అసలు తిరుగే ఉండదు.

– విస్మయ

నేరగాళ్లకు వరం కాదా?

చిన్నారులపై లైంగిక నేరాల కట్టడికి కేంద్రం పోక్సో చట్టం తెచ్చింది. సంబంధిత కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులనూ ఏర్పాటు చేసింది. అయినప్పటికీ శిక్షల రేటు చాలా తక్కువగా ఉంది. దాంతో పిల్లలపై అకృత్యాలు తగ్గడం లేదు. ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పోక్సో కేసుల్లో గతేడాది సగటు శిక్షల రేటు...

(శాతాల్లో)

పశ్చిమ్ బెంగాల్	2
జమ్మూ, కశ్మీర్	4.5
ఆంధ్రప్రదేశ్	5.19
త్రిపుర	5.3
మహారాష్ట్ర	6.07
తెలంగాణ	7
మణిపుర్	7
కర్ణాటక	8.1
హిమాచల్ ప్రదేశ్	8.24
దిల్లీ	8.59
గుజరాత్	9.53
గోవా	9.69
ఒడిశా	10.63
కేరళ	13
మధ్యప్రదేశ్	14.5

(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

ఆస్ట్రేలియా ప్రయోగం ఫలిస్తుందా?

సోషల్ మీడియాలో అసభ్యకరమైన కంటెంట్‌ను చూడటం, వేధింపులకు గురికావడంతో పిల్లల మానసిక ఆరోగ్యం దెబ్బతింటోందని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. దీన్ని తీవ్రంగా పరిగణించిన ఆస్ట్రేలియా 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాను నిషేధిస్తూ చట్టం చేసింది. అదిప్పుడు అమలులోకి రావడంతో- ఎలాంటి ఫలితాలు వస్తాయోనని ప్రపంచ దేశాలన్నీ ఆసక్తిగా గమనిస్తున్నాయి.



సామాజిక మాధ్యమాలతో ప్రయోజనాలే కాదు, అనర్థాలూ పొంచి ఉన్నాయి. ముఖ్యంగా యుక్త వయస్కులపై వీటి ప్రభావం ఆందోళనకర స్థాయిలో ఉంటోంది. దీన్ని గ్రహించిన ఆస్ట్రేలియా ప్రభుత్వం- 'ఆన్‌లైన్ సేఫ్టీ అమెండ్‌మెంట్(సోషల్ మీడియా మినిమం ఏజ్) యాక్ట్-2024'ను తీసుకొచ్చింది. 16ఏళ్ల లోపు పిల్లలు టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రాం, యూట్యూబ్, ఫేస్‌బుక్, ట్విటర్, స్నాప్‌చాట్ వంటి సోషల్ మీడియా ఖాతాలను కలిగి ఉండకూడదని ఈ చట్టం చెబుతోంది. దీని ప్రధాన లక్ష్యం- సోషల్ మీడియా వాడకాన్ని వ్యసనంగా మార్చే అల్గారిథమ్స్, ఆన్‌లైన్ వేధింపులు, మెదడుపై బిహేవియరల్ కొకైన్‌లా పనిచేసే కంటెంట్ నుంచి బాలబాలికలను రక్షించడం. ఈ నిబంధనలను పాటించని టెక్ కంపెనీలపై 49.5మిలియన్ ఆస్ట్రేలియన్ డాలర్ల వరకు జరిమానా విధిస్తారు. ఈ చట్టాన్ని అమలు చేయాల్సిన బాధ్యత పూర్తిగా సోషల్ మీడియా వేదికలదే. కాబట్టి, అవి ఖాతాదారుల వయసును కచ్చితంగా ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది. పిల్లలు, వారి తల్లిదండ్రులపై మాత్రం ఎలాంటి జరిమానాలూ విధించరు.

ఎన్నెన్నో తర్జనభర్జనలు...

పదహారేళ్ల లోపు పిల్లల్లో మెదడు ఎదుగుదల కీలక దశలో ఉంటుంది. సరిగ్గా అలాంటి తరుణంలోనే వారు సోషల్ మీడియాలోని అల్గారిథమిక్ ఫీడ్‌లకు గురికావడం వల్ల నిర్ణయాత్మక సామర్థ్యాన్నీ, భావోద్వేగ నియంత్రణనూ కోల్పోతారు. సామాజిక నైపుణ్యాలను పెంచుకోవడంలో వెనకబడిపోతారు. యువతలో నిరాశ నిస్పృహలు, ఒంటరితనం, ఆందోళన పెరగడానికి సోషల్ మీడియాయే ప్రధాన కారణమవుతోందని పలు అధ్యయనాల్లో తేలింది. అల్గారిథమ్‌లు నిరంతరాయంగా వారి దృష్టిని ఆకర్షించే ఫీడ్‌లను పంపి, ఒకలాంటి వ్యసనంలోకి నెడుతున్నాయి. ముఖ్యంగా యుక్తవయసు బాలికలు సోషల్ మీడియాలోని కల్పిత చిత్రాలను చూసి తాము అంత అందంగా లేమనే ఆత్మన్యూనతా భావానికి గురవుతున్నారు. నిమిష నిమిషానికి నోటిఫికేషన్లు రావడంతో పిల్లలు నిద్రకు దూరమై, చదువుల్లో వెనకబడిపోతున్నారు. సామాజిక మాధ్యమాల్లో ఎదురయ్యే బెదిరింపులు, వేధింపులకు తాళలేక ఎంతోమంది ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఇలాంటి ఘటనల నేపథ్యంలో పలు సోషల్ మీడియా వేదికలు ఖాతా తెరవడానికి కనీస వయసును 13 ఏళ్లుగా పేర్కొంటున్నాయి కానీ, వయసును మాత్రం పక్కాగా ధ్రువీకరించుకోవడం లేదు.

ఆస్ట్రేలియా నిర్ణయాన్ని టెక్ కంపెనీలు, కొందరు విద్యావేత్తలు తప్పుపడుతున్నారు. వయసును నిర్ధారించడానికి ప్రభుత్వం మంజూరుచేసిన ఐడీ లేదా ముఖ గుర్తింపు సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించాల్సి వస్తుందనీ, దీని వల్ల సున్నితమైన వ్యక్తిగత వివరాల గోప్యతకూ, వారి భద్రతకు ముప్పు వాటిల్లుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. యుక్తవయస్కులు తమ తల్లిదండ్రుల గుర్తింపు కార్డులను, వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్‌లను ఉపయోగించి ఈ నిషేధాన్ని తప్పించుకోవచ్చంటున్నారు. సోషల్ మీడియా నిషేధం వల్ల పిల్లలు తమ స్నేహితులకు 'సామాజికంగా' దూరమవుతారనీ, ఒకే తరహా ఆసక్తులు ఉన్నవారిని ఆన్‌లైన్‌లో కనుగొనడం కష్టమవుతుందనే వాదనలున్నాయి. ఆస్ట్రేలియా నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమనీ, ఇది యువతను ముఖ్యమైన సామాజిక, రాజకీయ చర్చల నుంచి దూరం చేస్తుందనీ న్యాయనిపుణులు అంటున్నారు. తీవ్ర తర్జనభర్జనలకు దారితీసిన ఆస్ట్రేలియా నిర్ణయం- సోషల్ మీడియా వినియోగానికి కఠిన వయోనిబంధనలను తీసుకురాదలచిన డెన్మార్క్, మలేసియా, బ్రెజిల్, ఇండోనేసియా, ఐరోపా దేశాలకు ఒక 'టెస్ట్ కేస్'లా మారిందిప్పుడు.

ప్రత్యామ్నాయ మార్గాలేంటి?

సోషల్ మీడియాను 16ఏళ్లలోపు వారికి పూర్తిగా దూరం చేయడం కంటే... రోజువారీ వినియోగ సమయాన్నీ, రాత్రి పది గంటల తరవాత అప్లికేషన్ల యాక్సెస్‌నూ పరిమితం చేయొచ్చు. ఆయా వేదికల్లో ఆటో-ప్లే, స్క్రోలింగ్ ఫీచర్లకు కత్తెర వేయడంతోపాటు అల్గారిథమ్‌ల ద్వారా హానికర కంటెంట్‌ను పిల్లలకు సిఫార్సు చేయకుండా నిరోధించాలి. భారత్ వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న డిజిటల్ ఆర్థిక వ్యవస్థల్లో ఆస్ట్రేలియా విధానాన్ని యథాతథంగా అమలు చేయడం కుదరకపోవచ్చు. మన దగ్గర చాలామంది పిల్లలు, యువతకు ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్ ద్వారానే బడులు, కళాశాలల నుంచి సమాచారం వస్తోంది. వారు విద్య, ఉపాధి అవకాశాల గురించీ, తమకు అర్థంకాని పాఠ్యాంశాల గురించీ సోషల్ మీడియాలోనే తెలుసుకుంటున్నారు. కాబట్టి, సామాజిక మాధ్యమాలను సురక్షితంగా, బాధ్యతాయుతంగా ఉపయోగించడంపై తల్లిదండ్రులూ ఉపాధ్యాయులూ చిన్నారులకు విడమరచి చెప్పాలి. డిజిటల్ ప్రపంచంలో పిల్లల్ని రక్షించడమనేది తల్లిదండ్రులు, విద్యావేత్తలు, ప్రభుత్వాలు, టెక్ కంపెనీల ఉమ్మడి బాధ్యతని గుర్తించాలి. ప్రపంచ దేశాలు ఈ సవాలుకు సమర్థ పరిష్కారాలను కనుగొనాల్సిన సమయమిదే!

– డాక్టర్ చిట్యాల రవీందర్

మట్టికి ఎన్ని రంగులో!



హాయ్ నేస్తాలూ..! మీరు ఎప్పుడైనా గమనించారా మట్టి కొన్నిచోట్ల ఎర్రగా, మరికొన్ని చోట్ల నల్లగా ఉంటుంది. అసలు అలా ఎలా మారుతుందని ఆలోచించారా? ఆ విషయాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం రండి!

ఐరన్ ఆక్సైడ్ వల్ల ఎర్రమట్టి ఆ రంగులో ఉంటుంది. అంటే ఈ నేలలో ఐరన్(ఇనుము) ఎక్కువ శాతం ఉంటుంది. ఐరన్ గాలిలోని ఆక్సిజన్‌తో చర్య జరిపి ఐరన్ ఆక్సైడ్‌గా మారుతుందని మనకు తెలుసు కదా! అదే మట్టి రేణువులకు ఎరుపు రంగును ఇస్తుంది. కొన్నిసార్లు ఈ మట్టిలో నీటి శాతం ఎక్కువగా ఉండి, రసాయన చర్యలు జరిగితే.. అది కొద్దిగా పసుపు రంగులోకి కూడా మారవచ్చు. సాధారణంగా గ్రానైట్, లాటరైట్ వంటి పురాతన శిలలు ఉన్న ప్రాంతాల్లో అలా కనిపిస్తుంది. మరి నల్లమట్టికి ఆ రంగు రావడానికి ముఖ్య కారణం సేంద్రియ పదార్థాలు, టైటానియం మిశ్రమాలన్నమాట. టైటానిఫెరస్ మాగ్నెటైట్ అనే సొల్యూషన్, నేలలోని శిలలు విడిపోయినప్పుడు ఏర్పడే ఇనుము, అల్యూమినియం టైటానియం మిశ్రమాలు మట్టి ముదురు లేదా నలుపురంగుగా మారడానికి సహాయపడతాయి. మొక్కలు, జంతువుల అవశేషాలు.. ఇతర పదార్థాలు కుళ్లిపోయి మట్టిలో కలిసిపోయినప్పుడు 'హ్యూమస్' అనే సేంద్రియ పదార్థం ఏర్పడుతుంది. ఇది ముదురు గోధుమ లేదా నలుపు రంగులో ఉంటుంది. క్రమంగా ఇది కూడా మట్టికి నలుపురంగును ఇస్తుంది. ఈ మట్టికి ఎక్కువగా అంటుకునే స్వభావం ఉంటుంది. ఇది తేమను ఎక్కువకాలం నిల్వ ఉంచుకోగలదు కాబట్టి దీన్ని 'నల్లరేగడి మట్టి' అని కూడా అంటారు. మనం బొమ్మరిల్లు కట్టుకోవడానికి, స్కూల్లో ఇచ్చిన కొన్ని ప్రాజెక్టులు చేయడానికి ఉపయోగించే మట్టి ఇదే. ప్రధానంగా అగ్నిపర్వతాల లావా నుంచి ఏర్పడిన బసాల్ట్ శిలలు ఉన్న దక్కన్ పీఠభూమి ప్రాంతంలో ఎక్కువగా కనిపిస్తుంది.

– తాడూరి స్వాతి


హాయ్! బుజ్జీ!!

చెప్పుకోండి చూద్దాం!

ఇక్కడ ఆంగ్లంలో ఒకే అక్షరంతో ముగిసే అంశాల పేర్లు తెలుగులో ఉన్నాయి. కానీ అందులో కొన్ని వేరే పదాలు కూడా కలిసిపోయాయి. అవేంటో చెప్పుకోండి చూద్దాం.

గది	గాలిపటం	జట్టు
పొలం	గడియారం	ఆవిరి
ఇల్లు	కల	మేక

[illegible]





దీక్ష విరమణ... అమ్మ సన్నిధిలోన..

విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ సన్నిధిలో గురువారం భవానీ దీక్షల విరమణ ప్రారంభమైంది. మండల, అర్ధ మండల దీక్షలు స్వీకరించిన భవానీ దీక్షాధారులు అమ్మవారి ఆలయానికి పోటెత్తారు. గిరిప్రదక్షిణ పూర్తయిన తరువాత గురు భవానీల సమక్షంలో ఇరుముడులు సమర్పించారు. క్యూలైన్లో వెళ్లి దుర్గమ్మను దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. భవానీలు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. - ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

చక్కెర మాటున చోరీ

- చౌకదుకాణాల్లో రూ.17కి బదులు 20కి అమ్మకం
- మిగులు నిల్వలు పక్కదారి పట్టిస్తున్న డీలర్లు



చౌక దుకాణాల్లో యథేచ్ఛగా చక్కెర మాటున దోపిడీ జరిగిపోతోంది. బియ్యం దందా స్థాయిలో రాబడి రాకున్నా గుట్టుచప్పుడు కాకుండా డీలర్లు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ నిర్దేశిత రేటుకు మించి అమ్మకాలు, నిల్వలను కిరాణా దుకాణాలకు అమ్మకం వంటి అక్రమాలు నిత్య కృత్యాలే. అధికారులు సైతం అదేంత అన్నట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

చిల్లర దోపిడీ.. ★ చౌక దుకాణాల్లో ఒక్కో కార్డుకు అర కేజీ పంచదార రూ.17కి అమ్మాల్సి ఉంది. క్షేత్ర స్థాయిలో మాత్రం రూ.20 వసూలు చేస్తున్నారు. ★ ప్రభుత్వ ధర రూ.20 అనే స్థాయిలో జనాలను మభ్యపెట్టారు. తెలిసిన వారు ప్రశ్నిస్తే చిల్లర లేదని సర్ది చెబుతున్నారు. వినియోగదారులు సైతం రూ.3 కోసం ఏం అడుగుతాం అని వదిలేస్తున్నారు. ★ ఉమ్మడి జిల్లాలో మొత్తం 525 మెట్రిక్ టన్నుల పంచదార ప్రతి నెలా సరఫరా అవుతుంది. ఇందులో 80శాతంపైగా దుకాణాల్లో అంటే 4.2 లక్షల కేజీల చక్కెర అదనపు ధరకే అమ్ముతున్నారు. కేజీకి రూ.6 చొప్పున నెలకు రూ.25.2లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. ★ హోల్‌సేల్ మార్కెట్‌లో కేజీ చక్కెర రూ.48 అమ్ముతున్నారు. అదనపు వసూళ్ల వల్ల చౌక దుకాణంలో సైతం రూ.40 అవుతోంది. రెండింటికి పెద్ద వ్యత్యాసం లేక రాయితీపై పంచదార అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం మసకబారుతోంది. ★ పెనమలూరు నియోజకవర్గంలో దాదాపు 70 శాతం పైగా దుకాణాల్లో పంచదార 20కే విక్రయిస్తున్నారు. కొన్ని దుకాణాల్లో మిగిలిన రూ.3కి చాక్లెట్లు, బిస్కెట్లు వంటి తినుబండారాలు బదలాయిస్తున్నారు.

దుకాణాలకు తరలిస్తారు.. ★ కార్డుదారుల్లో పంచదార తీసుకోని వారుంటారు.. ఈ-పోస్ యంత్రంలో వారికి బియ్యం మాత్రమే నమోదు చేయాలి. డీలర్లు మాత్రం చక్కెర తీసుకున్నట్లు నమోదు చేసి బిల్లు తీస్తారు. దీంతో రికార్డుల్లో తీసుకున్నట్టే చూపిస్తుంది. ★ రేషన్ సరఫరా పూర్తి చేశాక..దుకాణాలకు కేజీ రూ.45 వరకు అమ్ముకుని రూ.11 వరకు మిగుల్చుకుంటున్నారు. అదనపు వసూళ్లు చేస్తూనే..పంచదారను దారి మళ్లిస్తూ కాసులు పోగేసుకుంటున్నారు. ★ విజయవాడ నగర పరిధిలోని దుకాణాల్లోనే ఎక్కువ మొత్తంలో అమ్మకాలు జరుగుతున్నాయి. ★ **తనిఖీలు చేస్తాం:** దీనిపై ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల డీఎస్వోలు పాపారావు, మోహన్‌రావులు మాట్లాడుతూ చక్కెర సరఫరాలో అక్రమాలకు పాల్పడితే తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. - ఈనాడు, అమరావతి

అందని బిల్లు.. ఆగని కన్నీళ్లు

ఎన్టీఆర్ గృహకల్ప లబ్ధిదారులకు ఏళ్లుగా నిరీక్షణే

ఈనాడు, అమరావతి

కూటమి సర్కారు అధికారం చేపట్టడంతో గంపెడాశలు పెట్టుకున్న ఎన్టీఆర్ గృహకల్ప లబ్ధిదారులకు నిరీక్షణే మిగులుతోంది. ఏళ్లు గడుస్తున్నా బిల్లులు జమ కాక అవస్థలు పడుతున్నారు. బిల్లులు వచ్చే స్తాయని అప్పు చేసి ఇళ్లు కట్టుకున్న వారికి వడ్డీ బాధలు. ప్రభుత్వ సాయం లేకుండా ఇల్లు కట్టే స్తోమత లేక అసంపూర్తిగా వదిలేసిన వారికి గూడు లేక అవస్థలు మిగిలాయి. ఇప్పటికైనా ప్రభుత్వం బకాయిలు జమ చేస్తే లబ్ధిదారులు ఊపిరిపోసుకుంటారు.



ఎన్నెన్నో వ్యథలు.. నందిగామ మండలానికి చెందిన యమున అనే మహిళకు 2015లో ఇల్లు మంజూరైంది. చివరి బిల్లు రూ.30వేల వరకు రావాల్సి ఉండగా ఇప్పటి వరకు చెల్లించలేదు. అప్పులు చేసి ఇంటి నిర్మాణం చేపట్టి ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారు. నందిగామ నియోజకవర్గంలో 2042 మంది లబ్ధిదారులకు రూ.5.73కోట్ల బకాయిలు ఉన్నాయి.

అంశం (రూ.కోట్లలో)	ఎన్టీఆర్	కృష్ణా
చెల్లించాల్సిన బిల్లులు	201	197.3
జమయిన మొత్తం	175.35	167.7
మిగిలిన బకాయిలు	25.78	29.6
నిరీక్షిస్తున్న లబ్ధిదారులు	12,733	14,620
మొత్తం గృహాలు	18,481	22,429

పెను గంచిప్రోలుకు చెందిన సునీత అనే లబ్ధిదారు అప్పులు చేసి ఇల్లు చివరి దశకు తెచ్చారు. ప్రభుత్వం నుంచి రూ.60వేల వరకు రావాల్సి ఉండగా అసంపూర్తిగా నిలిపేశారు.

27,353 మందికి

2014-19 తెదేపా పాలనలో పేదల ఇంటి నిర్మాణానికి ఒక్కో లబ్ధిదారుడికి రూ.1.5లక్షల చొప్పున నాలుగు దశల్లో చెల్లించారు. ఉమ్మడి జిల్లాలో 40,910 నిర్మాణాలకు మొత్తం రూ.390.3 కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ.343.05 కోట్లు అప్పుడే చెల్లించారు. వైకాపా ప్రభుత్వం రావడంతో ఐదేళ్లలో పైసా విదల్చలేదు. కూటమి సర్కారు వచ్చాక హౌసింగ్ సిబ్బంది క్షేత్ర స్థాయిలో సర్వే చేసి 27,353 మందికి బిల్లులు ఇవ్వాలని తేల్చారు. ఇది జరిగి ఏడాది కావస్తున్నా ఇప్పటివరకు నగదు జమ కాలేదు. త్వరలోనే బిల్లులు జమవుతాయని ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల హౌసింగ్ పీడీలు విజయకుమారి, పోతురాజు తెలిపారు.

గుడివాడ మండలం దొండపాడులో సుజాతకు 2015లో ఇల్లు రాగా ప్రారంభంలో కొంత బిల్లు జమయింది. ప్రభుత్వం మారడంతో సొమ్ము లేక నిర్మాణం అసంపూర్తిగా వదిలేశారు.

ధాన్యం కొనుగోళ్లు 50 శాతం పూర్తి

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో ఖరీఫ్ సీజనులో ధాన్యం సేకరణ లక్ష్యం 1,50,000 మెట్రిక్ టన్నులు కాగా.. గురువారం నాటికి సుమారు 50 శాతానికి చేరింది. ఇప్పటి వరకు 9,693 మంది రైతుల నుంచి 70,156.240ఎంటీ ధాన్యాన్ని కొనుగోలు చేశామని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ సతీష్ తెలిపారు. రైతుల ఖాతాల్లో రూ.146.10 కోట్లు జమచేసినట్టు పేర్కొన్నారు. 18.75లక్షల గోనె సంచులు అవసరం కాగా, 23.21 లక్షల సంచులు అందుబాటులో ఉంచామని వివరించారు. గత ఏడాది ఖరీఫ్‌లో 433 వాహనాలు వినియోగించగా, ఈ ఏడాది 1,599 వాహనాలను అందుబాటులో ఉంచారు. 148 రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయగా, ప్రస్తుతం 136 కేంద్రాల్లో కార్యకలాపాలు జరుగుతున్నట్టు తెలిపారు. ధాన్యం సొమ్ము 24 గంటల్లోనే జమకావడంపై గంపలగూడెం మండలానికి చెందిన రైతులు గోపి, సుధారాణి సంతోషం వ్యక్తం చేశారు.

ఓఆర్ఆర్ 3ఏ ప్రతిపాదనలు కొలిక్కి

ఈనాడు, అమరావతి: అమరావతికి మణిహారంగా నిర్మించనున్న ఓఆర్ఆర్ (అమరావతి ఔటర్ రింగ్‌రోడ్డు) పూర్వ నిర్మాణ పనులు వడివడిగా జరుగుతున్నాయి. అన్ని జిల్లాల సంబంధించిన 3ఏ నోటిఫికేషన్ వివరాలు ఎన్‌హెచ్ అధికారులు పోర్టల్‌లో నమోదు చేశారు. ఏలూరు, పల్నాడు, గుంటూరు, కృష్ణా జిల్లాలకు సంబంధించిన 3ఏ వివరాలు దిల్లీకి పంపించగా తాజాగా ఎన్‌హెచ్ఏఐ, మంత్రిత్వశాఖ ఆమోదించింది. ఆ జిల్లాలకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ సైతం పబ్లిష్ అయింది. 3ఏ ప్రతిపాదనల తయారీలో ఇబ్బందులతో ఆలస్యంగా అందిన ఎన్టీఆర్ వివరాలు సైతం శుక్రవారం దిల్లీకి పంపనున్నారు. వీటికి కూడా ఆమోదం లభిస్తే ఆయా సర్వే నంబర్లతో ఉన్న వారికి, సాధారణ ప్రజలకు ఉన్న అభ్యంతరాలు తెలుసుకునేందుకు పత్రికా ప్రకటన ఇస్తారు.

హస్త కళ.. భళా..





మీరు చూస్తున్నవి అరటి నార, గుర్రపు డెక్క, వెదురుబొంగులతో తయారైన అలంకరణ వస్తువులు. ఎంత అందంగా ఉన్నాయో కదా.. కూటమి ప్రభుత్వ చొరవతో చేనేత, జౌళి శాఖ కార్పొరేషన్ సహకారంతో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన నిపుణులతో రాష్ట్రంలోని మహిళలకు చేతి వృత్తులపై శిక్షణ ఇప్పించి తయారు చేయించినవి. విజయవాడ ఆటోనగర్ గేటు సమీపంలో ఏర్పాటు చేసిన ఓ ప్రదర్శనశాలలో ఇవి అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాయి. -ఈనాడు, అమరావతి

బాలోత్సవం.. మెచ్చిన ఆబాలగోపాలం



విజేతలతో అతిథులు, నిర్వాహకులు



ఆకట్టుకున్న బాలికల నృత్యం

విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో 3రోజుల పాటు నిర్వహించిన అమరావతి బాలోత్సవం గురువారం ఘనంగా ముగిసింది. 'పర్యావరణాన్ని పరిరక్షిద్దాం.. మంచి గాలి కోసం, మంచి జీవితం కోసం' అనే నినాదంతో పలు కార్యక్రమాలు నిర్వహించారు. మొదటి రోజు.. మట్టి బొమ్మల తయారీ, వ్యాసరచన, కవితా రచన, దినపత్రికా పఠన పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రెండో రోజు చిత్రలేఖన పోటీల్లో స్ఫూర్తిదాయకమైన చిత్రాలు వేసి అందర్నీ ఆలోచింపజేశారు. బెస్ట్ ఫ్రం వేస్ట్‌లో వ్యర్థాలతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వివిధ ప్రాజెక్టులు రూపొందించి ప్రదర్శించారు. మూడో రోజు సైన్స్ ప్రదర్శనలో వివిధ ప్రాజెక్టులు ఆవిష్కరించి సందర్శకుల నుంచి శెభాష్ అనిపించుకున్నారు. వివిధ జిల్లాల నుంచి 16వేల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. - విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

సైబర్ నేరగాళ్ల నుంచి రూ.15.78 లక్షలు వెనక్కి

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : సైబర్ నేరగాళ్లు ఓ విశ్రాంత ఉద్యోగిని మోసం చేసి రూ.78.5 లక్షలు కొట్టేసిన సొమ్ములో రూ.15.78 లక్షలను సైబర్ క్రైం పోలీసులు వెనక్కి తీసుకువచ్చారు. దాదాపు రెండు నెలల తర్వాత ఫిర్యాదు చేసినా.. కొంత వరకు రికవరీ చేశారు. మొగల్రాజపురానికి చెందిన విశ్రాంత మెడిసిన్ ప్రొఫెసర్ (77)ను గుర్తు తెలియని వ్యక్తి వాట్సప్ మేసేజ్ పంపారు. పెట్టుబడులు పెడితే తక్కువ కాలంలో ఎక్కువ లాభం వస్తుందని నమ్మబలికాడు. అతని మాటలు నమ్మి.. విడతల వారీగా 12 బ్యాంకు ఖాతాలకు రూ.78.5లక్షలు పంపించారు. తర్వాత మోసపోయినట్లు గుర్తించి గత నెల 27న సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు. సదరు ఖాతాల వివరాలను సేకరించారు. వాటిలో ఉత్తర్‌ప్రదేశ్‌లోని మిలాక్ జిల్లా చౌరాహ తాలూకా రథోండా యూకో బ్యాంకు శాఖలో రూ.15.78లక్షలు ఉన్నట్లు గుర్తించి.. వెంటనే దానిని స్తంభింపజేశారు. న్యాయస్థానం ఆదేశాలతో ఆ డబ్బులను విశ్రాంత ప్రొఫెసర్ ఖాతాకు గురువారం బదిలీ చేశారు. పోయిన నగదులో కొంత వెనక్కి రావడంతో.. బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా గత నెల 17న ఏపీకే ఫైల్ క్లిక్ చేసి నందిగామ మండలం కోడూరు గ్రామానికి చెందిన వీరభద్రరావు అనే రైతు రూ.9.26లక్షలు పోగొట్టుకోగా.. వారం రోజుల తర్వాత కేసు నమోదు చేశారు. ఈ ఘటనలోనూ పోలీసులు రూ.2.70లక్షలు వెనక్కి రప్పించి బాధితుడి ఖాతాలో జమ చేయించారు.

చెక్కుచెదరని 165 సంవత్సరాల నాటి కట్టడం



1858లో అప్పటి బ్రిటిష్ పాలకుల ఆధ్వర్యంలో పమిడిముక్కల మండలం ఐనంపూడిలో బందరు కాలువకు నిర్మించిన అండర్ టన్నెల్ (భూగర్భ జలమార్గం) నేటికీ చెక్కుచెదరలేదు. తోట్లవల్లూరు, ఉయ్యూరు, పమిడిముక్కల, పామర్రు మండలాల పరిధిలోని లక్షల ఎకరాల మురుగు నీరు ఐనంపూడి డ్రెయిన్ ద్వారా జీలగలగండి వద్ద సముద్రంలో కలుస్తుంది. నామమాత్రంగా ఉన్న బందరు కాలువను 1801లో అభివృద్ధి చేశారు. 1857లో కృష్ణానదిపై ప్రకాశం బ్యారేజీ నిర్మించిన తర్వాత ఈ కాలువకు ప్రాధాన్యం పెరిగింది. వర్షాలు పడినపుడు ఐనంపూడి వద్ద బందరు కాలువ నీరు డ్రెయిన్‌లో కలుస్తున్నందున అప్పట్లో ఇక్కడ అండర్ టన్నెల్ నిర్మించారు. మురుగునీరు కింద నుంచి సొరంగం ద్వారా డ్రెయిన్‌లోకి వెళుతుండగా పైనుంచి బందరు కాలువ ప్రవహించడం ఇక్కడి విశేషం. - పమిడిముక్కల, న్యూస్‌టుడే

మూగజీవాలతో చీకటి దందా

యథేచ్ఛగా పశువుల అక్రమ రవాణా

- ఈనాడు, అమరావతి,
- న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్

ఉమ్మడి జిల్లాలో పశువుల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. సంతల ముసుగులో వేలాదిగా కబేళాలకు తరలిస్తున్నారు. రాష్ట్ర సరిహద్దులు దాటించి రూ.కోట్లలో సొమ్ము చేసుకుంటున్నారు. వాటి మాంసం ఇతర దేశాలకు ఎగుమతి చేస్తూ మూగజీవాలతో చీకటి వ్యాపారం చేస్తున్నారు.

సంతలో సదేమియా...



అక్రమంగా తరలిస్తున్న ఆవులు

✪ ఉమ్మడి జిల్లాలో ఆవులు, గేదెలు, ఎద్దులు, దున్నలు కలిపి 6,04,337 ఉన్నాయి. ఇందులో ఏటా 10శాతం వరకు వట్టిపోతాయి. వీటిని సంత ముసుగులో కొందరు రాజకీయ నాయకుల అండతో అమ్మకుంటున్నారు. ✪ 1960 జంతు సంరక్షణ చట్టం ప్రకారం జంతువులను వధించడం నేరమైనా వ్యాపారం జోరుగా సాగుతోంది. వట్టిపోయిన పశువును రూ.5వేల నుంచి 10వేలకు దళారులు కొనుగోలు చేస్తున్నారు. ✪ ఉత్తరాంధ్ర నుంచి హనుమాన్ జంక్షన్ సమీపంలోని సంతకు తరలిస్తున్నారు. ఇక్కడ రూ.15వేల నుంచి రూ.20వేల వరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఇక్కడ నుంచి భారీగా కంటైనర్లు, లారీలు, ఇతర వాహనాల్లో ఎక్కించి హైదరాబాద్, తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లోని కబేళాలకు తరలిస్తున్నారు. ✪ మాంసం మాత్రమే కాకుండా చర్మం, కొమ్ములు, ఎముకలు అన్నీ ఎగుమతి చేస్తున్నారు. వీటిని చెప్పులు, వాద్య పరికరాలు, ఎరువుల తయారీలో ఉపయోగిస్తారు. ✪ వీటి రవాణా జరగకుండా చూడాల్సిన పశుసంవర్ధక, పోలీస్, మార్కెటింగ్ శాఖలు కళ్లుమూసుకున్నాయి. ✪ హనుమాన్ జంక్షన్ సంతలో కొనుగోలు చేసి వరంగల్ జాతీయ రహదారి గుండా హైదరాబాద్ పరిధిలోని బహదూర్‌పురా కబేళాకు నిత్యం పశువులను తరలిస్తున్నారు. ఇటీవల అందిన ఫిర్యాదుల మేరకు తనిఖీలు చేపట్టిన అధికారులు ఏదులాబాద్ మార్గంలో కంటైనర్‌లో 31 ఆవులు, 35 ఎద్దులను రవాణా చేస్తున్నట్లు గుర్తించి పట్టుకున్నారు. ✪ దీనిపై ఎన్టీఆర్, కృష్ణా పశుసంవర్ధకశాఖ జేడీలు హనుమంతరావు, నరసింహులు మాట్లాడుతూ..పోలీసు, రవాణా, మార్కెటింగ్ శాఖల సమన్వయంతో పశువుల అక్రమ రవాణాను అరికడతామన్నారు.

పోలీసుల నిర్లిప్తత..


కొంతకాలం కిందట ఉత్తరాంధ్ర నుంచి గోవులను కబేళాకు తరలిస్తుండగా గోసంరక్షణ సమితి సభ్యులు వాహనంతో సహా ఆత్కూరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు. పోలీసుల సమక్షంలోనే మాఫియా బృందం గోసంరక్షణ సమితి సభ్యులపై దాడికి తెగబడ్డారు. పోలీసులు మాత్రం ప్రేక్షకపాత్ర వహించి ఉదాసీనంగా వ్యవహరించారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో హనుమాన్‌జంక్షన్ సీఐ, ఆత్కూరు ఎస్సైని వీఆర్‌కు పంపారు. ఈ ఉదంతం పశువుల అక్రమ రవాణాలో పోలీసుల నిర్లిప్తతకు అద్దం పడుతోంది.

ఏడాదిగా కలవలేదన్నా.. వినలే!

శ్రవణ్ సాయి హత్య కేసులో ముమ్మర విచారణ

అమీన్‌పూర్ (హైదరాబాద్): బీరంగూడ సృజన లక్ష్మీనగర్‌లో చోటుచేసుకున్న బీటెక్ విద్యార్థి శ్రవణ్ సాయి హత్య కేసులో పోలీసులు దర్యాప్తు కొనసాగుతుంది. విచారణలో కొత్త విషయాలు వెలుగుచూస్తున్నాయి. గతంలో హెచ్చరించినా వినకుండా, ఇద్దరు కలిసి తిరుగుతున్నారని తెలియడంతో.. యువతి తల్లి మాట్లాడుదామని మంగళవారం యువకుడిని ఇంటికి పిలిచినట్లు సమాచారం. తాను ఏడాదిగా యువతిని కలవలేదని యువకుడు చెప్పినా.. వినకుండా వాగ్వాదానికి దిగారు. ఆ క్రమంలోనే బ్యాట్‌తో తల్లి మొదట కుమార్తెపై దాడి చేసిందని.. దాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించిన యువకుడిని విచక్షణ రహితంగా కొట్టినట్లు తెలుస్తోంది. యువకుడి తలకు, వీపు వెనక తీవ్ర గాయాలు ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. యువకుడికి ఎవరూ లేరనే విషయాన్ని గుర్తించే తీవ్రంగా కొట్టి ఉంటారని.. తీవ్ర అస్వస్థతకు గురైనా ఆసుపత్రికి తరలించకుండా 18 గంటలు ఇంట్లోనే నిర్బంధించడంతో ప్రాణాలు పోయాయని పోలీసులు చెబుతున్నారు. దాడి సమయంలో యువతి తల్లి, సోదరుడు, మేనమామ, తల్లితో సహజీవనం చేస్తున్న వ్యక్తి ఇంట్లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వారిని గురువారం స్టేషన్‌కు పిలిపించి విచారించారు. చేయి విరగడంతో యువతి ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. శ్రవణ్‌సాయిని ఏ స్థితిలో ఆసుపత్రికి తీసుకొచ్చారు? ఎవరెవరు వెంట ఉన్నారు? గాయాల పరిస్థితి.. తదితర వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. మరోవైపు ఈ ఘటనకు తానే కారణమని యువతి తల్లి ఒప్పుకున్నట్లు తెలుస్తోంది.

AVIS HOSPITALS new age surgery
విజయవాడ
భారతదేశం లో బెస్ట్
వెరికోస్ వెయిన్స్ స్పెషలిస్ట్ అవార్డు గ్రహీత
డా.రాజా వి కొప్పాల గారు అందుబాటులో ఉంటారు.



డా. రాజా వి కొప్పాల
వాస్కులర్ & ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్
2001లో MD రేడియాలజీ, FRCR(UK)
30+ సంవత్సరాల అనుభవం
అవిస్ హాస్పిటల్స్ ఇండియా లిమిటెడ్,
సీతారాంపురం సిగ్నల్, ఏలూరు రోడ్, విజయవాడ 520002.
www.avisvascularcentre.com 99895 27715

బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు లోక్ అదాలత్

చుట్టుగుంట, న్యూస్‌టుడే : ఉమ్మడి కృష్ణా జిల్లాలోని కోర్టుల్లో ఈ నెల 13వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో.. క్లోజ్ చేసిన బీఎస్ఎన్ఎల్ ఫోన్ నంబర్లకు సంబంధించిన వినియోగదారుల బకాయిలు చెల్లించేందుకు వినియోగించుకోవాలని ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ ఎల్.శ్రీను కోరారు. కోర్టుకు హాజరుకాకుండా ఈ నెల 13వ తేదీలోపు వడ్డీ లేకుండా బకాయిలు చెల్లించవచ్చని పేర్కొన్నారు. వినియోగదారుల సమస్య పూర్వాపరాలు పరిశీలించిన తర్వాత తగిన రాయితీ పొందవచ్చని వివరించారు. మరిన్ని వివరాలకు 0866-2444588, 2444266, 83338 98997, 94911 19556, 94900 70707 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.

MARGADARSI CHIT FUND PVT. LTD.
Chit Groups are available at our VIJAYAWADA-1 TOWN BRANCH.

CHIT GROUP	DURATION IN MONTHS	MONTHLY INSTALLMENT	CHIT VALUE
LT V	50	1,00,000	50,00,000
LT D	50	50,000	25,00,000
LT X	50	20,000	10,00,000
LT S	50	6,000	3,00,000
FT N	40	12,500	5,00,000
FT B	40	5,000	2,00,000
TT C	30	30,000	9,00,000
TT T	30	10,000	3,00,000

Please Contact Branch Manager Mr.K.SRINIVASA RAO, for futher details.
Mobile Nos. 80085-38750, 85005-73881, Landline: 0866-2427171, 2421717.

మూడోకన్ను.. నడిపించేను!

భవానీదీక్షల విరమణకు సాంకేతికతతో పర్యవేక్షణ

ఈనాడు, అమరావతి



భవానీ దీక్షల విరమణ గురువారం నుంచి ప్రారంభమైంది. ఇది ఈ నెల 15 వరకు సాగనుంది. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. దీక్షలు విరమించే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. తొక్కిసలాట, గందరగోళానికి తావులేకుండా దీక్షల విరమణ, అమ్మవారి దర్శనం చేసుకునేందుకు వీలుగా సీపీ రాజశేఖరబాబు సాంకేతికతను వినియోగిస్తున్నారు. రద్దీ నియంత్రణ, హోల్డింగ్ ఏరియాలు, క్యూలైన్ల క్రమబద్ధీకరణ, ట్రాఫిక్ కష్టాలు తలెత్తకుండా గరిష్ఠంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుతున్నారు. దుర్గాఘాట్ వద్ద ఉన్న మోడల్ గెస్ట్ హౌస్‌లో కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి అన్నింటినీ పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశారు.

నిఘా నేత్రాల సాయంతో.. ఆలయం, పరిసర ప్రాంతాల్లో పర్యవేక్షణ నిమిత్తం మొత్తం 231 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటి నుంచి వచ్చే ఫీడ్‌ను 24 గంటలూ పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. భక్తులు, వాహనాల సంఖ్యను లెక్కించే రెండు ప్రత్యేక డ్రోన్లను మోహరించారు. ఈ దృశ్యాలను కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేశారు.

* భక్తుల సౌకర్యార్థం మూడోచోట్ల హోల్డింగ్ ఏరియాలను ఏర్పాటు చేశారు. వీటిని కంపార్ట్‌మెంట్లుగా విభజించారు. ఒక్కో కంపార్ట్‌మెంట్ ఖాళీ కాగానే కమాండ్ కంట్రోల్‌లోని తెరపై పరిశీలించేలా ఏర్పాటు చేశారు.

గతం నుంచి గుణపాఠాలు

2009లో సరైన ప్రణాళిక లేకుండా ఏర్పాట్లు చేయడంతో భక్తులు పోటెత్తారు. అధికారులు చేతులెత్తేయడంతో ఆ ఏడాది జనవరిలో ఘాట్ రోడ్డులో అమ్మవారి దర్శనానికి వెళ్లే సమయంలో తొక్కిసలాట జరిగింది. ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఇటువంటి దుర్ఘటనలు జరగకుండా ఉండేందుకు పోలీసు యంత్రాంగం పక్కాగా ఏర్పాట్లు చేసింది. రోజుకు లక్ష నుంచి 1.50 లక్షల మంది వరకు వస్తారని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాలైన ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం నుంచి వచ్చే రైళ్లలో ఎంత మంది వస్తున్నారు. ఆ సమయంలో రద్దీ ఎలా ఉంటుంది? అన్నది అంచనా వేస్తూ హోల్డింగ్ పాయింట్లలోని భక్తులను వదులుతున్నారు.

పార్కింగ్ ప్రాంతాల్లో 13 చోట్ల

దొంగలు, రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులు ఆలయ పరిసర ప్రాంతాల్లోకి వస్తే.. వెంటనే వారిని గుర్తించేలా ఫేషియల్ రికగ్నేషన్ కెమెరాలను బిగించారు. మొత్తం 11 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. 13 చోట్ల పార్కింగ్ ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ద్వారా వాటిల్లోని ఖాళీ వివరాలు, వాహనాల సంఖ్యను పరిశీలించనున్నారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి



ప్రకటనల కొరకు సంప్రదించండి: 98496 97616

దుర్గమ్మకు భక్తితో ఇరుముడుల సమర్పణ


అన్నప్రసాదం స్వీకరిస్తూ..


హోమ గుండంలో నేతి కొబ్బరి కాయలు వేస్తున్న భవానీలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న భవానీ దీక్షల విరమణ గురువారం ప్రారంభమైంది. మండల, అర్ధ మండల దీక్షలు స్వీకరించిన భవానీ దీక్షాధారులు వేకువ జామున 3 గంటల నుంచి గిరిప్రదక్షిణ పూర్తి చేసుకొని సీతమ్మ వారి పాదాల సెంటర్ సమీపంలోని కంపార్టుమెంట్స్‌కు చేరారు. కెనాల్ రోడ్డు వినాయకుడి గుడి నుంచి క్యూలైన్లలో దర్శనానికి వెళ్లారు. ఉదయం 6 గంటలకు అమ్మవారి ప్రధాన ఆలయం నుంచి ప్రధానార్చకులు దుర్గాప్రసాద్, స్థానాచార్య శివప్రసాద శర్మ, వేదపండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కనకదుర్గానగర్‌లో 6.30 గంటలకు నిర్వహించిన అగ్నిప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఈవో శీనానాయక్, ఛైర్మన్ రాధాకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు. అనంతరం క్యూలైన్లో వేచి ఉన్న దీక్షాధారులకు అమ్మవారి దర్శనానికి అనుమతించారు. దర్శనం అనంతరం అన్నప్రసాద తయారీ కేంద్రం మొదటి అంతస్తులో గురు భవానీల సమక్షంలో ఇరుముడులు సమర్పించారు. నేతి కొబ్బరికాయను హోమగుండంలో వేసిన భవానీ దీక్షాధారులు కేశఖండన శాలలో తలనీలాలు సమర్పించారు.

తొలి రోజు విశేష స్పందన

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణలు గురువారం ప్రారంభమయ్యాయి. బుధవారం అర్ధరాత్రి నుంచే భవానీ మాలధారణ భక్తులు ఆలయానికి చేరుకున్నారు. దుర్గగుడి టోల్‌గేట్ నుంచి బ్రాహ్మణవీధి మీదుగా భక్తులు గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు.

* మొదటి రోజు రూ.15 లడ్డూల ద్వారా రూ.8,415, రూ.100 లడ్డూల ద్వారా 31,65000,
* కేశఖండన ద్వారా రూ.2,35,480, మిగతా సేవల ద్వారా రూ.4,090 మొత్తం రూ.34,12,985 ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు ప్రకటనలో వెల్లడించారు. అల్పాహారం 7500 మందికి, అన్నప్రసాదం ఎనిమిది వేల మందికి పంపిణీ చేశారు.

మొదటి రోజు అవస్థలమయం.. గిరిప్రదక్షిణలో భక్తులు అవస్థలు పడ్డారు. వైద్య ఆరోగ్యశాఖ తరపున ఏర్పాటైన వైద్య శిబిరాల్లో సిబ్బంది ఎవ్వరూ లేకపోవడంపై విమర్శలు తలెత్తాయి. కార్పొరేషన్ ద్వారా ఏర్పాటైన మంచినీటి శిబిరాల వద్ద సిబ్బంది కనిపించలేదు.

* పోలీసు శాఖ ఏర్పాట్లపై భక్తులు హర్షం వ్యక్తం చేశారు. గిరిప్రదక్షిణ మార్గంలో భవానీ భక్తులు నడిచేందుకు వీలుగా ప్లాస్టిక్ డివైడర్లను ఏర్పాటు చేశారు.


వైద్య శిబిరంలో కనిపించని సిబ్బంది

కోరినన్ని లడ్డూలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: భవానీ దీక్షల విరమణ సందర్భంగా దీక్షాధారులకు కోరినన్ని లడ్డూలు అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు ఈవో శీనానాయక్ తెలిపారు. దుర్గగుడి ఛైర్మన్ రాధాకృష్ణతో కలిసి ఈవో ప్రసాదాలు, అన్నప్రసాద పంపిణీని గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతూ భక్తుల కోరినన్ని లడ్డూలు అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. అన్నప్రసాదం కూడా కావాల్సినంత పెట్టమని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చామన్నారు.

మానసిక వికాసానికి పోటీలు దోహదం



హాజరైనవారినుద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: చదువుకోవడం వల్ల విజ్ఞానం కలిగితే.. వివిధ పోటీల్లో పాల్గొనడం వల్ల పిల్లల్లో మానసిక వికాసం పెంపొందుతుందని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. కన్నెకల్లిలో ఇలా పోటీలు నిర్వహిస్తూ విద్యార్థుల మానసిక వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడుతున్నారని నిర్వాహకులను అభినందించారు. సిద్ధార్థ ఆడిటోరియంలో మూడు రోజులుగా జరుగుతున్న అమరావతి బాలోత్సవం పిల్లల పండగ గురువారం ఘనంగా ముగిసింది. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మణరావు మాట్లాడుతూ పిల్లల అభిరుచి, ఆసక్తి, ఆలోచనలకు అనుగుణంగా తల్లిదండ్రులు వ్యవహరించాలని సూచించారు. కొత్తగూడెం బాలోత్సవం వ్యవస్థాపకుడు డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు మాట్లాడుతూ సృజనాత్మకత పెంపొందించడానికి ఈ కార్యక్రమం ఎంతో తోడ్పడుతుందన్నారు. బాలోత్సవ ప్రధాన కార్యదర్శి ఆర్. కొండలరావు మాట్లాడుతూ గత ఏడేళ్లుగా నిర్వహిస్తున్నామని ఈ ఏడాది ఎంతో చక్కగా, విస్తృతంగా జరిగిందని, ఈఏడాది 16,500 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ ప్రదర్శించారన్నారు. బాలోత్సవ గౌరవాధ్యక్షుడు చలవాది మల్లికార్జునరావు, అధ్యక్షుడు ఎస్వీ రమణరాజు, మంగళగిరి, తాడేపల్లి బాలోత్సవ అధ్యక్షుడు నన్నపనేని నాగేశ్వరరావు, నిర్వహణ కమిటీ సభ్యులు పిన్నమనేని మురళీకృష్ణ, నాగళ్ల విద్యాసాగర్, పాలడుగు రావి శారద, వెన్న వల్లభరావు, యార్లగడ్డ సుబ్బారావు, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన సృజన: అమరావతి బాలోత్సవం ముగింపు సందర్భంగా వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో విద్యార్థులు సందడి చేశారు. శాస్త్రీయ, సంప్రదాయ నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. అమ్మవారి వేషధారణలో అలరించారు. పల్లె వాతావరణం ఉట్టిపడేలా సంప్రదాయ దుస్తులు ధరించి జానపద నృత్యాలు చేశారు. ప్రేక్షకాభినయంతో ఆహూతులను కట్టిపడేశారు. వివిధ అంశాలపై ముఖాభినయంలో ప్రదర్శించి సమాజానికి సందేశం ఇచ్చారు. జనరల్ క్విజ్, ఏకాగ్రత, స్పెల్‌బీ పరీక్షల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.


తయారు చేసిన ప్రాజెక్టులతో..


జానపద నవ్వడే..


ఫ్లాష్‌మాబ్ ప్రదర్శనలో విద్యార్థినులు


ఉర్రూతలూగించిన నృత్యరూపకం

బీడీఎస్ మూడో విడతలో 200 సీట్ల భర్తీ

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు దంత వైద్య కళాశాలల్లో రెండో విడత కౌన్సెలింగ్ అనంతరం మిగిలిన బీడీఎస్ కన్వీనర్ కోటా 200 సీట్లకు నిర్వహించిన మూడో విడత కౌన్సెలింగ్ సీట్ల జాబితాను విజయవాడ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం గురువారం వెల్లడించింది. మొత్తం సీట్లన్నీ భర్తీ కాగా.. సీట్లు సాధించిన విద్యార్థులు ఈనెల 15వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోగా ఆయా కళాశాలల్లో చేరాల్సి ఉంటుంది. ఇంకా కళాశాలల్లో చేరని సీట్లకు సంబంధించి త్వరలో 'స్ట్రే వేకెన్సీ' కౌన్సెలింగ్ చేపడతామన్నారు. ఇప్పటికే మొదటి బీడీఎస్ తరగతులు అక్టోబరు 13వ తేదీ నుంచి ప్రారంభించారు.

బీడీఎస్ యాజమాన్య సీట్లకు ఐచ్ఛికాలు

రెండో విడత కౌన్సెలింగ్ అనంతరం మిగిలిన బీడీఎస్ యాజమాన్య కోటా ప్రవేశానికి నిర్వహిస్తున్న మూడో విడత కౌన్సెలింగ్‌కు సంబంధించి అర్హత కలిగిన అభ్యర్థులు వెబ్ ఐచ్ఛికాలు నమోదు చేసుకోవాలని విశ్వవిద్యాలయం సూచించింది. అభ్యర్థులు ఈ నెల 12వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల నుంచి 15వ తేదీ ఉదయం 11.30 గంటల మధ్య ఐచ్ఛికాలు నమోదు చేసుకోవాలన్నారు. ఇందుకు 'బి1' కేటగిరీలో 55, 'బి2' కేటగిరీలో 110, ఎన్నారై 'సి' కేటగిరీలో 79 కలిపి మొత్తం 244 సీట్లు అందుబాటులో ఉంచారు.

పదో తరగతి ఉత్తీర్ణత పెంపునకు కృషి


డీఈవో చంద్రకళను కలిసిన యూటీఎఫ్ నాయకులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: జిల్లా విద్యాశాఖాధికారిణిగా ఎల్.చంద్రకళ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎంజీ రోడ్డులోని కార్యాలయానికి వచ్చిన ఆమెను సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, ఎ.సుందరయ్యలు ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. డీఈవో మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధికి ఉపాధ్యాయులు, అధికారులు, సమన్వయంతో పని చేద్దామని తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెంపొందించడమే లక్ష్యమని, అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఇదే విధంగా పలు సంఘాల నేతలు డీఈవోను కలిశారు.

14న దశవర్ష విజయ శంఖారావం

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: ఈ నెల 14న కేతనకొండలోని నేతాజీ స్కూల్ గ్రౌండ్‌లో వేలాది మంది హిందువులతో దశవర్ష విజయ శంఖారావం నిర్వహిస్తున్నట్లు శివశక్తి ఆధ్యాత్మిక చైతన్య వేదిక అధ్యక్షుడు కరుణాకర్, ప్రధాన కార్యదర్శి చెట్లపల్లి కల్యాణ్ కుమార్ తెలిపారు. శివశక్తి ఆధ్యాత్మిక సంస్థ పది వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గురువారం వారు ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. 10వేల మంది హిందూవీరుల సమక్షంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అతిథిగా చినజీయర్ స్వామి హాజరవుతారని చెప్పారు. హిందువులంతా పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా ఎంఎస్ బేగ్



విజయవాడ వన్‌టౌన్, విద్యాధరపురం, న్యూస్‌టుడే: ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ ఛైర్మన్‌గా విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్‌ను నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన 2019 వరకు వైకాపాలో కొనసాగారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సీటు వెలంపల్లి శ్రీనివాసరావుకు కేటాయించడంతో ఆ పార్టీకి రాజీనామా చేశారు. అనంతరం తెదేపా తీర్థం పుచ్చుకున్నారు. 2024 ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేశారు.

నూతన ఆవిష్కరణలతో ఉజ్వల భవిష్యత్తు


హ్యాకథాన్‌కు హాజరైన వివిధ రాష్ట్రాల విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న శాస్త్రవేత్త, శాస్త్ర సాంకేతిక విభాగం మేనేజింగ్ డైరెక్టర్ చదరం శివాజీ

చిట్టినగర్, న్యూస్‌టుడే: విద్యార్థులు నూతన ఆవిష్కరణలతో ముందుకు సాగితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని శాస్త్రవేత్త, భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం మేనేజింగ్ డైరెక్టర్ చదరం శివాజీ సూచించారు. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం 'మైండ్ స్ప్రింట్ 2K25' పేరుతో 36 గంటల పాటు జాతీయ స్థాయి హ్యాకథాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాస్త్ర సాంకేతిక రంగంలో మన దేశ విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా ఉన్నారని.. వారి ప్రతిభను ఇతర దేశాల అభ్యున్నతికి ఉపయోగించుకుంటున్నారని పేర్కొన్నారు. యువత దేశాభివృద్ధికి ఉపయోగపడే విధంగా నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ అధ్యక్షుడు వంకదారు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించడానికి హ్యాకథాన్లు దోహదపడతాయని చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ ఎ.వి.రత్నప్రసాద్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల నుంచి సుమారు 2 వేల మంది విద్యార్థులు హ్యాకథాన్‌లో పాల్గొన్నట్లు తెలిపారు. ఏఐ అప్లికేషన్స్, ఏఐ అండ్ ఎంఎల్, ఐఓటీ అండ్ రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్ చైన్, ఎలక్ట్రికల్ వాహనాలు, బిజినెస్ ప్లాన్స్, బయో మెడికల్, క్వాంటమ్ కంప్యూటింగ్, మహిళా సాధికారత, ఓపెన్ ఇన్నోవేషన్ వంటి విభాగాల గురించి చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు మల్లికార్జునరావు, కార్యదర్శి అమర్‌సుధీర్, ఏవో నారాయణరావు, కోశాధికారి రాఘవయ్య, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో చోరీ.. ఆభరణాలన్నీ హరీ

దొంగలను పట్టుకున్న పోలీసులు ✷ రూ.27.50 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసీపీ ప్రసాదరావు, పోలీసులు

మైలవరం, న్యూస్‌టుడే : ఊరి చివర, నిర్మానుష్య ప్రాంతాల్లోని ఆలయాలే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను పోలీసులు పట్టుకుని పెద్ద మొత్తంలో ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల వివరాలను ఎన్టీఆర్ జిల్లా మైలవరం పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో విజయవాడ రూరల్ డీసీపీ పి.లక్ష్మణరావు, ఏసీపీ వై.ప్రసాదరావు, సీఐ చంద్రశేఖర్‌తో కలిసి వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలానికి చెందిన ఆరముళ్ల పురుషోత్తం పదేళ్లుగా ఏలూరు జిల్లా నూజివీడు సిద్ధార్థనగర్‌లో పొట్లూరి పద్మ అనే మహిళతో కలిసి ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆమెతో పాటు మైలవరం మండలం వెల్వడానికి చెందిన ఏకుల రవికుమార్, ఏకసిరి అభిలాష్, చిట్టెమ్మలతో బృందంగా ఏర్పడి కొంత కాలంగా దేవాలయాల్లో ఆభరణాలే లక్ష్యంగా దొంగతనాలు చేస్తున్నారు. తెలంగాణలోనూ పలు నేరాలకు పాల్పడిన పురుషోత్తం, మైలవరం నియోజకవర్గంతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ చోరీలకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో గురువారం మైలవరం ప్రభుత్వాసుపత్రి వద్ద గస్తీలో ఉన్న పోలీసులకు తారసపడిన ముఠాను విచారించగా పలు నేరాలను అంగీకరించినట్లు డీసీపీ వివరించారు. వారి వద్ద నుంచి రూ.16,84,050 విలువైన 11.227 కిలోల వెండి ఆభరణాలు, రూ.10.66 లక్షల విలువైన 106.6 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం, ద్వారకా తిరుమల, తడికలపూడి, విజయవాడ టూ టౌన్, ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన మొత్తం 10 కేసుల్లో చోరీ సొత్తును రికవరీ చేసినట్లు వెల్లడించారు. దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం ఎస్సైలు కె.సుధాకర్, సతీష్, శ్రీను, సిబ్బందిని రివార్డులతో ఆయన అభినందించారు.

అన్ని వర్గాలకు సామాజిక న్యాయం చేయాల్సిందే


మాట్లాడుతున్న నారగోని. చిత్రంలో అయ్యన్నబాబు, శ్రీనివాసనాయుడు, జైబాబు తదితరులు

గాంధీనగర్, న్యూస్‌టుడే : రాష్ట్రంలో ఏళ్ల తరబడి రెండు మూడు కులాలే రాజ్యాధికారాన్ని అనుభవిస్తున్నాయని.. అన్ని కులాలకు సామాజిక న్యాయం చేయాల్సిన అవసరం ఉందని జాతీయ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ ఛైర్మన్ వీజీఆర్ నారగోని అన్నారు. 'అన్నివర్గాలు, కులాలకు రాజకీయ న్యాయం'అనే అంశంపై గురువారం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్సీలు, బీసీలు ఐకమత్యంతో రాజ్యాధికారం చేజిక్కించుకోవాలని పిలుపునిచ్చారు. దీని కోసం త్వరలోనే అన్ని జిల్లాల్లో ప్రజా చైతన్య యాత్రలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రెండు లక్షల ఓట్లు కలిగిన ప్రతి కులానికీ ఒక ఎమ్మెల్యే సీటు ఇవ్వాలని, జనగణన, కులగణను వెంటనే చేపట్టాలని కోరారు. బీసీ సంఘర్షణ సమితి ఏపీ అధ్యక్షుడిగా జయచంద్రగౌడ్‌ను నియమించారు. రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు వీరంకి అయ్యన్నబాబు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు జి.శ్రీనివాసనాయుడు, జైబాబు, కె.ఎన్.శ్రీధర్, వేల్పుల శ్రీనివాస్, రాజు, నాదెళ్ల సుధాకర్, పద్మిని, వారణాసి మురళీకృష్ణ, చిట్టిబాబు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

100 మందికి జరిమానా

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదేశాల మేరకు నగర వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా 2, 4, 5 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల అధికారులు.. మద్యం తాగి వాహనాలు నడిపిన 100 మందిపై కేసులు నమోదు చేశారు. వీరిని 6వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టారు. 14 మందికి రూ.15 వేలు, 86 మందికి రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి జి.లెనిన్‌బాబు తీర్పు చెప్పారు.

పారిశ్రామికవేత్తలకు బకాయిలు విడుదల చేయాలి


మాట్లాడుతున్న శ్రీనివాసరావు. పక్కన రమాదేవి

రాఘవయ్యపార్క్ కూడలి (కృష్ణలంక), న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు బకాయిలు విడుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో గురువారం ఆ పార్టీ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు మూడేళ్లుగా రాయితీ నిధులు విడుదల చేయడం లేదని విమర్శించారు. గూగుల్ పేరుతో అదానీ కంపెనీకి రాయితీ ఇస్తూ.. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల పట్ల వివక్ష చూపిస్తుండటం తగదన్నారు. ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేస్తామంటున్న ప్రభుత్వం.. ప్రోత్సాహకాలు ఇవ్వాలన్నారు. అధికారంలోకి రాగానే అంగన్‌వాడీలకు బకాయిలు చెల్లిస్తామన్న హామీని అమలు చేయాలని పేర్కొన్నారు. వైకాపా ప్రభుత్వంలో అంగన్‌వాడీలు చేపట్టిన 45రోజుల సమ్మె కాలం బకాయిలు చెల్లించాలని కోరారు. ఇండిగో ఎయిర్‌లైన్స్ వైఫల్యానికి కేంద్ర ప్రభుత్వ వైఖరే ప్రధాన కారణమని శ్రీనివాసరావు దుయ్యబట్టారు. వారి వైఫల్యాన్ని పక్కదోవ పట్టించేందుకు పార్లమెంటులో వందేమాతరంపై మతపరమైన చర్చ చేపట్టినట్లు విమర్శించారు. దేశభక్తి గీతాన్ని, స్వాతంత్ర్య సమరయోధుల నినాదాలను మతపరంగా చూడకూడదన్నారు. సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు డి.రమాదేవి పాల్గొన్నారు.


బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)
వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213, చికెన్ స్కిన్‌లెస్ - 243.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 139, 148, 159 చికెన్ విత్ స్కిన్ - 264 చికెన్ స్కిన్‌లెస్ - 274.

నిందితులను కస్టడీకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు


అంతదాస్, రాజు, మిథున్ దాస్, హాజీలను తీసుకొస్తున్న పోలీసులు

ఈనాడు, అమరావతి: మద్యం కేసులో నలుగురు నిందితులను ఎక్సైజ్ అధికారులు కస్టడీకి తీసుకున్నారు. ఎక్సైజ్ కోర్టు ఇచ్చిన ఆదేశాలతో నెల్లూరు కారాగారంలో రిమాండ్‌లో ఉన్న అంతదాస్, మిథున్‌దాస్, సయ్యద్ హాజీ, కట్టా రాజులను ఐదు రోజుల కస్టడీకి తీసుకుని విజయవాడ తరలించారు. వీరికి నెల్లూరు కేంద్ర కారాగారంలోనే వైద్య పరీక్షలు చేయించి బస్సులో విజయవాడలోని తూర్పు ఎక్సైజ్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. వీరు వచ్చేసరికే రాత్రి 7 గంటలు దాటింది. దీంతో వీరిని తొలి రోజు ప్రశ్నించేందుకు వీలు కాలేదు. ఈనెల 15వ తేదీ వరకు వీరిని పోలీసులు ప్రశ్నించనున్నారు. అప్పటివరకు వీరిని తూర్పు ఎక్సైజ్ స్టేషన్‌లోనే ఉంచుతారు.

మద్యం కేసులో నిందితుల పిటిషన్లపై విచారణ వాయిదా

ఈనాడు, అమరావతి: మద్యం కేసులో నిందితులు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్లపై సిట్ అధికారులు కౌంటర్లు దాఖలు చేసేందుకు విచారణను ఏసీబీ కోర్టు వాయిదా వేసింది. అనిల్ చోఖ్రా (ఏ49) పిటిషన్‌ను 15వ తేదీకి, చాణక్య (ఏ8) దాఖలు చేసుకున్న పిటిషన్‌ను 12వ తేదీకి వాయిదా పడింది. జైలులో తమకు వసతులు కల్పించాలని అనిల్ చోఖ్రా, వెంకటేష్ నాయుడు పిటిషన్లపై కౌంటర్లు వేసేందుకు 15వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. బెయిల్ ఆంక్షలను సడలించాలని బాలాజీ గోవిందప్ప వేసిన పిటిషన్‌పై తదుపరి విచారణను ఈనెల 19వ తేదీకి వాయిదా పడింది.

సత్యవర్ధన్ అపహరణ కేసులో కొమ్మా కోట్లు..

ఈనాడు, అమరావతి: సత్యవర్ధన్ అపహరణ, దాడి కేసులో వంశీ ప్రధాన అనుచరుడైన కొమ్మా కోట్లు (ఏ2)ను కస్టడీకి ఇవ్వాలని పటమట పోలీసులు ఎస్సీ, ఎస్టీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో మరిన్ని కోణాలను వెలికితీయాల్సి ఉందని, ఈ నేపథ్యంలో నిందితుడిని రెండు రోజుల కస్టడీకి ఇవ్వాలని ఆ పిటిషన్‌లో పోలీసులు అభ్యర్థించారు. బెయిల్ మంజూరు చేయాలని నిందితుడు పిటిషన్ వేశారు. ఈ రెండు పిటిషన్లపై నోటీసుల నిమిత్తం శుక్రవారానికి కోర్టు వాయిదా వేసింది.

అద్దేపల్లి జనార్దనరావును కస్టడీ కోరుతూ..

ఈనాడు, అమరావతి: నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడైన అద్దేపల్లి జనార్దనరావు (ఏ1)ను మరోసారి విచారించేందుకు అనుమతించాలని ఎక్సైజ్ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యవహారంలో కుట్రకు సంబంధించి ఏ1ను మరింత లోతుగా విచారించాలని, ఎక్సైజ్ కోర్టులో వేసిన పిటిషన్‌లో అభ్యర్థించారు. తిరుమలశెట్టి శ్రీనివాసరావు (ఏ13), చెక్కా సతీష్ (ఏ17) దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. వీటిపై తీర్పును ఈనెల 18న వెల్లడించనున్నట్లు న్యాయాధికారి ప్రకటించారు.

సంజయ్ బెయిల్‌పై ముగిసిన వాదనలు

ఈనాడు - అమరావతి: అగ్నిమాపక శాఖ, సీఐడీ డీజీగా పనిచేసిన కాలంలో అక్రమాలకు పాల్పడ్డారని నమోదైన కేసులో ఐపీఎస్ అధికారి సంజయ్ బెయిల్ పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. ఈ పిటిషన్ గురువారం ఏసీబీ కోర్టులో విచారణకు వచ్చింది. దీనిపై ఇరుపక్షాల వాదనలు పూర్తి అయ్యాయి. తీర్పును ఈనెల 15వ తేదీకి వెల్లడించనున్నట్లు న్యాయాధికారి భాస్కరరావు ప్రకటించారు.

91.9FM Vijayawada
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్). ✆ 83338 33368.

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166.

బంగారం కొనబడును. బ్యాంకుల లో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్‌క్యాష్ ✆ 814229 2071

PEOPLE CARE

OLD AGE HOME

గాయిత్రి గ్రూప్, VJA, వృద్ధులకు, పేషెంట్ల సేవకు, ఇంటి/ వంట, బేబి కేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 99590 21122, 96038 42233

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

REAL ESTATE

FLAT FOR SALE

విజయవాడ ఎనికేపాడులో 2nd ఫ్లోరు నందు 1100S.Ft. గల 2BHK ఫ్లాట్ వెస్ట్‌ఫేస్, కార్ పార్కింగ్‌తో 35 లక్షలకే అమ్మకం. ✆ 86396 33455

PLOT FOR SALE

4 గ్రా. గోల్డ్ ఫ్రీ. బండిపాలెంలో 60అ. రోడ్డుకు, ఇళ్ళ దగ్గర పంచాయతీ ప్లాట్లు & 12 గ్రా. గోల్డ్‌ఫ్రీ, కంచికచర్ల- అమరావతి ORRకి 200మీ లోపు CRDA ప్లాట్లు. రి.జి.ఫ్రీ ✆ 88018 03689

హైడ్ ప్రోజెక్ట్ వారి ఆఫీసర్స్ ఎవెన్యూ 16ఎ|| ఓపెన్ ప్లాట్లు & విల్లాస్ గన్నవరం నుండి పురుషోత్తపట్నం 100అ. రోడ్ ఫేసింగ్ CRDA,RERA 50% బ్యాంక్ లోన్, గ|| 21500/- Hyma Prasad ✆ 9959645468

PLOTS FOR SALE
శుభగృహ ప్రాజెక్ట్స్ వారి **సుకృతి సిగ్నేచర్** CRDA, RERA అప్రూవ్డ్ లేఅవుట్‌లో నిర్మాణానికి రెడీగా విజయవాడలో రామవరప్పాడు రింగ్ దగ్గరగా అందుబాటు ధరలో 183, 200 గజాలు విల్లా ప్లాట్స్ అందుబాటులో కలవు.
99855 51446
98481 80666

SHOP FOR SALE

నందిగామ ఓల్డ్‌హైవే లక్ష్మీప్రసన్న థియేటర్ సెంటర్ నందు నూతనముగా నిర్మించిన 2 షాపులు & 2 ఫ్లాట్స్ అమ్మకమునకు కలవు. రామకృష్ణ. ✆ 99498 94028

TO LET

COMMERCIAL

2700Sft Office Space for Lease on 2nd Floor in Punnaih & Vajramma Complex Below Tata Capital In HDFC Bank Bldg. Opp: Maris Stella College ✆95507 17832, 98490 02025

WANTED

విజయవాడలో ప్లే స్కూల్ కోసం డూప్లెక్స్ లేదా 500 గజాలు ఉన్న Independent House ఇల్లు లీజ్‌కు కావలెను. Cell: 96678 99196

JOBS

Wanted Female Telecallers. Qul: any Degree, Salary:Up To 15000+Incentives, Job Location: Benzcircle, & Kankipadu. ✆98481 72444

Req. of DRA & Non DRA Banking Collections, Field Exec: 16K- 22K, T/Callers: 12K- 18K. Vijayawada. ✆ 8121618919, 8978043042.

విజయ గౌతమ ల్యాండ్ ప్రోపర్టీస్ (రియల్ ఎస్టేట్) గాంధీనగర్ ఆఫీసు నందు రిసెప్షనిస్ట్‌గా పని చేయుటకు ఇంటర్ చదివిన లేడీ కావలెను. ✆ 98492 21955.

నూతనముగా ప్రారంభించిన ప్రముఖ బ్యాంకు అనుబంధ సంస్థకు రిటైర్డ్ స్టేట్, సెంట్రల్ ఎంప్లాయీస్, బ్యాంకర్స్ ఆడిటర్స్ కావలెను. ✆ 99120 24720

ప్రముఖ ఆటోఫైనాన్స్ ఆఫీస్‌కి అనుభవంగల కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. A: 25-30Y, Sal:18-25K Qul. డిగ్రీ ✆ 99495 58181, 81215 58181

దివ్య ఇమేజింగ్ సెంటర్ పటమట నందు పనిచేయుటకు రిసెప్షనిస్ట్‌లు మేనేజర్, టైపిస్ట్ (మెడికల్ ట్రాన్స్‌స్క్రిప్ట్) X-RAY, CT MRI టెక్నీషియన్స్ కావలెను. ✆ 98491 50699, 63091 02019

విజయవాడ ఫార్చ్యూన్ మురళీ పార్క్ రోడ్ కరూర్ బేకరి వెనుక వీధిలో ఆఫీస్ నందు కలెక్షన్‌కు చురుకైన యువకులు కావలెను. ✆ 81422 24444

M.R. Estates నందు సేల్స్ మేనేజర్స్ (M/F) కావలెను. జీతం 10వేలు+8వేలు. ఇన్సెంటివ్ కలదు. వయస్సు 30 సం||లలోపు వారికి ప్రాధాన్యత. విజయవాడ. 92900 95959.

బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్/ బిజినెస్ మేనేజర్స్ కావలెను. డిగ్రీ, 3సం||ల మార్కెటింగ్ రంగంలో అనుభవం, 30 సం||ల లోపువారు రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

DRIVERS

విజయవాడలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ నందు పని చేయుటకు అనుభవం గల కార్ డ్రైవర్లు కావలెను. ✆ 96189 62917, 90140 84525.

విజయవాడలో ఇన్నోవా కారు నడుపుటకు హైవేలలో కారు నడిపిన అనుభవం 3సం||-5సం|| ఉన్న ఫుల్‌టైమ్ కారు డ్రైవర్ కావలెను. వయస్సు 25 సం|| - 35 సం||లోపు. ✆ 96184 24888.

Book your 5 lines Classified Colour Rs.1200/-
3Ads Package Rs.3250/-
5 lines Classified B/W Rs.1025/-
3Ads Package Rs.2575/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం
PH: 98496 97616

తిరువూరు

• తిరువూరు • మైలవరం



మేధాదక్షిణామూర్తి స్వామికి నమస్కరిస్తున్న భక్తులు

ఆలయంలో ప్రత్యేక పూజలు

గోసవీడు(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండల పరిధి గోసవీడులోని విశ్వేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో గురువారం మేధాదక్షిణామూర్తి స్వామికి విశేష పూజలు నిర్వహించారు. అభిషేకం, అర్చన, అలంకారం చేశారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

నిర్మాణ పనులకు శంకుస్థాపన

కొండపల్లి, న్యూస్‌టుడే : కొండపల్లి పురపాలిక పశ్చిమ ఇబ్రహీంపట్నంలో సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు మున్సిపల్ ఛైర్మన్ చిట్టిబాబు గురువారం శంకుస్థాపన చేశారు. సీఆర్‌డీఏ నిధులు రూ.22 లక్షలతో వీటిని నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాణి ఫణి, ఆదినారాయణ, బుల్లబ్బాయి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఎక్స్‌లెన్స్ అవార్డు

గొల్లపూడి : గొల్లపూడిలోని ఎన్‌ఆర్‌ఐ ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలకు ఎక్సలెన్స్ అవార్డు వచ్చినట్లు పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి చైతన్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని ఈటీటెక్ ఎక్స్ పాఠశాల ఈ ఎక్సలెన్స్ అవార్డు అందించినట్లు ఆయన వెల్లడించారు. పాఠశాలలో అత్యుత్తమ బోధన, పరిశుభ్రత తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని ఈ అవార్డును ఇచ్చినట్లుగా చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

❖ తిరువూరు 4వ వార్డులోని డ్రెయిన్లలో మట్టి పేరుకుందని స్థానికుడు నరేష్ సమస్యను 'ఈనాడు' మేమున్నాం..మీకు తోడుగా ద్వారా మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మున్సిపల్ శానిటరీ అధికారి సంతోష్ స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులను పంపించి డ్రెయిన్లను శుభ్రం చేయించారు. – న్యూస్‌టుడే, తిరువూరు టౌన్



? కొండపల్లి బాలుర పాఠశాల నుంచి సీసీ రోడ్డు నిర్మించడం వల్ల ఆర్టీసీ బస్సులు ప్రధాన రహదారి నుంచి రాకపోకలు సాగించడం లేదు. రోడ్డు నిర్మాణం పూర్తి అయినా బస్సుల రాకపోకలు పునరుద్ధరించ లేదు. - **శ్రీవాత్సవ్, స్థానికుడు**

✔ సమస్య మా దృష్టికి వచ్చింది. వంతెన పనులు జరుగుతున్నందున అప్పుడే ఆర్టీసీ బస్సులు పునరుద్ధరించలేం.
- **వేణు, డిపో మేనేజర్ - న్యూస్‌టుడే, కొండపల్లి**

? చెవుటూరు బాపూజీ కాలనీలోని మురుగు కాలువల్లో పూడిక పేరుకుంది. నీరు పారక దోమలతో అవస్థలు పడుతున్నాం. - **డి.సుబ్బారావు, గ్రామస్థుడు**

✔ సమస్య మా దృష్టికి వచ్చింది. పారిశుద్ధ్య కార్మికులతో పూడిక తీయించి దోమల నివారణకు చర్యలు చేపడతాం.
- **బసవ లింగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, జి.కొండూరు**

28న హిందూ సమ్మేళనం

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఈ నెల 28న హిందూ సమ్మేళనం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దీనికి ముఖ్య అతిథిగా శ్రీశివ స్వామిజీ హాజరవుతారని వారు చెప్పారు.

అసంపూర్తి పనులు పూర్తి చేయాలి

జి.కొండూరు, న్యూస్‌టుడే : గ్రామంలో అసంపూర్తిగా నిలిచిన పనులు పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తెదేపా గ్రామ అధ్యక్షుడు పజ్జూరు విజయ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీసీ రోడ్ల నిర్మాణం, ఎన్టీఆర్ విగ్రహానికి మరమ్మతులు, తాగునీటి పైపులైన్ ఏర్పాటు కోసం తీర్మానించుకున్నారు. రవికుమార్, ఉమా, శివ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కష్టాలు.. నగరానికి పరుగులు

ఇబ్రహీంపట్నం, కొండపల్లి, న్యూస్‌టుడే

ఆధార్ సేవలు పొందడానికి ప్రజలు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కొండపల్లి పురపాలికతో పాటు ఇబ్రహీంపట్నం గ్రామీణ ప్రజలు వీటిని పొందేందుకు విజయవాడకు పరుగులు తీస్తున్నారు. దరఖాస్తుల గుర్తింపునకు, ప్రభుత్వ పథకాల అర్హతకు ఆధార్ తప్పని సరైన నేపథ్యంలో దీని అవసరత ప్రతి ఒక్కరికీ కలిగింది. గతంలో ప్రత్యేక శిబిరాల ద్వారా పుట్టే శిశువులు మినహా అందరూ దీన్ని పొందారు. అయితే జారీ అయిన వాటిలో అనేక తప్పులు సాధారణంగా మారాయి. ఈ పరిస్థితుల్లో వాటిని సరిచేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కానీ ఈ సేవలు పొందడానికి ప్రజలకు స్థానికంగా వెసులుబాటు లేక

ప్రాంతం పేరు	ప్రజలు	ఆధార్ కేంద్రాలు
కొండపల్లి పురపాలిక	లక్ష	2
ఇబ్రహీంపట్నం గ్రామీణం	40 వేలు	1



శిబిరంలో సవరణలు చేయించుకుంటున్న విద్యార్థులు

ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలో కొన్ని ఎంపిక చేసిన మీసేవా, ఆన్‌లైన్ సెంటర్లలో ఈ సేవలు లభించేవి. ప్రభుత్వం వాటికి లైసెన్స్‌లు నిలిపేయడంతో ఆయా చోట్ల సేవలు నిలిచాయి.

ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించి..

ప్రస్తుతం కొండపల్లి పురపాలికలో వీటీపీఎస్ తపాలా కార్యాలయం, ఇబ్రహీంపట్నంలోని ఓ బ్యాంకులో ఆధార్ సేవలున్నాయి. కానీ వాటిల్లో అన్ని రకాలు అందుబాటులో లేకపోవడం గమనార్హం. దీనికి తోడు సిబ్బంది సహకరించక పోవడంతో ప్రజలు రోజుల తరబడి ఆయా కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో కొందరు ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించి వారికి అధికంగా నగదు చెల్లించి సేవలు పొందుతున్నారు. వీరు పలు ఆధార్ సేవలకు సంబంధించి కొంత మొత్తాలను తీసుకొని విజయవాడ, నందిగామ తదితర ప్రాంతాల్లో సవరణలు, నమోదులు చేయిస్తున్నారు.

గ్రామానికో చోట ఏర్పాటు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నాం. గ్రామానికో చోట వీటిని ఏర్పాటు చేసి వారం రోజుల పాటు ప్రజలకు సేవలు అందిస్తున్నాం. విద్యార్థుల కోసం కొన్ని విద్యాసంస్థల్లో కూడా వీటిని ఏర్పాటు చేస్తున్నాం. **- శకుంతల, ఎంపీడీవో**



గాయత్రి కుటుంబ సభ్యులకు చెక్కు ఇస్తున్న నర్సిరెడ్డి తదితరులు

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండల కేంద్రానికి చెందిన వికాస్ కళాశాల విద్యార్థిని గుడిపూడి గాయత్రి ఇటీవల అనారోగ్యానికి గురైంది. ఈ సందర్భంగా ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం వికాస్ విద్యాసంస్థల యాజమాన్యం, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది కలిసి రూ.1,60,000 నగదు అందజేశారు. ఆ కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో వికాస్ విద్యాసంస్థల అధినేత ఎన్.నర్సిరెడ్డి గాయత్రి కుటుంబ సభ్యులకు దానికి సంబంధించిన చెక్కు ఇచ్చారు. ప్రిన్సిపల్స్ శ్రీనివాసరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి నిధుల కేటాయింపు హర్షనీయం



వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, పక్కన నాయకులు

తిరువూరు, గంపలగూడెం : తిరువూరు నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం రూ.43.3 కోట్లు కేటాయించినట్లు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక తెదేపా కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పలు విషయాలు వెల్లడించారు. అనంతరం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం, ఉప ముఖ్యమంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

తిరువూరు, గంపలగూడెం న్యూస్‌టుడే : నియోజకవర్గంలో దెబ్బతిన్న చెరువుల కట్టలను గుర్తించి, వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. గురువారం ఆయన కార్యాలయంలో జలవనరుల శాఖ అధికారులతో సమీక్షించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న పనులు, చేయాల్సిన వాటిపై చర్చించారు.

విస్సన్నపేట ఎంపీపీగా మల్లయ్య ఏకగ్రీవం

విస్సన్నపేట, న్యూస్‌టుడే : స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం జరిగిన మండల ప్రజా పరిషత్ ప్రత్యేక సమావేశంలో విస్సన్నపేట ఎంపీపీగా గద్దల మల్లయ్యను 17 మంది ఎంపీటీసీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎస్.ఇలక్కియ పర్యవేక్షణలో ఆర్డీవో కె.మాధురి ఆయనకు ధ్రువపత్రం అందించి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం అధికారులు, సభ్యులు మల్లయ్యకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ కార్యాలయానికి తోడ్కొని వెళ్లి ఆయనకు కేటాయించిన సీటులో కూర్చోబెట్టి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, ఎంపీడీవో చిన్నరాట్నాలు, మండల వైద్యాధికారి శ్రీనివాసరావు, పంచాయతీ ఈవో కేశవ హరికృష్ణ కుమార్, ఏవో సుజాత, ఏపీఎం ప్రసాద్, సీఐ గిరిబాబు, ఎస్సై రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మల్లయ్యతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న తిరువూరు ఆర్డీవో మాధురి

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

గొల్లపూడి, న్యూస్‌టుడే : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. గొల్లపూడి పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జవాబుదారీతనంతో కూడిన సుపరిపాలన అందించే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ నర్రా వాసు, నాయకులు బొమ్మసాని సుబ్బారావు, అక్కల గాంధీ పాల్గొన్నారు.

❖ మైలవరం నియోజకవర్గంలోని 50 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ఎల్‌ఓసీలను ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ అందజేశారు.

ఇబ్రహీంపట్నం (గ్రామీణం): మైలవరం నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం రూ.11.22 కోట్లు మంజూరు చేసిందని స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. వీటితో నియోజకవర్గంలో 20.149 కి.మీ పొడవున అంతర్గత రోడ్లు అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. దాములూరులో రూ.45 లక్షలతో నిర్మించనున్న పాడిపాల నిర్మాణానికి ఆయన గురువారం భూమిపూజ చేసి మాట్లాడారు. దాములూరు నుంచి కొత్తపేట ప్రధాన రహదారి కాలువ వరకు సీసీ రోడ్డు మంజూరైందని, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. సర్పంచి మధుసూదనరావు, నియోజకవర్గ జనసేన ప్రతినిధి అక్కల రామ్మోహనరావు, తెదేపా నాయకులు జంపాల సీతారామయ్య, రవి, చిట్టిబాబు, గ్రామస్థులు పాల్గొన్నారు.



గొల్లపూడి: అర్జీదారుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

ఇంధన పరిరక్షణపై అవగాహన

మైలవరం, న్యూస్‌టుడే : ఇంధన పరిరక్షణ వారంలో భాగంగా గురువారం స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగాధిపతి వి.ఉమాలక్ష్మి ఆధ్వర్యంలో ఇంధన పరిరక్షణపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. శక్తిని ఆదా చేయాల్సిన ఆవశ్యకతను ప్రిన్సిపల్ పి.రంగారావు విద్యార్థులకు చెప్పారు. నేడు పరిరక్షించిన శక్తి రేపటి తరాలకు గొప్ప సంపదని తెలిపారు. విద్యుత్తు ఆదా పద్ధతులను వివరించారు. వాటిపై రూపొందించిన కరపత్రాలను వాహనదారులకు, సమీప గ్రామ ప్రజలకు విద్యార్థులు పంచారు. ప్రతి ఒక్కరు ఇంధన ఆదాపై దృష్టి పెట్టాలని కోరారు.

న్యాయం చేయాలని వినతి

మైలవరం, న్యూస్‌టుడే : మండలంలోని గణపవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో వంట ఏజెన్సీ నిర్వాహకురాలికి అకారణంగా తొలగించారని, ఆమెకు తగిన న్యాయం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్.సుధాకర్ డిమాండ్ చేశారు. తొలగించిన నిర్వాహకురాలు రత్నకుమారి, కుటుంబ సభ్యులతో కలిసి గురువారం స్థానిక ఎంఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపి ఎంఈవో బాలుకు వినతిపత్రం అందించారు. అనంతరం సుధాకర్ మాట్లాడుతూ ఆయాగా పని చేస్తున్న వ్యక్తిని గత నెలలోనే రాజీనామా చేయించి, ఏజెన్సీ చూసుకోమని చెప్పి, తిరిగి రాజకీయ ప్రమేయంతో తొలగించి రోడ్డున పడేశారని ఆరోపించారు.

దాతలు స్పందించండి.. చొరవ చూపండి



కావవరం శివారు సత్యనారాయణపురంలో మూసేసిన ఎంపీయూపీ పాఠశాల భవనంతో పాటు స్థలాన్ని ప్రజావసరాలకు వినియోగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామ పరిధిలో ఐదెకరాల్లో కాలనీ ఏర్పాటు చేసి పేదలకు గృహాలు కేటాయించారు. అక్కడే ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయగా విద్యార్థులందరూ తమ నివాసాలకు దగ్గరగా ఉండటంతో అందులో చేరారు. తర్వాత విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో విద్యా శాఖ అధికారులు బడిని మూసివేశారు. అప్పటి నుంచి పాఠశాల భవనంతో పాటు స్థలాన్ని పరిసరాల వారు వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకుంటున్నారు. గ్రామంలో సామాజిక కార్యక్రమాలు నిర్వహించే దాతలు ముందుకొచ్చి ఈ స్థలంలో సామాజిక భవనం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం**




మహిళా సంఘాలను ఉద్దేశించి మాట్లాడుతున్న శంకర్ నాయక్

తక్కువ వ్యయంతో నాణ్యమైన దిగుబడులు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ సాగు వ్యయంతో విషరహితమైన నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజరు వై.శంకర్ నాయక్ వివరించారు. కేతనకొండ, మూలపాడు గ్రామాల్లో క్షేత్ర స్థాయి సిబ్బందికి నిర్వహించిన శిక్షణ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగులో ఖర్చును తగ్గించి రైతును లాభాల బాట పట్టించేందుకు ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయంను ప్రోత్సహిస్తుందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ఏపీఎన్జీవో నూతన కార్యవర్గ ఎన్నిక

మైలవరం, న్యూస్‌టుడే : ఏపీఎన్జీవో మైలవరం తాలూకా యూనిట్ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఆ సంఘం నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం స్థానిక ర.భ. కార్యాలయ అతిథిగృహంలో నిర్వహించిన నామినేషన్ల ప్రక్రియ అనంతరం ఎస్‌డీ వజిరుద్దీన్ ఖాదీర్ ప్యానెల్ సభ్యులు ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్షుడు డి.సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి పి.రమేష్ గురువారం ప్రకటించారు. అందులో అధ్యక్ష, సహాధ్యక్షుడిగా ఎస్‌డీ వజిరుద్దీన్ ఖాదీర్, వి.రవికుమార్, కార్యదర్శిగా సీహెచ్.నరసింహరావు, కోశాధికారిగా ఎన్ఎన్ సత్యనారాయణ తదితరులు ఎన్నికైనట్లు పేర్కొన్నారు. సంఘం నాయకులు రాజశేఖర్, జానీబాషా, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.



సత్కారం అందుకున్న సంఘ సభ్యులతో నాయకులు

అమృతమూర్తికి అశ్రునివాళి



జననం 16-09-1949 మరణం 30-11-2025

శ్రీమతి ఉప్పెల రాజేశ్వరి దేవి గారు

చెరగని చిరునవ్వుతో అందర్నీ ఆప్యాయంగా పలకరిస్తూ... ఆదర్శ గృహిణిగా కుటుంబ ఉన్నతికై శ్రమించిన మీరు మా నుండి భౌతికంగా దూరమైనా మీతో గడిపిన మధుర స్మృతులు మాతోనే ఉంటాయి. మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ... శోకతప్త హృదయాలతో...

భర్త: ఉప్పెల సత్యనారాయణ రెడ్డి
Executive Engineer, Irrigation (Retd)

కుమారుడు: ఉప్పెల సువీణ్ కుమార్ రెడ్డి (USA)
మనుమడు: సిహార్ష్ కేశవ్ రెడ్డి మనుమరాలు: దీత్య సాయి రెడ్డి
కుమార్తె: జంగా సుష్మాదేవి అల్లుడు: జంగా నారాయణ రెడ్డి (USA)
మనుమరాలు: నవ్య సాయి రెడ్డి మనుమడు: నీహార్ సాయి రెడ్డి

పెద్దకర్మ: ది. 13-12-2025 శనివారం, NTR జిల్లా, గంపలగూడెం (మం) 'కనుమూరు' గ్రామములో మా స్వగృహమునందు జరుగును. కావున తెలియపరచడమైనది. ఫోన్: 63039 75361

వృద్ధురాలి గృహ నిర్మాణానికి చేయూత

విస్సన్నపేట : విస్సన్నపేటకు చెందిన సర్కువరపు నాగేశ్వరమ్మ వృద్ధురాలు. ఈ నేపథ్యంలో ఆమె ఇంటి నిర్మాణానికి జనసేన నాయకుడు, డాక్యుమెంట్ రైటర్ తోట వెంకటేష్ వితరణతో రూ.10,000లు నగదును నాగేశ్వరమ్మకు గురువారం అందించారు. ఆమె కుమారుడు లీలాకృష్ణ దివ్యాంగుడు. మానవతా దృక్పథంతో ప్రభుత్వం సహాయం చేయాలని ఆమె కోరారు. జనసేన మండల నాయకులు, వీర మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

సాహిత్య సేవలు ఎనలేనివి

జి.కొండూరు, న్యూస్‌టుడే : భారతీయ భాషోత్సవంలో భాగంగా స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ కవి సుబ్రహ్మణ్య భారతి జయంతిని చెవుటూరులో గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి చెవుటూరు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. సుబ్రహ్మణ్య భారతి సాహిత్యానికి చేసిన సేవలను విద్యార్థులకు తెలిపారు. హెచ్ఎం రమాదేవి, ఉపాధ్యాయులు ఆంజనేయులు, వాసు, కిరణ్, నాగరాజు పాల్గొన్నారు.



సుబ్రహ్మణ్య భారతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రమాదేవి, వాసు తదితరులు

కొండపల్లి, న్యూస్‌టుడే : కొండపల్లి జడ్పీ బాలికోన్నత పాఠశాలలో గురువారం భారతీయ భాషోత్సవ్- 2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం హేమలత మాట్లాడుతూ కవి సుబ్రహ్మణ్య భారతి జయంతిని పురస్కరించుకొని భారతీయ భాషోత్సవ్‌ను వారం రోజుల పాటు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మూత్రపిండాల వ్యాధితో ఒకరు మృతి



బాలాజీ (పాతచిత్రం)

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : ఎ.కొండూరు మండలం మత్రియా తండాకు చెందిన బర్మావత్ బాలాజీ(47) అనే వ్యక్తి మూత్రపిండాల వ్యాధి కారణంగా గురువారం మృతి చెందాడు. కొన్నేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న అతనికి పెద్ద మొత్తంలో నగదు ఖర్చు చేసి వైద్యం చేయించినా ఫలితం లేకుండా పోయిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

అన్యాక్రాంత భూములు వెనక్కివ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

మైలవరం, న్యూస్‌టుడే : గతంలో పేదలకు పంపిణీ చేయగా, అన్యాక్రాంతమైన భూములను వెనక్కి తీసుకుని, పేదలకే దక్కేలా చూడాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కల్యాణ్ కోరారు. ఈ మేరకు గురువారం మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ అబ్దుల్ దరియాకు వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని గ్రామాల్లో భూముల వివరాలను తహసీల్దార్‌కు వివరించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుధాకర్, వ్య.కా.స. నాయకులు వెంకటేశ్వర్లు, సురేష్, ప్రసాదరావు పాల్గొన్నారు.

ఇంటి తాళం పగలగొట్టి చోరీ

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : తిరువూరులోని ఓ ఇంట్లో బుధవారం రాత్రి దొంగలు పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సాయి రాఘవ ఎస్టేట్‌లో నివాసం ఉండే వాసం చిన్ని కృష్ణ మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని తన కుమారుడి వద్దకు వెళ్లి గురువారం ఉదయం తిరిగి వచ్చారు. ఈ నేపథ్యంలో ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడం గమనించి విలువైన వస్తువులు, కొంత నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు అక్కడికి వచ్చి పరిశీలించారు. క్లూస్ బృందం సాయంతో వేలి ముద్రలు, ఆధారాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



గదిలో చిందరవందరగా పడి ఉన్న దుస్తులు

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 98496 97616

సజావుగా ధాన్యం కొనుగోళ్లు

గంపలగూడెం, విస్సన్నపేట, న్యూస్‌టుడే : జిల్లాలో ఖరీఫ్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగుతోందని, రైతులకు ఎక్కడా ఇబ్బంది లేకుండా క్షేత్ర స్థాయిలో అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎస్.ఇలక్కియా తెలిపారు. తిరువూరు ఆర్డీవో కె.మాధురితో కలిసి విస్సన్నపేట, గంపలగూడెం, పెదకొమిరలో అన్నదాతల నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఆమె గురువారం తనిఖీ చేశారు. స్థానిక రైతు సేవా కేంద్రాలను సందర్శించి రైతులకు అందుతున్న సేవలను పరిశీలించారు.

రెడ్డిగూడెం: మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 16 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు ఏవో డి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు అందజేశారు.



తూకం పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ ఇలక్కియా, పక్కన ఆర్డీవో మాధురి, అధికారులు



శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానము
పెనుగంచిప్రోలు (గ్రా & మం), NTR జిల్లా.

టెండరు ప్రకటన

NIT No. REV-61/PRIN/1/2022 Dated: 10-12-2025

శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానమునందు రంగుల మహోత్సవం- 2026 సందర్భంగా వివిధ నిర్మాణ మరియు ఏర్పాట్ల పనులు (14 Nos) చేయుటకు గాను ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలువబడుచున్నవి. టెండరు వివరముల కొరకు www.tender.apeprocurement.gov.in ఈ-ప్రొక్యూర్‌మెంట్ సైట్ నందు చూడగలరు.

శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం నందు 2026 సంవత్సరం నందు వివిధ మెయింటెనెన్స్ పనులకు అవసరం అగు సిమెంట్, స్టీల్, పెయింట్లు, S&W మెటీరియల్స్, టైల్స్, హార్డ్‌వేర్ సామానులు, ఎలక్ట్రికల్ మెటీరియల్స్ వగైరాలను సప్లయి చేయుటకుగాను కొటేషన్స్ ది. 12-12-2025 నుండి 20-12-2025 వరకు కోరబడుచున్నవి. వివరములకు దేవస్థాన కార్యాలయం నందు సంప్రదించగలరు.

అమ్మవారి సేవలో

శ్రీ జంగాల శ్రీనివాసరావు — చైర్మన్ మరియు ధర్మకర్తల మండలి సభ్యులు

B.మహేశ్వరరెడ్డి — డిప్యూటీ కమిషనర్ & కార్యనిర్వహణాధికారి

(c) eenadu

పర్సన్ ఆఫ్ ద ఇయర్‌గా 'ఆర్కిటెక్ట్స్ ఆఫ్ ఏఐ'



ఈ ఏడాదికిగానూ 'పర్సన్ ఆఫ్ ద ఇయర్‌'గా 'ఆర్కిటెక్ట్స్ ఆఫ్ ఏఐ'ని (ఏఐ సృష్టికర్తలు) ప్రముఖ అంతర్జాతీయ మ్యాగజిన్ టైమ్ ప్రకటించింది. 2025ను ఏఐ ఏడాదిగా అభివర్ణించిన ఈ మ్యాగజిన్.. దాని శక్తి ప్రపంచాన్ని స్పష్టంగా వినియోగించిన ఏర్పాటని పేర్కొంది. ఏఐ మన జీవితాలను మార్చడంలో, ఆలోచనల్ని విస్తృతపరచడంలో, ఆవిష్కరణల్లో ప్రధాన పాత్ర పోషించిందని వివరించింది. జెన్సెన్ హువాంగ్, సామ్ ఆల్ట్‌మన్, ట్రంప్, బెంజమిన్ నెతన్యాహు, జోహ్రాన్ మమ్దానీ పర్సన్ ఆఫ్ ద ఇయర్ రేసులో పోటీ పడ్డారు. -న్యూయార్క్

ఈదే బల్బులు!



విద్యుత్ బల్బుల్లా కనిపిస్తున్న ఈ చిరు జీవులను సముద్ర కప్పలుగా మత్స్యకారులు పిలుస్తారు. తీరానికి దూరంగా చాలా లోతున సంచరించే ఇవి.. ఆహార అన్వేషణలో పైకి వచ్చినప్పుడు వలల్లో పడతాయి. జాలరిపేట ఋషికొండ తీరంలో మత్స్యకారుల వలకు ఈ జీవులు చిక్కాయి. వీటిపై ఏవైనా పెద్ద జీవులు దాడికి యత్నించినా, భయాందోళనకు గురైనా ఇలా ఉబ్బుతాయని వారు వివరించారు.
- న్యూస్‌టుడే, విశాఖపట్నం (సాగర్‌నగర్)

తినండి.. హృదయ పూర్వకంగా!



హిత భుక్... మిత భుక్... ఋతు భుక్! ఏం తినాలో, ఎంత తినాలో, ఎప్పుడు తినాలో... తెలియాలంటారు పెద్దలు. దాన్ని ఎలా తినాలో కూడా తెలిస్తేనే ఆహారం ఆరోగ్యంగా మారుతుంది.. అమృతంలా ఒంటబడుతుంది! వైశ్వానర విద్యగా పిలిచే ఈ విధానాన్ని మన పూర్వీకులు ఓ యజ్ఞంలా ఆచరించారు. ఇప్పుడు మాత్రం నూటికి 90 మంది ఆహార సూత్రాల విషయంలో అలసత్వం వహిస్తున్నారు.

ఎక్కడ కూర్చుంటున్నాం...

- తినడంలో క్రమశిక్షణ చాలా అవసరం.
- ప్రస్తుతం ఎక్కువ మంది.. ఫోన్, టీవీ, ల్యాప్‌టాప్ చూస్తూ, వేరే పని చేసుకుంటూ తింటున్నారు.
- ఆదరాబాదరాగా లాగించడం ఏమాత్రం మంచిది కాదు. ఆహారాన్ని ప్రశాంతంగా, ఆస్వాదిస్తూ ఆరగించాలి.
- పూర్వం నేల మీద కూర్చొని తినే వాళ్లు... తర్వాత పీట, ఆ తర్వాత డైనింగ్ టేబుల్, ఇప్పుడు నుంచొని తినడానికి అలవాటుపడ్డాం. ఇది అనారోగ్యానికి హేతువు.
- నేల మీద కూర్చున్నప్పుడు ముద్ద నోట్లో పెట్టుకోవడానికి ముందుకు వంగుతాం. దీంతో పొట్టపై కొంత ఒత్తిడి పడి తిన్నది సరిపోయిందా లేదా అనేది శరీరం చెప్పేస్తుంది.
- బాసింపట్టు వేసుకోవడం వల్ల కాళ్లపై ఒత్తిడి పడి పొట్టకు రక్త సరఫరా పెరుగుతుంది. జీర్ణశక్తి మెరుగవుతుంది.

- జీర్ణాశయాన్ని మూడు భాగాలుగా భావించి రెండు భాగాలే ఆహారం తీసుకోవాలి. మిగతాది ఖాళీగా ఉంచాలి
- చాలా మంది భోజనం చేసిన వెంటనే మళ్లీ ఏదో ఒక చిరుతిండి తింటారు. ఇది ఉడికే అన్నంలో బియ్యం వేయడం లాంటిదే.
- కొందరు అన్నం పూర్తిగా తిన్నాక ఒకేసారి నీళ్లు తాగుతుంటారు. దానికన్నా భోజనం చేసేటప్పుడు కొద్దికొద్దిగా నీళ్లు తాగడం మేలు చేస్తుంది.




పొట్టను నింపేయొద్దు!

- 3-4 గంటల విరామం తర్వాతే మళ్లీ ఏదో ఒకటి తినాలి.
- రాత్రి భోజనాన్ని వీలైనంత త్వరగా ముగించాలి.
- సమయానికి ఆకలి, దాహం, రుచి లేని తేన్పులు రావటం, మల విసర్జన సాఫీగా కావడం..ఈ లక్షణాలన్నీ ఆహారం సరిగా జీర్ణమవుతోందనడానికి సూచనలు.

గుటుక్కుమనిపించొద్దు...

- ముద్ద పెట్టుకోగానే చాలా మంది గుటుక్కున మింగుతారు.
- అలా కాకుండా కనీసం 15 నుంచి 20 సార్లు నమిలి మింగాలి.
- లెక్కపెట్టుకోలేమనుకుంటే... ఆహారం ద్రవరూపంలోకి మారే దాకా నమలాలి. ఇలా చేస్తే సగం నోట్లోనే జీర్ణమయ్యి పొట్ట మీద భారం తగ్గుతుంది.
- సరిగ్గా నమలకపోవడం వల్ల తిన్నది జీర్ణంకావడానికి చాలా సమయం పడుతుంది.
- కచ్చాపచ్చాగా నమిలిన ఆహారం ఎక్కువ సేపు కడుపులో ఉండటంతో పులి తేన్పులు, గ్యాస్ట్రిక్ సమస్యలు వస్తాయి.



- ఈనాడు, అమరావతి

మీ ప్లేట్‌లో ఏముంది?

- కంచాన్ని నాలుగు భాగాలు చేసుకోవాలి. 50 శాతం కూరగాయలు, ఆకుకూరలు, సలాడ్‌లు ఉండాలి. మిగతా 25 శాతం ప్రొటీన్, మరో పావువంతు కార్బోహైడ్రేట్లు ఉండేలా చూసుకోవాలి. దీన్నే హెల్దీ ప్లేట్ అంటాం.
- మనలో ఎక్కువ మంది పెద్ద ప్లేట్‌లో అన్నం పెట్టుకుని ఏదో ఓ మూల కొంచెం కూర వేసుకుంటాం. అలా కాకుండా ఈసారి నుంచి ప్లేట్‌లో ముందు కూర వడ్డించుకోండి. అందులో సగం అన్నం పెట్టుకొని తినండి. దీని వల్ల కార్బోహైడ్రేట్లు తగ్గి పీచు శాతం పెరుగుతుంది.

-వినీత మామిళ్ల, పోషకాహార నిపుణురాలు



అబ్బ.. ఏం పెరిగాయి!



చూడగానే ఈ చెట్లు భవనాన్ని దాటి పెరిగాయనిపిస్తోంది కదూ! కానీ ఇవి హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని కళాజ్యోతి ప్రాసెస్ భవనం ఐదో అంతస్తుపై ఉన్న టెర్రస్ గార్డెన్‌లోనివి. సాధారణంగా మిద్దెపై పది అడుగుల వరకు ఎత్తున్న చెట్లు పెంచుతుంటారు. ఇక్కడ మాత్రం కాండం సన్నగా ఉండి ఏకంగా 80-100 అడుగుల ఎత్తు పెరిగే అరికా కాటేచు అనే ఫిలిప్పీన్స్‌కు చెందిన తాటిజాతి(మనం వక్క చెట్లని పిలుస్తాం) చెట్లను, ఆస్ట్రేలియాకు చెందిన ఫాక్స్ టైల్ తాటిచెట్లను ఏర్పాటు చేశారు. ఉక్కు వంతెన పైనుంచి వెళ్లేవారు వీటిని చూసి మిద్దెపై ఇంత పెద్ద చెట్లా అని ఆశ్చర్యపోతున్నారు.
-ఈనాడు, హైదరాబాద్

కోరింగలో కొత్తందాలు!

అంతరించిపోతున్న పక్షి జాతుల్లో ఇండియన్ స్కిమ్మర్ ఒకటి. జలవనరులపై తక్కువ ఎత్తులో ఎగురుతూ కింది దవడతో నీటిని చీల్చుకుంటూ చేపలను వేటాడడం వీటి ప్రత్యేకత. మధ్యప్రదేశ్‌లోని చంబల్, ఒడిశాలోని మహానది పరిసరాల్లో సంతానోత్పత్తి కోసం స్థావరాలు ఏర్పాటు చేసుకుంటాయి. శీతాకాలంలో ఆహారం కోసం తెలుగు రాష్ట్రాల్లోని తీరప్రాంత నదీ ముఖద్వారాల వద్దకు వస్తాయి. కాకినాడ జిల్లా కోరింగ అభయారణ్యం, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని భైరవపాలెం ప్రాంతాల్లో కొన్ని రోజులుగా కనువిందు చేస్తున్నాయి. చాకు లాంటి రెక్కలతో.. ఎర్రటి పదునైన ముక్కుతో గుంపులుగా వేటసాగిస్తున్నాయి. ఇసుకలో గూళ్లు కట్టుకొని, సేదదీరుతున్నాయి. వీటిని వేటాడడం నేరమని డీఎఫ్‌వో రామచంద్రరావు చెప్పారు.
– ఈనాడు, కాకినాడ





గిత్తల్లో మొనగాడు!

పొట్టిగా.. చిన్నగా కనిపిస్తున్న ఈ పుంగనూరు గిత్తను వెన్నెకై జాతీయ పాడి అభివృద్ధి సంస్థ (ఎన్‌డీడీబీ) రూ.3 లక్షలకు కొనుగోలు చేసింది. ఈ గిత్త వీర్యం చాలా నాణ్యమైనదని తేలడంతో ఆ డబ్బు చెల్లించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం సమనసకు చెందిన మంచిగంటి మహేష్ ఏడాది క్రితమే రూ.లక్ష పెట్టి కొని, దానికి రావణ్ అని పేరు పెట్టి పెంచుకుంటున్నారు. ఇదే క్రమంలో మంచి పుంగనూరు గిత్తల గురించి ఆరా తీస్తున్న వెన్నెల ఎన్‌డీడీబీ ప్రతినిధుల దృష్టిలో ఇది పడింది. వెంటనే దాని



వీర్యాన్ని సేకరించి, పరీక్షించి.. కొనుగోలు చేసి గురువారం తమ వెంట తీసుకెళ్లారు. గిత్త వయసు నాలుగేళ్లు.
– న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

పోస్టర్ @ రూ.35 కోట్లు



స్టార్ వార్స్ సినిమాను 50 ఏళ్ల క్రితం ప్రపంచానికి పరిచయం చేసిన పెయింటింగ్ వేలంలో దాదాపు రూ.35.2 కోట్లకు అమ్ముడుపోయింది. గురువారం డాలస్‌లో ఈ వేలం జరిగింది. సినిమా పోస్టర్ డిజైనర్ టామ్ జంగ్ ఈ పెయింటింగ్‌ను వేశారు. వేలంలో దీన్ని కొన్న వారు తమ వివరాలను వెల్లడించలేదు. -వాషింగ్టన్

మహిళలను చూసే దృక్కోణంలో మార్పు రావాలి

- సమాన అవకాశాలు, గౌరవం, సమానత్వం అవసరం
- కుటుంబం అందించిన ధైర్యం వల్లే ఈ స్థాయికి చేరుకున్నా
- ఉమెన్ 5.0 సదస్సులో మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్



సదస్సులో ప్రసంగిస్తున్న మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్. వేదికపై కోటిరెడ్డి, విజయలక్ష్మి, ప్రొ.రాజ్యలక్ష్మి, దీపా శ్రీనివాస్

ఈనాడు, హైదరాబాద్– శంకర్‌పల్లి, న్యూస్‌టుడే: సమాజంలో మహిళలను చూసే దృక్కోణం మారాలని మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్ అన్నారు. ప్రస్తుతం మహిళలు శక్తిమంతంగా మారుతున్నారని, అన్ని రంగాల్లోనూ రాణిస్తూ మార్గదర్శకుల్లా నిలుస్తున్నారని తెలిపారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలోని ఇక్ఫాయ్ యూనివర్సిటీలో గురువారం నిర్వహించిన ఉమెన్ 5.0 (పవర్.. ప్రోగ్రెస్.. పాజిబిలిటీస్) సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కాలం మారుతున్నకొద్దీ మహిళల ఆలోచనల్లో మార్పులొస్తున్నాయని, పురుషులకు దీటుగా పనిచేస్తున్నారని అన్నారు. వారికి సానుభూతి అవసరం లేదని... గుర్తింపు కావాలని చెప్పారు. మహిళలకు గౌరవం, రక్షణ అనేవి చట్టాల వల్ల రావని... ఇల్లు, కుటుంబం, సమాజం దృక్పథంలో మార్పుతోనే అవి సాధ్యమని పేర్కొన్నారు. కుటుంబంలోని తండ్రి, భర్త, పిల్లలు అండగా నిలిస్తే మహిళలు కొండంత ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేసుకోవడంతో పాటు ప్రపంచాన్ని ధైర్యంగా ఎదుర్కొంటారని వివరించారు. తన కుటుంబం అందించిన ధైర్యం వల్లే తాను ఈ స్థాయికి చేరుకున్నానని శైలజా కిరణ్ తెలిపారు. మార్గదర్శి చిట్‌ఫండ్ సంస్థ రూ.100 కోట్ల టర్నోవర్ నుంచి ప్రస్తుతం రూ.12,000 కోట్ల టర్నోవర్‌కు చేరుకుందని, నాలుగు రాష్ట్రాల్లో 129 శాఖలు నిర్వహిస్తున్నామని వివరించారు.

స్ఫూర్తి ప్రదాతలు... సృజనశీలురు...

చరిత్ర గతిని మార్చిన మహిళలు, చరిత్ర సృష్టించిన మహిళలతో పాటు ఎంతోమంది స్ఫూర్తి ప్రదాతలున్నారని శైలజా కిరణ్ అన్నారు. విద్యతోనే అన్ని లభిస్తాయన్న దూరదృష్టితో సావిత్రీబాయి పులే 1846లోనే బాలికా విద్యను ప్రోత్సహించారని గుర్తుచేశారు. పురుషాధిక్య సమాజంలో మహిళా ఇంజినీర్‌గా టెల్కోలో ప్రస్థానం ప్రారంభించిన సుధామూర్తి ప్రస్తుతం ఇన్ఫోసిస్‌కు వెన్నెముకగా మారారని చెప్పారు. క్షిపణుల తయారీలో తనదైన ముద్ర వేసిన డాక్టర్ టెస్సీ థామస్ జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. భవిష్యత్తులో రాజకీయాలు, శాస్త్ర సాంకేతిక, క్రీడా రంగాల్లో మహిళల పాత్ర పెరగనుందని, విధానపరమైన నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదగనున్నారని పేర్కొన్నారు. యువతులు, మహిళలు సొంతంగా ఎదగడంతో ఆగిపోకుండా వ్యాపార రంగాల్లో ఇతరులకు మార్గదర్శకంగా ఉండేలా కొత్తదారులు వేస్తున్నారని శైలజా కిరణ్ అన్నారు. ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో కనీసం 10 శాతం కంపెనీలకు మహిళలు సీఈవోలుగా ఉన్నారని, కొత్తగా సంస్థలు స్థాపిస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని తెలిపారు. యాభై ఏళ్ల వయస్సులో నైకా సంస్థను స్థాపించిన ఫల్గుణి నాయర్, యువ పారిశ్రామికవేత్త రోష్నీ నాడార్ మల్హోత్రా ఇందుకు తాజా ఉదాహరణలని పేర్కొన్నారు. మహిళలు నాయకత్వం వహిస్తే సమాజం ఎదుగుతుందని, వారు రాణిస్తే పరిశ్రమలు పెరుగుతాయని, మరిన్ని విజయాలు సాధిస్తే దేశం అగ్రపథాన దూసుకెళ్తుందని పేర్కొన్నారు. సదస్సులో హైదరాబాద్ ఐఐటీ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ... సాంకేతికత మార్పు చెందుతున్నకొద్దీ వస్తున్న అధునాతన మార్పుల్లో మహిళల పాత్రను ఆమె వివరించారు. ఇక్ఫాయ్ విశ్వవిద్యాలయం డీన్ సునీతారాణి మాట్లాడుతూ.. సమాజంలో మహిళలు పురోగతి సాధిస్తున్నప్పటికీ ఇంకా అనేక సవాళ్లు ఉన్నాయని తెలిపారు. ఇన్‌ఛార్జి ఉపకులపతి కోటిరెడ్డి మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడం, శ్రామికశక్తిలో వారి చురుకైన భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ ఎస్.విజయలక్ష్మి స్వాగతోపన్యాసం చేశారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ విమెన్స్ స్టడీస్ ప్రొఫెసర్ దీపా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆమెకు 80.. ఆయనకు 90

క్రీడా పతకాలు లెక్కలేనన్ని



తమిళనాడులోని కోయంబత్తూర్‌కు చెందిన లోగనాథన్, లక్ష్మి దంపతులు క్రీడల పోటీల్లో సాధించిన పతకాలతో వారింటి అల్మారాలు నిండిపోయాయి. లోగనాథన్ ఒక ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో, లక్ష్మి ప్రభుత్వ బాలికల పాఠశాలలో పీఈటీలుగా పనిచేసి పదవీ విరమణ పొందారు. ఉద్యోగాల నుంచి రిటైర్డ్ అయినా క్రీడలపై ఈ దంపతులకున్న ఆసక్తి తగ్గలేదు. లోగనాథన్ రాష్ట్ర, జాతీయస్థాయిలో పలు సీనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని వందల పతకాలు, అనేక ట్రోఫీలను గెలుచుకున్నారు. రెండుసార్లు ఆసియా క్రీడల్లో పాల్గొని పతకాలు సాధించారు. ఆయన సాధించిన బంగారు పతకాలను బంగారు గాజులుగా మార్చి చేతికి ధరిస్తున్నట్లు లక్ష్మి తెలిపారు. ఇప్పుడు తనకు 90 ఏళ్లు రావడంతో క్రీడా పోటీల్లో పాల్గొనడం మానేశానని, లక్ష్మి మాత్రం 80 ఏళ్ల వయసులోనూ వివిధ దేశాలకు ప్రయాణిస్తూ ఇప్పటికీ పతకాలు సాధిస్తున్నట్లు లోగనాథన్ తెలిపారు. ఫిన్లాండ్‌లో జరిగిన అంతర్జాతీయ సీనియర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో మూడోస్థానంలో నిలిచారు. ఇప్పటికీ నిత్యం యోగా, వ్యాయామాలతో వీరు దేహ దృఢత్వాన్ని కాపాడుకొంటున్నారు.
–ఈటీవీ భారత్

'పంచ్ ఏఐ'తో పురపాలకశాఖ అవగాహన ఒప్పందం

ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు వెల్లడి

ఈనాడు, అమరావతి: 'పంచ్ ఏఐ' సంస్థతో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ గురువారం అవగాహన ఒప్పందం చేసుకున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఈ ఒప్పందం రిటైల్ రంగంలో పట్టణ ప్రాంతాల్లోని డ్వాక్రా సభ్యుల ఉత్పాదకతను పెంచేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఈ వివరాలను ఆయన ఎక్స్ వేదికగా వెల్లడించారు.



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం సంగారెడ్డి జిల్లా బుదేరాలోని వోక్సెన్ యూనివర్సిటీలో ఫుట్‌బాల్ ఆడుతున్న దృశ్యమిది. ఈ నెల 13న ఉప్పల్ స్టేడియంలో నిర్వహించే మ్యాచ్‌లో దిగ్గజ ఫుట్‌బాల్ క్రీడాకారుడు మెస్సితో కలిసి.. రేవంత్‌రెడ్డి ఆడనున్నారు.– ఈనాడు, సంగారెడ్డి


'అంబారీ'కి జైకొట్టండి

- సినీ దర్శకుడు కృష్ణవంశీ
- ఆకెళ్ల శివప్రసాద్ రచించిన నవల ఆవిష్కరణ



నవలను ఆవిష్కరిస్తున్న కృష్ణవంశీ. చిత్రంలో రచయిత ఆకెళ్ల

హైదరాబాద్, న్యూస్‌టుడే: సనాతన ధర్మ పరిరక్షణ లక్ష్యంగా భారతీయత, దైవభక్తి, దేశభక్తిని చాటుతున్న 'అంబారీ' నవలకు జైకొట్టాలని సినీ దర్శకుడు కృష్ణవంశీ అన్నారు. కథా రచయిత, నవలాకారుడు ఆకెళ్ల శివప్రసాద్ రచించిన అంబారీ నవలను గురువారం హైదరాబాద్‌లో ఆయన ఆవిష్కరించి ప్రసంగించారు. రంగమార్తాండ, కన్నప్ప, ఆ నలుగురు వంటి విలక్షణ సినిమాలకు మాటలందించిన ఆకెళ్ల కలం నుంచి జాలువారిన అద్భుత నవలగా అంబారీని అభివర్ణించారు. ఈ నవలలోని కథ విశేషంగా ఆకట్టుకుంటుందన్నారు. భూబకాసురుల పంజాలో ప్రాచీన దేవాలయాలు ధ్వంసమవుతున్న నేపథ్యం, హత్యాకాండలు జరుగుతున్న ఘోర వాతావరణం నవలలో ఆవిష్కృతమైందన్నారు. ఆకెళ్ల శివప్రసాద్ మాట్లాడుతూ.. సాంస్కృతిక పూర్వవైభవానికి 'నేను సైతం' అంటూ ఎవరో ఒకరు ముందుకు రావడం ప్రేరణగా నవల రాసినట్లు చెప్పారు.



శీనన్నా.. అదిరిందన్నా!

కల్లు గీయడానికి మోకు సాయంతో తాటి చెట్లు ఎక్కడం ఒక ప్రత్యేక నైపుణ్యం. అందులో ఉన్న రిస్క్ దృష్ట్యా ఈ కాలంలో మోకు సాయంతో చెట్లు ఎక్కేవారు తగ్గిపోతున్నారు. ఈ నేపథ్యంలో ఓ గీత కార్మికుడు తాటి చెట్లకు ఇలా నిచ్చెన ఏర్పాటు చేసుకున్నారు. దీంతో సౌకర్యంగా చెట్లు ఎక్కి కల్లు తీస్తున్నారు. తెలంగాణలోని రాజన్న సిరిసిల్ల జిల్లా చీర్లవంచకు చెందిన నేరెళ్ల శ్రీనివాస్‌గౌడ్.. అత్తగారి ఊరైన ధూల్మిట్ట మండలం లింగాపూర్‌లో నివసిస్తున్నారు. ఈ ఊరిలో చెట్లెక్కి కల్లు తీసేవారు లేకపోవడంతో గ్రామస్థులు ఆయనకు అవకాశమిచ్చారు. కల్లుగీతతో పాటు వెల్డింగ్ పని తెలిసిన శ్రీనివాస్‌గౌడ్.. కల్లు గీసే ఒక్కో చెట్టుకు రూ.5 వేల చొప్పున ఖర్చు చేసి.. ఇనుప పట్టీలు తెచ్చి సొంతంగా వెల్డింగ్ పనిచేసి బిగించారు. ఒక్కో చెట్టుకు నాలుగు నెలల పాటు కల్లు వస్తుందని.. 20 రోజుల అమ్మకంతోనే ఈ ఖర్చులు కలిసొస్తాయని చెప్పారు. – న్యూస్‌టుడే, చేర్యాల

పొక్లెయిన్ల ఖానాపురం

మంచి పేరు తెచ్చుకోవడం, ప్రత్యేక గుర్తింపు సాధించడం సాధారణ విషయాలేమీ కావు. తెలంగాణలోని ఖమ్మం జిల్లా ముదిగొండ మండలంలోని ఖానాపురం గ్రామం సైతం ప్రత్యేక గుర్తింపు సాధించింది. 181 ఇళ్లు ఉన్న ఈ చిన్న గ్రామంలో 70 మందికి పైగా పొక్లెయిన్ ఆపరేటర్లుగా పనిచేస్తుండగా.. ఈ గ్రామస్థులకు సొంతంగా 40 పొక్లెయిన్లు ఉన్నాయి. దీంతో పొక్లెయిన్ సేవలకు, ఆపరేటర్లకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది ఖానాపురం. గ్రామ సమీపంలో పెద్దసంఖ్యలో క్వారీలు ఉండడం, ముదిగొండలో గ్రానైట్ పరిశ్రమలు ఉండడంతో వాటిలో పనులకు 25 ఏళ్ల క్రితం నుంచే పొక్లెయిన్లు వినియోగించేవారు. గ్రామ యువత పొక్లెయిన్ ఆపరేటర్లుగా చేరి.. ఆయా పనుల్లో నైపుణ్యం సాధించి ఈ వృత్తిలో స్థిరపడిపోయారు. 40 మంది సొంతంగా కొనుగోలు చేసి.. వివిధ జిల్లాల్లో పనులు చేస్తున్నారు.
–న్యూస్‌టుడే, ముదిగొండ



'అఖండ-2' టికెట్ ధరల పెంపు నిలిపివేత

- తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

ఈనాడు, హైదరాబాద్: అఖండ-2 సినిమా ప్రీమియర్ షోకు, 12వ తేదీ నుంచి టికెట్ ధరల పెంపునకు అనుమతిస్తూ ఇచ్చిన మెమోను తెలంగాణ హైకోర్టు గురువారం సస్పెండ్ చేసింది. సినిమా టికెట్ ధరల పెంపునకు అనుమతిస్తూ ఎలాంటి మెమోలు జారీ చేయరాదంటూ ఇదే సినిమా గురించి 9న స్పష్టమైన ఉత్తర్వులిచ్చినా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించింది. మెమో జారీ చేసిన ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిపై కోర్టు ధిక్కరణ చర్యలు ఎందుకు చేపట్టకూడదంది. జీవో 120 ప్రకారమే టికెట్ ధరలుండాలంటూ డివిజన్ బెంచ్, సెప్టెంబరు 19న ఈ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులకు విరుద్ధంగా మెమో ఎలా జారీ చేస్తారంది. టికెట్ల పెంపు విషయం ఇక్కడ పెండింగ్‌లో ఉండగా ఉత్తర్వులివ్వడంపై నిలదీసింది. ప్రతి సినిమాకూ ఇదే తంతా? అని ప్రశ్నించింది. అఖండ-2 సినిమా టికెట్ ధరల పెంపుపై దాఖలైన మూడు పిటిషన్లపై జస్టిస్ ఎన్.వి.శ్రవణ్‌కుమార్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ గురువారం సాయంత్రం అఖండ-2 ప్రీమియర్ షో టికెట్ ధర రూ.600 నిర్ణయించి.. ఆన్‌లైన్ ద్వారా కాకుండా నగదుకు విక్రయిస్తున్నారన్నారు. 12 నుంచి 15వ తేదీ వరకు సింగిల్ స్క్రీన్ రూ.50, మల్టీప్లెక్స్‌లు 100 వరకు పెంచుకోవడానికి అనుమతించారన్నారు. న్యాయమూర్తి స్పందిస్తూ ఇది కచ్చితంగా కోర్టు ధిక్కరణేనని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ న్యాయవాది మహేశ్ రాజె జోక్యం చేసుకుంటూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కొత్తగా బాధ్యతలు తీసుకున్నారని, గత ఉత్తర్వుల విషయం తెలియకపోయి ఉండవచ్చన్నారు. వివరాలతో కౌంటరు దాఖలు చేస్తామన్నారు. వాదనలు విన్న ధర్మాసనం మెమో అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ఈ ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయడానికి ఉత్తర్వుల కాపీని స్పెషల్ చీఫ్ సెక్రటరీకి మెయిల్ ద్వారా పంపాలని రిజిస్ట్రీని ఆదేశించింది. రాష్ట్ర హోంశాఖ ముఖ్యకార్యదర్శి, పోలీసు కమిషనర్లకు నోటీసులిచ్చింది. 14 రీల్స్ ప్లస్ ఎల్‌ఎల్‌పీ, బుక్ మై షోలకు ఈమెయిల్ ద్వారా నోటీసులు అందజేయాలని ఆదేశిస్తూ విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

(c) eenadu



మీకు తెలుసా?

తల్లులు తమ పిల్లల్ని ఎక్కువగా ఎడమవైపునే ఎత్తుకుంటారట. ముఖ్యంగా తొలినెలల్లో. ఎందుకంటే ఎడమ భాగంలోని ఇంద్రియ, భావోద్వేగ సమాచారమంతా కుడి మెదడులోనే ప్రాసెస్ జరుగుతుంది. కాబట్టి, ఎడమవైపున ఎత్తుకుని గమనించడం వల్ల బిడ్డకు సంబంధించిన సమాచారం మరింత సమర్థంగా కుడివైపునకు ప్రసారమవుతుందట. అందుకే ఈ ఏర్పాటు అంటున్నాయి పరిశోధనలు.



మహిళలు లింగభేదం గురించి ఆలోచించకుండా సామర్థ్యం మీదే దృష్టిపెట్టాలి. సవాళ్లనే అలవాటుగా మార్చుకోవాలి. అప్పుడు విజయం తథ్యం. అయితే, నిజమైన విజయం... సంపద కాదు, ఇతరులకు మీరు అందించే సహకారమే అన్నది మర్చిపోకండి.

– జయశ్రీ ఉల్లాల్, అరిస్టా నెట్‌వర్క్స్ ఛైర్ పర్సన్, సీఈఓ

వసుంధర

vasundhara@eenadu.in

వీళ్లు... శక్తిమంతులు!

స్వేచ్ఛా వాణిజ్యంపై ప్రపంచ దేశాలతో కీలక ఒప్పందాలు చేసుకోవడం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధ సమయంలో యూరోపియన్ దేశాలను ఒక్కతాటిపై నడిపించగలగడం ఉర్సులా వాన్ డెర్ లేయన్ శక్తిసామర్థ్యాలకు ప్రతీక. కొవిడ్ తర్వాత యూరోపియన్ దేశాల్లో ధరల పెరుగుదలను నియంత్రించడంతోపాటు పిల్లల సంరక్షణ, సమానవేతనాల కోసం పాలసీలెన్నో తెచ్చారు క్రిస్టీన్ లగార్డే. ఇవన్నీ వీళ్ల సామర్థ్యాలకు మచ్చుతునకలు. ఇంకా వీళ్ల ప్రయాణంలో ఘనతలు చాలానే! కాబట్టే, ఫోర్బ్స్ 2025 శక్తిమంతురాళ్ల జాబితాలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు.

ఆ సామర్థ్యమే మొదటి స్థానంలో నిలిపింది..!

యూరోపియన్ గ్రీన్ డీల్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఉక్రెయిన్‌కి మద్దతు, రక్షణ వ్యయం పెంపుతోపాటు సుమారు 45 కోట్లమంది యూరోపియన్ జీవితాలను ప్రభావితం చేసే పలు కీలక నిర్ణయాలు తీసుకోవడంలో ఉర్సులా దిట్ట. బెల్జియం రాజధాని బ్రసెల్స్‌లోని ఇక్సెల్స్‌లో జన్మించారు ఉర్సులా ఆల్‌బ్రెక్ట్. ఆమె తండ్రి ఎర్నెస్ట్ ఆల్‌బ్రెక్ట్ యూరోపియన్ యూనియన్ మొదటితరం ఉద్యోగుల్లో ఒకరు. ఆమె బాల్యం జర్మన్, ఫ్రెంచ్ భాషలు మాట్లాడే వాతావరణంలో గడిచింది. తర్వాత తండ్రి రాజకీయాల్లోకి రావడంతో వారి కుటుంబం జర్మనీలోని హనోవర్ ప్రాంతానికి మారింది.

మారు పేరుతో...

ఉర్సులా... గోటింగెన్ యూనివర్సిటీలో ఆర్థిక శాస్త్రం చదువుతున్న సమయంలో జర్మనీలో వామపక్ష ఉగ్రవాద భయం తీవ్రంగా ఉండేది. రెడ్ ఆర్మీ ఫ్రాక్షన్ (ఆర్ఏఎఫ్) ఆమెను కిడ్నాప్ చేయాలి అనుకుంటోందని ఉర్సులా కుటుంబానికి సమాచారం అందింది. దాంతో ఆమెను లండన్ పంపించేశారు. ఏడాది పాటు స్కాట్లాండ్ యార్డ్ రక్షణలో రోజ్ లాడ్‌సన్ అనే మారు పేరుతో గడిపారట. అక్కడే లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో చేరారు. చదువయ్యాక జర్మనీ తిరిగి వచ్చినా చాలా సంవత్సరాలు సెక్యూరిటీ గార్డుల నీడలోనే జీవించారు. కొన్నాళ్లయ్యాక హనోవర్ మెడికల్ స్కూల్‌లో వైద్యవిద్యలో పట్టా అందుకున్నారు. విమెన్‌హెల్త్‌లో స్పెషలైజేషన్ చేశారు. తన తోటివైద్యుడు డాక్టర్ హైకో వాన్ డెర్ లేయన్‌ను పెళ్లి చేసుకున్నారు. ఈ దంపతులకు ఏడుగురు సంతానం.



తొలి మహిళా రక్షణ మంత్రి...

1990లో క్రిస్టియన్ డెమొక్రటిక్ యూనియన్‌లో చేరారీమె. 2003లో లోయర్ సాక్సనీ రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. 2005లో ఏంజెలా మెర్కెల్ క్యాబినెట్‌లో ఫ్యామిలీ అఫైర్స్ మినిస్టర్‌గా నియమితులై, చైల్డ్ అడ్వాన్స్‌మెంట్ యాక్ట్, పేరెంటల్ లీవ్ స్కీమ్ వంటి సంస్కరణలు తీసుకొచ్చారు. 2009-13 మధ్య కార్మికశాఖా మంత్రిగా కనీస వేతనం, స్వలింగ సంపర్కుల వివాహం, ఇమ్మిగ్రేషన్ సంస్కరణలకు మద్దతిచ్చారు. జర్మనీ చరిత్రలో తొలి మహిళా రక్షణ మంత్రిగా పనిచేసిందీ ఉర్సులానే. రక్షణ మంత్రిగా బుండెస్వెర్ (జర్మన్ ఆర్మీ)ను ఆధునికీకరణ చేశారు. రక్షణ బడ్జెట్‌ను 1.3శాతం జీడీపీకి పెంచి, 7,000 మంది సైనికులను నియమించారు. అఫ్గానిస్థాన్, ఇరాక్ వంటి సంక్షోభాల్లో యూరప్ ఐక్యతకు మద్దతిచ్చారు. 2019లో యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఆ స్థానంలో కూర్చున్న తొలి మహిళ, రెండో జర్మన్ వ్యక్తి కూడా. 2024లో రెండోసారి ఎన్నికయ్యారు. ఈ పదవిలో 2029 వరకూ ఉంటారు. ఈ కృషే ఆమెను 2022 నుంచి వరుసగా ఫోర్బ్స్ జాబితాలో నిలుపుతుంది. ఈ ఏడాది మొదటి స్థానం అందుకునేలా చేసింది.

న్యాయం చదివిన ఆర్థికవేత్త!

క్రిస్టీన్ లగార్డే... పేరు వినగానే గొప్ప ఆర్థికవేత్త అనేస్తారు. ప్రపంచవ్యాప్తంగా ఆమెకంత గుర్తింపు. కానీ ఆమె ఎకనామిక్స్, ఫైనాన్స్ పాఠాలే చదవలేదు. తను ఓ లాయర్. అయితేనేం, ప్రపంచ ఆర్థికవ్యవస్థ మీద తనదైన ముద్ర వేశారు క్రిస్టీన్. పారిస్‌లో జన్మించారీమె. తల్లిదండ్రులిద్దరూ టీచర్లే. పారిస్ నాంటెర్ యూనివర్సిటీలో లా డిగ్రీ పట్టా పొందిన క్రిస్టీన్ తరవాత లేబర్ లా ప్రధానాంశంగా మాస్టర్స్ చేశారు. ఇంగ్లిష్‌లో మాస్టర్స్ పూర్తిచేసిన ఆమె ఫ్రెంచ్, స్పానిష్‌లోనూ అనర్గళంగా మాట్లాడగలరు. చదువవ్వగానే చికాగోకు చెందిన 'బేకర్ మెకంజీ' అనే అంతర్జాతీయ లా సంస్థలో లాయర్‌గా కెరియర్ ప్రారంభించారు. 31ఏళ్ల వచ్చేనాటికి సంస్థ ఎగ్జిక్యూటివ్ కమిటీలో స్థానం సంపాదించారు. అలా నిలిచిన తొలి మహిళ క్రిస్టీన్. తరవాత ఆ కమిటీకి ఛైర్‌పర్సన్ అయ్యారు... అదీ రెండుసార్లు! తొలి ఫిమేల్ గ్లోబల్ ఛైర్‌గానూ నిలిచారు. 2005లో ఫ్రెంచ్ రాజకీయాల్లోకి అడుగుపెట్టారీమె. ఫైనాన్స్ మినిస్టర్‌గా పగ్గాలు అందుకున్న తొలి మహిళగానూ చరిత్ర సృష్టించిన క్రిస్టీన్... ఫారెన్ ట్రేడ్, అగ్రికల్చర్ అండ్ ఫిషరీస్ శాఖలకీ మంత్రిగా చేశారు. ఆర్థిక మాంద్యం సమయంలో ఆమె తీసుకున్న ప్రభావవంతమైన నిర్ణయాలు ప్రపంచ దృష్టిని ఆకర్షించాయి.



గ్లోబల్ లీడర్‌గా

తరవాత ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ (ఐఎంఎఫ్). .. మేనేజింగ్ డైరెక్టర్ పగ్గాలు అందుకున్నారు క్రిస్టీన్. ఎనిమిదేళ్లు ఈ హోదాలో కొనసాగారు. యూరప్ రుణ సంక్షోభానికి అడ్డుకట్ట వేయడం, సురక్షిత బ్యాంకింగ్ రూల్స్, నష్టపోతున్న దేశాలను ఆర్థికంగా ఆదుకోవడం వంటివెన్నో చేశారు... గ్లోబల్ లీడర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు క్రిస్టీన్. ఆపై యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ (ఈసీబీ)కి ప్రెసిడెంట్ అయ్యారు. కరోనా తరవాత ధరలు పెరగకుండా ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నారు. ఎకానమీ పెరుగుదలలో మహిళ పాత్రా ఎక్కువే అని నమ్మే ఈమె పిల్లల సంరక్షణ, సమాన వేతనాలు వంటి ఎన్నో పాలసీలూ తీసుకొచ్చారు. గ్రీన్ ఎనర్జీనీ ప్రోత్సహిస్తున్నారు.

పదహారేళ్ల వయసులో తండ్రిని కోల్పోయారు క్రిస్టీన్. కుటుంబానికి అండగా నిలవాల్సిన పరిస్థితి. అదే తనని దృఢమైన, స్వతంత్ర భావాలున్న వ్యక్తిగా నిలిపిందంటారామె. ఫ్రాన్స్‌లో టాప్ సివిల్ సర్వీస్ స్కూల్లో చదవాలనుకున్నారు. అక్కడ చదివితే పెద్ద స్థాయి ప్రభుత్వ ఉద్యోగాలు దక్కుతాయని నమ్ముతారు. కానీ ప్రవేశమే దక్కలేదు. అయితేనేం, కోరుకుంటే ఎవరైనా అనుకున్నది సాధించొచ్చని నిరూపించారు. ఎకనామిక్స్ నేపథ్యం లేకుండా మంత్రి, ఐఎంఎఫ్, ఈసీబీ బాధ్యతలు తీసుకున్నప్పుడూ ఎన్నో సవాళ్లు, అనుమానాలు, లింగవివక్ష. పైగా ఇద్దరు పిల్లల ఒంటరి తల్లి. అయినా తన సమర్థతతో నిరూపించుకుంటూ ముందుకు సాగారు. ప్రపంచవ్యాప్త నాయకురాళ్లలో ఒకరిగా గుర్తింపు పొందారు. కాబట్టే, తాజాగా ఫోర్బ్స్ కూడా ప్రపంచ వ్యాప్తంగా శక్తిమంతురాళ్ల జాబితాలో రెండో స్థానంలో క్రిస్టీన్‌కి చోటిచ్చింది.



చలికాలానికి... చిలగడ దుంప..

చలికాలం వచ్చిందంటే ఆలస్యంగా నిద్రలేవడం, బద్ధకంగా ఉండటం, ఆకలి తగ్గడం వంటివి కనిపిస్తాయి. అంతేకాదు, బయట పడిపోతున్న ఉష్ణోగ్రతల నుంచి మనల్ని వెచ్చగా ఉంచడానికి మన శరీరం ఎక్కువ శక్తినీ ఖర్చు చేస్తుంది. దాంతో రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది. అందుకే మనం తినే ఆహారం మన శక్తిస్థాయుల్ని పెంచాలి. జీర్ణక్రియను మెరుగుపరిచి, సీజనల్ ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడేదిగా ఉండాలి. ఇందుకు చిలగడ దుంప మంచి ఎంపిక. దీంతో చాలా ఆరోగ్య ప్రయోజనాలున్నాయి.

- చిలగడ దుంపలో విటమిన్ ఎ, సి, బీటా కెరోటిన్ పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. శ్వాసకోశ గోడలకు రక్షణ కల్పించి వైరల్ ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ కల్పిస్తాయి.
- దీనిలో ఉండే కార్బోహైడ్రేట్లు మన శరీరానికి కావాల్సిన శక్తిని నెమ్మదిగా విడుదల చేస్తాయి. దాంతో శీతకాలంలో వచ్చే అలసటను దూరం చేసి చురుకుగా ఉండేందుకు సహకరిస్తాయి.
- వాతావరణం చల్లగా ఉందని నీరు తక్కువగా తాగుతాం. దాంతో చర్మం పొడిబారుతుంది. అయితే ఇందులో ఎక్కువగా ఉండే నీటిశాతం వల్ల శరీరం డీహైడ్రేషన్‌కి గురికాదు.
- చిలగడదుంపలో ఉండే పీచుపదార్థం జీర్ణక్రియను పెంచుతుంది. పేగులో మంచి బ్యాక్టీరియాను వృద్ధి చేసి గట్‌హెల్త్‌ను ప్రోత్సహిస్తుంది.
- యాంటీ ఆక్సిడెంట్లు, ఆంథోసైనిన్లు సమృద్ధిగా ఉండే స్వీట్ పొటాటో వృద్ధాప్య ఛాయల్ని తగ్గిస్తుంది. చర్మాన్ని మృదువుగా చేసి, సహజ మెరుపునిస్తుంది. అందుకే దీన్ని, సూప్‌చేసి లేదా ఉడికించి చిరుతిండిగా తీసుకుంటే మంచిది.

వేడి చేసిందేమో అనుకుంటే...

మా పాపకి 16 ఏళ్లు. ఈ మధ్య మూత్రం పోస్తోంటే నొప్పి వస్తోంది అంటోంది. వేడి చేసిందేమో అనుకుని కొబ్బరినీళ్లు, మజ్జిగ వంటివి పట్టిస్తున్నా. కానీ తగ్గట్లేదు. రక్తం కూడా కనిపిస్తోందట. ఏంటీ తన సమస్య? – ఓ సోదరి

మూత్రం పోస్తున్నప్పుడు నొప్పి, రక్తం కూడా కనిపిస్తోందంటే యూరిన్ ఇన్‌ఫెక్షనే కారణం. ఈ వయసు పిల్లలు నీళ్ల తాగడాన్ని అశ్రద్ధ చేస్తుంటారు. స్కూల్లో వాష్‌రూమ్‌లు బాగోవు, వాసన వస్తాయి... వాటిని వాడలేమనీ మంచినీళ్లు సరిగా తాగరు. పదే పదే యూరినేషన్‌నీ చేయరు. దీనివల్ల కూడా ఇన్‌ఫెక్షన్లు వస్తాయి. మూత్రం పోసేటప్పుడు నొప్పి, మంట, రక్తం కనిపించడం వంటివి యూరినరీ ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్‌కి సంకేతాలే. అయితే ముందు అమ్మాయికి పరీక్ష చేయించండి. ఆపై తగ్గట్టుగా యాంటీ బయాటిక్స్ వాడాలి. అప్పుడు నెమ్మదిగా తగ్గుతుంది. అయితే దాంతోపాటు అమ్మాయికి గుర్తుంచుకుని మంచినీళ్లు తాగడం, తరచూ మూత్ర విసర్జన చేయడం అలవాటుగా చేయండి. జననాంగాలను పరిశుభ్రంగా ఉంచుకోమనండి. దాంతోపాటు సిట్రస్ ఫలాలు అన్ని కాలాలూ తినేలా చూడండి. ఇవన్నీ ఈ ఇన్‌ఫెక్షన్లకి దూరంగా ఉంచుతాయి. లేదు ఇలాగే తరచూ కొనసాగితే అనవసర అనారోగ్య సమస్యలు వస్తాయి. కాబట్టి, సమస్య చిన్నదే. పెద్దది కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడం మాత్రం తప్పనిసరి.

డియర్ వసుంధర



డా. చీపురుపల్లి వసుంధర
గైనకాలజిస్ట్

నిద్రకూ ఓ ప్రయాణం..!

పని ఒత్తిడి, ఉరుకుల పరుగుల జీవనశైలి, స్క్రీన్ సమయం పెరగడం... ఇవన్నీ నిద్రకు ఆటంకం కలిగించేవే. దాంతో ఆరోగ్యకరమైన నిద్రవేళలకు దూరమవుతున్న వారే ఎక్కువ. ఇలా నిద్రలేమితో బాధపడుతున్న వారిలో మహిళలే అధికమట. జెన్ జీలు, మిలీనియల్ అమ్మాయిలు కూడా ఈ జాబితాలో చేరిపోతున్నారు. ఈ సమస్య నుంచి బయటపడటానికే 'స్లీప్ టూరిజా'న్ని ఎంపిక చేసుకుంటున్నారీ తరం అమ్మాయిలు. ప్రశాంతంగా నిద్రపోవడానికే ఈ ప్రయాణాలు. అందుకు తగినట్లే ఏర్పాట్లు కూడా ఉంటాయట. ప్రత్యేకంగా డిజైన్ చేసిన స్లీప్ సూట్స్, సౌండ్ ప్రూఫ్ గదులు, అరోమాథెరపీ, నిద్రపట్టడానికి మసాజ్, వ్యాయామ సెంటర్లు అందుబాటులో ఉంటాయట. అలానే నిద్రలేమి సమస్యకు కారణాలు తెలుసుకుని చికిత్స అందించేందుకు వైద్యులూ ఉంటారట. అవసరమైతే ఐస్‌బాత్, శాండ్, సౌండ్ థెరపీలూ అందిస్తారట. ఇదివరకు విదేశాల్లో మాత్రమే అందుబాటులో ఉండే ఈ విధానం... ఇప్పుడు టైర్-1,2 నగరాలకూ విస్తరిస్తోంది. స్లీప్ సెంటర్లూ పెరుగుతున్నాయట. అవసరం అయితే ప్రయత్నించి చూడండి.



సంక్రాంతి ముగ్గులకు ఆహ్వానం...



రంగవల్లిక

ధనుర్మాసం మొదలవగానే... మగువలు సంక్రాంతి సంబరాలకు శ్రీకారం చుడతారు. వీధులన్నీ ముగ్గులతో నింపేస్తారు. నక్షత్రాల్నే చుక్కలుగా పేర్చి... వాటి మధ్య నుంచి సన్నటి గీతల్ని ఒడుపుగా తిప్పేస్తూ రంగవల్లికల్ని వేసేస్తారు. నేలనే కాన్వాస్‌గా మలుచుకుని ముత్యాల ముగ్గులెన్నో పెట్టేస్తారు. చక్కటి చిత్రాలెన్నింటికో చోటిస్తారు. మీరూ అలా అందంగా ముగ్గులు వేయగలరా? మరి ఇంకెందుకు ఆలస్యం...

తెల్లటి కాగితంపై ముగ్గులు పెట్టి మాకు పంపించండి. వచ్చిన వాటిల్లో ఉత్తమమైన రంగవల్లికల్ని 'వసుంధర' పేజీలో ప్రచురిస్తాం. మరికొన్నింటిని ఈ-పేపర్, ఈనాడు.నెట్, వసుంధర.నెట్‌ల్లో అప్‌లోడ్ చేస్తాం.

గమనిక: ముగ్గుల్లో చుక్కలు స్పష్టంగా కనిపించాలి. చుక్కల వివరాలూ, మీ పేరూ, ఫొటో, ఫోన్ నంబర్‌నూ జతచేయడం మరిచిపోవద్దు.

మెయిల్:
vasundhara@eenadu.in
వాట్సప్ నం: 9154091911
మా చిరునామా: వసుంధర, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిల్మ్‌సిటీ, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా - 501 512

క్లెన్సర్ పడుతుందా లేదా..!

చర్మ సంరక్షణలో అమ్మాయిలు తప్పకుండా ఉపయోగించే ఉత్పత్తుల్లో క్లెన్సర్ ఒకటి. అయితే ఒకే రకమైన క్లెన్సర్లు అన్ని కాలాలకూ సరిపడవు. అందుకే కాలానికి తగినట్లుగా స్కిన్ కేర్ రొటీన్‌ను కూడా మార్చుకోవాల్సి ఉంటుంది. ఈ కాలంలో మీరు వాడుతున్న క్లెన్సర్ మీ చర్మతత్వానికి సరిపోతుందా లేదా అని తెలుసుకోవడం ఎలా అంటే...



- క్లెన్సర్ వాడిన పది నిమిషాలకు మీ ముఖం బిగుతుగా, ఉన్నట్లు అనిపిస్తే... అది మీ శీతకాలపు స్కిన్ కేర్ రొటీన్‌కు సెట్ కానట్లేనట.
- గడ్డం కింద, ముక్కుకు ఇరువైపుల చర్మం పొలుసుబారుతోందా? క్లెన్సర్ మృదుత్వాన్ని, హైడ్రేషన్‌ని ఇవ్వడం లేదనే దీని అర్థం.
- క్లెన్సర్ పడకపోతే మృతకణాలు తొలగించే ప్రక్రియలో చర్మం పొడిబారుతుంది. కొన్నిసార్లు, దురద, మంట, ఎరుపుగా మారడం వంటివి కనిపిస్తాయి. మాయిశ్చరైజర్ రాసేటప్పుడు మంట కూడా ఎక్కువవుతుందట.
- మేకప్ వేసుకునేటప్పుడు అది చర్మం అంతా ఒకే విధంగా ఉండకుండా, అసమానంగా ఒకదగ్గర ఎక్కువ, ఒకదగ్గర తక్కువగా పెచ్చులా కనిపిస్తుందట.
- చర్మం ముందుకన్నా ఎక్కువగా పొడిబారినట్లు అనిపిస్తుంది. దాంతో పదేపదే మాయిశ్చరైజర్ అప్లై చేయాల్సి వస్తుంది. ఇవన్నీ గమనించుకుని అవసరమైతే ఉత్పత్తుల్ని మార్చుకోండి మరి!

నాటి శాలువా... నేటి ర్యాప్!





మనకంటే స్వెటర్లు వేసుకోవడం అలవాటు కానీ... ఒకప్పుడు అమ్మలు, బామ్మలు మాత్రం శాలువా కప్పుకోవడానికే ఇష్టపడేవారు. ఇప్పటికీ ప్రయాణాలంటే చలివేళే కాదు... ఇతర సమయాల్లోనూ బయటికి వచ్చేవి అవే! కానీ తెలుసా... వీటికీ పెద్ద చరిత్రే ఉండేదని? వందల ఏళ్ల క్రితం హోదాకీ, రాచరికానికీ గుర్తుగా వీటిని భావించేవారు. ఎక్కువగా రాణులే వాడేవారు మరి. తరవాత్తరవాత ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌గా మారాయి. దీంతో ధనిక వర్గాలన్నింటికీ పరిచయం అయ్యాయి. కేవలం మన దేశానికే పరిమితం అవ్వలేదు... విదేశాల్లోనూ వీటికి ఆదరణ పెరిగింది. అంతా బాగానే ఉంది కానీ... ఇప్పుడీ శాలువా సంగతెందుకు అన్న సందేహమొచ్చిందా? ఏమీలేదు. ఫ్యాషన్ ప్రపంచమంతా ఓ వృత్తంలో తిరుగుతుంది అన్న మాట వినే ఉంటారుగా! శాలువా ఇందుకు మినహాయింపు కాదు. అయితే నేటి అమ్మాయిలు దాన్నే శాల్, ర్యాప్ అని స్టైల్‌గా పిలుచుకుంటున్నారు. కుర్తీ, టీషర్ట్, షర్ట్... దేనిమీదకైనా స్టైల్‌గా చుట్టేసుకుని వెళ్లిపోతున్నారు. సౌకర్యానికి నేటి తరం ఎంత ప్రాధాన్యం ఇస్తుందో మనకు తెలిసిందేగా! ఆడుతూ పాడుతూ, ఉరకలు వేస్తూ ఉండే అమ్మాయిలు చూడటానికి ఎంత స్టైల్‌గా ఉన్నా... పదే పదే వాళ్ల శాల్ లేదా ర్యాప్ భుజాల్ని జారి పడుతోంటే విసిగిపోరూ? అందుకే 'హ్యాండ్స్ ఫ్రీ శాల్', 'ర్యాప్ విత్ స్లీవ్స్' అంటూ వీటిని ఎంచుకుంటున్నారు. సింపుల్‌గా ఓ కోట్‌నే వేసుకున్నట్టు లేదూ? స్టైల్‌కి స్టైల్, వెచ్చదనానికి వెచ్చదనం, అన్నింటికన్నా సౌకర్యం! ఇంకేం 'కోజీ వేర్' అని తెగ ఇష్టపడి కొనుక్కుంటున్నారు. అసలే డిసెంబరు... పార్టీల మాసం. డ్యాన్స్, పార్టీ, ఆటలు ఏవైనా చలి ఇబ్బంది పెట్టొద్దంటే ఇలాంటిది ఒకటి కావాల్సిందే కదా! అందుకే వార్డ్‌రోబ్‌లో చోటిచ్చేస్తున్నారు. మీకూ ఇదొకటి అవసరమే అనిపిస్తోందా? ఇంకేం తెచ్చేసుకోండి మరి!





వ్యవసాయం మీద ఇష్టంతో..!

'అందరూ డాక్టర్లు, ఇంజినీర్లు అయితే... మరి రైతు అయ్యేది ఎవరు? అన్నదాత లేకపోతే అన్నం పెట్టేదెవరు. యాళిని వాళ్ల నాన్న ఆమెతో చెప్పిన మాటలివి. అవే ఆమెకు ఈ రంగం మీద మక్కువ పెంచాయి. అంతరించిపోతున్న 21 సంప్రదాయ వరి వంగడాల్ని సాగులోకి తీసుకురావడానికి కారణమైంది.



యాళిని

యాళినిది తమిళనాడు, తంజావూరు జిల్లాలోని కరుప్పట్టిపట్టి. తల్లిదండ్రులు తవసెల్వన్-పుగళెంది. వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. చిన్నప్పట్నుంచీ దాన్ని చూస్తూ పెరగడం వల్లే తనకు ఈ రంగంపై మక్కువ కలిగిందనే యాళిని... తనకు పదకొండు ఏళ్లు ఉన్నప్పట్నుంచీ తండ్రి దగ్గర వ్యవసాయంలో మెలకువలు నేర్చుకోవడం మొదలుపెట్టింది. ఉదయం స్కూల్‌కి వెళ్లడానికి ముందు, సాయంత్రం తిరిగి వచ్చాక పొలంలోనే తన సమయాన్ని కేటాయించేదట. అనతి కాలంలోనే పనులన్నీ నేర్చుకుంది. ఇప్పుడు తను స్వయంగా సాగు చేస్తోంది కూడా.

చదువు-వ్యవసాయం...

తిరుచ్చిలోని ఒక ప్రైవేట్ కళాశాలలో బీఎస్సీ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ చదువుతోందీమె. 'సేంద్రియ వ్యవసాయంపై ఆసక్తి ఎక్కువ నాకు. అందుకే కష్టమైనా ఆ పద్ధతుల్ని వాడే వ్యవసాయం చేస్తున్నా. దశాబ్దం క్రితం వరకూ వరిలో వందకు పైగానే రకాలు ఉండేవట. కానీ ఇప్పుడు అవేవీ మచ్చుకైనా కనపడటం లేదని చెప్పారోసారి నాన్న. అంతరించిపోతున్న వాటిని వెలికితీసి పండించాలనుకున్నా. అలా ఇప్పటివరకు 21కిపైగానే సంప్రదాయ వరి వంగడాలను సాగు చేశా. వాటిలో రత్నచోడి, మైసూర్ మల్లిక, తూయ మల్లి, పూంగర్, మాప్పిళ్లై సాంబ రకాలు ముఖ్యమైనవి. సాధారణ రకాల కంటే వీటి దిగుబడి తక్కువ. కానీ ధర, డిమాండ్ ఎక్కువ, ఆరోగ్యం కూడా. అందుకే వీటిని సాగుచేస్తున్నా. వంగడాల సేకరణకు 'ఆర్మ్స్ విత్ సీడ్స్' అనే సంస్థనూ స్థాపించా.

అదో పండుగలా...

వ్యవసాయం గురించి, రైతుల కష్టనష్టాల గురించి నేటి తరానికి తెలియాలి. అందుకే నాట్లు వేయడాన్ని ఓ పండుగలా చేస్తున్నా. నాట్లు వేసేముందు స్థానిక కళాశాలలు, పాఠశాలలకు ఆహ్వానం పంపిస్తున్నాం. ఏడాదికి 200 మందికి పైగానే పిల్లలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. సేంద్రియ వ్యవసాయం గురించి అవగాహన కార్యక్రమాలూ నిర్వహిస్తుంటా' అనే యాళిని... ఈ రంగంలో అందిస్తున్న సేవలకుగానూ తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం నుంచి 'పసుమై ముదన్మైయాలర్' (గ్రీన్ లీడర్) అనే పురస్కారం అందుకుంది. వరి వంగడాలతోపాటు ఎర్రజొన్న, రాగులు వంటి చిరుధాన్యాల్నీ సేకరిస్తోంది. యువత వ్యవసాయంలో భాగం కావాలన్నదే తన లక్ష్యం అంటోన్న యాళిని ప్రయత్నాన్ని అభినందించాల్సిందే కదూ!

– ఆళ్ల లక్ష్మీ హరికృష్ణ, చెన్నై

బంగారం - వెండి



11న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కేజీ)
హైదరాబాద్	1,33,320	1,19,750	1,95,723
విజయవాడ	1,28,940	1,19,350	1,93,600
ప్రొద్దుటూరు	1,28,400	1,18,130	1,87,000
రాజమహేంద్రవరం	1,30,750	1,19,850	2,09,000
విశాఖపట్నం	1,29,730	1,19,350	1,85,000
తమిళనాడు	-----	1,20,500	2,09,000

చేసిన మంచిని వివరిస్తే గెలుపు మనదే

- ప్రతిపక్షంలో ఉన్నప్పటి కంటే ఎక్కువగా శ్రమించాలి
- మహిళల మద్దతు కూడగట్టడంలో మీదే కీలకపాత్ర
- కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు


మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో తెదేపా కేంద్ర కార్యాలయంలో సమావేశమైన పార్టీ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: డబ్బుతోనే ఎన్నికల్లో గెలుస్తామని కొందరు భావిస్తారని, కానీ మనం చేసిన మంచి పనులను ప్రజలకు నిత్యం వివరిస్తే గెలుపు మనదేనని తెదేపా అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పని చేయడం ఒకెత్తు, దాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం మరో ఎత్తు అని పార్టీ కార్యకర్తలకు ఉద్బోధించారు. ప్రతిపక్షంలో ఎంత పట్టుదలతో పనిచేశారో, ఇప్పుడు అంతకుమించి కష్టపడాలని సూచించారు. ఎన్డీయే పార్టీలతో సమన్వయం చేసుకోవాలని, క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ శిబిరానికి గురువారం చంద్రబాబు హాజరయ్యారు. వారితో ఉల్లాసంగా గడిపారు. 'కాఫీ కబుర్లు' పేరుతో వారితో కలిసి కాఫీ తాగుతూ ముచ్చటించారు. ఎన్టీఆర్ హయాంలో జరిగిన శిక్షణ కార్యక్రమాలను గుర్తుచేసుకున్నారు. అప్పట్లో చెట్ల కింద ఎర్రటి ఎండలో శిక్షణ శిబిరాలు నిర్వహించేవారమని, ఇప్పుడు ఏసీ గదుల్లో జరుగుతున్నాయని చెప్పారు. పరిస్థితులను బట్టి నాయకత్వ లక్షణాలు మెరుగుపరచుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం, పార్టీ విధానాలు, ప్రభుత్వ ఆలోచనలు, విజయాలు, నాయకత్వ లక్షణాలు, సంక్షేమ పథకాల అమలు, కార్యకర్తలకు గౌరవం, పదవులు తదితర అంశాలపై చంద్రబాబు చర్చించారు.

పార్టీ భావజాలం తెలుసుకోవాలి

'నేతలు, కార్యకర్తలను కలిసేందుకు వినూత్న చర్యలు చేపడుతున్నాం. పార్టీ సిద్ధాంతాలు, భావజాలం ప్రతి కార్యకర్తకు తెలియాలి. కోటి మంది క్రియాశీలక సభ్యులతో దేశంలో బలమైన పార్టీగా ఉన్న తెదేపా సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లేందుకు ఈ శిక్షణ ఎంతో దోహదం చేస్తుంది. గ్రామస్థాయి పరిస్థితులు తెలుసుకోవడానికి ఈ శిబిరం సరైన వేదిక. 'కార్యకర్తే అధినేత' అనే సిద్ధాంతంతో పనిచేసే మన పార్టీలో.. కార్యకర్తలను కలుసుకునే ప్రతి సందర్భమూ నాకు ప్రత్యేకమే'నని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

బూత్ స్థాయిలో బలోపేతం కావాలి

'2019-24 మధ్య రాష్ట్రంలో విధ్వంసం జరిగి వ్యవస్థలన్నీ దెబ్బతిన్నాయి. వాటిని సరిచేసి గాడిన పెట్టాం. అన్నదాతా సుఖీభవ, దీపం-2.0, స్త్రీశక్తి, తల్లికి వందనం పథకాలు అమలు చేస్తున్నాం. ఏటా రూ.33 వేల కోట్లు సామాజిక భద్రత పింఛన్లకు వెచ్చిస్తున్నాం. వీటి ఫలితం ఎలా ఉందో పోలింగ్ బూత్‌ల వారీగా బలాబలాల్ని చూసుకోవాలి. ప్రతి బూత్‌లోనూ పార్టీ బలోపేతం కావాలి. నాయకత్వం సమర్థంగా ఉన్నచోటే ఎక్కువ ఓట్లు వస్తాయి. బలహీన నియోజకవర్గానికి మంచి నేతను ఇన్‌ఛార్జిగా నియమిస్తే, అక్కడ పార్టీ బలపడుతుంది. బలహీన నేతకు మంచి నియోజకవర్గమిచ్చినా పార్టీని బలహీనపరుస్తారు' అని అధినేత విశ్లేషించారు.

తెదేపా జిల్లా కమిటీల కూర్పు.. ప్చ్!

సామాజికవర్గ సమీకరణాల ప్రకారం లేదు ● అన్నివర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలి

మహిళలకు 33% పదవులు ఇవ్వాలి ● త్రిసభ్య కమిటీల సమావేశంలో చంద్రబాబు

ఈనాడు, అమరావతి: తెదేపా జిల్లా కమిటీల కూర్పుపై పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని జాబితా సామాజికవర్గ దామాషాకు అనుగుణంగా లేదని స్పష్టం చేశారు. మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ ఇతర వర్గాల ప్రాతినిధ్యం పెంచాలని, సోమవారానికి కొత్త జాబితా ఇవ్వాలని త్రిసభ్య కమిటీల నేతలను ఆదేశించారు. మంగళవారం మరోసారి సమావేశమై నిర్ణయం తీసుకుందామని స్పష్టం చేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన త్రిసభ్య కమిటీల సభ్యులతో సమావేశమయ్యారు. జిల్లాలవారీగా ఏర్పాటు చేసిన కమిటీలో మంత్రి, సీనియర్ నేతలు ఉన్నారు. జిల్లా కమిటీ ఏర్పాటుపై కసరత్తు పూర్తి చేసి 34 మందితో కూడిన జాబితాలను ప్రోగ్రాం కమిటీకి అందించారు. దీనిపై చంద్రబాబు త్రిసభ్య కమిటీ సభ్యులతో విస్తృతంగా చర్చించారు.

సోషల్ ఇంజినీరింగ్‌కు ప్రాధాన్యం ఏదీ?

తెలుగుదేశం అంటే సోషల్ ఇంజినీరింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తుంది.. జిల్లా కమిటీలు కూడా అందుకు అనుగుణంగా ఉండాలని చంద్రబాబు స్పష్టం చేశారు. త్రిసభ్య కమిటీలు అందజేసిన జాబితా సామాజికవర్గ దామాషాకు అనుగుణంగా లేదని అసంతృప్తి వెలిబుచ్చారు.

ముస్లింలు, ఎస్సీల ప్రాతినిధ్యం పెరగాలి

ప్రస్తుత జాబితాల ప్రకారం.. ఓసీలు 34%, బీసీలు 41%, ఎస్సీలు 7%, ఎస్టీలు 3%.. మిగిలిన భాగంలోఇతర సామాజికవర్గాలు ఉన్నాయి. దీన్ని సరిచేయాలని.. ఎస్సీ వర్గాలకు అవకాశం పెంచాలని చెప్పారు. అలాగే ముస్లింలకూ మరింత ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. మహిళలకు 33% ఇవ్వాలని చంద్రబాబు సూచించారు.

ప్రతి జిల్లా కమిటీలో 40 మంది

తెదేపా జిల్లా కమిటీల్లో ఇప్పటి వరకు ఛైర్మన్, ప్రధాన కార్యదర్శి సహా 34 మంది ఉండేవారు. సామాజికవర్గ సమీకరణాల్లో భాగంగా 40 మందిని నియమిస్తామని చంద్రబాబు వెల్లడించారు. నియోజకవర్గాలవారీ సామాజికవర్గాల జనాభా లెక్కలను గురువారం రాత్రికి త్రిసభ్య కమిటీకి అందించాలని ప్రోగ్రాం కమిటీని ఆదేశించారు. జాబితాల తయారీలో శ్రద్ధ పెట్టలేదని ఈ కసరత్తు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశానికి 11 మంది సభ్యులు హాజరుకాలేదు. వారి పేర్లు కూడా చంద్రబాబు చదివి వినిపించారు.

కల్తీ జరగలేదని నివేదిక ఇవ్వాలని ఒత్తిడి చేశారా?

- మూడో రోజు తితిదే మాజీ జీఎంను ప్రశ్నించిన సిట్
- నేటితో ముగియనున్న కస్టడీ

ఈనాడు-తిరుపతి, న్యూస్‌టుడే, తిరుపతి(నేరవిభాగం): 'నెయ్యి కల్తీ గురించి మైసూరులోని సీఎఫ్‌టీఆర్‌ఐ ల్యాబ్ నివేదిక ఇచ్చాక డెయిరీ నిపుణులను ఎందుకు సంప్రదించారు? కల్తీ జరగలేదని నివేదిక ఇవ్వాలని మీరు డాక్టర్ బత్తుల సురేంద్రనాథ్‌పై ఒత్తిడి చేశారా' అని తితిదే కొనుగోళ్ల విభాగం మాజీ జీఎం, ప్రస్తుత ఈఈ సుబ్రహ్మణ్యంను సిట్ అధికారులు ప్రశ్నించారు. ఆయనకు ఫోన్లు చేసిన మాట వాస్తవమేనని, కేవలం అభిప్రాయం ఇవ్వాలని అడిగానే తప్ప నివేదిక ఎలా ఇవ్వాలో సూచించలేదని సుబ్రహ్మణ్యం సమాధానమిచ్చారు. మీరు ఒత్తిడి చేశారని సురేంద్రనాథ్ వాంగ్మూలం ఇచ్చారని చెప్పగా లేదని చెప్పారు. తిరుమల లడ్డూకు కల్తీ నెయ్యి సరఫరా కేసులో గురువారం మూడోరోజు సుబ్రహ్మణ్యంను సిట్ అధికారులు సాయంత్రం 6 గంటల వరకు విచారించారు. మరో నిందితుడు అజయ్ కుమార్ సుగంధ్‌నూ ప్రశ్నించారు. నేటితో వీరిద్దరి కస్టడీ గడువు ముగియనుంది. భోలేబాబాను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టిన తర్వాత శ్రీ వైష్ణవి, ఏఆర్ డెయిరీ, తదితర సంస్థలను ముందుంచి ఆ డెయిరీ డైరెక్టర్లు పొమిల్ జైన్, విపిన్ జైన్‌లు కల్తీ నెయ్యి సరఫరా చేశారని, దీన్ని మీరెందుకు గుర్తించలేకపోయారని అడగ్గా నిబంధనలు సరళీకృతం చేయడంతో ఆ డెయిరీలు రంగ ప్రవేశం చేశాయని సుబ్రహ్మణ్యం సమాధానమిచ్చారు. సంబంధిత డెయిరీలు ఎవరెవరితో సంప్రదింపులు జరిపాయో తనకు తెలియదన్నారు. వైవీ సుబ్బారెడ్డి మాజీ పీఏ చిన్న అప్పన్న భోలేబాబా కమీషన్ ఏజెంట్ పీపీ శ్రీనివాసన్, ఆ సంస్థ ప్రతినిధులను డబ్బు డిమాండ్ చేసిన సంగతి తెలుసా అని ప్రశ్నించగా.. కేవలం వివరాలు ఇచ్చానే తప్ప అతను ఏం చేశాడో తనకు అవగాహన లేదని సుబ్రహ్మణ్యం చెప్పారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు విచారించి వైద్య పరీక్షలు నిర్వహించిన తర్వాత వీరిద్దరినీ నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించనున్నారు.

సుబ్రహ్మణ్యం సస్పెన్షన్..

కల్తీ నెయ్యి వ్యవహారంలో సుబ్రహ్మణ్యం పాత్ర ఉన్న నేపథ్యంలో గత నెల 27న ఆయన్ను సిట్ అధికారులు అరెస్టు చేయడంతో తితిదే వెంటనే సస్పెండ్ చేసింది. గత నెలలోనే ఆదేశాలు ఇచ్చినా తాజాగా ఈ విషయం వెలుగు చూసింది. ఇప్పటికే నెల్లూరు అనిశా కోర్టులో దాఖలు చేసిన మెమోలో ఏడుగురు తితిదే ఉద్యోగుల పేర్లు ఉండటం, అందులో ముగ్గురు ఉద్యోగ విరమణ పొందడంతో సిట్ చర్యలకు అనుగుణంగా వీరిపైనా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు. తాజాగా కొనుగోళ్లు, గోదాముల విభాగంలో పనిచేసిన మరికొందరి పాత్రపైనా సిట్ అధికారులు ఆరా తీస్తున్నారు. వీరందరినీ ఇప్పటికే ప్రశ్నించారు. సుబ్రహ్మణ్యం ఇచ్చిన సమాధానాల ఆధారంగా మరోసారి వారిని పిలవనున్నారు. విచారణకు సహకరించని వ్యక్తులను అరెస్టు చేయాలని యోచిస్తున్నట్లు తెలిసింది.

ఏది అడిగినా నాకేం సంబంధమన్న సుగంధ్..

మరోవైపు సుగంధ్ ఆయిల్స్ అండ్ కెమికల్స్ యజమాని అజయ్‌కుమార్ సుగంధ్.. మూడో రోజు సైతం విచారణకు సహకరించలేదు. ఏ ప్రశ్న అడిగినా తనకేం సంబంధమని సిట్ అధికారులకు బదులిచ్చినట్లు తెలిసింది. భోలేబాబాతో తనకున్నవి వ్యాపార సంబంధాలేనని, కల్తీ నెయ్యి వ్యవహారం గురించి తెలియదన్నారు. డ్రమ్ముల్లో రసాయనాలను ఉత్తరాఖండ్‌కు పంపినప్పుడైనా ఈ అంశం గుర్తించలేదా అని అడగ్గా లేదన్నారు. గతంలో అరెస్టు చేయడానికి ముందు విచారించినప్పుడు కూడా అజయ్‌కుమార్ సుగంధ్ ఇలానే స్పందించారు.

రిపబ్లిక్ టీవీతో అనవసర వివాదం

కేంద్ర పరిధిలోని విమానాల అంశం మనకెందుకు? ● చిన్న అంశాన్ని పెద్దది చేశారు

అంత జరుగుతుంటే నాకెందుకు చెప్పలేదు? ● అధికార ప్రతినిధులపై సీఎం అసహనం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వానికి ఏ మాత్రం సంబంధం లేని 'ఇండిగో విమానాల రద్దు' అంశంపై రిపబ్లిక్ టీవీ ఛానల్‌తో అనవసర వివాదాన్ని తెచ్చుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు. రిపబ్లిక్ టీవీ మొదటి నుంచీ తెదేపా అంటే సానుకూల దృక్పథంతో ఉంటుందని, అలాంటి ఛానల్‌తో ఘర్షణాత్మక వైఖరి సరికాదన్నారు. పార్టీ అధికార ప్రతినిధులతో గురువారం తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వివాదం పెద్దదయ్యే వరకు తన దృష్టికి తేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ అధికార ప్రతినిధి దీపక్‌రెడ్డి రిపబ్లిక్ టీవీ చర్చకు మరింత కసరత్తుతో వెళ్లి, సమయస్ఫూర్తితో వ్యవహరించి ఉండాల్సిందని, చర్చలో ఆయన చేసిన వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తమైనప్పుడు అంతటితో ముగించాల్సిందని చంద్రబాబు పేర్కొన్నారు. 'అనవసరంగా చిన్న విషయాన్ని పెద్దది చేశారు. ఛానల్‌ను బహిష్కరిస్తున్నామని చెప్పడం ద్వారా వివాదం మరింత పెంచారు' అని మందలించారు. ఛానల్‌ను బహిష్కరిస్తున్నామని పార్టీ తరఫున ఎవరూ చెప్పలేదని అధికార ప్రతినిధులు సీఎం దృష్టికి తేగా 'మనం అలా చెప్పకపోయినా, వారికి అలాంటి అభిప్రాయం కలిగింది కదా! టీవీ ఛానల్‌లో ఖాళీ కుర్చీ చూపించి, తెదేపా బహిష్కరించిందని చెప్పారు కదా? పరిస్థితి అంత వరకు ఎందుకు తెచ్చుకోవాలి? వారితో మాట్లాడి అపోహలు తొలగిస్తే సరిపోయేది కదా! అధికార ప్రతినిధులు పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్నామని గుర్తు పెట్టుకోవాలి. తెలిసోతెలియకో వారు చేసే తప్పులు పార్టీపై ప్రభావం చూపుతాయి. భవిష్యత్తులో ఇలాంటివి జరగడానికి వీల్లేదు' అని స్పష్టం చేశారు. 'నేను ప్రతి అడుగూ ఆచితూచి వేస్తుంటే... మీలో కొందరు ఇష్టానుసారం మాట్లాడేస్తే పార్టీకి నష్టం జరుగుతుంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాట్లాడకుండా ఉండటం ఎంత తప్పో, అధికారంలో ఉన్నప్పుడు అనవసరంగా మాట్లాడటం కూడా అంతే తప్పు. టీవీ చర్చలకు, విలేకర్ల సమావేశాలకు ముందస్తు కసరత్తుతో బాగా సిద్ధమై వెళ్లండి. తప్పులకు ఆస్కారం ఇవ్వొద్దు' అని సీఎం దిశానిర్దేశం చేశారు.

మీకు పార్టీ లైన్ కరెక్ట్‌గా రావట్లేదు!

పార్టీ లైన్, ప్రభుత్వ విధానాలపై అధికార ప్రతినిధులకు మార్గదర్శనం చేయడంలో వైఫల్యం కనిపిస్తోందని సీఎం పేర్కొన్నారు. 'వారికి సమాచారం అందించేందుకు ఇద్దరు మంత్రుల్ని, పార్టీ నుంచి ఇద్దరు సీనియర్లను నియమిస్తానని సీఎం చెప్పారు. పార్టీ నాలెడ్జ్ సెంటర్, బ్యాక్ ఆఫీస్ సమర్థంగా పనిచేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత విభాగాల బాధ్యులకు చంద్రబాబు అక్షింతలు వేశారు. 'ప్రధాని ఒక మాట చెబితే దాన్ని భాజపా శ్రేణులు క్షేత్రస్థాయికి సమర్థంగా తీసుకెళతాయి. ఆ విషయంలో మన పార్టీలో లోపాలు కనిపిస్తున్నాయి. పీపీపీ విధానంలో వైద్య కళాశాలల్ని నిర్మించాలన్న ప్రభుత్వ విధానంపై విపక్షం విషప్రచారం చేస్తుంటే క్షేత్రస్థాయి వరకు సమర్థంగా తిప్పికొట్టాలి కదా? అది కూడా నేనే చూసుకోవాలంటే ఎలా?' అని ఆయన వ్యాఖ్యానించారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికార ప్రతినిధులు బాగా పనిచేశారని, ఇప్పుడు మరింత బాధ్యతగా, తెలివిగా వ్యవహరించాలని ఆయన సూచించారు. 'రిపబ్లిక్ టీవీ చర్చలో ఆ అంశం ప్రస్తావనకు వచ్చినప్పుడు అది కేంద్రం పరిధిలో అంశమని, వారు చూసుకుంటారని చెబితే సరిపోయేది' అని సీఎం పేర్కొన్నారు.

పిన్నెల్లి సోదరులకు 14 రోజుల రిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

సెంట్రల్ జైలుకు తరలించారు. వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన తెదేపా నేతలు జవ్విశెట్టి వెంకటేశ్వర్లు, జవ్విశెట్టి కోటేశ్వరరావుల హత్య కేసులో రెండు వారాల్లో లొంగిపోవాలని సుప్రీం కోర్టు నవంబరు 28న ఆదేశించిన నేపథ్యంలో పిన్నెల్లి సోదరులు గురువారం మాచర్ల కోర్టులో లొంగిపోయారు. మే 24న వెల్దుర్తి మండలం బొదిలవీడు సమీపంలో తెదేపా నేతల జంటహత్యలు జరిగాయి. గ్రామంలో ఆధిపత్య పోరు నేపథ్యంలో వారిద్దరినీ హత్య చేసేలా ప్రత్యర్థులకు సహకరించారని పిన్నెల్లి సోదరులపై మాచర్ల గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో అరెస్టు కాకుండా ముందస్తు బెయిల్ పిటిషన్ వేయగా కింది కోర్టు, హైకోర్టు తిరస్కరించాయి. దీంతో సెప్టెంబరు 1న సుప్రీంకోర్టుకు వెళ్లారు. అదే నెల 4న విచారించిన ధర్మాసనం వారికి అరెస్టు నుంచి మధ్యంతర రక్షణ కల్పించింది. వాయిదాల తర్వాత నవంబరు 28న రెండువారాల్లో లొంగిపోవాలని సూచించింది.

పటిష్ఠ బందోబస్తు

గురువారం ఉదయం 11:30 గంటలకు పిన్నెల్లి సోదరులు మాచర్ల కోర్టుకు చేరుకున్నారు. గంటపాటు ప్రాథమిక విచారణ పూర్తయ్యాక 12:30కు వైద్య పరీక్షల నిమిత్తం పోలీసులు స్థానిక పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి తిరిగి తీసుకొచ్చారు. మధ్యాహ్నం 1:30కు మాచర్ల అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి ప్రశాంత్ వారికి ఈ నెల 24 వరకు రిమాండ్ విధిస్తూ తీర్పునిచ్చారు.

ప్రత్యేక కారు కోసం వినతి

రిమాండ్ విధించిన తర్వాత నెల్లూరులోని కేంద్ర కారాగారానికి తరలించాలని కోర్టు నుంచి ఆదేశాలు వచ్చాయి. అక్కడికి తమ పిటిషనర్లు ప్రత్యేక కారు రావడానికి అనుమతివ్వాలని పిన్నెల్లి సోదరుల తరఫు న్యాయవాదులు కోర్టుకు విన్నవించారు. సాధారణ నిందితులను ఎలా తీసుకెళ్తారో అలాంటి సౌకర్యాలే ఉంటాయని, ప్రత్యేక సదుపాయాలు ఉండవని న్యాయమూర్తి బదులిచ్చారు. దీంతో పోలీసు జీపులోనే పల్నాడు ఏఎస్పీ సంతోష్, గురజాల డీఎస్పీ జగదీశ్‌ల ఆధ్వర్యంలో పిన్నెల్లి సోదరుల్ని నెల్లూరుకు తరలించారు.

మొదటిసారిగా జైలుకు తమ్ముడు

ఈ కేసులో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి మొదటిసారి జైలుకు వెళ్లారు. 2024 ఎన్నికల పోలింగ్ అనంతరం జరిగిన అల్లర్లు, పలు హత్యాయత్నం కేసుల్లో ఏ2గా ఉన్నా ముందస్తు బెయిల్‌పై మొన్నటివరకు అజ్ఞాతంలో ఉన్నారు. తెదేపా నేతల జంట హత్యల కేసులో మాత్రం తప్పించుకోలేకపోయారు. అల్లర్లు, హత్యాయత్నం కేసుల్లో ఏ1 అన్న రామకృష్ణారెడ్డి ఇప్పటికే ఒకసారి జైలుకెళ్లి వచ్చారు. ఆయన నెల్లూరు జైలులోనే 54 రోజులు ఉన్నారు.

కోర్టు లోపలకు వెళ్లేందుకు ప్రయత్నం

మాచర్ల పట్టణంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పల్నాడు పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. ఎక్కడికక్కడ వైకాపా నాయకులను హౌస్ అరెస్టు చేశారు. అయినాసరే యర్రగొండపాలెం ఎమ్మెల్యే చంద్రశేఖర్, సత్తెనపల్లి వైకాపా ఇన్‌ఛార్జి సుధీర్ భార్గవ్‌రెడ్డి, అంబటి మురళి కోర్టు వరకు పిన్నెల్లి వెంట కారులో రావడమే కాకుండా లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల బందోబస్తు ఉన్నా.. వైకాపా యూత్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి, యాంకర్ శ్యామల ఉదయమే మాచర్లలోని పిన్నెల్లి ఇంటికి చేరుకున్నారు. శ్యామల, ఆమె భర్త నరసింహారెడ్డి వెళుతున్న కారును మాచర్ల టౌన్ సీఐ అడ్డుకోగా, కాసేపు వాగ్వాదం చోటుచేసుకుంది.


హైడ్రోజన్ ఇంధనం నడిచే ఎలక్ట్రిక్ కారు మిరాయ్‌తో పార్లమెంటుకు వచ్చిన కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

ఈ పడవకు హైడ్రోజనే ఇంధనం

(మొదటి పేజీ తరువాయి)

కీలక పాత్ర పోషిస్తోంది" అని తెలిపారు. ఈ నౌక పొడవు 24 మీటర్లు. ఏసీ క్యాబిన్ ఉంటుంది. దీనిలో 50 మంది ప్రయాణించవచ్చు. 'హరిత నౌక కార్యక్రమం కింద దేశీయంగా కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో దీనిని నిర్మించారు. ఎలక్ట్రో మెకానికల్ పద్ధతిలో ఇది విద్యుదుత్పత్తి చేసుకుంటుంది. ఇంధనం వాడాక కేవలం నీరు, వేడిమి బయటకు వెలువడతాయి. కాలుష్య ఉద్గారాలు సున్నా. ఎలాంటి రొద చేయకపోవడం దీని ప్రత్యేకతల్లో ఒకటి.

హైడ్రోజన్ కారు 'మిరాయ్'ని నడిపిన కేంద్ర మంత్రి జోషి: కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి గురువారం 'మిరాయ్' కారును నడుపుతూ పార్లమెంటుకు వచ్చారు. హైడ్రోజన్‌తో నడిచే ఈ కారును టయోటా కంపెనీ అభివృద్ధి చేసింది. 'జాతీయ హరిత హైడ్రోజన్ మిషన్'లో భాగంగా టయోటా కిర్లోస్కర్, జాతీయ సౌరవిద్యుత్తు సంస్థ మధ్య గురువారం ఒప్పందం కుదిరినట్లు ఆయన తెలిపారు.

పారిశ్రామికవేత్తలకు 21 రోజుల్లో అనుమతులిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

భేటీ అయ్యారు. 'విమానాశ్రయాలు, పోర్టులు, లాజిస్టిక్స్, రోడ్లు వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో పెట్టుబడులకు కెనడా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి. రాజధాని అమరావతిలో రూ.65 వేల కోట్లతో పనులు చేస్తున్నాం. గూగుల్ విశాఖలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోంది' అని పేర్కొన్నారు. ఏపీ పారిశ్రామికాభివృద్ధికి తమ వంతు సహకారాన్ని అందిస్తామని థామస్ పేర్కొన్నారు.

వెండి కిలో రూ.2,00,000

(మొదటి పేజీ తరువాయి)

కిలో వెండి ధర రూ.1,90,000 కాగా, గురువారం ఒక్కరోజే రూ.10,000కు పైగా పెరిగింది. విలువైన లోహాల ట్రేడింగ్ జరిగే ఎంసీఎక్స్‌లో కూడా 2026 మార్చి కాంట్రాక్టు 1,89,908 వద్ద ప్రారంభమై, రూ.1,98,894 వద్ద స్థిరపడింది. ఒక దశలో జీవనకాల గరిష్ఠమైన రూ.1,98,942కు చేరింది కూడా. లోహం రూపంలో 2024 డిసెంబరు 31న కిలో వెండి ధర రూ.1,04,700 కాగా, ఏడాదిలోపే రూ.95,400 పెరిగింది

■ బంగారం ధర కూడా అంతర్జాతీయంగా ఔన్సు 4285 డాలర్లకు చేరడంతో, దేశీయంగా 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1,34,500 (అన్ని పన్నులతో కలిపి) కు చేరింది.

2024 జూన్ 2 నుంచి అమరావతిని ఏపీ రాజధానిగా గుర్తించండి

(మొదటి పేజీ తరువాయి)

చట్టంలోని సెక్షన్ 5(2)లో చేర్చాలని కోరారు. విభజన చట్టంలో హైదరాబాద్ పదేళ్లపాటు ఉమ్మడి రాజధానిగా ఉంటుందని చెప్పిన నేపథ్యంలో 2024 జూన్ 2 నుంచి అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా పేర్కొనడం సబబుగా ఉంటుందని కేంద్ర హోం శాఖ కార్యదర్శికి తెలిపారు. దీని ఆధారంగా కేంద్ర హోం శాఖ కేబినెట్ నోట్ తయారుచేసి, మంత్రివర్గం ముందుకు తీసుకెళ్లనున్నట్లు తెలిసింది. డిసెంబర్ చివరివారానికల్లా కేబినెట్ ఇందుకు ఆమోదముద్ర వేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ చట్టసవరణ బిల్లు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే బడ్జెట్ సమావేశాల ముందుకు రావొచ్చని తెలిసింది.

ఎంతమంది జగన్‌లు వచ్చినా అడ్డుకోలేరు: పెమ్మసాని

అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా చట్టబద్ధంగా గుర్తిస్తూ విభజన చట్ట సవరణ బిల్లును ఎంతమంది జగన్‌మోహన్‌రెడ్డిలు వచ్చినా అడ్డుకోలేరని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. ఒక నెల అటూ ఇటూ అయినా ఆ బిల్లు పార్లమెంటు ఆమోదం పొంది గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం ఖాయమన్నారు. ఆయన గురువారం ఇక్కడ తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. 'మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన సాక్షి మీడియాలో అమరావతి బిల్లుపై విషం కక్కారు. అమరావతి బిల్లు ఆగిపోయిందని రాక్షసానందం పొందేలా రాయించుకున్నారు. అమరావతికి రాజధాని హోదా 2014 నుంచి ఇవ్వాలా? 2024 నుంచి ఇవ్వాలా? అన్న సాంకేతిక అంశంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని స్పష్టత అడిగారు. ఈసారి కాకపోయినా వచ్చే సమావేశాల్లోనయినా పార్లమెంటులో పెట్టిస్తాం. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల అమరావతిలో 16 జాతీయ సంస్థల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. రూ.3 వేల కోట్లతో కేంద్ర సచివాలయం, అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్, కాగ్ కార్యాలయం, పోస్టల్ శాఖ ప్రాంతీయ కార్యాలయం, కేంద్రీయ విద్యాలయాలు, రూ.2,500 కోట్లతో రైల్వే లైన్, ఔటర్ రింగ్‌రోడ్ ఇలా అన్నీ వస్తున్నాయి. ఇప్పుడు కొన్ని వేల మంది కార్మికులు రాత్రింబవళ్లు పనిచేసి అమరావతి నిర్మిస్తున్నారు. గుంటూరు లోక్‌సభ స్థానం పరిధిలో ఈఎస్‌ఐ ఆసుపత్రి కోసం మా కార్యాలయ సిబ్బంది 30 సార్లు సంబంధిత విభాగాల వద్దకు, నేను ఐదు సార్లు ఆ మంత్రుల వద్దకు వెళ్లాల్సి వచ్చింది. ఒక చిన్న ఆసుపత్రికే ఇంత పని ఉంటే, మహా నగరాన్ని నిర్మించి, అందులోకి ఇన్ని సంస్థలను తీసుకురావాలంటే కేంద్ర, రాష్ట్రాల మధ్య ఎంత సమన్వయం ఉండాలో అర్థం చేసుకోవాలని రాష్ట్ర ప్రజలను కోరుతున్నా. ఇవన్నీ చేయటం చేతకాకే జగన్ కేవలం బటన్ నొక్కుడుతోనే ఐదేళ్లూ గడిపేశారు. ఆయన కనీసం ఒక్క ప్రాజెక్టు పూర్తిచేసి ఉంటే అభివృద్ధి చేయడం ఎంత కష్టమో అర్థమయ్యేది' అని పెమ్మసాని పేర్కొన్నారు.

చంద్రబాబుతో కలిసి వెళ్లడం మంచి పరిణామం

(మొదటి పేజీ తరువాయి)

చేసినట్లు సమాచారం.

తెలంగాణ పార్టీ శైలిపై అసంతృప్తి

తెలంగాణలో భాజపా అనుసరిస్తున్న శైలిపై ప్రధానమంత్రి అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. సామాజిక మాధ్యమాల్లో ఒవైసీ కంటే భాజపా వెనకబడిందని పెదవి విరిచినట్లు సమాచారం. ప్రతిపక్ష పాత్ర సరిగా పోషించట్లేదని ఎంపీలపై అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. సామాజిక మాధ్యమాల కోసం మంచి బృందాన్ని పెట్టుకొని అధికార, ఇతర ప్రతిపక్షాలను సమర్థంగా ఎదుర్కోవడానికి వచ్చిన సమస్య ఏంటని ప్రశ్నించినట్లు తెలిసింది. రాష్ట్రంలో పార్టీ పెరగడానికి మంచి అవకాశం ఉన్నా దాన్ని ఉపయోగించుకోవడంలో విఫలమవుతున్నామని అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. జాతీయ పరిణామాలపైనా తెలుగు రాష్ట్రాల ఎంపీలు చురుగ్గా ఉండాలని నిర్దేశించినట్లు తెలిసింది. వివిధ రాష్ట్రాల్లో పర్యటించి జాతీయ పరిణామాల గురించి ప్రజల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేయాలని వారికి ఉపదేశించారు.

ఎన్డీయే ఎంపీలకు ప్రధాని మోదీ విందు

ఈనాడు, దిల్లీ: ఎన్డీయే ఎంపీలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం రాత్రి తన నివాసంలో విందు ఇచ్చారు. పార్లమెంటు సమావేశాల సందర్భంగా మర్యాదపూర్వకంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణల నుంచి భాజపా, తెదేపా, జనసేన ఎంపీలు, కేంద్రమంత్రులు పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి ఎంపీల టేబుళ్ల వద్దకు వచ్చి అందరికీ అభివాదం చేసిన అనంతరం పార్టీల ఫ్లోర్‌లీడర్లతో కలిసి కూర్చున్నారు. వారితోనే సుమారు గంటన్నరకు పైగా విభిన్న అంశాలపై మాట్లాడారు. వారి మధ్య రాజకీయాలకు అతీతమైన సంభాషణ జరిగినట్లు తెలిసింది. ముఖ్యంగా నాయకులంతా ప్రధాని నరేంద్రమోదీ జీవనవిధానం, ప్రజలకు చేరువగా ఉండటానికి ఆయన తీసుకొనే చర్యలు, ప్రజల జీవితంలో మార్పులు తెచ్చేందుకు చేపట్టే పథకాలు, సమయపాలన గురించి అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. ప్రధానమంత్రి అందరితో ఆహ్లాదంగా మాట్లాడినట్లు తెలిసింది.

శరవేగంగా కులశేఖరపట్టిణం ప్రయోగ వేదిక నిర్మాణం

ఇస్రో ఛైర్మన్ నారాయణన్



చెన్నై (టీనగర్), న్యూస్‌టుడే: భారత అంతరిక్ష రంగం దేశానికి గొప్ప కీర్తి తీసుకొచ్చిందని ఇస్రో ఛైర్మన్ నారాయణన్ పేర్కొన్నారు. గురువారం తమిళనాడులోని తిరునెల్వేలిలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. "గగన్‌యాన్ ప్రాజెక్టుకు సంబంధించి రాకెట్ తయారీ పనులు చివరిదశలో ఉన్నాయి. వ్యోమగాముల భద్రతలో భాగంగా అంతరిక్షంలో ఆక్సిజన్, ఉష్ణోగ్రత, పీడనం వంటి వాటిని నియంత్రించే వ్యవస్థను అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నాం. రాకెట్‌లో ఏదైనా సమస్య తలెత్తినప్పుడు వ్యోమగాములు రక్షించుకునే అంశాలపై పరీక్షలు విజయవంతంగా నిర్వహించాం. 2035 నాటికి సొంత అంతరిక్ష కేంద్రాన్ని పూర్తిగా నిర్మించాలని ప్రధాని మోదీ సూచించారు. తమిళనాడులోని కులశేఖరపట్టిణం రాకెట్ ప్రయోగ వేదిక నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 2027 నుంచి ఇక్కడ రాకెట్ ప్రయోగాలు నిర్వహిస్తాం'' అని పేర్కొన్నారు.

15 రోజుల్లోనే ఎఫ్‌సీఐకి 1.72 లక్షల టన్నుల బియ్యం

ఈనాడు, అమరావతి: ధాన్యం సేకరణ ప్రారంభమైన తర్వాత 15 రోజుల్లోనే సీఎంఆర్ కింద భారత ఆహార సంస్థకు 1,71,651 టన్నుల బియ్యం పంపడం రాష్ట్రంలోనే రికార్డు అని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. డిసెంబరు 10న రాష్ట్రవ్యాప్తంగా 1,46,607 టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం మరో రికార్డు అని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 3,24,296 మంది రైతుల నుంచి 20.64 లక్షల టన్నుల ధాన్యం సేకరించి రైతుల ఖాతాల్లో రూ.4,609.89 కోట్లు జమ చేశామన్నారు. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో అధిక దిగుబడి, తుపాను నేపథ్యంలో అత్యవసర చర్యలు చేపట్టామని తెలిపారు.

తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో తొలివిడతలో హస్తం హవా

రెండువేలకు పైగా సర్పంచి స్థానాల్లో కాంగ్రెస్ మద్దతుదారుల విజయం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ పల్లెపోరులో హస్తం సత్తా చాటింది. గురువారం జరిగిన తొలివిడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అర్ధరాత్రి 12 గంటల వరకు వెల్లడైన ఫలితాల మేరకు ఏకగ్రీవాలతో కలుపుకొని అధికార కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు 2221 సర్పంచి స్థానాల్లో విజయదుందుభి మోగించారు. సిద్దిపేట, కుమురంభీం మినహా మిగిలిన జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ స్థానాలను కైవసం చేసుకుంది. పలు చోట్ల గట్టిపోటీ ఇచ్చిన ప్రతిపక్ష భారాస 1128 పంచాయతీలను గెలిపొందింది. స్వతంత్ర అభ్యర్థులు 508 చోట్ల విజయం సాధించారు. వీటిలో సీపీఎం 15, సీపీఐ 10 చోట్ల గెలిచాయి. భాజపా రెండువందల లోపు స్థానాలకు పరిమితమైంది. తొలివిడత ఎన్నిక జరిగే ప్రాంతాల్లో 396 పంచాయతీలు ఏకగ్రీవం కాగా.. 3,834 సర్పంచి, 27,678 వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్ జరిగింది.

జిల్లా గ్రంథాలయ సంస్థలకు ఛైర్మన్ల నియామకం

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా 13 ఉమ్మడి జిల్లాల గ్రంథాలయ సంస్థలకు ఛైర్మన్లను ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం ప్రకటించారు. ఇందులో తెదేపాకు 10, జనసేనకు 2, భాజపాకు 1 చొప్పున కేటాయించారు.

(c) eenadu

అమరావతి క్వాంటమ్ వ్యాలీకి మరింత సొబగు



- మరో 7 ప్రాజెక్టులకు మంత్రిమండలి పచ్చజెండా
- రాష్ట్రంలో ఇంకో 23 ప్రాజెక్టులకూ ఆమోదం
- విశాఖ, తిరుపతిల్లో స్టార్ హోటళ్లు, బాపట్లలో బీచ్ రిసార్టులకు సమ్మతి

ఈనాడు, అమరావతి: రాష్ట్ర మంత్రిమండలి గురువారం రూ.16,060 కోట్ల విలువైన 30 కొత్త ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. క్యాబినెట్ నిర్ణయాలను మంత్రి కొలుసు పార్థసారథి విలేకర్లకు వెల్లడించారు. 'దేశంలోనే తొలిసారిగా ఏపీ ప్రభుత్వం అమరావతిలో క్వాంటమ్ మిషన్ చేపడుతోంది. ఒకప్పుడు ఐటీ విప్లవంలా భవిష్యత్తును క్వాంటమ్ కంప్యూటర్ ప్రభావితం చేస్తుంది. కొత్తగా మరో ఏడు క్వాంటమ్ అనుసంధాన ప్రాజెక్టులు అమరావతికి రాబోతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌ను క్వాంటమ్ కంప్యూటర్ రంగంలో ఇవి ఉన్నతస్థాయికి తీసుకువెళ్తాయి. అనేక ఉపాధి అవకాశాలు కల్పిస్తాయి. మరోవైపు ఆతిథ్య రంగంలో విశాఖ, తిరుపతి నగరాల్లో 5 స్టార్ హోటళ్లు వస్తున్నాయి. బాపట్లలో బీచ్ రిసార్టులు కొత్తగా రాబోతున్నాయి' అని మంత్రి వివరించారు. మంత్రివర్గం ఆమోదించిన కొత్త ప్రాజెక్టుల వివరాలివీ..

అమరావతి క్వాంటమ్ వ్యాలీలో ప్రాజెక్టులు

1. క్యూపీఐఏఐ ఇండియా లిమిటెడ్: రూ.47.6 కోట్ల పెట్టుబడి. 2026 జూన్ నాటికి ప్రాజెక్టు ప్రారంభం. విద్యార్థులకు ఉచిత క్వాంటమ్ శిక్షణ, క్వాంటమ్ కంప్యూటర్‌పై ప్రాక్టికల్ అనుభవం, పరిశోధనలు, పేటెంట్ల అభివృద్ధికి అవకాశం. దీని వల్ల యువతకు అధిక వేతనాలతో ఉద్యోగాలొచ్చే అవకాశాలున్నాయి. భవిష్యత్తు సాంకేతికతలో ఏపీ ముందడుగు వేయనుంది.

2. క్యూబిటెక్ స్మార్ట్ సొల్యూషన్స్ లిమిటెడ్: రూ.15 కోట్ల పెట్టుబడితో నేషనల్ క్వాంటమ్ రిఫరెన్స్ సౌలభ్యం కల్పిస్తుంది. 2.5 ఎకరాల్లో ఏర్పాటయ్యే ఈ సంస్థ 2026 మే నాటికి ప్రారంభమవుతుంది. ఏపీని క్వాంటమ్ హార్డ్‌వేర్‌లో దేశంలో అత్యుత్తమ స్థాయిలో నిలపడం, స్టార్టప్‌లకు టెస్టింగ్ సౌకర్యాలు, యువతకు క్వాంటమ్ ఇంజినీరింగ్ నైపుణ్యాలు కల్పించడం దీని లక్ష్యం. క్వాంటమ్ పాలసీ 2030 మేరకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీలు కల్పించింది.

3. సైబ్రానెక్స్ టెక్నాలజీస్ కన్సల్టెన్సీ ప్రైవేట్ లిమిటెడ్: రూ.9.80 కోట్ల పెట్టుబడి. క్వాంటమ్ ఆల్గరిథమ్స్‌ను అభివృద్ధి చేయడమే కాక యువతకు శిక్షణ ఇస్తుంది. పోస్ట్ క్వాంటమ్ సెక్యూరిటీని కల్పిస్తుంది. 10 వేల చదరపు అడుగుల కార్యాలయ స్థలంలో ఏర్పాటవుతుంది. 12 వారాల్లోనే పైలట్ ప్రాజెక్టులు ప్రారంభిస్తారు.

4. క్యూబిట్స్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్: రూ.36.50 కోట్ల పెట్టుబడి. ఐదెకరాల్లో ఏర్పాటు. 2028లో ప్రారంభమవుతుంది. క్వాంటమ్ సెన్సర్లు, చిప్ ఆధారిత లేజర్లు తయారు చేస్తుంది. దీని వల్ల క్వాంటమ్ ఇంజినీరింగ్ ఫొటోనిక్సన్, ఏఐలో నైపుణ్య ఉద్యోగాల కల్పన. రక్షణ, ఆరోగ్య, ఇంధన రంగాల్లో సేవలందుతాయి.

5. సెంటిల్లా సైంటిఫిక్ లిమిటెడ్: రూ.6.25 కోట్ల పెట్టుబడి. 2,500 చదరపు గజాల్లో కార్యాలయం ఏర్పాటు. 2026 జూన్‌లోపు ప్రారంభం. దీని వల్ల ఔషధ అభివృద్ధి ఖర్చు 60% తగ్గింపు, సమయం 25% ఆదా.

6. 42 టెక్నాలజీ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్: రూ.9.45 కోట్ల పెట్టుబడి. అమరావతిని దేశంలోనే మొదటి క్వాంటమ్ సేఫ్ డిజిటల్ రాష్ట్రంగా నిలపడం. పౌరుల డేటాకు భవిష్యత్తు ముప్పు నుంచి రక్షణ. మూడేళ్లలో 25 స్టార్టప్‌ల స్థాపనకు తోడ్పడటం.

7. క్యూక్రెర్వోయన్స్ క్వాంటమ్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్: అమరావతిలో రూ.14 కోట్ల పెట్టుబడి. 2026 జనవరిలో ప్రారంభం. ప్రభుత్వ డిజిటల్ సేవలకు అత్యాధునిక భద్రత కల్పిస్తుంది. క్రిటికల్ అప్లికేషన్లకు క్వాంటమ్ సేఫ్ సెక్యూరిటీ అందిస్తుంది. విద్యార్థులకు క్వాంటమ్ ల్యాబ్ శిక్షణ, సర్టిఫికెట్లు ఇస్తుంది.

కంపెనీ	పెట్టుబడి (రూ.కోట్లలో)	ప్రయోజనాలు	ఉపాధి/ఉద్యోగాలు
ఇన్ఫో కిసాన్ సెజ్	870	2,776 ఎకరాల్లో బహుళ ఉత్పత్తుల సెజ్ అభివృద్ధి	70,000
విరూపాక్ష ఆర్గానిక్స్	1,225	100.23 ఎకరాల్లో డ్రగ్ ఇంటర్మీడియట్స్ తయారీ	2,000
కృష్ణాపురం ఇన్‌ఫ్రా	గత ప్రాజెక్టుకు మరింత గడువు	మాస్ ఫ్యాబ్రిక్ పార్క్ ఏర్పాటుతో ఆర్థిక కార్యకలాపాలు	-
టీజీవీ క్రాక్	1,216.60	కాస్టిక్ సోడా ప్లాంట్, 70 మెగావాట్ల సౌర విద్యుత్తు ప్లాంట్	400
రెన్యూ ఫోటోవోల్టాయిక్స్	3,990	6జీడబ్ల్యూ సోలార్ పీవీ ఇన్‌గాట్ వేఫర్ తయారీ యూనిట్	1200
శ్రీ వేంకటేశ్వర బయోటెక్	122	600 టీపీడీ స్ట్రాప్స్ ప్లాంట్ (రైతులకు మార్కెట్ విస్తరణ, ఆహారభద్రత)	184
ఎమర్జ్ గ్లాస్ ఇండస్ట్రీ	182	గ్లాస్ షీట్ తయారీ యూనిట్ విస్తరణ (నిర్మాణ రంగానికి మెరుగైన సరఫరా	415
జైట్ ఎనర్జీ	305.9	సౌర పీవీ మాడ్యూల్ తయారీ యూనిట్	300
రామన్ సింగ్ గ్లోబల్ ఫుడ్ పార్క్	141	ఏలూరులో ఫుడ్ ప్రాసెసింగ్ పార్కు	600
గాయత్రి రెన్యువబుల్ ఫ్యూయల్స్	320	నెల్లూరులో బయోఫ్యూయల్ అనుబంధ ప్రాజెక్టు (పర్యావరణహిత ఇంధన ఉత్పత్తి	700
మల్లాది (డ్రగ్స్, ఫార్మాస్యూటికల్స్)	343	తిరుపతిలో ఫార్మా విస్తరణ (ఔషధ రంగ ఎగుమతులు)	355
ఎలైట్ ఉమెన్ ఎంఎస్‌ఎంఈ	22.48	31.77 ఎకరాల్లో మహిళల కోసం ప్రత్యేక పారిశ్రామిక పార్క్	2,000
మాస్ ఫ్యాబ్రిక్ పార్క్	200	714 ఎకరాల్లో బహుళ ప్రయోజనాల పార్క్	35,000
టెలీయస్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్	350	సాఫ్ట్ డ్రింక్స్, ప్యాకేజ్ వాటర్ తయారీ యూనిట్	-
పీవీఆర్ హాస్పిటాలిటీ	225.30	విశాఖపట్నం ఎండాడలో 3 ఎకరాల్లో బ్రాండ్ హయాత్ 5 స్టార్ హోటల్	1,230
మెగ్నస్ రీటెయిల్	348.12	విశాఖ మధురవాడలో 5 ఎకరాల్లో హిల్టన్ 5 స్టార్ హోటల్	1,700
యాగంటి ఎస్టేట్స్	61.32	బాపట్ల బీచ్ పాండురంగాపురం సొంత భూమిలో రాడిసన్ రిసార్ట్	750
నంది హోటల్స్	149.65	తిరుపతి అక్కారంపల్లిలో 88 సెంట్లలో హిల్టన్ గార్డెన్ 4 స్టార్ హోటల	622
స్వర హోటల్స్	250	తిరుపతి ఆర్‌సీ గ్రామంలో 20 ఎకరాల్లో హోటల్ నిర్మాణం	1,500

ఇతర ప్రాజెక్టులు

● **సిఫ్ఫా టెక్ ప్రైవేట్ లిమిటెడ్:** తిరుపతి జిల్లా నాయుడుపేటలో రూ.1,140 కోట్ల పెట్టుబడి. 2026 ఫిబ్రవరికి తొలిదశ ప్రారంభం. పెట్టుబడిలో 63% రాయితీ. 1,251 ఉద్యోగాల కల్పన.

● **శ్రీ తమ్మిన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ లిమిటెడ్:** విశాఖపట్నం మధురవాడలో రూ.62 కోట్ల పెట్టుబడి. 81 సెంట్ల భూమి కేటాయింపు. 2026 డిసెంబర్ నాటికి ప్రారంభం. 500 మంది యువతకు ఉద్యోగాలతో పాటు స్థానిక యువతకు అంతర్జాతీయ స్థాయి ప్రాజెక్టుల్లో అనుభవం కల్పించడం.

● **ఏసీఎన్ హెల్త్‌కేర్ ఆర్‌సీఎం సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్:** విశాఖపట్నంలోని మధురవాడలో రూ.30 కోట్ల పెట్టుబడి. విశాఖలో 600 హెల్త్‌కేర్ ఐటీ ఉద్యోగాల కల్పన.

● విశాఖపట్నంలోని మధురవాడలో రూ.50.60 కోట్లతో నాన్‌రెల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఏపీ సాఫ్ట్ ప్రాడక్ట్ డెవలప్‌మెంట్ లిమిటెడ్ కంపెనీ ఏర్పాటు చేస్తోంది. ఎకరా భూమి కేటాయింపు. 12 నెలల్లో ప్రాజెక్టు ప్రారంభం. విశాఖలో 567 ఉద్యోగాల కల్పన.

భూముల కేటాయింపుల వివరాలు https://epaper.eenadu.net లో

శ్రీచరణికి 2.5 కోట్ల నగదు, (గ్రూప్)-I ఉద్యోగం

ఈనాడు, అమరావతి: ఇండియా తొలిసారిగా గెలిచిన మహిళల అంతర్జాతీయ ప్రపంచ క్రికెట్ కప్‌లో పాల్గొన్న బృందంలో ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహించిన అంతర్జాతీయ క్రికెటర్ ఎన్.శ్రీచరణికి రూ.2.50 కోట్ల నగదు అందించేందుకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. అలాగే కడప నగరంలో ఇంటి స్థలం కేటాయింపుతో పాటు ఆమె గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన తర్వాత గ్రూప్-1 ఉద్యోగం ఇచ్చేందుకు ఆమోదముద్ర వేసింది. రాష్ట్ర క్రీడల విధానంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంది.

● రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు 3.64% చొప్పున కరవు భత్యం చెల్లించేందుకు గతంలో ఇచ్చిన జీవో 28కి రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

నిర్మాణ రంగంలో నైపుణ్యాభివృద్ధికి రాజధానిలో శిక్షణ

- సీఎంతో క్రెడాయ్ ప్రతినిధులు



సీఎంకు క్రెడాయ్ కార్యక్రమాలు వివరిస్తున్న ప్రతినిధులు

ఈనాడు, అమరావతి: నిర్మాణ పనుల్లో నాణ్యత, ఉత్పాదకతను పెంచే లక్ష్యంతో రాజధాని అమరావతిలో పెద్ద స్థాయిలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు భారత స్థిరాస్తి వ్యాపార అభివృద్ధి సమాఖ్య (క్రెడాయ్) ప్రణాళికలు సిద్ధం చేస్తోందని ఆ సమాఖ్య రాష్ట్ర కమిటీ తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు బాయన శ్రీనివాసరావు, ఛైర్మన్ బుడ్డిగా శ్రీనివాస్, కార్యదర్శి దాసరి రాంబాబుతో పాటు పలువురు ప్రతినిధులు సీఎం చంద్రబాబును సచివాలయంలో గురువారం కలిశారు. రాష్ట్రంలో స్థిరాస్తి వ్యాపార రంగం అభివృద్ధికి ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాలపై ఈ సందర్భంగా సీఎంకు వారు ధన్యవాదాలు చెప్పారు. ఈ నెల 19, 20 తేదీల్లో దిల్లీలో జరగనున్న క్రెడాయ్ జాతీయ సదస్సు వివరాలను ముఖ్యమంత్రికి వివరించారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో పాటు ఇతర కేంద్ర మంత్రులు, ఐదు రాష్ట్రాల సీఎంలు సదస్సులో పాల్గొంటారని తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. "చంద్రబాబు నాయకత్వంలో గత 18 నెలల్లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, సంస్కరణలు స్థిరాస్తి వ్యాపార రంగంలో నూతన ఉత్సాహాన్ని నింపాయి. భవన నిర్మాణ అనుమతులకు సంబంధించిన నిబంధనల సవరణ, నాలా రద్దు వంటి నిర్ణయాలు స్థిరాస్తి వ్యాపార అభివృద్ధికి ఎంతో దోహదం చేశాయి. అనుమతులు వేగవంతం చేయడం ద్వారా నమ్మకం పెరిగింది" అని పేర్కొన్నారు.

రూ.200 కోట్లతో 'క్వాంటమ్'లో పరిశోధనలు

- సీఎం చంద్రబాబుతో చర్చించిన విదేశీ బృందం
- గ్లోబల్ క్వాంటమ్ బయో ఫౌండ్రీ ఏర్పాటుకు ప్రతిపాదన

ఈనాడు, అమరావతి: అమరావతిలో ఏర్పాటు కానున్న క్వాంటమ్ వ్యాలీ విద్య, వైద్యం, ఔషధాలు సహా వివిధ రంగాలకు సేవలు అందించే కేంద్రంగా పనిచేయాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. వివిధ దేశాల నుంచి వచ్చిన పరిశోధకులు, విద్యావేత్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల బృందంతో సచివాలయంలో ముఖ్యమంత్రి గురువారం సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. 'దేశంలోనే తొలి క్వాంటమ్ బయోమెడికల్ రీసెర్చ్ ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నాం. వైద్యం, ఆరోగ్యం, ఔషధాల రూపకల్పన సహా వివిధ అంశాల్లో విస్తృతంగా పరిశోధనలు జరగాలి. క్వాంటమ్ పరిశోధనల్లో బయోసెన్సర్ల వంటి అప్లికేషన్లను అందుబాటులోకి తేవాలి. క్వాంటమ్ వ్యాలీ వల్ల అమరావతిలో క్వాంటమ్ ఎకో సిస్టమ్ ఏర్పడుతోంది. గతంలో అందిపుచ్చుకున్న ఐటీ, జీనోమ్ వ్యాలీ వంటివి ఇప్పుడు విజయగాథలుగా మారాయి. ఇప్పుడు క్వాంటమ్ రంగంలో పనిచేయడానికి ఔత్సాహిక కంపెనీలు ఏపీని సంప్రదిస్తున్నాయి. బయోమెడికల్ రీసెర్చ్‌తో పాటు వ్యవసాయం, విద్య, వైద్యం, రక్షణ, రవాణా సహా వివిధ రంగాల్లో క్వాంటమ్ వ్యాలీ సేవలు వినియోగించుకునేందుకు వీలుగా ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేస్తాం' అని తెలిపారు. రూ.200 కోట్ల పెట్టుబడితో గ్లోబల్ క్వాంటమ్ బయోఫౌండ్రీ ద్వారా మాలిక్యులర్ మోడలింగ్, డ్రగ్ డిస్కవరీ సిమ్యులేషన్స్, మెటీరియల్ సైన్స్‌పై పరిశోధనలు జరపనున్నట్లు బృందం ముఖ్యమంత్రికి వివరించింది. వైద్య రంగంలో నూతన ఔషధాల తయారీతో పాటు మెటీరియల్ సైన్స్‌పై పరిశోధనలకు గ్లోబల్ క్వాంటమ్ బయో ఫౌండ్రీని ఏర్పాటు చేసేందుకు సిద్ధమని తెలిపింది.

సమస్యలు పరిష్కరించే బాధ్యత నాది..

బాధితుల్లో ధైర్యం నింపిన ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రాష్ట్రం నలుమూలల నుంచి పలు సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి సీఎం చంద్రబాబు వినతులు స్వీకరించారు. మంత్రివర్గ సమావేశం అనంతరం గురువారం మధ్యాహ్నం మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయానికి వచ్చిన సీఎం.. నేరుగా బాధితుల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు. పలువురు వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారు తమకు ఆర్థిక సహాయం అందించాలని ముఖ్యమంత్రిని కోరారు. సమస్యలు పరిష్కరించే బాధ్యత తనదని సీఎం భరోసా ఇచ్చారు.

పవన్‌కల్యాణ్‌కు మంత్రుల కృతజ్ఞతలు



ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలుపుతున్న మంత్రులు వంగలపూడి అనిత, డీవీబీ స్వామి, అనగాని సత్యప్రసాద్, సవిత, నిమ్మల రామానాయుడు

ఈనాడు, అమరావతి: గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంపై ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు పలువురు మంత్రులు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం మంత్రివర్గ సమావేశానికి ముందు ఆయనను మంత్రులు పయ్యావుల కేశవ్, అనిత, నారాయణ, నాదెండ్ల మనోహర్, సవిత, డోలా బాల శ్రీవీరాంజనేయస్వామి, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, రాంప్రసాద్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, కందుల దుర్గేశ్ కలిశారు. వైకాపా హయాంలో విధ్వంసమైన రహదారులతో ప్రజలు చాలా అవస్థలు పడ్డారని, ఆ రోడ్లు ఇప్పుడు బాగవుతున్నాయని పేర్కొన్నారు. అందుకే ప్రజల తరఫున తాము కృతజ్ఞతలు చెబుతున్నామని వెల్లడించారు.

రుషికొండ ప్యాలెస్‌పై తేల్చరేం?

- మంత్రివర్గ ఉపసంఘం జాప్యంపై సీఎం అసహనం
- ఇన్‌ఛార్జి మంత్రులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించట్లేదని అసంతృప్తి
- చేనేతలకు ఉచిత విద్యుత్ పథకం వెంటనే అమల్లోకి తేవాలని ఆదేశం

ఈనాడు, అమరావతి: విశాఖలోని రుషికొండపై వైకాపా ప్రభుత్వం రూ.450 కోట్ల ప్రజాధనాన్ని వెచ్చించి నిర్మించిన విలాసవంతమైన ప్యాలెస్‌లను ఎలా వినియోగంలోకి తేవాలన్న అంశాన్ని మంత్రివర్గ ఉపసంఘం ఇంకా కొలిక్కి తేకపోవడంపై ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం మంత్రివర్గ సమావేశంలో ఆ అంశం చర్చకు వచ్చినప్పుడు.. 'వీళ్లేమీ తేల్చడం లేదు. మంత్రివర్గ ఉపసంఘంలో ఎవరెవరు ఉన్నారు' అని ఆయన ప్రశ్నించారు. పయ్యావుల కేశవ్, డోలా బాలవీరాంజనేయస్వామి, కందుల దుర్గేష్ ఉన్నారని మంత్రులు తెలిపారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జోక్యం చేసుకుని త్వరగా పూర్తి చేయాలని దుర్గేష్‌కి సూచించారు. త్వరలోనే దానికొక పరిష్కారం కనుక్కోండని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలుపై ఇన్‌ఛార్జి మంత్రులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడం లేదని ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. 'పరిశ్రమలకు భూములు కేటాయిస్తున్నాం. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఇళ్లపై సౌర విద్యుత్ ప్యానళ్ల ఏర్పాటుకు సూర్యఘర్ వంటి పథకాల్ని ఉచితంగా అందజేస్తున్నాం. అవి ఎలా అమలవుతున్నాయో చూడాల్సిన బాధ్యత ఇన్‌ఛార్జి మంత్రులకు లేదా? ఎక్కడికెళ్లినా రెవెన్యూ సమస్యలపై అర్జీలు వస్తున్నాయి. వాటి పరిష్కారానికి మీరు చొరవ చూపాలి కదా? మీరు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి సమస్యలేమైనా ఉంటే నా దృష్టికి తేవాలే తప్ప మీ పనీతీరును నేను సమీక్షించాల్సిన పరిస్థితి తీసుకొస్తే ఎలా?' అని ఆయన ప్రశ్నించారు.

మంత్రులకు క్రమశిక్షణ లేకపోతే ఎలా?

ఆలస్యంగా వచ్చిన మంత్రులపై సీఎం ఆగ్రహం



మంత్రివర్గ సమావేశానికి ఆలస్యంగా వచ్చిన కొందరు మంత్రులపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. 'క్రమశిక్షణ లేకపోతే ఎలా? సమయపాలన అక్కర్లేదా' అని మందలించారు. మంత్రివర్గ సమావేశం మొదలై ఎజెండాలోని తొలి అంశంపై చర్చ పూర్తయ్యాక రెవెన్యూ మంత్రి ఫోన్ రింగవడంతో సీఎం కొంత అసహనానికి లోనయ్యారు. అదే సమయంలో వాసంశెట్టి సుభాష్ తలుపు తీసుకుని లోపలికి వచ్చారు. తర్వాత గుమ్మిడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్ వచ్చారు. దాంతో సీఎం సీరియస్ అయ్యారు. 'క్యాబినెట్ సమావేశానికే ఆలస్యంగా వస్తే ఎలా? ఇలా మధ్యలో వస్తే ఆటంకం కాదా? వర్క్ మూడ్ దెబ్బతింటుంది కదా?' అని ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఆయన ఆ మాటలు అంటుండగానే.. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమావేశ మందిరంలోకి వచ్చారు. సాధారణంగా ఉదయం 11 గంటలకు మొదలై మధ్యాహ్నం 2-3 గంటల వరకు జరిగే మంత్రివర్గ సమావేశం గురువారం ఉదయం 10.30 గంటలకే మొదలై 12.45 గంటలకు ముగిసింది. ఎజెండాలోని అంశాల్లో ఎక్కువ భాగం ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదించినవే కావడంతో, పెద్దగా చర్చ లేకుండా వేగంగా ముగించారు. ఎజెండాలో 42 అంశాలుండగా సమావేశం ముగింపు దశలో సీఎంకి ముఖ్యమైన ఫోన్ వచ్చింది. దాంతో ఆయన ఎజెండాలో ఇంకా ఎన్ని అంశాలున్నాయని ప్రశ్నించారు. ఒకటే ఉందని సీఎస్ బదులివ్వడంతో మీరు చర్చించి సమావేశం ముగించేయండని చెప్పి సీఎం బయటకు వెళ్లిపోయారు.

చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని ఎందుకు ఆపారు?

చేనేత కార్మికులకు ప్రతి నెలా మగ్గానికి 200 యూనిట్ల వరకు, మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలని గతంలోనే క్యాబినెట్ నిర్ణయించినా పథకం ఇంత వరకు అమలవలేదని మంత్రులు అచ్చెన్నాయుడు, సవిత చెప్పారు. ఆ ప్రతిపాదనను ఆర్థికశాఖలో పెండింగ్‌లో పెట్టారని తెలిపారు. సూర్యఘర్ పథకం కింద ప్రతి ఇంటికీ సౌర విద్యుత్ ప్యానళ్లు ఏర్పాటు చేయాలనుకుంటున్నప్పుడు ఉచిత విద్యుత్ పథకం అవసరం లేదని ఆపామని ఆర్థికశాఖ అధికారులు సీఎంకి వివరించారు. 'అది తర్వాత వస్తుంది. అప్పటిలోగా అర్హులకు పథకం అమలు చేయాలి కదా? ముందు దాన్ని క్లియర్ చేయండి' అని సీఎం స్పష్టం చేశారు.

ఆ స్థలాల వినియోగంపై ప్రత్యామ్నాయాలు ఆలోచించండి

వైకాపా ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో చాలా చోట్ల ఊరికి దూరంగా, నివాసానికి అనువుగానిచోట పేదలకు స్థలాలు కేటాయించిందని, వాటిలో ఇళ్లు కట్టుకునేందుకు ఎక్కువ మంది ఆసక్తిగా లేరని, ఆ స్థలాల్ని రద్దు చేద్దామన్నా కుదరడం లేదని కొందరు మంత్రులు సీఎం దృష్టికి తెచ్చారు. వాటిని లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేయడంతో రద్దు సాధ్యం కాదని అధికారులు చెబుతున్నారన్నారు. స్థలాలు కేటాయించాక ఆరు నెలల్లోగా ఇల్లు కట్టుకోకపోతే రద్దు చేయవచ్చన్న నిబంధనలు ఉన్నాయని కొందరు తెలిపారు. అక్కడ ఉండేందుకు ఇష్టపడి ఇళ్ల నిర్మాణం ప్రారంభించినవారిని కట్టుకోనివ్వాలని, అసలు నిర్మాణాలు మొదలుపెట్టని స్థలాల్ని ఎలా వినియోగంలోకి తేవాలన్న అంశంపై ఒక కమిటీ ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయాలు ఆలోచించాలని సీఎం సూచించారు.

రోడ్లపై సంక్రాంతికి ప్రజల ఫీడ్‌బ్యాక్ తీసుకోవచ్చా?

రాష్ట్రంలోని రోడ్లపై ఈ నెలాఖరుకు గుంతలు లేకుండా చేస్తారా? రోడ్ల పరిస్థితిపై సంక్రాంతికి ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల అభిప్రాయం తీసుకోవచ్చా? అని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. చేస్తామన్నట్లుగా ఆయన తలూపారు. రవాణా, రోడ్లు భవనాలు, మౌలిక వసతులు, పెట్టుబడుల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణబాబును ఉద్దేశించి.. 'మిమ్మల్ని ఐ అండ్ ఐకి తెచ్చింది ఎందుకు? మీరు వచ్చాక మార్పు చూపించాలి కదా? పెట్టుబడులు తేవాలి కదా?' అని సీఎం వ్యాఖ్యానించారు.

దేవాదాయ, అటవీ, పర్యాటక శాఖలు కలిసి పనిచేయాలి: పవన్ కల్యాణ్

పర్యాటకుల్ని ఆకర్షించేందుకు దేవాదాయ, అటవీ, పర్యాటక శాఖలు సంయుక్తంగా ప్రాజెక్టులు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. 'గోదావరి, కృష్ణా పుష్కరాలు రాబోతున్న నేపథ్యంలో ఇలాంటి ప్రాజెక్టులు చేపట్టడం చాలా అవసరం. వాటిపై దృష్టిసారించండి. రాష్ట్రాన్ని ప్రమోట్ చేసేలా ఈ మూడు శాఖలు సమన్వయంతో వీలైనన్ని ఎక్కువ పర్యాటక కార్యక్రమాలు నిర్వహించాలి. రాష్ట్రానికి పర్యాటకులను ఆకర్షించాలి. జీఎస్‌డీపీ పెరిగేలా చూడాలి' అని అధికారులను సీఎం ఆదేశించారు.


■ రాష్ట్రవ్యాప్తంగా 10-15 చోట్ల హోటళ్ల నిర్మాణానికి ఒకే వేదికపై నుంచి శంకుస్థాపన చేద్దామని ముఖ్యమంత్రి సూచించారు. వచ్చే నెలలో దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాలకు వెళ్లేలోగా ఈ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు.

కళ్యాణదుర్గం మున్సిపల్ ఛైర్మన్ పీఠం తెదేపా కైవసం



మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైన తలారి గౌతమికి ధ్రువీకరణపత్రం అందజేస్తున్న ప్రిసైడింగ్ అధికారి వసంతబాబు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మున్సిపల్ ఛైర్మన్ పీఠాన్ని తెదేపా కైవసం చేసుకుంది. మున్సిపల్ కార్యాలయంలో గురువారం ప్రిసైడింగ్ అధికారి వసంతబాబు సమక్షంలో జరిగిన ఎన్నికకు తెదేపా తరఫున 11 మంది కౌన్సిలర్లు, ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. వైకాపా నుంచి 11 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. ఈ మున్సిపాలిటీలో మొత్తం 24 వార్డులుండగా 22 మంది కౌన్సిలర్లు సమావేశానికి వచ్చారు. ఛైర్మన్ అభ్యర్థులుగా తెదేపా తరఫున 15వ వార్డు కౌన్సిలర్ తలారి గౌతమి, వైకాపా తరఫున 14వ వార్డు కౌన్సిలర్ లక్ష్మన్నను నిలిపారు. తెదేపా అభ్యర్థికి 13 మంది, వైకాపా అభ్యర్థికి 11 మంది మద్దతు తెలిపారు. తెదేపాకే మెజార్టీ ఉండటంతో గౌతమిని ఛైర్‌పర్సన్‌గా ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. వైకాపాకు 13 మంది కౌన్సిలర్ల బలం ఉండగా ఇద్దరు గైర్హాజరయ్యారు. మరోవైపు కొంత కాలంగా వాయిదా పడుతూ వస్తున్న శ్రీసత్యసాయి జిల్లా రామగిరి ఎంపీపీ పదవి సైతం తెదేపా పరమైంది. కుంటిమద్ది ఎంపీటీసీ సభ్యురాలు కప్పల సాయిలీల మండలాధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



సరస్సు అందంగా ఉందని అందులో పడుకోగలమా!

నిర్మలంగా ఉండే సరస్సు చూడటానికి అందంగా ఉండొచ్చు. కానీ అందులోని నీటిపై పడుకోలేం కదా! అదే విధంగా పైపై మెరుగులతో ఆకర్షించేవాటిని చూసి మనం మోసపోకూడదు. ఏ విషయాన్నైనా ఉపరితలం వరకే పరిమితం కాకుండా లోతుగా అధ్యయనం చేయాలి. అప్పుడే నిజానిజాలేంటో తెలిసొస్తాయి.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

లక్ష మందికి ఉపాధి

(మొదటి పేజీ తరువాయి)

క్లౌడ్ స్టోరేజ్‌లో ఉంచాలని సీఎం పేర్కొన్నారు.

● జలజీవన్ మిషన్‌కు సంబంధించి పంచాయతీరాజ్‌శాఖలో 506 ప్రాజెక్టులకు రూ.9,514.63 కోట్లతో అంచనాలు సవరిస్తూ నవంబరు 28న విడుదల చేసిన ఉత్తర్వులను మంత్రిమండలి ఆమోదించింది. (ర్యాటిఫై చేసింది). మిగిలిన 281 ప్రాజెక్టులను ఎల్‌ఎస్ పద్ధతిలో మరింత సమర్థంగా చేపట్టేందుకు అనుమతిచ్చింది.

● అమరావతి ప్రభుత్వ కాంప్లెక్సులో గవర్నర్ బంగ్లా లోక్‌భవన్ నిర్మాణానికి టెండర్లు పిలిచి ఎల్1గా నిలిచిన వారితో ఒప్పందం చేసుకునేందుకు అనుమతి. గవర్నర్ నివాసం, దర్బార్ హాల్, గవర్నర్ కార్యాలయం, రెండు అతిథిగృహాలు, సిబ్బంది నివాస గృహాలు కలిపి లోక్‌భవన్‌గా నిర్మించనున్నారు.

● రాజధాని అమరావతి నుంచి ఈ3 రోడ్డు మూడో దశలో విస్తరణకు సంబంధించి 16వ నంబర్ జాతీయ రహదారికి కలిపేందుకు వీలుగా ఇంటర్‌ఛేంజ్‌లు, వివిధ యుటిలిటీలతో కూడిన వంతెనలు, అండర్‌పాస్‌లు ఆరు వరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి పిలిచిన టెండర్లలో ఎల్ 1 సంస్థకు టెండర్లు అప్పగించేందుకు ఆమోదం.

● కుప్పం నియోజకవర్గంలో పాలార్ నదిపై నాలుగు చెక్ డ్యాంల నిర్మాణానికి గత అంచనాలను సవరిస్తూ రూ.15.96 కోట్లతో పనులు చేపట్టేందుకు ఆమోదం. ఈ పనుల వల్ల కుప్పం కరవు ప్రాంతంలో రైతులకు ప్రయోజనం కలుగుతుంది.

ప్రభుత్వ విభాగం	మొత్తం ప్రతిపాదనలు	పెట్టుబడులు (రూ.కోట్లలో)
పరిశ్రమలు, వాణిజ్య శాఖ	14	13,605
ఐటీ, కమ్యూనికేషన్	1	1,421
పర్యాటకశాఖ	5	1,034
మొత్తం	30	16,060

● గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న 221 మంది తెలుగు, 91 మంది హిందీ భాషా పండితులతో పాటు 99 మంది వ్యాయామ ఉపాధ్యాయులను స్కూల్ అసిస్టెంట్లుగా ఉన్నతీకరించే ప్రతిపాదనకు ఆమోదం.

● ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ బోర్డును తిరిగి ఏర్పాటు చేసే ఉత్తర్వులకు ఆమోదం.

● కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన మోడల్ జైళ్ల చట్టం 2023ను రాష్ట్రంలో అమలు చేసేందుకు వీలుగా కొత్త ముసాయిదా బిల్లుకు మంత్రిమండలి ఆమోదం.

డ్రోన్, ఏరోస్పేస్ రంగంలో పెట్టుబడులకు ఆసక్తి

మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో చర్చించిన ప్రతినిధులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పెట్టుబడులకు అనువైన వాతావరణం ఉందని, దాంతో వివిధ సంస్థలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఏరోస్పేస్, డ్రోన్ తయారీ కంపెనీల ప్రతినిధులు గురువారం సచివాలయంలో మంత్రిని కలిసి పెట్టుబడి ప్రతిపాదనలపై చర్చించారు. ఈ ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు మంత్రి వారికి చెప్పారు. ■ బెంగళూరుకు చెందిన త్సల్లా ఏరోస్పేస్ సంస్థ.. మానవరహిత వైమానిక వ్యవస్థల పరిశోధన, అభివృద్ధి ప్రాజెక్టు ద్వారా ఐదేళ్లలో రూ.500 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపింది. ■ రాష్ట్రంలో డ్రోన్ల తయారీ, బేస్ స్టేషన్‌ల ఏర్పాటుకు బెంగళూరుకు చెందిన వెక్రోస్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆసక్తి వ్యక్తం చేసింది. జీపీఎస్, మానవరహిత, కఠిన వాతావరణ పరిస్థితుల్లో నావిగేట్ డ్రోన్ల తయారీ యూనిట్ ఏర్పాటుకు సంస్థ ప్రతిపాదించింది. ■ సర్వే, నిఘా, రక్షణ, వ్యవసాయ రంగానికి అవసరమైన డ్రోన్‌లు, యాంటీ డ్రోన్‌లు, విడిభాగాలు, లాంగ్ రేంజ్ సిస్టమ్ తయారీ యూనిట్ ఏర్పాటుకు ఎక్సో డ్రోన్స్ సంస్థ ఆసక్తి వ్యక్తం చేసింది. రాష్ట్రంలో డ్రోన్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించింది.

(c) eenadu

తమిళనాడు అధికారిణి సుప్రియా సాహూకు.. ఐక్యరాజ్యసమితి అత్యున్నత పురస్కారం


అవార్డు అందుకుంటున్న సుప్రియా సాహూ

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: తమిళనాడు పర్యావరణం, వాతావరణ మార్పులు, అటవీశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సుప్రియా సాహూ ఐక్యరాజ్యసమితి అత్యున్నత పురస్కారమైన 'ఛాంపియన్స్ ఆఫ్ ది ఎర్త్ 2025' అవార్డు అందుకున్నారు. కెన్యాలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పర్యావరణం కోసం విశేష కృషి చేసిన వ్యక్తులు, సంస్థలకు అవార్డులు అందించారు. తమిళనాడులో ఉష్ణోగ్రతలు తగ్గించే పద్ధతులు ప్రవేశపెట్టడం, అటవీప్రాంత విస్తరణ, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం తదితర కార్యక్రమాలు చేపట్టినందుకు సుప్రియా సాహూను అవార్డుకు ఎంపికచేశారు. ఈ సందర్భంగా ఆమెకు తమిళనాడు సీఎం స్టాలిన్ ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు.

పర్యాటక రంగానికి ప్రభుత్వ సహకారం అద్భుతం

- పర్యాటకంపై విజయవాడలో రాష్ట్రస్థాయి సదస్సు నేడు
- ఏపీ స్టార్ హోటళ్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్వీ స్వామి


సదస్సు కరపత్రం విడుదల చేస్తున్న ఆర్వీ స్వామి, లక్ష్మీనారాయణ, చరణ్

ఈనాడు, అమరావతి: దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా పర్యాటక రంగం అభివృద్ధికి ప్రభుత్వం అనేక రాయితీలు అందించి ప్రోత్సహిస్తోందని ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ పర్యాటక విభాగం కమిటీ చైర్మన్, రాష్ట్ర స్టార్ హోటళ్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్వీ స్వామి అన్నారు. ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో విజయవాడలో శుక్రవారం పర్యాటక రంగంపై నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సదస్సు నేపథ్యంలో ఆర్వీ స్వామి గురువారం విలేకరులతో మాట్లాడారు. 'పర్యాటక రంగంలోని ఉత్తమ విధానాలపై సదస్సులో పలువురు నిపుణులు ప్రసంగిస్తారు. ఈ అవకాశాన్ని పెట్టుబడిదారులు వినియోగించుకోవాలి' అని ఆర్వీ స్వామి సూచించారు. 'కొత్త ప్రాజెక్టులకు అనుమతుల జారీలో పర్యాటకశాఖ అధికారులు చక్కని సహకారం అందిస్తున్నారు' అని ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ పర్యాటక విభాగం కమిటీ సలహాదారు లక్ష్మీనారాయణ కాట్రగడ్డ అన్నారు. కమిటీ ప్రతినిధి, జీఆర్‌టీ హోటల్ ఎండీ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

కుల మతాల పేరుతో భాజపా విధ్వంసం

- దేశ ఐక్యతకు కట్టుబడింది సీపీఐ ఒక్కటే
- పార్టీ శత వార్షికోత్సవంలో ప్రధాన కార్యదర్శి డి.రాజా


సభలో మాట్లాడుతున్న రాజా. చిత్రంలో పార్టీ నేతలు గుజ్జుల ఈశ్వరయ్య, రామకృష్ణ తదితరులు

అజాద్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం విలువలకు కట్టుబడిన ఏకైక పార్టీ సీపీఐ అని, దేశం కుల మతాలకు అతీతంగా ఉండాలని ఉద్యమించిందీ తామేనని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా పేర్కొన్నారు. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం కుల మతాల పేరిట ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకొంటోందని విమర్శించారు. అనంతపురం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సీపీఐ శత వార్షికోత్సవాల్లో రాజాతో పాటు జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీశ్, కార్యవర్గ సభ్యుడు సి.జాఫర్ తదితరులు ప్రసంగించారు. జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి నేతృత్వంలో తొలుత అమరవీరుల స్తూపానికి నివాళి అర్పించారు. పార్టీలో పనిచేసిన ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన 267 మంది ఉద్యమకారుల కుటుంబాలను సన్మానించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ '1925 డిసెంబరు 26న ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూరులో సీపీఐ ఏర్పడగా, అదే ఏడాది మతతత్వ సంఘం ఆరెస్సెస్ కూడా ఏర్పడింది. దేశానికి పూర్తిస్థాయి స్వాతంత్ర్యాన్ని డిమాండ్ చేసింది తొలుత మా పార్టీయే. సీపీఐ నాయకులెందరో స్వాతంత్ర్య ఉద్యమంలో బలిదానం చేశారు. ఆరెస్సెస్, భాజపాలు ఏనాడూ స్వాతంత్ర్యం కోసం పోరాడలేదు' అని వివరించారు. గాంధీజీ 'ఈశ్వర్ అల్లా తేరే నామ్' అంటూ హిందూ, ముస్లింల ఐక్యతను కోరుకున్నారనీ, నేడు భాజపా.. మతాలు, కులాలుగా ప్రజలను విభజించి సామాజిక విధ్వంసం సృష్టిస్తోందని రాజా విమర్శించారు. ప్రజావ్యతిరేక, కార్పొరేట్ అనుకూల పాలన చేస్తున్న భాజపాకు ఏపీ, బిహార్ ముఖ్యమంత్రులు చంద్రబాబు, నీతీశ్‌కుమార్‌లు ఎందుకు మద్దతిస్తున్నారని ప్రశ్నించారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ, 4 కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పార్టీ శ్రేణులకు రాజా పిలుపునిచ్చారు.

13న హస్తకళల అవార్డు గ్రహీతలకు సన్మానం

ఈనాడు, అమరావతి: జాతీయ హస్తకళల వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 13న శ్రీకాళహస్తిలో నిర్వహించే కార్యక్రమంలో హస్తకళల్లో జాతీయ అవార్డులు సాధించిన ఐదుగురు కళాకారులను సన్మానించనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. శ్రీకృష్ణచరిత, శివమ్మ, సంతోష్, అంజన్న, హరనాథ్‌లు జాతీయస్థాయి అవార్డులు సాధించటంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఇదే కార్యక్రమంలో మరో 100 మంది కళాకారులకు రూ.10 వేల చొప్పున విలువచేసే టూల్ కిట్లను పంపిణీ చేయనున్నట్లు గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు.



పెట్టుబడికి పంచ సూత్రాలు

1. మూలధనాన్ని కోల్పోకుండా జాగ్రత్తపడండి. ఆ తర్వాతే లాభాలు ఆశించండి.
2. ఏయే రంగాల వాణిజ్య కార్యకలాపాలను మీరు సులువుగా అర్థం చేసుకోగలరో, వాటికి చెందిన సంస్థల్లోనే పెట్టుబడి పెట్టండి.
3. సంపాదన మొదలైనప్పటి నుంచే మదుపును ప్రారంభించి ఎక్కువ కాలం కొనసాగిస్తే, చక్రవడ్డీ ప్రభావంతో మీ ఫండ్ అనూహ్య స్థాయిలో పెరుగుతుంది.
4. చిన్న చిన్న అవసరాలకే మీ ఫండ్ నుంచి సొమ్మును విత్‌డ్రా చేసుకుంటూ చక్రవడ్డీకి ఆటంకం కలిగించకండి.
5. మీరు పెట్టుబడి పెట్టిన సంస్థలకు సంబంధించిన పరిణామాలపై నిరంతరం అధ్యయనం చేయండి. అప్పుడే సరైన నిర్ణయాలు తీసుకోగలరు.

– వారెన్ బఫెట్, ఇన్వెస్టర్

కేంద్ర సహకారంతో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు

- దేశ ప్రగతికి మూలవిరాట్ వాజ్‌పేయీ
- ధర్మవరంలో అటల్-మోదీ సుపరిపాలన యాత్ర ప్రారంభం
- ముఖ్య అతిథిగా హాజరైన మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్



వాజ్‌పేయీ విగ్రహాన్ని ఆవిష్కరించిన మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్, రాష్ట్రమంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యేలు ఎం.ఎస్.రాజు, పల్లె సింధూరరెడ్డి, భాజపా నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి ★ ప్రసంగిస్తున్న మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్

ఈనాడు, పుట్టపర్తి: 'ఎన్డీయేలో ముఖ్యనాయకుడైన సీఎం చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. పరిశ్రమలు తీసుకురావడం, ఉపాధి, విద్యావకాశాలు, పెట్టుబడుల్లోనూ రాష్ట్రం ముందుకు వెళ్తోంది. ఇందుకు కేంద్రంలో మోదీ ప్రభుత్వం సహకారం అందిస్తోంది' అని మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్ పేర్కొన్నారు. మాజీప్రధాని వాజ్‌పేయీ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా భాజపా రాష్ట్రకమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన అటల్-మోదీ సుపరిపాలన యాత్రను శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో గురువారం ఆయన ప్రారంభించారు. పట్టణంలోని కళాశాల కూడలిలో వాజ్‌పేయీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో భాజపా జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ అధ్యక్షతన జరిగిన సభలో మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్ మాట్లాడారు. ఆయన ప్రసంగాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలుగులో అనువదించారు. 'వాజ్‌పేయీ దేశ ప్రగతికి మూలవిరాట్. ఆయన జన్మస్థానమైన గ్వాలియర్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ ఆయన శతజయంతి వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉంది. చంద్రబాబు పాలనలో జరుగుతున్న అభివృద్ధిని చూస్తూనే ఉన్నాం' అని చెప్పారు.

ధర్మవరం అభివృద్ధికి ఏదైనా చేస్తా: సత్యకుమార్ యాదవ్

'భారతదేశాన్ని ఆర్థికప్రగతిలో ముందుంచిన వాజ్‌పేయీ శతజయంతి సందర్భంగా సుపరిపాలన యాత్ర ఇక్కడినుంచి ప్రారంభించడం ఆనందదాయకం. ఎన్నో మంచి పథకాలను ప్రారంభించి దేశంలో సుపరిపాలనకు స్ఫూర్తిగా నిలిచిన అటల్‌జీని స్మరిస్తూ ఈ యాత్ర చేపట్టాం. ధర్మవరం ప్రాంత అభివృద్ధి, సంక్షేమం కోసం సముద్రంలో దూకాలన్నా దూకుతా' అని వివరించారు.

వాజ్‌పేయీ దేశానికి రక్షణగా నిలిచారు: పీవీఎన్ మాధవ్



'సహకార సమాఖ్యకు వాజ్‌పేయీ స్ఫూర్తి. దేశవ్యాప్తంగా జాతీయ రహదారులు, టెలికాం విప్లవం, అందరికీ గ్యాస్ కనెక్షన్లు ఆయన చలవే. పోఖ్రాన్‌లో అణుప్రయోగాలు చేయించి దేశానికి రక్షణగా నిలిచారు. అందుకే ధర్మవరం నుంచి శ్రీకాకుళం వరకు యాత్ర నిర్వహించి, డిసెంబరు 25న ఆయన జయంతిరోజు సభలో స్మృతివనం ప్రారంభిస్తాం. ఈ కార్యక్రమం గురించి సీఎం చంద్రబాబుకు చెబితే.. మహనీయుడి గురించి అందరికీ తెలియాల్సిన అవసరం ఉందన్నారు' అని వివరించారు. కార్యక్రమంలో భాజపా ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, తెదేపా ఎమ్మెల్యేలు ఎం.ఎస్.రాజు, సింధూర రెడ్డి, తెదేపా శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, భాజపా రాష్ట్ర ప్రధానకార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలోచన మెరిసే.. ఆవిష్కరణ మురిసే

- గుంటూరులో 'ఈనాడు' వైజ్ఞానిక ప్రదర్శనకు విశేష స్పందన
- 126 ప్రాజెక్టులను రూపొందించిన 252 మంది విద్యార్థులు



'ఈనాడు-కేఎల్ విశ్వవిద్యాలయం వైజ్ఞానిక ప్రదర్శన'ను తిలకించేందుకు పెద్దఎత్తున తరలివచ్చిన విద్యార్థులు ★ విజేతలతో ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ, చిత్రంలో ఈనాడు ఏపీ బ్యూరో ఇన్‌ఛార్జి కనపర్తి శ్రీనివాస్

ఈనాడు, అమరావతి: ఆలోచనలు మెరిశాయి.. ఆవిష్కరణలు మురిపించాయి. బడిలో పాఠాలు నేర్చుకోవడమే కాదు.. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేలా చిట్టిబుర్రలు గట్టి ఆలోచనలు చేశాయి. రోడ్డు భద్రత, వ్యవసాయం, క్వాంటమ్ కంప్యూటర్.. ఇలా అనేక అంశాలపై విద్యార్థులు ప్రాజెక్టులు రూపొందించారు. శాస్త్ర సాంకేతికరంగాల్లో విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికితీసేందుకు 'ఈనాడు', కె.ఎల్. విశ్వవిద్యాలయం సంయుక్తాధ్వర్యంలో గురువారం గుంటూరు లక్ష్మీపురంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య పాఠశాలలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనకు విశేష స్పందన వచ్చింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 252 మంది విద్యార్థులు పాల్గొని.. 126 ప్రాజెక్టులను ప్రదర్శించారు. కార్యక్రమాన్ని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ప్రారంభించారు. కె.ఎల్.విశ్వవిద్యాలయం డీన్ ఎం.కిశోర్‌బాబు, పాఠశాల డైరెక్టర్ పాటిబండ్ల కృష్ణవేణి, ఈనాడు ఏపీ బ్యూరో ఇన్‌ఛార్జ్ కనపర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన ముగింపు వేడుకకు ఈగల్ విభాగాధిపతి ఆకే రవికృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై ప్రాజెక్టులను తిలకించారు.

విజేతలు వీరే..

స్మార్ట్ హెల్మెట్‌తో రక్షణ: గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం వేములూరిపాడు జడ్పీ ఉన్నతపాఠశాల 8వ తరగతి విద్యార్థులు కొండా ప్రశాంత్, షేక్ మహమ్మద్ ఆరిఫ్ తయారుచేసిన స్మార్ట్ హెల్మెట్‌కు మొదటి బహుమతి వచ్చింది. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకుంటేనే వాహనం స్టార్ట్ అయ్యేలా జీపీఎస్ మాడ్యూల్స్, ఎలక్ట్రికల్ సెన్సర్ల వ్యవస్థతో దీన్ని రూపొందించారు.

తక్కువ స్థలంలో ఆధునిక వ్యవసాయం: భూమి కొరత, సాగునీటి సమస్యను అధిగమించేలా పల్నాడు జిల్లా క్రోసూరు మండలం దొడ్లేరు జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 8, 9వ తరగతి విద్యార్థులు పల్లా శ్రీలక్ష్మి, పల్లా యుక్త కృష్ణప్రియ రూపొందించిన హైడ్రోపోనిక్ సిస్టమ్ ప్రాజెక్టుకు ద్వితీయ బహుమతి లభించింది.

రైతన్నకు సాంకేతికత తోడు: ఆధునిక సాంకేతికతను వినియోగించుకుని వ్యవసాయం చేసేలా గుంటూరు లక్ష్మీపురంలోని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య పాఠశాల 9వ తరగతి విద్యార్థులు రుషిద అంజుం షేక్, షిజాయుస్కాన్ రూపొందించిన 'అగ్రి గ్రో ఆటోమోటార్' ప్రాజెక్టుకు తృతీయ బహుమతి దక్కింది.

విద్యార్థుల సామాజిక స్పృహకు నిదర్శనం

–ఎ.తమీమ్ అన్సారియా, గుంటూరు కలెక్టర్

'పిల్లల సామాజిక స్పృహకు ఈ ప్రాజెక్టులు నిదర్శనం. పాఠశాల స్థాయిలోనే బాలల్లో మేధోసంపత్తి బాగా వృద్ధి చెందుతోందని అర్థమవుతోంది. క్వాంటమ్ వ్యాలీ గురించి పిల్లలు అవగాహన పెంపొందించుకుని, ప్రాజెక్టులను తయారుచేయడం గొప్ప విషయం. ఆధునిక వ్యవసాయం, ప్రమాదాలను నివారించే సాంకేతికత, ప్రకృతి విపత్తుల వేళ ముందస్తు హెచ్చరికలు చేసే ప్రాజెక్టులు.. ఇలా అన్ని విషయాల్లో చిన్నారుల సామాజిక స్పృహ కనిపిస్తోంది.'

మత్తుకు దూరంగా ఉంటేనే భవిత

– ఆకే రవికృష్ణ, ఈగల్ విభాగాధిపతి

'చిన్నారులు తయారుచేసిన ప్రాజెక్టులు చాలా బాగున్నాయి. నేటితరం ఇలాంటి వైజ్ఞానిక పరిశోధనలపై దృష్టిపెట్టాలి. కొంతమంది మత్తుకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ప్రతి విద్యాసంస్థలో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటుచేస్తున్నాం. గుంటూరులో ఓ పార్టీలో డ్రగ్స్ వాడుతూ ఓ ముఠా పట్టుబడితే వారిలో బీటెక్ చదివి వారంలో ఉద్యోగంలో చేరాల్సిన యువకుడున్నాడు. మత్తుపదార్థాల కేసుల్లో పట్టుబడితే పాస్‌పోర్టు రాదు. ఉన్నతచదువు, ఉద్యోగాలకు అనర్హులవుతారు. ఈ విషయాలన్నీ విద్యార్థులకు వివరిస్తున్నాం.'

నకిలీ మద్యం కేసులో దారబోయిన ప్రసాద్ అరెస్టు

- పెద్దఎత్తున మూతలు సరఫరా చేసిన నిందితుడు

ఈనాడు, అమరావతి: నకిలీ మద్యం కేసులో అరెస్టయిన నిందితుడు దారబోయిన ప్రసాద్ (ఏ23)కు కోర్టు రిమాండ్ విధించింది. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో వెలుగుచూసిన నకిలీ మద్యం కేసులో అరెస్టు కాకుండా రెండు నెలలుగా ప్రసాద్ తప్పించుకుని తిరుగుతున్నారు. ఇబ్రహీంపట్నం, ములకలచెరువుకు సీసా మూతలను సరఫరా చేశారు. విజయవాడలోని భవానీపురం ఎక్సైజ్‌స్టేషన్‌లో నమోదైన కేసులో నిందితుడిగా చేర్చారు. గత నెలలో ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించడంతో నిందితుడిని సిట్, ఎక్సైజ్ అధికారులు గురువారం హైదరాబాద్‌లో అరెస్టుచేశారు. విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో వైద్యపరీక్షలు చేయించిన తర్వాత గురువారం రాత్రి.. ఎక్సైజ్ కోర్టు న్యాయాధికారి లెనిన్‌బాబు ఎదుట హాజరుపర్చారు. ప్రసాద్‌కు ఈ నెల 24వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి ఉత్తర్వులిచ్చారు. అనంతరం నిందితుడిని విజయవాడ కారాగారానికి తరలించారు.

కంపెనీల పేర్లతో మూతల సరఫరా

హైదరాబాద్‌కు చెందిన దారబోయిన ప్రసాద్.. 2022 నుంచి నకిలీ మద్యం తయారీ కోసం మూతలను సరఫరా చేస్తున్నారు. తొలుత జనార్దన్‌రావుకు ఇదే కేసులో మరో నిందితుడైన మనోజ్‌కుమార్ మూతలు సరఫరా చేసేవారు. కంపెనీ పేర్లతో సరఫరా చేయాలని జనార్దన్‌రావు కోరడంతో, వాటిని తయారుచేసే పరిజ్ఞానం తనవద్ద లేదని మనోజ్ చేతులెత్తేయడంతో ప్రసాద్‌ను జనార్దనరావు సంప్రదించారు. అప్పటి నుంచి వివిధ బ్రాండ్లకు చెందిన మూతలను తయారుచేసి పంపేవారు.

ఎర్రచందనం సంరక్షణ కోసం రూ.6.2 కోట్లు


ఏపీకి రూ.1.1 కోట్లు, తెలంగాణకు రూ.17.8 లక్షలు

ఈనాడు, దిల్లీ: ఎర్రచందనం సంరక్షణ కోసం జాతీయ జీవ వైవిధ్య ప్రాధికార సంస్థ ఏపీ, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు కలిపి రూ.6.2 కోట్లు విడుదల చేసింది. యాక్సెస్ అండ్ బెనిఫిట్ షేరింగ్ విధానం కింద ఈ మొత్తాన్ని ఇస్తున్నట్లు తెలిపింది. ఇందులో ఆంధ్రప్రదేశ్ రైతులకు రూ.1.1 కోట్లు, తెలంగాణ రైతులకు రూ.17.8 లక్షలు అటవీశాఖకు రూ.5.8 లక్షలు, తమిళనాడు అటవీశాఖకు రూ.2.98 కోట్లు, కర్ణాటకకు రూ.1.05 కోట్లు, మహారాష్ట్రకు రూ.69.2 లక్షలు విడుదల చేసినట్లు పేర్కొంది. ఇది కాకుండా మరో రూ.16 లక్షలను ఈ రాష్ట్రాల జీవ వైవిధ్య మండళ్లకు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించింది. దీంతో ఇప్పటివరకూ యాక్సెస్ బెనిఫిట్ షేరింగ్ విధానం కింద ఎర్రచందనం సంరక్షణ కోసం రూ.101 కోట్లు ఇచ్చినట్లయిందని పేర్కొంది. ఇప్పటివరకు దీనివల్ల 216 మంది రైతులకు వ్యక్తిగతంగా ప్రయోజనం కలిగిందని, అందులో ఏపీ రైతులు 198 మంది, తమిళనాడుకు చెందిన 18 మంది ఉన్నారని వెల్లడించింది.

కుల పంచాయితీ పేరుతో దారుణం


బాధితుడిని ఊరేగిస్తున్న గ్రామస్థులు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించాడన్న ఆరోపణలతో ఓ వ్యక్తికి శిరోముండనం చేసి, మెడలో చెప్పులదండతో ఊరేగించిన అమానవీయ ఘటన కలహండిలో చోటుచేసుకుంది. కులపంచాయితీ పేరుతో గ్రామపెద్దలు విధించిన ఈ శిక్షకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. జిల్లాకేంద్రం భవానీపట్నాకు 8 కి.మీ. దూరంలో ఉన్న బొదిలి గ్రామంలో ఈ ఘటన జరిగింది. వీడియో వైరల్ కావడంతో ఇది వెలుగులోకి వచ్చింది. 13వ వార్డుకు చెందిన ఓ మహిళ నీళ్లకోసం సమీప బావి వద్దకు వెళ్లగా, ఆమె పట్ల ఇదే ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీనిపై మహిళ కుటుంబీకులు లక్ష్మీపూజ మండపం వద్ద పంచాయితీ నిర్వహించగా ఆ వ్యక్తికి శిరోముండనం చేయించి, మెడలో చెప్పులతో ఊరేగించాలని పెద్దలు తీర్పునిచ్చారు.



EENADU Vol: 52, Issue: 122 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

(c) eenadu

అత్యవసరంలో లైవ్ వీడియో సందేశం

ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్లలో సరికొత్త సదుపాయం



● అందుబాటులోకి తెచ్చిన గూగుల్
● తొలుత అమెరికా, మెక్సికో, జర్మనీల్లో

ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు, అత్యవసర సమయాల్లో సాయం కోసం అవసరమైన వారికి పంపేందుకు, సరికొత్త భద్రతా ఫీచర్‌ను గూగుల్ తీసుకువస్తోంది. 'ఎమర్జెన్సీ లైవ్ వీడియో'గా పిలుస్తున్న ఈ ఫీచర్ వల్ల 'అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారు సాయం కోసం కాల్ లేదా మెసేజ్ పంపే సమయంలో, లైవ్ వీడియో ఫీడ్‌ను అనుమతి ఇవ్వొచ్చు. కారు ప్రమాదం, ఆరోగ్య అత్యవసర పరిస్థితులు, అగ్ని ప్రమాదం వంటి సమయాల్లో.. ఏమి జరుగుతుందో కాలర్ చెప్పలేకపోయినా, ఈ ఫీచర్‌తో ప్రత్యక్షంగా చూపొచ్చు. స్పష్టమైన దృశ్య సమాచారం లభించడం ద్వారా, అత్యవసరంలో ఉన్నవారికి, అవసరమైన తక్షణ సాయం అందించే సౌలభ్యం ఉంటుందని గూగుల్ వెల్లడించింది. అత్యవసర పరిస్థితుల్లో మానసికంగా, శారీరకంగా ఒత్తిడి ఏర్పడి మాట్లాడటమూ కొందరికి కష్టతరమవుతుందని, అటువంటి సందర్భాల కోసం ఈ ఫీచర్ రూపొందించినట్లు వివరించింది.

ఇది ఎలా పనిచేస్తుందంటే..

అత్యవసర కాల్ లేదా మెసేజ్ చేసేప్పుడు.. ఆండ్రాయిడ్ పరికరం (స్మార్ట్‌ఫోన్ తెర)పై 'కెమెరా ఫీడ్‌ను షేర్ చేసుకుంటారా' అనే సందేశం వస్తుంది. వినియోగదారులు అంగీకరిస్తే, వెంటనే ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్‌తో వీడియో స్ట్రీమింగ్ ప్రారంభమవుతుంది. ఈ వీడియోపై వినియోగదారుల పూర్తి నియంత్రణ ఉంటుంది, వారు ఎప్పుడైనా ఒక్క స్పర్శతో స్ట్రీమింగ్‌ను ఆపివేయొచ్చని గూగుల్ పేర్కొంది. ఈ ఫీచర్‌కు ఎటువంటి ప్రత్యేక సెటప్ అవసరం లేదు. ఆండ్రాయిడ్ 8 లేదా ఆ తర్వాతి వెర్షన్‌తో పనిచేసే స్మార్ట్‌ఫోన్లు, ఇతర పరికరాల్లో గూగుల్ ప్లే సర్వీసెస్ ద్వారా ఇది పనిచేస్తుంది. ఈ ఫీచర్‌ను గురువారం అమెరికాతో పాటు జర్మనీ, మెక్సికోలోని కొన్ని ప్రాంతాల్లో తీసుకువచ్చారు. రాబోయే రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా ఈ ఫీచర్‌ను అందుబాటులోకి తెస్తారు.

రూ.148 లక్షల కోట్లు!

● గత అయిదేళ్లలో పెరిగిన మదుపర్ల సంపద
● భారతీ ఎయిర్‌టెల్, బీఎస్ఈ, హెచ్‌ఏఎల్ ప్రత్యేకం
● ఇంకా వృద్ధి అవకాశాలు
● 2042కు 16 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ

మనదేశంలో గత 30 ఏళ్లలో ఎన్నడూ లేనంత అధికంగా సంపద సృష్టి 2020-25లో జరిగినట్లు మోతీలాల్ ఓస్వాల్ 30వ వార్షిక వెల్త్ క్రియేషన్ స్టడీ వెల్లడించింది. స్టాక్‌మార్కెట్లో నమోదైన కంపెనీల్లో, 100 అత్యుత్తమ కంపెనీలే రూ.148 లక్షల కోట్ల సంపదను సృష్టించినట్లు పేర్కొంది. ఈ నివేదిక ప్రకారం..

✦ అత్యధికంగా, అత్యంత వేగంగా, స్థిరంగా సంపద సృష్టించిన కంపెనీల్లో భారతీ ఎయిర్‌టెల్, బీఎస్ఈ, హెచ్‌ఏఎల్ (హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్) అగ్రస్థానంలో ఉన్నాయి.


✦ వివిధ వ్యాపార రంగాలను పరిశీలిస్తే ఆర్థిక సేవల్లో నిమగ్నమైన సంస్థలు అధికంగా సంపద సృష్టించాయి.

✦ తదుపరి స్థానాల్లో పరిశ్రమలు, కేపిటల్ మార్కెట్స్, టెక్నాలజీ, యుటిలిటీస్ విభాగాల కంపెనీలున్నాయి.

✦ ప్రభుత్వ రంగ సంస్థలు మళ్లీ వెలుగులోకి వస్తున్నాయి. ముఖ్యంగా రక్షణ, ఇంధన, యుటిలిటీస్ విభాగాల్లోని ప్రభుత్వ రంగ సంస్థలు మెరుగైన పనితీరు ప్రదర్శిస్తూ సంపద సృష్టిస్తున్నాయి.

గత 20 ఏళ్లలో ఏటా 17%

ప్రపంచ వ్యాప్తంగా సంపద సృష్టి పెరుగుతోంది. మన దేశంలోనూ అదే జరుగుతోంది. మనదేశంలో స్టాక్‌మార్కెట్లో నమోదైన కంపెనీల విలువ (మార్కెట్ కేపిటలైజేషన్) గత 20 ఏళ్లలో ఏటా 17% చొప్పున పెరగడం గమనార్హం. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా చూస్తే, భారత్ నాలుగో అతిపెద్ద ఈక్విటీ మార్కెట్‌గా ఉంది. ఎన్ని అవాంతరాలు, అడ్డంకులు వచ్చినా దీర్ఘకాలంలో ఈక్విటీ మార్కెట్లు పెరుగుతూనే ఉన్నాయి.



జీడీపీ గత 17 ఏళ్లలో 4 లక్షల కోట్ల డాలర్లకు

మన స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) గత 17 సంవత్సరాల్లో లక్ష కోట్ల డాలర్ల (సుమారు రూ.90 లక్షల కోట్లు) నుంచి 4 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.360 లక్షల కోట్ల)కు విస్తరించింది. వచ్చే 17 ఏళ్లలో... అంటే 2042 నాటికి 16 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.1440 లక్షల కోట్ల)కు చేరుకునే అవకాశం ఉన్నట్లు ఈ నివేదిక అంచనా వేసింది.

భారీ అవకాశాలు ముందున్నాయ్

ఈ అంచనాలపై మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఛైర్మన్ రామ్‌దేవ్ అగర్వాల్ స్పందిస్తూ, మనదేశంలో సంపద ఎంతగానో విస్తరించే తరుణంలో మనం ఉన్నామని, మళ్లీ ట్రిలియన్ డాలర్ (లక్ష కోట్ల డాలర్లు) అవకాశాలు మదుపర్లకు లభిస్తాయని తెలిపారు. నాణ్యమైన వ్యాపార సంస్థల షేర్లపై పెట్టుబడి పెడితే, దీర్ఘకాలంలో సంపద సృష్టికి అవకాశం కలుగుతుందని అన్నారు. మార్కెట్ హెచ్చుతగ్గులకు కంగారు పడకుండా.. నాణ్యమైన కంపెనీల షేర్లను ఎంపిక చేయడం ముఖ్యమని వివరించారు.

ఈ నివేదిక ప్రకారం భవిష్యత్తులో సంపద సృష్టికి అనుకూలంగా కనిపిస్తున్న కంపెనీలు

ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ (ఇండిగో), ఐషర్ మోటార్స్, హీరో మోటోకార్ప్, ఎంఅండ్ఎం, మారుతీ సుజుకీ, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, ఎస్‌బీఐ, పాలీక్యాబ్ ఇండియా, కమిన్స్ ఇండియా, ఎల్ అండ్ టీ, వారీ ఎనర్జీస్, బీఎస్ఈ, హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ, మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎంసీఎక్స్, సమ్మాన్ వెల్త్, ప్రుడెన్షియల్ కార్పొరేషన్, బ్లూస్టార్, ఎటర్నల్ ఇండియా, బజాజ్ ఫైనాన్స్, చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్, గ్లోబల్ హెల్త్, నారాయణ హృదయాలయ, ఐసీఐసీఐ లాంబార్డ్, పీబీ ఫిన్‌టెక్, గోద్రేజ్ ప్రాపర్టీస్, లోధా డెవలపర్స్, భారతీ ఎయిర్‌టెల్.

ఈనాడు బిజినెస్

భారత్ నుంచి 14,000 పేటెంట్లు దాఖలు చేశాం: శాంసంగ్




దిల్లీ: భారతదేశం నుంచి 14,000కు పైగా పేటెంట్ దరఖాస్తులు చేసినట్లు శాంసంగ్ తెలిపింది. ప్రపంచంలోనే ప్రధాన ఆవిష్కరణల కేంద్రంగా, రాబోయే దశాబ్దంలో భారత్ మారుతుందని అంచనాను సంస్థ వ్యక్తం చేసింది. భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించి 30 ఏళ్లు పూర్తి చేసుకోవడంతో పాటు, రూ.1.11 లక్షల కోట్ల ఆదాయంతో అతి పెద్ద బహుళ జాతి సంస్థగా అవతరించినట్లు వెల్లడించింది. 'భారత్‌లో మరిన్ని ఉత్పత్తులను అభివృద్ధి, డిజైన్ చేయడంతో పాటు ప్రపంచం కోసమూ ఆవిష్కరిస్తామ'ని సంస్థ పేర్కొంది. గత 30 ఏళ్లలో చెన్నై, నొయిడాలో రెండు తయారీ యూనిట్లను స్థాపించడంతో పాటు, దిల్లీ, నొయిడా, బెంగళూరుల్లో 3 ఆర్ అండ్ డీ సెంటర్లు, దిల్లీ-ఎన్‌సీఆర్‌లో డిజైన్ సెంటరును శాంసంగ్ ఏర్పాటు చేసింది. డిజిటల్‌గా శక్తిమంత దేశంగా భారత్‌ను తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యానికి సహకరిస్తామని శాంసంగ్ నైరుతి ఆసియా ప్రెసిడెంట్ జేబీ పార్క్ ఈ సందర్భంగా వివరించారు.

పెరగనున్న బీఎండబ్ల్యూ, బెంజ్ కార్ల ధరలు

జైపుర్: యూరోతో పోలిస్తే రూపాయి విలువ బలహీన పడుతుండటం, ప్రపంచ సరఫరా వ్యవస్థ స్థిరంగా లేకపోవడంతో.. భారత్‌లో విక్రయించే తమ వాహనాల ధరలను 2026 జనవరి నుంచి పెంచాలని యోచిస్తున్నట్లు జర్మనీకి చెందిన విలాసవంత కార్ల తయారీ సంస్థ బీఎండబ్ల్యూ ప్రెసిడెంట్, ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) హర్దీప్ సింగ్ బ్రార్ తెలిపారు. యూరో విలువ రూ.93-95 మధ్య ఉంటుందనుకుంటే, రూ.103-105కు చేరింది. ఫలితంగా వాహన ధరలు పెంచాల్సి వస్తోందని హర్దీప్ వెల్లడించారు. ఈ ఏడాది సెప్టెంబరులో కూడా తమ కార్ల ధరలను 3% వరకు సంస్థ పెంచిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం మన దేశంలో రూ.45.3 లక్షల 2 సిరీస్ గ్రాన్ కూపే నుంచి రూ.2.54 కోట్ల ఎక్స్‌ఎం మోడల్ కార్లను ఈ సంస్థ విక్రయిస్తుంది. రూపాయి మారకపు విలువ కారణంగా ఈ మెర్సిడెజ్ బెంజ్ కూడా నూతన ఏడాదిలో తన వాహన ధరలు పెంచనున్నట్లు తెలిపింది.

టీసీఎస్, కాగ్నిజెంట్, ఇన్ఫీ, విప్రోతో మైక్రోసాఫ్ట్ భాగస్వామ్యం

సత్యనాదెళ్ల ప్రకటన



టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్, విప్రోతో ఒక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నట్లు మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల ప్రకటించారు. మూడు రోజుల 'ఇండియా ఏఐ టూర్'లో భాగంగా తొలుత దిల్లీ, తదుపరి బెంగళూరును సత్య నాదెళ్ల సందర్శించారు. ఏఐ ఏజెంటిక్‌ను దేశంలో మరింత విస్తరించడం కోసం దిగ్గజ ఐటీ కంపెనీలతో జట్టు కట్టినట్లు ఆయన వివరించారు. ఈ సహకారంలో భాగంగా ఉద్యోగులు మరింత వేగంగా, స్మార్ట్‌గా పనిచేయడం కోసం రెండు లక్షల మైక్రోసాఫ్ట్ కోపైలట్ లైసెన్సులను ఆఫీస్ వంటి తన ఉత్పత్తుల్లో మైక్రోసాఫ్ట్ అమలు చేయనుంది. ఎంటర్‌ప్రైజ్-స్కేల్ ఏఐని ఈ స్థాయిలో అమలు చేయడం విశేషం. ఉత్పాదకత, వినూత్నత, వినియోగదార్లతో సంబంధాలు తదితరాలను మెరుగుపరచడం కోసం మైక్రోసాఫ్ట్ కోపైలట్‌ను వ్యాపార కార్యకలాపాల్లో వినియోగించుకోవచ్చని కంపెనీ తెలిపింది. ఏఐని అందిపుచ్చుకోవడం వల్ల ఉద్యోగులు మరింత సమర్థంగా పనిచేసి, కంపెనీ వృద్ధికి చేయూతనిస్తారని నాదెళ్ల పేర్కొన్నారు. శుక్రవారం ముంబయిలో వ్యాపార, సాంకేతిక దిగ్గజాలను సత్య కలవనున్నారు.

హైదరాబాద్‌లో నగ్జియాన్ ఎనర్జీ యూనిట్

ఈనాడు, హైదరాబాద్: సోడియం-అయాన్ బ్యాటరీ కంపెనీ నగ్జియాన్ ఎనర్జీ, తన ఉత్పత్తి సదుపాయాలను విస్తరించడానికి రూ.200 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ సంస్థ, కోయంబత్తూరులోని తన యూనిట్లో మొబిలిటీ, ఎనర్జీ స్టోరేజ్ అప్లికేషన్ల కోసం అధిక సామర్థ్యం గల సోడియం అయాన్ బ్యాటరీ ప్యాక్‌లను అభివృద్ధి చేస్తోంది. ఇప్పుడు హైదరాబాద్‌లో కొత్త యూనిట్ ఏర్పాటు చేస్తోంది. ఇది 2026 చివరికి సిద్ధం అవుతుందని అంచనా. తమ వినియోగదార్ల నుంచి పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని, కొత్త యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ సీఈఓ అభిషేక్ రెడ్డి తెలిపారు. అసెంబ్లీ ప్లాంట్, సెల్ తయారీ సదుపాయం ఇందులో ఉంటాయన్నారు. మనదేశంలో తొలిసారిగా సోడియం అయాన్ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్‌ను తమ సంస్థ కోయంబత్తూరు యూనిట్లో తయారు చేసినట్లు ఆయన తెలిపారు. ఇందులో బ్యాటరీ, ఇన్వర్టర్, సోలార్ మాగ్జిమమ్ పవర్ పాయింట్ ట్రాకింగ్ (ఎంపీపీటీ) ఉంటాయి. అన్ని రంగాల్లో విద్యుత్తు నిల్వ అవసరాలకు అనుగుణంగా ఉంటాయన్నారు. డీజిల్ జనరేటర్లకు ప్రత్యామ్నాయంగా సోడియం అయాన్ ఎనర్జీ స్టోరేజ్ ప్లాట్‌ఫామ్ పనిచేస్తుందన్నారు. బిల్డ్-ఇన్-బ్యాటరీలతో 3.5 కేవీ, 5 కేవీ, 10 కేవీ సామర్థ్యంతో వీటిని ఆవిష్కరించారు.

అన్ని బ్యాంకుల్లో ఒకే ఛార్జీల విధానం!

ఆర్‌బీఐ సంప్రదింపులు



త్వరలో అన్ని బ్యాంకుల్లో ఒకే ఛార్జీల విధానం రానుంది. ఇందుకోసం బ్యాంకుల యాజమాన్యాలతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) చర్చలు జరుపుతోంది.

రుణ ప్రాసెసింగ్ ఫీజులు సవివరంగా..: అన్ని బ్యాంకుల్లో సేవల ఛార్జీలను ప్రామాణీకరిస్తారని ఒక బ్యాంకు సీనియర్ ఎగ్జిక్యూటివ్ తెలిపినట్లు ఆంగ్ల వార్తా సంస్థ పేర్కొంది. రుణ ప్రాసెసింగ్ ఫీజులకు సంబంధించి సవివరమైన బ్రేక్-అప్‌నూ అందించాల్సి ఉంటుంది. రుణ దరఖాస్తు అందజేసినప్పటి నుంచి, రుణం మంజూరు/తిరస్కరణ అయ్యేవరకు ఈ వివరాలు ఇవ్వాలి. 'ఖాతాలో కనీస సగటు నిల్వ లేకపోతే' విధించే ఛార్జీలను చాలా వరకు ప్రభుత్వ రంగ బ్యాంకులు తొలగించాయి. ఇపుడు ఫీజుల విషయంలో హేతుబద్ధీకరణను తీసుకురానున్నారని తెలుస్తోంది. వినియోగదారు ఖాతా ఉన్న బ్యాంకు శాఖతో పాటు, ఇతర శాఖల్లోనూ ఒకేరీతిలో సేవలు అందించేలా చూడాలని బ్యాంకులను ఆర్‌బీఐ కోరినట్లు సమాచారం.

వెసులుబాటు కోరతాయా?: ఈ విషయమై గత నెలలో ఆర్‌బీఐ చేసిన సూచనలను బ్యాంకులు అంతర్గతంగా పరిశీలిస్తున్నాయని మరో ఎగ్జిక్యూటివ్ తెలిపారు. ప్రైవేటు, ప్రభుత్వ రంగ బ్యాంకులు తమలో తాము చర్చించుకుని, తమ స్పందన తెలియజేయనున్నాయి. ఖాతా రకాన్ని బట్టి, సేవల ఛార్జీలను రూపొందించేందుకు బ్యాంకులకు వెసులుబాటు ఉండాలని అవి భావిస్తున్నాయి.

నామినేషన్‌కు మరింత గడువు

ముంబయి: డీమ్యాట్ ఖాతాలు, మ్యూచువల్ ఫండ్ ఖాతాలకు నామినేషన్ ఇచ్చేందుకు ఇంతకుముందు నిర్ణయించిన గడువు డిసెంబరు 15ను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ మరింత పొడిగించింది. ఒక్కో మదుపుదారు 10 మందిని నామినేట్ చేసుకోవచ్చు. ఈ నిబంధనలకు గడువుగా కొత్త తేదీని తర్వాత ప్రకటిస్తామని సెబీ వివరించింది.

కోడి గుడ్డు

12న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	651	తూ/ప గోదావరి	655
వరంగల్	653	విశాఖపట్నం	645
విజయవాడ	675	చిత్తూరు	663

ఎంఎఫ్ ఆస్తులు రూ.80.80 లక్షల కోట్లకు




దిల్లీ: నవంబరులో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్‌ల (ఎంఎఫ్)లోకి రూ.29,911 కోట్ల నిధులు తరలివచ్చాయని మ్యూచువల్ ఫండ్ల పరిశ్రమ సంఘం యాంఫీ వెల్లడించింది. అక్టోబరు నాటి రూ.24,690 కోట్లతో పోలిస్తే, ఇవి 21% అధికమని తెలిపింది. సెప్టెంబరులో రూ.30,421 కోట్లు, ఆగస్టులో రూ.33,430 కోట్ల నికర పెట్టుబడులు ఈక్విటీ ఫండ్లలోకి వచ్చాయి. పరిశ్రమ నిర్వహణలోని మొత్తం ఆస్తులు (ఏయూఎం) అక్టోబరు చివర్లో రూ.79.87 లక్షల కోట్లుగా ఉండగా, నవంబరు ఆఖరుకు రూ.80.80 లక్షల కోట్లకు చేరాయని యాంఫీ తెలిపింది. క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్) ద్వారా అక్టోబరులో రూ.29,631 కోట్లు రాగా, నవంబరులో స్వల్పంగా తగ్గి రూ.29,445 కోట్లకు పరిమితమయ్యాయి. అయినా ఈక్విటీ ఎంఎఫ్‌ల్లోకి నికరంగా పెట్టుబడులు పెరగడం గమనార్హం.

✦ డెట్ ఎంఎఫ్‌ల్లోకి అక్టోబరులో రూ.1.6 లక్షల కోట్లు తరలి రాగా, నవంబరులో రూ.25,692 కోట్లు వెనక్కి తరలిపోయాయి. గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్‌ల)లోకి కూడా పెట్టుబడులు భారీగా తగ్గాయి. అక్టోబరులో రూ.7,743 కోట్లు రాగా, నవంబరులో రూ.3,742 కోట్లకు పరిమితమయ్యాయి.

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీలోకి రూ.4,815 కోట్లు

ఐపీఓకు ముందు (ప్రీ-ఐపీఓ) ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఏఎంసీ)లోకి 26 దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదార్లు రూ.4,815 కోట్ల నిధులు చొప్పించారు. ప్రైవేట్ ప్లేస్‌మెంట్ పద్ధతిలో 2,22,40,841 ఈక్విటీ షేర్లను ఒక్కోటి రూ.2,165 చొప్పున వారికి సంస్థ కేటాయించింది. ఐసీఐసీఐ బ్యాంక్ కూడా రూ.2,140 కోట్ల పెట్టుబడితో 2% వాటాను ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీలో కొనుగోలు చేసింది. రూ.10,602 కోట్ల సమీకరణ నిమిత్తం, ఈ నెల 12-16 తేదీల్లో జరగనున్న ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీకు ధరల శ్రేణి రూ.2,061-2,165. ఐపీఓ పూర్తిగా ఓఎఫ్ఎస్‌లో ఉండనుంది. యూకేకు చెందిన ప్రమోటరు ప్రుడెన్షియల్ కార్పొరేషన్ హోల్డింగ్స్ 4.89 కోట్ల షేర్లను విక్రయించనుంది.

కోక-కోలా కొత్త సీఈఓగా హెన్రిక్ బ్రాన్



కోక కోలా చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ)గా ఉన్న హెన్రిక్ బ్రాన్ (57), 2026 మార్చి 31 నుంచి ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) బాధ్యతలు చేపడతారని కంపెనీ బుధవారం వెల్లడించింది. ఈయన 3 దశాబ్దాలుగా కోక-కోలాలో పని చేస్తున్నారు. ఇంతకు ముందు బ్రెజిల్, లాటిన్ అమెరికా, గ్రేటర్ చైనా, దక్షిణ కొరియా కార్యకలాపాలకు హెన్రిక్ నేతృత్వం వహించారు. ప్రస్తుత ఛైర్మన్, సీఈఓ జేమ్స్ క్విన్సీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా కొనసాగుతారని కంపెనీ తెలిపింది.

యంత్ర పరికరాల రంగంలో 11% వృద్ధి

ఈనాడు, హైదరాబాద్: యంత్ర పరికరాల రంగంలో ఏటా 11% వృద్ధి నమోదవుతోందని ఇండియన్ మెషీన్ టూల్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఐఎంటీఎంఏ) ప్రెసిడెంట్ మోహినీ కేల్కర్ తెలిపారు. జనవరి 21-25 తేదీల్లో బెంగళూరులో నిర్వహిస్తున్న ఐఎంటీఈఎక్స్ ఫార్మింగ్ 2026 వివరాలను ఆమె వెల్లడించారు. విద్యుత్ వాహనాలు, పునరుత్పాదక ఇంధన సంస్థల నుంచి, యంత్ర పరికరాల తయారీ ఆర్డర్లు పెరుగుతున్నాయని వెల్లడించారు. లోకేష్ మెషీన్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.లోకేశ్వరరావు మాట్లాడుతూ.. ఏరోస్పేస్ రంగంలో ఉపయోగించే యంత్రాల తయారీకి గిరాకీ పెరుగుతోందని చెప్పారు. ఏస్ డిజైనర్స్ మేనేజింగ్ డైరెక్టర్ టీకే రమేష్ మాట్లాడుతూ.. తయారీ రంగంలోనూ కృత్రిమ మేధ(ఏఐ) వినియోగం పెరుగుతోందన్నారు. 22 దేశాల నుంచి పేరున్న యంత్ర పరికరాల ఉత్పత్తిదారుల గురించి తెలుసుకునేందుకు ఎక్స్‌పో వీలు కల్పిస్తుందన్నారు. ఐఎంటీఎంఏ ట్రేడ్ ఫెయిర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గురు ప్రశాంత్ మాట్లాడుతూ గత ఏడాది నిర్వహించిన ప్రదర్శనలో రూ.550 కోట్ల ఆర్డర్లు లభించాయని, ఈసారి ఈ మొత్తం అధికంగా ఉండే అవకాశం ఉందన్నారు.

జీడీపీలో 25% వాటా తయారీదే

● 2047కు సాధ్యపడొచ్చు
● బీసీజీ, జడ్47 నివేదిక



దేశ జీడీపీలో తయారీ రంగ వాటా 2047 నాటికి 25 శాతానికి చేరొచ్చని బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ), జడ్47 సంయుక్త నివేదిక పేర్కొంది. ప్రస్తుతం జీడీపీలో తయారీ రంగ వాటా దాదాపు 17 శాతంగా ఉంది. 2047కు అంతర్జాతీయ పారిశ్రామికశక్తిగా భారత్ మారనుందని ఈ నివేదిక తెలిపింది. 'డిజిటైజింగ్ మేక్ ఇన్ ఇండియా 3.0' పేరిట ఈ నివేదిక వెలువడింది. 2047కు అయిదు (ఎలక్ట్రానిక్స్, రక్షణ, వాహన-ఈవీ, ఇంధన, ఔషధ) రంగాల్లో 25 లక్షల కోట్ల డాలర్ల (రూ.2,250 లక్షల) విలువైన పారిశ్రామిక అవకాశాలు లభిస్తాయంది.


✦ ఈ అయిదు రంగాలు బలమైన వృద్ధిని, పారిశ్రామిక ప్రోత్సాహం, స్పష్టమైన విధాన/పెట్టుబడుల మార్గాలను కలుపుతాయని తెలిపింది. ఆవిష్కరణలకు ఊతమివ్వడం, వ్యూహాత్మక నిర్ణయాల బలోపేతం, పోటీతత్వాన్ని పెంచుకోవడంతో భారత తయారీ రంగం తదుపరి దశకు చేరుకుంటుందని వివరించింది.

లక్ష్యాల సాకారానికి: 2047కు నిర్దేశించుకున్న లక్ష్యాలను సాకారం చేసుకునేందుకు రక్షణ, ఈవీ, సెమీకండక్టర్లలోని ప్రాంతీయ తయారీ క్లస్టర్లపై ఆధారపడాల్సి ఉంది. నొయిడా-చెన్నై-హోసూర్, ధోలేరా వంటి కారిడార్లు ఇప్పటికే మంచి ఫలితాలు ఇస్తున్నాయి. ఈ క్లస్టర్లు సరఫరాదార్లు, భాగస్వామ్య ల్యాబ్‌లు, లాజిస్టిక్స్, నైపుణ్యం కలిగిన వారిని ప్రోత్సహిస్తున్నాయి. ఇవి ఖర్చును తగ్గించడంతో పాటు ఆవిష్కరణలను పెంపొందిస్తాయని నివేదిక వెల్లడించింది.

✦ 2022లో 33 బిలియన్ డాలర్లు (సుమారు రూ.2.97 లక్షల కోట్లు)గా ఉన్న భారత ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ల మార్కెట్, 2030కు 117 బి.డాలర్ల (సుమారు రూ.10.53 లక్షల కోట్ల)కు చేరే అవకాశం ఉంది. 2025-26 బడ్జెట్‌లో రక్షణ రంగం కోసం రూ.6.81 లక్షల కోట్లు కేటాయించారు. భారత్‌లో తయారీ కోసం గత దశాబ్దకాలంలో ఈ రంగానికి బడ్జెట్ దాదాపు రెట్టింపైంది.

భవిష్యత్తు మార్పులకు కీలకంగా హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ ఈవీలు

కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి



దిల్లీ: దేశ భవిష్యత్తు ఇంధన వ్యవస్థలను హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ విద్యుత్ వాహనాలు (ఈవీలు) పూర్తిగా మార్చివేయగలవని కేంద్ర కొత్త, పునరుత్పాదక ఇంధన మంత్రి ప్రహ్లాద్ జోషి కొనియాడారు. జపాన్ కార్ల దిగ్గజం టయోటా ఉత్పత్తి చేసిన హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ విద్యుత్ కారు 'మిరాయ్'ను జోషి కొత్త పార్లమెంట్ వరకు గురువారం నడిపారు. 'హైడ్రోజన్‌తో నడిచే టయోటా మిరాయ్‌ను ఈ రోజు పార్లమెంట్ భవనం వరకు నడిపాను. కేంద్ర మంత్రి శ్రీపాద నాయక్ కూడా కారులో ఉన్నారు. ఎటువంటి ఉద్గారాలు లేకుండా ప్రయాణం చాలా సాఫీగా, నిశ్శబ్దంగా, సౌకర్యవంతంగా సాగింది. భవిష్యత్ శుద్ధ ఇంధన మార్పులకు హైడ్రోజన్ వాహనాలు చిరునామా కానున్నాయి' అని జోషి 'ఎక్స్'లో పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా భవిష్యత్ ఇంధన వ్యవస్థలకు వెన్నెముకగా గ్రీన్ హైడ్రోజన్ అవతరిస్తోందని మంత్రి వెల్లడించారు. టయోటా మిరాయ్ కోసం కుదుర్చుకున్న భాగస్వామ్యాలు.. సరికొత్త ఆవిష్కరణలు, పరిశ్రమ నైపుణ్యాలు, సాంకేతిక మార్పులను తీసుకొచ్చాయని అన్నారు. వాహన పరిశ్రమలో మిరాయ్ సరికొత్త అధ్యాయమని, మిరాయ్ అంటే జపనీస్ భాషలో భవిష్యత్ అని అర్థమని వివరించారు.

ప్రాడా నుంచి కొల్హాపురి చెప్పులు

ధర రూ.84,000

భారతీయ చేతివృత్తుల కళాకారులు రూపొందిస్తున్న కొల్హాపురి చెప్పులను, ఇటలీ విలాస ఉత్పత్తుల సంస్థ ప్రాడా తన సాంకేతికత జతపరచి, మరింత ప్రీమియం లుక్‌తో విడుదల చేయనుంది. వీటి ధరను 800 యూరోలు (రూ.84,000)గా నిర్ణయించింది. ఈ సరికొత్త పరిమిత కాల ఎడిషన్‌లో కేవలం 2000 జతలనే ఈ సంస్థ తయారుచేయనుంది. మహారాష్ట్ర, కర్ణాటక నుంచి స్థానిక చేతివృత్తి కళాకారుల నైపుణ్యానికి తమ సాంకేతికతను జోడించనున్నట్లు ప్రాడా తెలిపింది. 2026 ఫిబ్రవరి నుంచి ప్రపంచవ్యాప్తంగా ఉన్న 40 ప్రాడా స్టోర్లు, ఆన్‌లైన్‌లో ఈ చెప్పులు లభిస్తాయని వెల్లడించింది. ఈ ఉత్పత్తుల కోసం ప్రభుత్వ సంస్థలు సంత్ రోహిదాస్ లెదర్ ఇండస్ట్రీస్, చర్మకార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (లిడ్‌కామ్), బాబు జగ్జీవన్ రామ్ లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (లిడ్‌కార్)లతో ప్రాడా భాగస్వామ్యం కుదుర్చుకుంది. మూడేళ్ల భాగస్వామ్యంలో భాగంగా స్థానిక చేతివృత్తుల కళాకారులకు శిక్షణ, ఇటలీలోని ప్రాడా అకాడమీలో కార్యక్రమాలు, స్వల్పకాల అవకాశాలను సంస్థ అందిస్తోంది. భారత రిటెయిల్ రంగంలోకి 3-5 ఏళ్లలో వస్తామని, స్వతంత్రంగా వచ్చేందుకు మొగ్గుచూపుతున్నామని.. విస్తరణలో జాప్యానికి ఇదే కారణమని ప్రాడా చీఫ్ మార్కెటింగ్ అధికారి బెర్టెల్లి తెలిపారు.

ఐపీఓ ఆలోచనలో ఐస్ప్రౌట్!

ఈనాడు, హైదరాబాద్: కో-వర్కింగ్ సేవలను అందించే ఐస్ప్రౌట్, ఐపీఓకు వచ్చే ఆలోచనతో ఉంది. ఈ విభాగంలో పెరుగుతున్న వృద్ధిని అందుకునేందుకు, పబ్లిక్ ఇష్యూ ఉపయోగపడుతుందని సంస్థ సహ వ్యవస్థాపకులు, సీఈఓ సుందరి పాటిబండ్ల తెలిపారు. టాటా క్యాపిటల్ నుంచి రూ.60 కోట్ల రుణం తీసుకుని, విస్తరణకు వినియోగిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. మెట్రో నగరాల్లో కో-వర్కింగ్ మౌలిక వసతులను బలోపేతం చేయడానికి ఈ నిధులు తోడ్పడతాయని పేర్కొన్నారు. ఐస్ప్రౌట్ సహ వ్యవస్థాపకుడు శ్రీని తీర్థాల మాట్లాడుతూ.. సంస్థలు, జీసీసీలు సౌకర్యవంతమైన కార్యాలయాలను ఇష్టపడుతున్నాయన్నారు. టెక్ ఆధారిత, భవిష్యత్ అవసరాలకు సిద్ధంగా కో-వర్కింగ్ స్పేస్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు.

కలిసొచ్చిన అమెరికా రేట్ల కోత

సెన్సెక్స్ ▲ 427	నిఫ్టీ ▲ 141
84818	25899

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.2,020.94 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.3,796.07 కోట్లు

డాలర్ @ రూ.90.32

సూచీల మూడు రోజుల వరుస నష్టాలకు అడ్డుకట్ట పడింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను 0.25% తగ్గించడం, 2026లో మరోసారి కోతకు సంకేతాలివ్వడం.. పదేళ్ల బాండ్‌పై ప్రతిఫలాలు తగ్గడం వల్ల, విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలు భవిష్యత్తులో నిదానిస్తాయనే అంచనాలు కలిసొచ్చాయి. వాహన, లోహ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 39 పైసలు క్షీణించి జీవన కాల కనిష్ఠమైన 90.33కు చేరింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 1.22% నష్టపోయి 61.45 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో జపాన్, షాంఘై, దక్షిణ కొరియా, హాంగ్‌సెంగ్ ప్రతికూలంగా ముగిశాయి. ఐరోపా మార్కెట్లు సానుకూలంగా కదలాడాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2.56 లక్షల కోట్లు పెరిగి, రూ.466.64 లక్షల కోట్ల (5.16 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

✦ సెన్సెక్స్ ఉదయం 84,456.75 పాయింట్ల (క్రితం ముగింపు 84,391.27) వద్ద సానుకూలంగా ప్రారంభమైంది. తదుపరి 84,150.19 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసింది. తర్వాత పుంజుకుని ఒక దశలో 84,906.93 పాయింట్ల వద్ద గరిష్ఠ స్థాయిని తాకింది. చివరకు 426.86 పాయింట్ల లాభంతో 84,818.13 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సైతం 140.55 పాయింట్లు పెరిగి 25,898.55 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,922.80-25,693.25 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 22 లాభపడ్డాయి. ఎటర్నల్ 2.74%, టాటా స్టీల్ 2.56%, కోటక్ బ్యాంక్ 2.45%, మారుతీ సుజుకీ 1.62%, అల్ట్రాటెక్ సిమెంట్ 1.31%, టెక్ మహీంద్రా 1.16%, సన్ ఫార్మా 1.16%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.99%, టీఎంపీవీ 0.98%, ఎం అండ్ ఎం 0.97%, ఇన్ఫోసిస్ 0.83%, ట్రెంట్ 0.68% చొప్పున పెరిగాయి. ఏషియన్ పెయింట్స్ 0.91%, భారతీ ఎయిర్‌టెల్ 0.65%, యాక్సిస్ బ్యాంక్ 0.50%, బజాజ్ ఫైనాన్స్ 0.45% నష్టపోయాయి.



✦ రంగాల వారీ సూచీలకొస్తే లోహ, వాహన, కమొడిటీస్, ఐటీ, ఆరోగ్య సంరక్షణ, స్థిరాస్తి సూచీలు లాభపడ్డాయి. చమురు-గ్యాస్ రంగం ఒక్కటే డీలాపడింది. బీఎస్ఈలో 2,397 షేర్లు సానుకూలంగా, 1,786 షేర్లు ప్రతికూలంగా ముగిశాయి. 158 షేర్లలో ఎలాంటి మార్పు లేదు.

✦ హైడ్రోజన్ ఆధారిత ఇంధన పర్యావరణ వ్యవస్థను వేగవంతం చేయడానికి కొత్త, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోలార్ ఎనర్జీ (ఎన్ఐఎస్ఈ)తో ఒక అవగాహనా ఒప్పందంపై సంతకం చేసినట్లు **టయోటా కిర్లోస్కర్** గురువారం తెలిపింది.

ఐపీఓ సమాచారం

✦ రూ.871 కోట్ల సమీకరణకు వచ్చిన **నెఫ్రోకేర్ హెల్త్ సర్వీసెస్** పబ్లిక్ ఇష్యూ రెండో రోజుకు 36% స్పందనే లభించింది.

✦ **స్టాన్‌బిక్ అగ్రో** రూ.12.28 కోట్ల పబ్లిక్ ఇష్యూ ఈనెల 12న ప్రారంభమై, 16న ముగియనుంది. రూ.10 ముఖ విలువ కలిగిన 40.92 లక్షల షేర్లను ఒక్కోటి రూ.30 చొప్పున జారీ చేయనుంది. బీఎస్ఈ ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్‌పై ఈనెల 19న ఈ షేర్లు నమోదు కానున్నాయి.

✦ రూ.710 కోట్ల నిధుల సమీకరణ కోసం **కేఎస్‌హెచ్ ఇంటర్నేషనల్** ఐపీఓ ఈ నెల 16-18 తేదీల్లో రాబోతోంది. ఈ ఇష్యూకు ధరల శ్రేణి రూ.365-384. యాంకర్ మదుపర్లు 15న బిడ్లు దాఖలు చేయాలి. కంపెనీ రూ.420 కోట్ల తాజా షేర్లను జారీ చేయనుంది. ప్రమోటర్లు రూ.290 కోట్ల విలువైన షేర్లను ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్)లో విక్రయించనున్నారు.

✦ వాణిజ్య ఒప్పందం కోసం భారత్ అత్యుత్తమ షరతుల ఆఫర్ ఇచ్చిందంటూ, యూఎస్ ట్రేడ్ రెప్రెజెంటేటివ్ జేమిసన్ గ్రీర్ చేసిన వ్యాఖ్యలను వాణిజ్య మంత్రి పీయూశ్ గోయల్ స్వాగతించారు.

(c) eenadu

ఈనాడు సినిమా

రీల్ రివైండ్ 2025

చిత్రసీమను కళకళలాడించడంలో యువ హీరోలే కీలకంగా నిలుస్తుంటారు. తీరికనే పదానికి తమ డైరీల్లో చోటే లేదన్నట్లు బాక్సాఫీస్ బరిలో సందడి చేస్తుంటారు. ఏడాదికి ఒకటికి రెండు సినిమాలతో సినీప్రియులకు వినోదం వడ్డిస్తుంటారు. కానీ, ఈ 2025లో చాలా మంది కుర్ర స్టార్ల డైరీల్లో విడుదల మాటే కనిపించలేదు. కొందరు కథల ఎంపికలో ఆచితూచి వ్యవహరించడం.. మరికొందరు చిత్రీకరణలతో బిజీగా ఉన్నా అనుకున్న సమయానికి సినిమాలు పూర్తి కాకపోవడం.. ఇలా రకరకాల కారణాలతో ఈ ఏడాది తెరపై కనిపించలేదు. అంతేకాదు వీళ్లతో పాటు కొందరు అగ్రతారలు ఒక్క విడుదల లేకుండానే ఈ 2025కి వీడ్కోలు పలకనున్నారు. మరి ఈ ఏడాది తెరపై దర్శనమివ్వని ఆ తారలెవరు? 2026లో బాక్సాఫీస్ బరిలో వాళ్ల సందడి ఎలా ఉండనుంది?

ఖాళీ లేదు.. ఖాతా జీరో!

ఈ ఏడాది తెరపై కనిపించని కథానాయకులు ● 2026లో వరుస సినిమాలతో సందడి..


అఖిల్


నవీన్ పొలిశెట్టి


వైష్ణవ్ తేజ్


అడివి శేష్


సాయి దుర్గా తేజ్


నిఖిల్


వరుణ్ తేజ్

ఏడాదికి ఒకటికి రెండు చిత్రాలతో బాక్సాఫీస్ బరిలో జోరు చూపించే హీరోల్లో నిఖిల్, సాయిదుర్గా తేజ్, అడివి శేష్, వరుణ్ తేజ్ తదితరులు ముందు వరుసలో ఉంటారు. వీళ్ల సినీ ప్రయాణంలో విరామాలు చాలా తక్కువనే చెప్పొచ్చు. కానీ, 2025లో వీళ్ల నుంచి ఒక్క చిత్రం బయటకు రాలేదు. అలాగని ఈ హీరోలంతా ఏడాదంతా ఖాళీగానూ లేరు. వరుస సినిమాలతో సెట్స్‌పై బిజీగానే గడిపారు. అవన్నీ వచ్చే ఏడాదిలోనే వరుసగా ప్రేక్షకుల్ని పలకరించనున్నాయి. ‘కార్తికేయ 2’తో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు కథానాయకుడు నిఖిల్. ఆయన గతేడాది ‘అప్పుడో ఇప్పుడో ఎప్పుడో’ సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించగా.. ఈ ఏడాది ఒక్క చిత్రాన్ని బయటకు తీసుకు రాలేకపోయారు. అలాగని ఆయన చేతిలో సినిమాలు లేక కాదు. ఈ ఏడాదంతా తను ‘స్వయంభూ’, ‘ది ఇండియా హౌస్’ చిత్రాలతో సెట్స్‌పై తీరిక లేకుండానే గడిపారు. నిజానికి వీటిలో ‘స్వయంభూ’ ఈపాటికే తెరపైకి రావాల్సి ఉండగా.. రకరకాల కారణాల వల్ల ఆలస్యమైంది. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామా వచ్చే ఏడాది ఫిబ్రవరిలో తెరపైకి వచ్చే అవకాశముంది. ఇక చిత్రీకరణ దశలో ఉన్న మరో సినిమా ‘ది ఇండియా హౌస్’ వచ్చే ఏడాది చివర్లో ప్రేక్షకుల్ని పలకరించనున్నట్లు తెలుస్తోంది. 2022లో ‘మేజర్’, ‘హిట్: ది సెకండ్ కేస్’ చిత్రాలతో వరుస విజయాలందుకున్న అడివి శేష్.. ఆ తర్వాత 2023, 2024 సంవత్సరాల్ని ఒక్క విడుదల లేకుండానే ముగించారు. ఈ ఏడాది తన నుంచి ‘డెకాయిట్: ఎ లవ్‌స్టోరీ’ విడుదల కావాల్సి ఉండగా.. చిత్రీకరణ ఆలస్యమవ్వడం వల్ల అది వచ్చే ఏడాది మార్చి 19కి వాయిదా పడింది. ఇక ఆయన నటిస్తున్న మరో సినిమా ‘జీ2’ కూడా వచ్చే ఏడాది ప్రథమార్ధంలోనే తెరపైకి రానుంది. విజయవంతమైన ‘గూఢచారి’ సినిమాకి కొనసాగింపుగా రూపొందుతున్న ఈ చిత్రం మే 1న థియేటర్లలోకి రానున్నట్లు ఇప్పటికే ప్రకటించారు.


‘విరూపాక్ష’, ‘బ్రో’ చిత్రాలతో 2023లో వరుస విజయాలు ఖాతాలో వేసుకున్న సాయి దుర్గా తేజ్.. గతేడాది ఒక్క సినిమాని విడుదల చేయలేదు. గత కొన్ని నెలలుగా చిత్రీకరణ దశలో ఉన్న తన ‘సంబరాల ఏటి గట్టు’ చిత్రం దసరాకి విడుదల కావాల్సినప్పటికీ.. చిత్రీకరణ ఆలస్యమవ్వడం వల్ల వాయిదా పడింది. దీన్నిప్పుడు వచ్చే ఏడాది వేసవికి తెరపైకి తీసుకొచ్చేందుకు ఆ చిత్ర నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ‘ఆపరేషన్ వాలెంటైన్’, ‘మట్కా’ చిత్రాలతో గతేడాది వరుసగా చేదు ఫలితాలు అందుకున్నారు వరుణ్ తేజ్. దీంతో కథల ఎంపికలో జాగ్రత్త పడ్డ ఆయన.. ఆచితూచి దర్శకుడు మేర్లపాక గాంధీ కథకు ఓకే చెప్పారు. వరుణ్ 15వ సినిమాగా ఈ ఏడాది ఆరంభంలో సెట్స్‌పైకి వెళ్లిన ఈ హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ 2026 ప్రథమార్ధంలో థియేటర్లలోకి రానుంది. ‘మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి’ విజయం తర్వాత నవీన్ పొలిశెట్టి వెంటనే ‘అనగనగా ఒక రాజు’ చిత్రాన్ని ప్రకటించారు. కానీ, తను అనుకోకుండా రోడ్డు ప్రమాదానికి గురి కావడం వల్ల గతేడాది చిత్రీకరణ ప్రారంభించలేక పోయారు. ఎట్టకేలకు ఇది ఈ సంవత్సరం ఆరంభంలో సెట్స్‌పైకి వెళ్లినప్పటికీ.. వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది. గత కొన్నేళ్లుగా వరుస పరాజయాలతో సతమతమవుతున్నారు హీరోలు నాగశౌర్య, అఖిల్ అక్కినేని. అందుకే కాస్త విరామం తీసుకుని కథల ఎంపికపై దృష్టి సారించారు ఈ ఇద్దరూ. దీంతో ఈ ఏడాది వీళ్ల నుంచి ఒక్క చిత్రం బయటకు రాలేదు. ప్రస్తుతం అఖిల్ నటిస్తున్న ‘లెనిన్’, నాగశౌర్య చేస్తున్న ‘బ్యాడ్‌బాయ్ కార్తీక్’ సినిమాలు ముగింపు దశలోనే ఉన్నాయి. ‘ఉప్పెన’తో హీరోగా తొలి అడుగులోనే భారీ విజయాన్ని ఖాతాలో వేసుకున్నారు వైష్ణవ్ తేజ్. కానీ, ఆ తర్వాత వరుస సినిమాలు చేసినా ఆస్థాయిలో మరో విజయాన్ని అందుకోలేకపోయారు. దీంతో 2023 తర్వాత ఆయన నుంచి మరో చిత్రమేదీ బయటకు రాలేదు.

ఈ అగ్ర హీరోలు కనిపించలేదు!


చిరంజీవి



ప్రభాస్


మహేశ్ బాబు


అల్లు అర్జున్

తెలుగు అగ్ర కథానాయకుడు చిరంజీవి వెండితెరపై కనిపించి రెండేళ్లు పూర్తయింది. నిజానికి ఆయన ‘భోళా శంకర్’ విడుదలైన వెంటనే ‘విశ్వంభర’ను పట్టాలెక్కించినప్పటికీ.. విజువల్ ఎఫెక్ట్స్ పనులు ఆలస్యం వల్ల పలుమార్లు వాయిదా పడి ఆఖరికి అది వచ్చే ఏడాది వేసవికి వెళ్లిపోయింది. ఇక దీని తర్వాత ‘మన శంకరవరప్రసాద్ గారు’ చిత్రాన్ని పట్టాలెక్కించినప్పటికీ.. అది సంక్రాంతి బరిలో నిలువనున్నట్లు ముందే ప్రకటించారు. చిరు తర్వాత బాబీ దర్శకత్వంలో కొత్త సినిమా శ్రీకారం చుట్టనున్నారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే దాన్ని కూడా వచ్చే ఏడాదే తెరపై చూసే అవకాశం లేకపోలేదని వార్తలు వినిపిస్తున్నాయి. ఇదే జరిగితే చిరు వచ్చే సంవత్సరం ముచ్చటగా మూడు చిత్రాలతో పలకరించినట్టవుతుంది. గతేడాది సంక్రాంతికి ‘గుంటూరు కారం’తో ప్రేక్షకుల్ని పలకరించారు కథానాయకుడు మహేశ్‌బాబు. ఆ తర్వాత నుంచి ఆయన పూర్తిగా ‘వారణాసి’పైనే దృష్టి సారించారు. దర్శకుడు రాజమౌళి రూపొందిస్తున్న ఈ సినిమా ఈ ఏడాది ఆరంభంలో చిత్రీకరణ ప్రారంభించుకుంది. 2026 వేసవి నాటికి చిత్రీకరణ పూర్తి చేసుకుని 2027 వేసవికి రానుంది. గతేడాది చివర్లో ‘పుష్ప 2’తో భారీ విజయాన్ని ఖాతాలో వేసుకున్నారు అల్లు అర్జున్. ప్రస్తుతం ఆయన అట్లీ దర్శకత్వంలో ఓ సినిమా పట్టాలెక్కించినప్పటికీ.. అది పూర్తయ్యి, తెరపైకి రావడానికి 2027 వరకు వేచి చూడక తప్పదనే సంకేతాలందుతున్నాయి. ‘కల్కి 2898ఏడీ’ సినిమా తర్వాత హీరో ప్రభాస్ నుంచి మరో చిత్రమేదీ తెరపైకి తీసుకురాలేదు. ‘ది రాజాసాబ్’తో ఈ ఏడాది తెరపై సందడి చేస్తారని భావించినప్పటికీ.. విజువల్ ఎఫెక్ట్స్ పనుల ఆలస్యం వల్ల వచ్చే సంక్రాంతికి వాయిదా పడింది. ఇక తను నటిస్తున్న మరో సినిమా ‘ఫౌజీ’ వచ్చే ఏడాది ద్వితీయార్ధంలో ప్రేక్షకుల్ని పలకరించనుంది. అయితే ప్రభాస్ నుంచి ఈ ఏడాది ఒక్క సినిమా బయటకు రాకున్నా.. తను ‘కన్నప్ప’లో అతిథి పాత్రలో మెరవడం, ‘బాహుబలి’ చిత్రాలు ‘బాహుబలి ది ఎపిక్’ పేరుతో ఒక్క భాగంగా థియేటర్లలో సందడి చేయడం ప్రేక్షకులకు కిక్ ఇచ్చింది.

శ్రీలీల ‘చూమంతర్’?


శ్రీలీల

దక్షిణాదిలో మంచి క్రేజ్ సంపాదించుకున్న అందాల తార శ్రీలీల.. ఇప్పుడు బాలీవుడ్ ప్రేక్షకులకు ‘చూమంతర్’ అంటూ మంత్రం వేయబోతోంది. ‘ముంజ్య’ ఫేమ్ అభయ్ వర్మ హీరోగా ‘చూమంతర్’ సినిమాలో నటిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. మడాక్ ఫిల్మ్స్ నిర్మిస్తోంది. ఇప్పుడీ చిత్రంలో కథానాయికగా అనన్యపాండే స్థానంలో శ్రీలీలను తీసుకున్నట్లు సమాచారం. ‘ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ దశలో ఉంది చిత్రం. కాల్షీట్ల కారణంగా అనన్య ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకుంది. దీంతో ఆ పాత్ర కోసం శ్రీలీలను రంగంలోకి దించింది నిర్మాణ సంస్థ. త్వరలో చిత్రీకరణ ప్రారంభమయ్యే అవకాశం ఉంది’ అని మడాక్ ఫిల్మ్స్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో శ్రీలీల సందడి ఎలా ఉంటుందో తెలుసుకోవాలంటే ఇంకొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

‘కలర్ ఫోటో’లా ‘మోగ్లీ’ ఎప్పటికీ నిలిచిపోయే చిత్రమవుతుంది: రానా


సందీప్, సాక్షి, రానా, రోషన్, టీజీ విశ్వప్రసాద్

“రోషన్‌ను చూస్తుంటే ‘చిరుత’ సినిమాలో రామ్‌చరణ్‌ను చూసినట్లు ఉంద”న్నారు నటుడు రానా దగ్గుబాటి. ‘కలర్ ఫోటో’ లాగే ‘మోగ్లీ’ కూడా ఎప్పటికీ నిలిచిపోయే చిత్రమవుతుందని అన్నారు. రోషన్ కనకాల హీరోగా నటించిన ఈ సినిమాని సందీప్ రాజ్ తెరకెక్కించారు. టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. సాక్షి మడోల్కర్ కథానాయిక. ఈ సినిమా ఈనెల 13న రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. నటుడు రానా, దర్శకుడు మారుతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రానా మాట్లాడుతూ.. ‘‘సందీప్ చాలా ఫ్యాషన్‌తో ఈ సినిమా తీశాడ’ని అన్నారు. ‘‘బాలకృష్ణ సినిమాతో పాటు ‘మోగ్లీ’ రావడం వల్ల ఇంకా చాలా మందికి ఈ సినిమా ఒకటి వస్తుందని తెలిసింది. బాలయ్య ఆశీర్వాదాలతో సందీప్ ఎదగాలని కోరుకుంటున్నా’’ అన్నారు దర్శకుడు మారుతి. కార్యక్రమంలో టీజీ విశ్వప్రసాద్, రవికాంత్ పేరేపు, సాక్షి తదితరులు పాల్గొన్నారు.

19న ‘మిస్టీరియస్’

మహి కోమటి రెడ్డి దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘మిస్టీరియస్’. రోహిత్, మేఘన రాజ్‌పుత్, రియా కపూర్ ప్రధాన పాత్రల్లో నటించారు. జయ్ వల్లందాస్ నిర్మించారు. ఈ నెల 12న రావాల్సిన ఈ సినిమాను 19కి ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు గురువారం ప్రకటించింది చిత్రబృందం. ‘అఖండ 2’ చిత్రాన్ని 12న విడుదల చేస్తున్నట్లు అకస్మాత్తుగా ప్రకటించడం వల్ల ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు వెల్లడించింది.

ధురంధర్‌పై హృతిక్ వ్యాఖ్యలపై విమర్శలు


హృతిక్ రోషన్

రణ్‌వీర్ సింగ్ హీరోగా ఆదిత్య ధర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘ధురంధర్’. ప్రస్తుతం థియేటర్లలో సందడి చేస్తున్న ఈ సినిమా గురించి మాట్లాడారు హృతిక్ రోషన్. సినిమా అంటే ఇలానే ఉండాలి కానీ.. ఇందులోని రాజకీయ అంశాల్ని అంగీకరించలేకపోతున్నా అంటూ సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. “నాకు ఈ చిత్రం చాలా నచ్చింది. అంత గొప్ప కథను ప్రేక్షకులకు అందించినందుకు చిత్రబృందానికి అభినందనలు. హృదయానికి హత్తుకునేలా దీన్ని తీర్చిదిద్దారు. కథను తెరకెక్కించిన విధానం మెప్పించింది. ఇదే అసలైన సినిమా అనిపించింది. ఇందులో చూపించిన రాజకీయపరమైన అంశాలను నేను అంగీకరించలేపోతున్నా. కానీ దర్శకులు కొన్ని విషయాలపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలి కాబట్టి అలా రూపొందించారని అనుకుంటున్నా. చిత్రపరిశ్రమకు చెందిన వ్యక్తిగా ఈ చిత్రాన్ని బాగా ఆస్వాదించాను. ఈ చిత్రం నుంచి ఎన్నో విషయాల్ని నేర్చుకున్నా” అని ఆ పోస్ట్‌లో రాసుకొచ్చారు. దీంతో ‘ధురంధర్’లో కేవలం పాకిస్థాన్ ఉగ్రవాదుల క్రూరత్వాన్ని, దాడులను చూపారని, ఆవిషయాలను ఎందుకు అంగీకరించలేపోతున్నారని హృతిక్‌పై నెట్టింట్లో విమర్శలు కురిపిస్తున్నారు ప్రేక్షకులు.

కుటుంబ సమేతంగా..

రామ్‌కిరణ్, మేఘ ఆకాష్ జంటగా ఉదయ్‌శర్మ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘సఃకుటుంబానాం’. హెచ్.మహదేవ్ గౌడ్, నాగరత్న సంయుక్తంగా నిర్మించారు. రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం, శుభలేఖ సుధాకర్, సత్య, రాజశ్రీ నాయర్ కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రాన్ని 19వ తేదీన విడుదల చేయనున్నట్లు సినీ వర్గాలు ప్రకటించాయి. “కొన్ని నిర్ణయాలు వ్యాపారం కోసం కాకుండా... భావోద్వేగాల్ని దృష్టిలో ఉంచుకుని తీసుకుంటుంటాం. ‘అఖండ 2’ చిత్రం 12వ తేదీ వస్తున్నందుకు బాలకృష్ణపై గౌరవంతో మేం మా సినిమాని 19న విడుదల చేయాలని నిర్ణయించాం. పేరుకు తగ్గట్టే కుటుంబమంతా కలిసి చూడదగిన చిత్రమిది”ని సినీవర్గాలు తెలిపాయి.

ఆద్యంతం నవ్వించే త్రీరోజెస్ 2


ప్రగతి, సంయుక్త, మారుతి, ఎస్‌కేఎన్, ఈషా, రాశి

“విమర్శించే వాళ్లు లేకుంటే మనం ఎదగలేం” అన్నారు దర్శకుడు మారుతి. విమర్శించే వాళ్ల తిట్ల నుంచే పాజిటివ్ ఎనర్జీని తీసుకుని ఎదగాలని చెప్పారు. ఆయన ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ‘త్రీ రోజెస్ సీజన్ 2’ వెబ్‌సిరీస్ ప్రీరిలీజ్ వేడుకలో ఈ వ్యాఖ్యలు చేశారు. తను షోరన్నర్‌గా వ్యవహరించిన ఈ సిరీస్‌లో ఈషా రెబ్బా, రాశీ సింగ్, సత్య, హర్ష చెముడు, కుషిత కల్లపు ప్రధాన పాత్రలు పోషించారు. కిరణ్ కె కరవల్ల తెరకెక్కించారు. ఎస్‌కేఎన్ నిర్మించారు. ఈ సిరీస్ ఈ నెల 13నుంచి ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సంయుక్తా మేనన్, రూపా కొడువయూర్ తదితరులు అతిథులుగా హాజరయ్యారు. త్రీ రోజెస్ 2 ఆద్యంతం నవ్విస్తుందని చెప్పారు మారుతి. ఇటీవల ఏషియన్ ఓపెన్ అండ్ మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో తాను గెలిచిన నాలుగు పతకాల్ని చిత్ర పరిశ్రమలోని మహిళా ఆర్టిస్ట్‌లకు అంకితం చేస్తున్నట్లు నటి ప్రగతి తెలిపారు.

కొత్త రకమైన హాస్యాన్ని పంచుతాం!


మురళీ మనోహర్

తెలివైనోళ్లకీ... తెలివి తక్కువవాళ్లకీ మధ్య జరిగే యుద్ధమే మా ‘గుర్రం పాపిరెడ్డి’ సినిమా కథ అంటున్నారు దర్శకుడు మురళీ మనోహర్. ‘సింబా’ చిత్రంతో దర్శకుడిగా పరిచయమైన మురళీ మనోహర్... తన రెండో చిత్రంగా ‘గుర్రం పాపిరెడ్డి’ని తెరకెక్కించారు. నరేశ్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన చిత్రమిది. వేణు సద్ది, అమర్ బుర్రా, జయకాంత్ (బాబీ) నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా మురళీ మనోహర్ గురువారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడుతూ...“మన మూలాల్లోని కథతో... ఒక కొత్త రకమైన హాస్యాన్ని పంచే చిత్రమిది. మీమ్స్, రీల్స్ తరహా కామెడీ కాకుండా... మనలో సహజంగా ఉండే మూర్ఖత్వం నుంచి పుట్టుకొచ్చే హాస్యాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేశా. కథానాయకుడి పేరు గుర్రం పాపిరెడ్డి. ఈ కథంతా ఆ పాత్ర నేపథ్యంలోనే సాగుతుంది. నరేశ్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా.. ఇద్దరూ మంచి అభినయం ప్రదర్శించారు. మొదట ఈ సినిమాకి ‘పరమపద సోపానం’ అనే పేరు పెట్టాలనుకున్నాం. కథానాయకుడి పాత్రకి కూడా టెస్లా అనే పేరు అనుకున్నాం. అయితే అవి ప్రేక్షకులకు అంతగా కనెక్ట్ కాకపోవచ్చేమో అని ‘గుర్రం పాపిరెడ్డి’ అనే పేరుని ఖరారు చేశాం. బ్రహ్మానందం పాత్ర కూడా ఈ సినిమాకి చాలా కీలకం. ఆయన తొలి ఫ్రేమ్ నుంచి చివరి వరకూ కనిపిస్తారు. చాలా రోజుల తర్వాత ఆయన్ని ఓ కొత్త రకమైన విజువల్స్‌లో చూస్తారు ప్రేక్షకులు” అని చెప్పారు.

‘అన్నగారు వస్తున్నారు’ విడుదల నిలుపుదల

‘వా వాతియార్(అన్నగారు వస్తున్నారు)’ సినిమా విడుదలను నిలుపుదల చేస్తూ మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఈ సినిమాని శుక్రవారం విడుదల చేసేందుకు సన్నాహాలు చేశారు. నలన్ కుమారస్వామి దర్శకత్వంలో నటుడు కార్తి నటించిన ఈ చిత్రాన్ని స్టూడియో గ్రీన్ పతాకంపై జ్ఞానవేల్ రాజా నిర్మించారు. పారిశ్రామిక వేత్త అర్జున్‌లాల్ సుందర్‌దాస్ వద్ద జ్ఞానవేల్ రాజా రూ.10.35 కోట్లు తీసుకున్నారని, ఆ మొత్తం ప్రస్తుతం రూ.21.78 కోట్లు అయిందని ఆ నగదు చెల్లించాలని మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు అయింది. అదేవిధంగా ‘వా వాతియార్’ సినిమా విడుదలకు స్టే విధించాలని కోరారు. ఈ పిటిషన్ ఇదివరకు విచారించిన మద్రాసు హైకోర్టు వా వాతియార్ సినిమా విడుదలకు మధ్యంతర స్టే విధించింది. ఈ నేపథ్యంలో ఈ పిటిషన్ తిరిగి బుధవారం విచారణకు వచ్చింది. కోర్టు పలుమార్లు అవకాశం ఇచ్చినప్పటికీ జ్ఞానవేల్‌రాజా అప్పు తిరిగి ఇవ్వలేదని, కాబట్టి ఆయన ఆస్తులను జప్తు చేయాలని సుందర్‌దాస్ తరపు న్యాయవాది కోరారు. అనంతరం విచారణ జరిపిన న్యాయమూర్తులు జ్ఞానవేల్‌రాజాకు కోర్టు ఇదివరకే చాలా సార్లు అవకాశం ఇచ్చిందని, మళ్లీ అవకాశం ఇవ్వాల్సిన అవసరం లేదని, అప్పు తిరిగి చెల్లించేవరకు ‘వా వాతియార్’ విడుదల చేయకూడదని న్యాయస్థానం ఉత్తర్వులు ఇచ్చింది. -న్యూస్‌టుడే, ప్యారిస్

“తన కల చాలా పెద్దది.. సాధించలేనిదని భావించే ప్రతి అమ్మాయితో నేను మాట్లాడాలని అనుకుంటున్నా” అంటోంది కథానాయిక అలియా భట్. త్వరలో ‘ఆల్ఫా’ చిత్రంతో తెరపై యాక్షన్ హంగామాను మొదలు పెట్టడానికి సిద్ధమవుతోంది భామ. నటనతోనే కాకుండా.. అవకాశం వచ్చినప్పుడల్లా అంతర్జాతీయ వేదికలపై మెరుస్తూ సినీప్రియుల్ని ఆకర్షిస్తుంది. తాజాగా రెడ్ సీ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో సందడి చేసింది అలియా. ఈ సందర్భంగా తన కెరీర్ గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది.

ఇది ఒత్తిడి కాదు.. గౌరవం


అలియా భట్

“అంతర్జాతీయ వేదికపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడం ఏ నటికైనా గొప్ప బాధ్యత. నా దృష్టిలో ఇది ఒత్తిడి కాదు.. గౌరవం, గర్వం. మెట్‌గాలా, కేన్స్ లాంటి మరే ఇతర అంతర్జాతీయ కార్యక్రమం అయినా వేదికపై ఎంత గొప్పగా కనిపించినా.. ఆ తర్వాత అది సాధారణమవుతుంది. గ్లామర్, మంచి లుక్, రాత్రి తరచుగా పైజామాలో పిజ్జా తినడంతోనే ముగుస్తుంది(నవ్వుతూ)”.

అది నిర్ణయించేది ప్రేక్షకులే

రాహా మా జీవితంలోకి వచ్చాక చాలా మార్పులు వచ్చాయి. ప్రస్తుతం ఆమె ‘అమ్మా ఎక్కడికి వెళ్తున్నావు..? ఎప్పుడు వస్తావు’ అని అడిగేంత వయసులో ఉంది. అందుకే రోజూ నా ప్రయాణం చాలా భావోద్వేగంగా మారుతుంది. ఇక చిత్రపరిశ్రమ విషయానికొస్తే.. బంధుప్రీతి గురించి ఎప్పుడూ మాట్లాడుతూనే ఉంటారు. కానీ ఇక్కడ ఎవరు ఉండాలి.. ఎవరు వెళ్లాలో నిర్ణయించేది ప్రేక్షకులే. నేను ఇప్పుడు తల్లి అయినప్పటికీ... ప్రపంచాన్ని చుట్టి వచ్చినప్పటికీ.. విజయాలు సాధించినా.. నన్ను నేను ఓ విషయంలో కోల్పోకూడదనుకుంటా. ఏం జరిగినా.. ఎప్పుడూ నేర్చుకుంటూనే ఉండాలనుకుంటున్నా”.

18ఏళ్ల అమ్మాయిలా ఉండాలనిపిస్తోంది

“నేను చిన్న వయసులో చాలా ఉత్సాహం, శక్తితో ఉండేదాన్ని. 17-18ఏళ్ల వయసులో ఉన్నప్పుడు భయం, సంకోచం లేకుండా.. ప్రతిదీ చేయాలనుకునేదాన్ని. కానీ కాలక్రమేణా విజయం, వైఫల్యం రెండూ నన్ను మార్చాయి. ఇప్పటికీ అంతే ఉత్సాహంగా ఉన్నా. కానీ మునుపటి కన్నా ఇప్పుడు నా ఆలోచనా ధోరణిలో మార్పు వచ్చింది. కొన్నిసార్లు ఫలితాల గురించి పట్టించుకోకుండా నాకు అన్నీ ఇచ్చే ఆ 18ఏళ్ల అమ్మాయిలా ఉండాలనిపిస్తోంది”.


అలియాకు అంతర్జాతీయ పురస్కారం

రెడ్‌సీ అంతర్జాతీయ చిత్రోత్సవంలో అలియాను గోల్డెన్ గ్లోబ్స్ హారిజన్ అవార్డుతో సత్కరించారు. ఆమె అంతర్జాతీయ సినిమాకు చేసిన కృషికి గానూ ఈ పురస్కారం దక్కింది. ఈ సందర్భంగా అలియా మాట్లాడుతూ.. “గోల్డెన్ గ్లోబ్స్ ప్రపంచ అవార్డుల విశ్వంలో ఒక ప్రత్యేక భాగం. ఇప్పుడు నేను దాని ద్వారా గుర్తింపు పొందడం గౌరవంగా భావిస్తున్నా. మరింత సమగ్రమైన, ప్రభావవంతమైన కథలను చెప్పడానికి ప్రపంచమే కలిసి వస్తున్న ఈ తరుణంలో ఈ గుర్తింపు పొందడం సంతోషంగా ఉంది. భవిష్యత్తులో శక్తిమంతమైన, అర్థవంతమైన మహిళల కథలను తెరపైకి తీసుకురావాలనుకుంటున్నాను” అని చెప్పింది.

(c) eenadu

విమానం రద్దయిందా?

ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా వేలాది విమానాలు రద్దవ్వడం, ప్రయాణికులు విమానాశ్రయాల్లో వేచి చూడటం మనం చూశాం. ఇలా విమానాలు రద్దయినప్పుడు టికెట్ డబ్బులు వెనక్కి వస్తాయా? అసలు మనకున్న హక్కులేంటి? అనే సందేహాలు చాలామందిలో ఉన్నాయి. కేవలం టికెట్ డబ్బులు వెనక్కి తీసుకోవడమే కాకుండా, అదనంగా నష్టపరిహారం పొందే వీలూ ఉంది. ఈ నేపథ్యంలో విమాన ప్రయాణికులు తెలుసుకోవాల్సిన నిబంధనలేమిటో చూద్దాం..



భారతీయ పౌర విమానయాన నియంత్రణ సంస్థ (డీజీసీఏ) నిబంధనల ప్రకారం.. విమానయాన సంస్థ ముందస్తు సమాచారం లేకుండా కేవలం మీ ప్రయాణానికి 24 గంటల కంటే తక్కువ సమయంలో విమానం రద్దయినట్లు ప్రకటిస్తే.. కచ్చితంగా ప్రత్యామ్నాయ విమానాన్ని ఏర్పాటు చేయాలి. లేదా టికెట్ డబ్బును మొత్తం వాపసు ఇవ్వాలి. ఒకవేళ విమానయాన సంస్థ మీకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా లేదా సరైన ప్రత్యామ్నాయం చూపించకపోతే.. టికెట్ డబ్బులతోపాటు, అదనంగా పరిహారం పొందే హక్కు మీకుంది.

- మీ విమానం రద్దయినప్పుడు లేదా ఆలస్యమైనప్పుడు ప్రత్యామ్నాయ విమానం కోసం విమానాశ్రయంలో ఎదురుచూడాల్సి వస్తే.. మీకు ఉచితంగా ఆహారం, పానీయాలు అందించాలి. ఒకవేళ రాత్రిపూట వేచి ఉండాల్సి వస్తే వసతి సదుపాయం కల్పించాల్సిన బాధ్యత విమానయాన సంస్థదే.
- చాలా సందర్భాల్లో విమానయాన సంస్థలు సాంకేతిక కారణాల వల్ల లేదా నిర్వహణ సమస్యల వల్ల విమానం రద్దయ్యిందని చెబుతుంటాయి. అందుకే, పరిహారం ఇవ్వడం సాధ్యం కాదని అంటాయి. కానీ, వినియోగదారుల కోర్టుల తీర్పుల ప్రకారం.. పైలెట్ల కొరత లేదా సంస్థ అంతర్గత లోపాలను అసాధారణ పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలు వంటి కారణాలుగా పరిగణించలేం. సంస్థ లోపం వల్ల విమానం రద్దయితే, కచ్చితంగా పరిహారం కోరాలి.
- చాలా క్రెడిట్ కార్డుల్లో టికెట్ బుక్ చేసుకునేటప్పుడే 'ట్రిప్ క్యాన్సిలేషన్ కవర్' ఉంటుంది. విమాన ప్రయాణంలో అంతరాయం కలిగినప్పుడు కార్డు రకాన్ని బట్టి రూ.25,000 నుంచి రూ.1 కోటి వరకూ బీమా రక్షణ కల్పిస్తున్నాయి.
- మీరు టికెట్ కొనుగోలు చేసినప్పుడు వాడిన కార్డు బ్యాంకును సంప్రదిస్తే, ఈ కవర్ గురించి పూర్తి వివరాలు తెలుస్తాయి.

ప్రయాణ బీమా ఉంటే: మీకు ప్రయాణ బీమా ఉంటే.. విమానం రద్దయిన సందర్భాల్లో పరిహారం లభిస్తుంది. వసతి, భోజనం, ఇతర ఖర్చులనూ ఈ బీమా పాలసీ చెల్లిస్తుంది. దీన్ని తీసుకునేటప్పుడు ముందుగానే అన్ని నిబంధనలు తెలుసుకొని, ఎంచుకోండి. ప్రయాణం 6-7 గంటల ఆలస్యానికి కొన్ని బీమా సంస్థలు పరిహారం ఇవ్వడం లేదు.

ఏం చేయాలి?

ముందుగా విమానయాన సంస్థ నోడల్ ఆఫీసర్‌కు లేదా కస్టమర్ కేర్‌కు మెయిల్ చేయండి. అందులో డీజీసీఏ నిబంధనలను ప్రస్తావిస్తూ పరిహారం కోరండి.

- సంస్థ స్పందించకపోతే కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖకు చెందిన ఎయిర్‌సేవా యాప్ లేదా పోర్టల్‌లో ఫిర్యాదు చేయండి. ఇది ఫిర్యాదుల పరిష్కారానికి సమర్థంగా పనిచేస్తుంది.
- అప్పటికీ న్యాయం జరగకపోతే వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించవచ్చు. డీజీసీఏ ఇచ్చే పరిహారం కేవలం నామమాత్రమే. విమాన రద్దు వల్ల మీ వ్యాపార ఒప్పందాలు రద్దయినా, వాయిదా పడినా, మానసిక వేదనకు గురైనా అదనపు పరిహారం కోసం వినియోగదారుల కోర్టులో కేసు వేయొచ్చు. ఇప్పుడు ఈ-దాఖిల్ ద్వారా ఆన్‌లైన్లోనే ఫిర్యాదు చేయవచ్చు.

మీ ప్రయాణం పూర్తయ్యే వరకూ టికెట్, బోర్డింగ్ పాస్, విమానయాన సంస్థ పంపిన సందేశాలను భద్రపరచుకోండి. అవే మీ న్యాయపోరాటానికి బలమైన సాక్ష్యాలు. మీ హక్కులను అడిగి తెలుసుకోవడంలో వెనుకాడవద్దు.

సిప్ చేద్దాం స్టెప్-అప్

మ్యూచువల్ ఫండ్లలో క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్)లో మదుపు చేయడం ద్వారా డబ్బును కూడబెట్టేందుకు అవకాశం ఉంటుంది. ఇది అందరికీ తెలిసిందే. కానీ, కేవలం సాధారణంగా సిప్ చేస్తూ వెళ్తే మీరు అనుకున్నంత వేగంగా ధనవంతులు కాలేకపోవచ్చు. మీ ఆదాయం పెరిగే కొద్దీ, మీ పెట్టుబడిని పెంచే స్టెప్-అప్ సిప్ ద్వారా రూ.కోట్ల సంపదను సృష్టించుకునే వీలుంది. అది ఎలా తెలుసుకుందాం.



సంప్రదాయ సిప్ విధానంలో ఒక మొత్తాన్ని నిర్ణయించుకొని, కొన్నేళ్లపాటు అదే మొత్తాన్ని ప్రతి నెలా చెల్లిస్తూ ఉంటారు. కానీ, ఏటా మన ఆదాయం పెరుగుతూ ఉంటుంది. ఖర్చులూ (ద్రవ్యోల్బణం) పెరుగుతాయి. మీరు మొదలుపెట్టిన మొత్తాన్ని ఏటా ఒక నిర్ణీత శాతం (ఉదాహరణకు 10 శాతం) చొప్పున పెంచుకుంటూ వెళ్లడమే స్టెప్-అప్ సిప్. మీ ఆదాయం పెరుగుదలకు అనుగుణంగా ఇది ఉంటుంది. భవిష్యత్తు అవసరాలకు సరిపోయేలా డబ్బును సమకూరుస్తుంది.

లాభమేమిటి?

సాధారణ సిప్, స్టెప్-అప్ సిప్ మధ్య తేడాను ఒక ఉదాహరణతో గమనిద్దాం.

✦ మీరు నెలకు రూ.5,000 చొప్పున 15 ఏళ్లపాటు నిర్విరామంగా మదుపు చేస్తున్నారనుకుందాం. అప్పుడు మీరు చెల్లించిన మొత్తం రూ.9లక్షలు. దీనికి వార్షిక సగటు రాబడి 12 శాతం అంచనా వేసుకుంటే.. చివరగా మీ చేతికి వచ్చేది సుమారు రూ.24 లక్షలు.

✦ మొదటి ఏడాది రూ.5,000, రెండో ఏడాది రూ.5,500 ఇలా పెంచుకుంటూ వెళ్లారు అనుకుందాం. అప్పుడు 15 ఏళ్లలో మీరు చెల్లించిన మొత్తం రూ.19లక్షల వరకూ అవుతుంది. రూ.41.37 లక్షల వరకూ చేతికి వస్తుంది.

కోట్లు సాధ్యమే..

స్టెప్-అప్ సిప్‌తో రూ.10కోట్లకు మించి సంపదను కూడబెట్టడం సాధ్యమేనని నిపుణులు చెబుతున్నారు..

ఉదాహరణకు

రవి నెలకు రూ.10,000 చొప్పున క్రమానుగత పెట్టుబడి విధానంలో ఈక్విటీ ఫండ్లలో మదుపు చేయడం ప్రారంభించారు. వార్షిక సగటు రాబడి అంచనా 13 శాతం అనుకుందాం. ఏటా ఆయన 10 శాతం చొప్పున స్టెప్-అప్ చేస్తున్నారని భావిద్దాం.

అప్పుడు..

✦ **16 ఏళ్లలో:** మొత్తం పెట్టుబడి రూ.43,13,968. దీనిపై రూ.62,58,822 రాబడితో కలిసి రూ.1,05,72,790 అవుతుంది.

✦ **21 ఏళ్లలో:** మొత్తం పెట్టుబడి రూ.76,80,300. దీనిపై రాబడి రూ.1,63,56,706తో చేతికి రూ.2,40,37,006 వస్తాయి.

✦ **30 ఏళ్లలో:** మొత్తం పెట్టుబడి రూ.1,97,39,283 అవుతుంది. దీనిపై రూ.7,29,15,507 వరకూ రాబడి వస్తుందని అంచనా వేసుకుంటే.. రూ.9,26,54,790 చేతికి అందుతుంది. మరో ఏడాది పొడిగించారనుకోండి.. రూ.10.69 కోట్ల సంపదను సృష్టించొచ్చు.

దీర్ఘకాలం పెట్టుబడిని కొనసాగించినప్పుడు, చక్రవడ్డీ మహిమతోనే ఇదంతా సాధ్యమవుతుందని మర్చిపోవద్దు.

జాగ్రత్తగా ఉండాలి..

స్టెప్-అప్ సిప్ చాలా శక్తిమంతమైనదే. అయినప్పటికీ కొన్ని జాగ్రత్తలు పాటించాలి.

✦ పెద్ద మొత్తంలో డబ్బు జమ చేయాలనే ఉత్సాహంతో 20-30శాతం పెంచుతామని లక్ష్యంగా పెట్టుకోకండి. మధ్యలో ఖర్చులు పెరిగితే, సిప్ ఆపేయాల్సి వస్తుంది.

✦ ఒకవేళ ఒక ఏడాది మీ ఆదాయం పెరగకపోతే, ఉద్యోగంలో సమస్యలు వస్తే సిప్ భారం కావొచ్చు. కాబట్టి, మీ స్తోమతను బట్టి మాత్రమే పెంపు శాతాన్ని ఎంచుకోండి.

✦ మార్కెట్ హెచ్చుతగ్గులను పట్టించుకోవద్దు. దీర్ఘకాలంలోనే చక్రవడ్డీ అద్భుతాలు చేస్తుందని మర్చిపోవద్దు.

ఎవరికి అనుకూలం..

కొత్తగా ఉద్యోగంలో చేరిన వారు. తమ వేతనం తక్కువగా ఉన్నా ముందుగా పెట్టుబడులను ప్రారంభించాలి. ఆ తర్వాత ఏటా ఆదాయం పెరిగినప్పుడల్లా పెట్టుబడిని స్టెప్-అప్ చేసుకోవచ్చు.

✦ ఆలస్యంగా మదుపు ప్రారంభించిన వారికి (40 ఏళ్ల తర్వాత) తక్కువ సమయం ఉంటుంది. ఇలాంటివారికి సాధారణ సిప్ సరిపోదు. ఉదాహరణకు 45 ఏళ్ల వ్యక్తి నెలకు రూ.10,000 సిప్ చేశారనుకుందాం.. 15 ఏళ్లలో 13 శాతం రాబడి అంచనాతో.. రూ.88,82,196 మాత్రమే జమ చేయగలరు. అదే ఏటా 15 శాతం పెట్టుబడిని పెంచుతూ వెళ్తే.. 15 ఏళ్లలో రూ.1,20,77,377 జమ చేసేందుకు వీలవుతుంది.

ఇప్పుడే ఉద్యోగంలో చేరినా, పదవీ విరమణకు దగ్గరగా ఉన్నా.. సంపద సృష్టించేందుకు స్టెప్-అప్ ఒక మంచి మార్గమే. చిన్న మొత్తంతో మదుపు ప్రారంభించండి. క్రమం తప్పకుండా దాన్ని పెంచుతూ వెళ్లండి.

(గణాంకాలు అంచనాలు మాత్రమే. మీ సొంత అవగాహన, నిర్ణయంతోనే పెట్టుబడులను ప్రారంభించాలి. మ్యూచువల్ ఫండ్లలో నష్టభయం ఉంటుంది.)

బంగారం, వెండిలో మదుపు

కొత్త పథకం

ప్రతి ఒక్కరి పెట్టుబడుల పోర్ట్‌ఫోలియోలో బంగారం, వెండి తప్పనిసరిగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. బంగారం, వెండి ధరలు బాగా పెరగడం ఇంకా పెరుగుతాయనే అంచనాలు ఉండటం, కొంతకాలం క్రితం ఈ రెండు లోహాలపై పెట్టుబడి పెట్టిన వారికి అధిక లాభాలు కనిపించడం దీనికి ప్రధాన కారణాలు. ద్రవ్యోల్బణం, కరెన్సీ విలువ తగ్గిపోవడం, మార్కెట్లలో అనిశ్చితీ ఇతర కారణాలుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో బంగారం, వెండిపై పెట్టుబడి పెట్టాలని ఆశించే మదుపరుల కోసం యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా ఒక ప్యాసివ్ ఫండ్ ఆఫ్ ఫండ్‌ను తీసుకొచ్చింది. యాక్సిస్ గోల్డ్, సిల్వర్ పాసివ్ ఫండ్ ఆఫ్ ఫండ్ (ఎఫ్‌ఓఎఫ్) అనే ఈ పథకం.. పసిడి, వెండి ఈటీఎఫ్ (ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్)లలో పెట్టుబడి పెడుతుంది. ఈ రెండింటికీ సమానంగా పెట్టుబడి కేటాయిస్తారు. దేశీయ మార్కెట్లో ఈ లోహాల ధరలను పథకం పనితీరుకు ప్రామాణికంగా తీసుకుంటారు. ఎన్ఎఫ్ఓ ఈ నెల 22న ముగుస్తుంది. కనీస పెట్టుబడి రూ.100. దీనికి ప్రతీక్ టిబ్రేవాల్, ఆదిత్య పగారియా ఫండ్ మేనేజర్లుగా వ్యవహిస్తారు.

◆ ఎడెల్‌వైజ్ మ్యూచువల్ ఫండ్ సిల్వర్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ ను తీసుకువచ్చింది. ప్రధానంగా వెండిలో పెట్టుబడి పెట్టే అవకాశాన్ని కల్పించటం ఈ పథకం ప్రధాన లక్ష్యం. సమీకరించిన నిధులను సిల్వర్ ఈటీఎఫ్ పథకాల్లో పెట్టుబడిగా పెడతారు. ఎన్ఎఫ్ఓ ముగింపు తేదీ ఈ నెల 22. కనీసం రూ.100 పెట్టుబడి పెట్టాలి.

సిరి

siri@eenadu.net

వినియోగం ఆధారంగా

టాటా మ్యూచువల్ ఫండ్ నుంచి ఒక వినూత్నమైన ఇండెక్స్ పథకం అందుబాటులోకి వచ్చింది. టాటా బీఎస్ఈ మల్టీక్యాప్ కన్సంప్షన్ 50:30:20 ఇండెక్స్ ఫండ్ అనే ఈ పథకం ఎన్ఎఫ్ఓ ముగింపు తేదీ ఈ నెల 23. బీఎస్ఈ మల్టీక్యాప్ కన్సంప్షన్ 50:30:20 ఇండెక్స్ (టీఆర్ఐ) ఈ పథకం పనితీరుకు కొలమానంగా ఉంటుంది. బీఎస్ఈ 500లోని 100 అగ్రశ్రేణి కంపెనీలతో ఈ ఇండెక్స్‌ను రూపొందించారు. లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ తరగతులకు చెందిన షేర్లలో పెట్టుబడి పెట్టే అవకాశం ఈ ఫండ్ ద్వారా కలుగుతుంది. ప్రధానంగా కన్సంప్షన్ థీమ్‌ను అనుసరించే పథకం కాబట్టి, వినియోగం అధికంగా నమోదవుతున్న రంగాల్లోని కంపెనీలను గుర్తించి, పెట్టుబడి పెడతారు. ఆటోమోటివ్, ఆటో విడిభాగాలు, డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్, పర్యటక సేవలు, ఇంటర్నెట్, రిటెయిల్.. తదితర కంపెనీలు ఇందులో ఉంటాయి. ఎన్ఎఫ్ఓలో కనీసం రూ.5,000 పెట్టుబడి పెట్టాలి.

లోహాల్లో పెట్టుబడి

కొంతకాలంగా బంగారం, వెండి ధరలు బాగా పెరిగాయి. సమీప భవిష్యత్తులో మిగిలిన లోహాలు ఇదే బాటను అనుసరిస్తాయనే అంచనాలున్నాయి. ఇదే జరిగితే అల్యూమినియం, రాగి, జింగ్, స్టీలు ధరలూ బాగా పెరుగుతాయి. ఈ లోహాలను ఉత్పత్తి చేసే కంపెనీలకు అధిక లాభాలు నమోదు అవుతాయి. ఈ నేపథ్యంలో గ్రో మ్యూచువల్ ఫండ్ కొత్తగా మెటల్ ఈటీఎఫ్ పథకాన్ని ఆవిష్కరించింది. గ్రో నిఫ్టీ మెటల్ ఈటీఎఫ్ అనే ఈ పథకం ఎన్ఎఫ్ఓ ఈ నెల 17తో ముగుస్తుంది. ఎన్ఎఫ్ఓలో కనీసం రూ.500 పెట్టుబడి పెట్టాలి. ఈ పథకం పనితీరుకు నిఫ్టీ మెటల్ ఇండెక్స్-టీఆర్ఐ కొలమానంగా ఉంటుంది. ఈ సూచీలో ఉన్న షేర్లపై ఈ పథకం పెట్టుబడి పెడుతుంది. నిఖిల్ సాతమ్, ఆకాశ్ చౌహాన్, శశి కుమార్ దీనికి ఫండ్ మేనేజర్లుగా ఉంటారు. విడివిడిగా లోహాల కంపెనీల షేర్లు కొనే బదులు నిపుణుల పర్యవేక్షణ ఉన్న లోహాల తరగతికి చెందిన మ్యూచువల్ ఫండ్‌పై పెట్టుబడి పెట్టాలనే ఆలోచన ఉన్న మదుపరులు ఈ పథకాన్ని పరిశీలించవచ్చు.

ఆ పాలసీని ఆపేయొచ్చా?

ఇటీవలే ఒక స్థలం విక్రయించాం. మా దగ్గర ఇప్పుడు రూ.25 లక్షల వరకూ ఉన్నాయి. మా అమ్మాయి భవిష్యత్తు అవసరాల కోసం ఈ మొత్తాన్ని కనీసం 10 ఏళ్ల వరకూ మదుపు చేయాలనే ఆలోచనతో ఉన్నాం. ఆ తర్వాతే డబ్బు వెనక్కి తీసుకుంటాం. ఇందుకోసం ఏం చేయాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? - రమేష్

ముందుగా మీ అమ్మాయి భవిష్యత్తు అవసరాలు, లక్ష్యాలకు తగిన ఆర్థిక భద్రత కల్పించండి. ఇందుకోసం మీ వార్షికాదాయానికి 10-12 రెట్ల వరకూ టర్మ్ ఇన్సూరెన్స్ ద్వారా జీవిత బీమా తీసుకోండి. మీరు పెట్టుబడి పెట్టాలనుకుంటున్న మొత్తం ద్రవ్యోల్బణాన్ని మించి కనీసం 4-5శాతం అధిక రాబడినిచ్చేలా చూసుకోండి. అప్పుడే మీ పెట్టుబడి వృద్ధి చెందుతుంది. అధిక రాబడి రావాలంటే ఈక్విటీ ఆధారిత పెట్టుబడులను ఎంచుకోవచ్చు. డైవర్సిఫైడ్ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో రూ.20లక్షలు, రూ.5లక్షలు గోల్డ్ ఫండ్లలో పెట్టుబడి పెట్టుకోండి. ఈ పెట్టుబడితోపాటు, వీలును బట్టి, నెలనెలా కొంత మొత్తాన్ని మదుపు చేసేందుకు ప్రయత్నించండి. రూ.25లక్షలను పదేళ్లపాటు సగటున 12 శాతం రాబడి వచ్చేలా మదుపు చేస్తే రూ.77,64,620 అయ్యేందుకు వీలుంది.

ఇటీవలే ఉద్యోగంలో చేరాను. నెలకు రూ.35వేల వరకూ వస్తున్నాయి. ఇందులో నుంచి రూ.10 వేల వరకూ దీర్ఘకాలంపాటు మదుపు చేయాలని అనుకుంటున్నాను. ఎలాంటి పథకాలను ఎంచుకుంటే మంచిది? - అఖిల్

కనీసం మూడు నెలల ఖర్చులకు సరిపోయేలా అత్యవసర నిధిని ముందుగా ఏర్పాటు చేసుకోండి. ఆ తర్వాత రూ.40లక్షలకు టర్మ్ పాలసీ తీసుకోండి. రూ.5లక్షల ఆరోగ్య బీమా, రూ.25 లక్షలకు వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీలుండాలి. మిడ్ అండ్ స్మాల్ క్యాప్ ఫండ్లలో రూ.3వేలు మదుపు చేయండి. మిగతా మొత్తాన్ని డైవర్సిఫైడ్ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లకు కేటాయించండి.

అగ్రెసివ్ హైబ్రిడ్ ఫండ్‌లో రూ.5లక్షలు జమ చేసి, డివిడెండ్‌ను వెనక్కి తీసుకోవాలని అనుకుంటున్నాను. ఇది మంచి ఆలోచనేనా? ప్రత్యామ్నాయం ఏముంది? - మోహన్

డివిడెండ్ అనేది లాభం కాదు. మీరు పెట్టిన పెట్టుబడిపై వచ్చిన రాబడినే కొంత మేరకు వెనక్కి ఇస్తారు. ఇది లాభంగానే అనిపిస్తుంది. కానీ, అంత ప్రయోజనం ఉండదు. ఫండ్ కొన్నిసార్లు డివిడెండ్‌ను అందించకపోవచ్చు. దీనికన్నా ఎస్‌డబ్ల్యూపీని ఎంచుకోవడం మంచిది.

పన్ను ఆదా కోసం నాలుగేళ్ల క్రితం ఒక ఎండోమెంట్ పాలసీ తీసుకున్నాను. ఏడాదికి రూ.40వేల వరకూ ప్రీమియం చెల్లిస్తున్నాను. ఇప్పుడు ఈ పాలసీని రద్దు చేసుకోవచ్చా? టర్మ్ పాలసీని తీసుకుంటే మంచిదేనా. నా వయసు 48. నెలకు రూ.70వేల వరకూ వస్తున్నాయి. ఎంత మొత్తానికి పాలసీ తీసుకోవాలి? - బాలకృష్ణ

ఎండోమెంట్ పాలసీల్లో సాధారణంగా 4-5 శాతం మధ్య రాబడి వస్తుంది. ఇది ద్రవ్యోల్బణాన్ని తట్టుకోలేదు. టర్మ్ పాలసీ తీసుకోవాలనే ఆలోచన మంచిదే. ఎండోమెంట్ పాలసీని రద్దు చేసుకుంటే మీరు చెల్లించిన ప్రీమియంలో 50-60 శాతమే వెనక్కి వచ్చే అవకాశం ఉంది. మీరు కనీసం రూ.80 లక్షల వరకూ టర్మ్ ఇన్సూరెన్స్‌ను తీసుకోండి.

మార్గదర్శి

గృహరుణం తీసుకొని ఇల్లు కొన్నాం. నెలకు రూ.32,500 వాయిదా చెల్లిస్తున్నాను. వడ్డీ రేట్లు తగ్గుతున్నాయి కదా.. మరో రూ.10లక్షల వరకూ రుణం ఇస్తామని బ్యాంకు అంటోంది. ఈ మొత్తాన్ని తీసుకోవచ్చా? ఏదైనా పెట్టుబడి పెడితే మంచి లాభం వస్తుందని ఆలోచిస్తున్నాను. - సూరజ్

ప్రస్తుతం మన దగ్గర వడ్డీ రేట్లు తగ్గుతున్నాయి. ఇంకా తగ్గే సూచనలూ ఉన్నాయి. మీరు టాపప్ రుణం తీసుకోవడం గురించి మరోసారి ఆలోచించండి. కనీసం అయిదేళ్లపాటు మదుపు చేస్తే, మీరు చెల్లించిన వడ్డీకి మించి రాబడి వచ్చే అవకాశం ఉంది. కానీ, మీపై రుణ భారం ఉంటుందని మర్చిపోవద్దు. మీకు ఈఎంఐ చెల్లించడం ఒత్తిడిగా అనిపిస్తే, టాపప్ రుణం తీసుకోవద్దు. టాపప్ రుణానికి చెల్లించే వాయిదా మొత్తాన్నే పెట్టుబడికి మళ్లించడం మంచిది.

– తుమ్మ బాల్‌రాజ్, సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

పొదుపు ఖాతా: సరైన బ్యాంకును ఎంచుకోండి



తొలిసారి ఉద్యోగంలో చేరినప్పుడు లేదా ఇంటికి దగ్గరగా ఉందని ఏదో ఒక బ్యాంకులో పొదుపు ఖాతా తీసుకుంటాం. డిజిటల్ బ్యాంకింగ్, మారుతున్న వడ్డీ రేట్ల నేపథ్యంలో మనం ఏ బ్యాంకును ఎంచుకుంటున్నాం అనే విషయంపై కాస్త శ్రద్ధ పెట్టడం ఇప్పుడు చాలా అవసరం. ముఖ్యంగా మీ బ్యాంకు ఖాతాలో ఎక్కువ మొత్తంలో నగదు నిల్వ ఉంచే అలవాటు ఉంటే, ఇది మరింత కీలకం అవుతుంది. మీ డబ్బుకు భద్రత ఉండాలి, అదే సమయంలో కొంత రాబడిని అందించేలా ఈ ఖాతా ఉండాలి.

✦ చాలామంది కొత్తగా బ్యాంకు ఖాతా ప్రారంభించేప్పుడు బ్యాంకులు ఇచ్చే 'వెల్కమ్ ఆఫర్లు' లేదా చిన్న వడ్డీ రేట్ల తేడాలనే చూస్తుంటారు. కానీ, అంతకన్నా ముందు ఆ బ్యాంకు ఎంత సురక్షితమైనది అనేది చూడాలి. మీ కష్టార్జితం, అత్యవసర నిధి ఉంచే బ్యాంకు ఎప్పుడూ నమ్మదగినదిగా ఉండాలి. ప్రభుత్వ రంగ బ్యాంకులు, పెద్ద ప్రైవేటు బ్యాంకులు సాధారణంగా ఆర్థికంగా బలంగా ఉంటాయి. వాటిలో నష్టభయమూ తక్కువ. కొత్తగా వచ్చిన చిన్న బ్యాంకులు ఎక్కువ వడ్డీ ఇస్తుంటాయి. కానీ, మీ ప్రధాన ఖాతా ఎప్పుడూ పెద్ద బ్యాంకులో ఉండటమే శ్రేయస్కరం.

✦ పొదుపు ఖాతా ముఖ్య ఉద్దేశం ఎప్పుడు కావాలంటే అప్పుడు నగదును తీసుకునేందుకు వీలుండటం. కరెంటు బిల్లు కట్టడం, కిరణా సరకులు కొనడం, రోజువారీ ఖర్చులు చేయడంలాంటివి. కాబట్టి, మూడు నెలలకు సరిపోయే ఖర్చుల డబ్బును మాత్రమే అందులో ఉంచాలి. అంతకు మించి ఎక్కువ డబ్బును సేవింగ్స్ ఖాతాలో ఉంచడం వల్ల పెద్దగా లాభం ఉండదు. ఈ ఖాతాపై బ్యాంకులు ఇచ్చే వడ్డీ కేవలం 2.5శాతమే. కొన్ని బ్యాంకులు ఇంకా తక్కువగానూ ఇస్తున్నాయి.


✦ వడ్డీ రేట్లతోపాటు బ్యాంకు విధించే ఛార్జీల గురించీ తెలుసుకోవాలి. కనీస బ్యాలెన్స్ లేకపోతే వేసే జరిమానాలు, ఏటీఎం ఛార్జీలు దీర్ఘకాలంలో భారమవుతాయి. మీ బ్యాంకు ఆన్‌లైన్, మొబైల్ బ్యాంకింగ్‌ను సులభంగా నిర్వహించేలా ఉండాలి. వినియోగదారుల సేవలు బాగుండాలి. చిన్న పనులకూ ఇబ్బంది పెట్టే బ్యాంకును ప్రధాన ఖాతా తీసుకునేందుకు ఎంచుకోవద్దు.

✦ ఎక్కువ డబ్బును ఖాళీగా ఈ ఖాతాలో ఉంచొద్దు. ఉదాహరణకు మీ దగ్గర రూ.10లక్షల నుంచి రూ.50లక్షల వరకూ ఉంటే, దానిని పొదుపు ఖాతాలో ఉంచినప్పుడు మీరు చాలా నష్టపోతారు. ఆ డబ్బును వేరేచోట పెట్టుబడి పెడితే వచ్చే అధిక లాభాన్ని మీరు కోల్పోతున్నారని అర్థం. ఇలాంటప్పుడు అవసరానికి మించి ఉన్న డబ్బును ఫిక్స్‌డ్ డిపాజిట్ ఖాతాలోకి మళ్లించడం మేలు.

✦ మీ డబ్బుకు అధిక రాబడి, భద్రత కావాలనుకున్నప్పుడు ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉత్తమం. రాబోయే కొద్ది రోజుల్లో స్కూలు ఫీజులు చెల్లించడానికి, ఇల్లు నిర్మాణానికో దాచిన డబ్బును మంచి బ్యాంకులో ఎఫ్‌డీ చేయడం మంచిది. ఇప్పుడు కాస్త వడ్డీ రేట్లు తగ్గుతున్నాయి. కాబట్టి, ప్రత్యామ్నాయంగా డెట్ ఫండ్లను ఎంచుకోవచ్చు. అత్యవసరం అయితే ఇందులో నుంచి డబ్బు తీసుకోవడమూ సులభమే. లిక్విడ్ లేదా అల్ట్రా షార్ట్ టర్మ్ ఫండ్లు పెద్ద మొత్తంలో డబ్బును స్వల్పకాలానికి దాచుకునేందుకు ఉపయోగపడతాయి.

అమ్మానాన్నలకు ఆరోగ్య బీమా

ఉన్నత చదువులు, ఉద్యోగాల కోసం యువత దూరప్రాంతాల్లో స్థిరపడటం ఈ రోజుల్లో సాధారణమే. ఇలా దూరంగా ఉన్నప్పుడు తల్లిదండ్రుల ఆరోగ్యం, వారికి ఏదైనా అత్యవసర వైద్య చికిత్స అవసరమైతే ఎలా అనే ఆందోళన పిల్లల్లో ఉంటుంది. తల్లిదండ్రుల కోసం ఆరోగ్య బీమా తీసుకోవడం ద్వారా వారి ఆరోగ్యానికి ఒక భరోసా కల్పించేందుకు వీలుంది. అంతేకాకుండా మీ పొదుపు మొత్తమూ వైద్య ఖర్చులకు చెల్లించాల్సిన అవసరం లేకుండా చూసుకోవచ్చు. ఇలా అమ్మానాన్నల కోసం ఒక పాలసీని తీసుకోవాలని భావించినప్పుడు కొన్ని ముఖ్యమైన విషయాలను గుర్తుంచుకోవాలి.



తగినంత బీమా

వయసు మీద పడుతున్నకొద్దీ అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం పెరుగుతుంది. దీనికి తోడు వైద్య ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయి. కాబట్టి, వైద్యపరమైన అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులు రాకుండా ఉండాలంటే సమగ్రమైన పాలసీని, తగినంత బీమా మొత్తంతో తీసుకోవాలి. ఈ రోజు సరిపోతుంది అనిపించిన మొత్తం, కొన్నేళ్ల తర్వాత సరిపోదు. అందుకే, ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకొని, కనీసం రెండు మూడేళ్లకోసారి బీమా మొత్తాన్ని సరిచూసుకోవాలి. ఇప్పుడు చాలా పాలసీలు రీస్టోర్ ప్రయోజనంతో పాలసీలను అందిస్తున్నాయి. ఇలాంటి వాటికి కాస్త ప్రీమియం అధికంగా ఉంటుంది. అవసరాన్ని బట్టి, దీన్ని పరిశీలించుకోవచ్చు.

ప్రత్యేకంగా..

కంపెనీలు అందించే పాలసీల్లో తల్లిదండ్రులకూ ఆరోగ్య బీమా ఉంటుంది. ఇది మంచిదే. కానీ, పూర్తిగా దీనిపైనే ఆధారపడకూడదు. వీరికి సొంతంగా ఒక పాలసీ తీసుకోవడమే ఉత్తమం. కొన్నిసార్లు ఉద్యోగం మారినప్పుడు మీరు చేరే కొత్త సంస్థ తల్లిదండ్రులకు పాలసీ అందించకపోవచ్చు. అలాంటప్పుడు ఇబ్బంది వస్తుంది. కొత్తగా పాలసీ తీసుకోవాలన్నా బీమా సంస్థ అంగీకరించకపోవచ్చు. కాబట్టి, తల్లిదండ్రులకు వీలైనంత వరకూ సొంత పాలసీని తీసుకోవడమే మంచిది. ఫ్యామిలీ ఫ్లోటర్ పాలసీలో భాగంగా తల్లిదండ్రులను, అత్తామామలను చేర్చుకునే పాలసీలు అందుబాటులో ఉన్నాయి. వీటిని పరిశీలించవచ్చు.

నెట్‌వర్క్ ఆసుపత్రులు..

మీ ఇంటికి దగ్గరలో ఉన్న ఆసుపత్రులు మీ కంపెనీ నెట్‌వర్క్‌లో ఉన్నాయా లేదా చూసుకోవాలి. ఉన్న కంపెనీ నుంచే పాలసీ తీసుకోవడం మేలు. దీనివల్ల ఆసుపత్రిలో చేరినప్పుడు నగదు రహిత చికిత్సకు అవకాశం ఉంటుంది. కొన్నిసార్లు ఇంటి వద్దే ఉండి, చికిత్స తీసుకోవాల్సిన అవసరం రావచ్చు. మీరు తీసుకునే పాలసీ ఇంటి వద్ద చికిత్సకూ అనుమతించాలి.

రైడర్లతో..

అనుబంధ పాలసీలను ఎంచుకోవడం ద్వారా అదనపు భరోసా లభిస్తుంది. ముఖ్యంగా ముందస్తు వ్యాధులకు పాలసీ తీసుకున్న రోజు నుంచే రక్షణ లభించడం, టాపప్ పాలసీల్లాంటివి ఎంచుకోవాలి.

వేచి ఉండే వ్యవధి...

ముందస్తు వ్యాధులకు వెంటనే ఆరోగ్య బీమా పాలసీ వర్తించదు. పాలసీ రకం, వ్యాధులను బట్టి 2-4 ఏళ్ల వరకూ వేచి ఉండే వ్యవధి ఉంటుంది. ఆ తర్వాతే పాలసీ పరిహారం చెల్లిస్తుంది. పెద్దల కోసం పాలసీ తీసుకునేటప్పుడు వీలైనంత వరకూ ఈ వ్యవధి తక్కువగా ఉండేలా చూసుకోవాలి. దీంతోపాటు పాలసీలో ఉప-పరిమితులు ఉండకూడదు. ఉదాహరణకు రూ.5లక్షల పాలసీ ఉన్నా, ఏదైనా ఒక వ్యాధి చికిత్సకు రూ.2లక్షలే చెల్లించేలా పరిమితి ఉంటుంది. గది అద్దె, శస్త్ర చికిత్సలకూ ఇలాంటి పరిమితులు ఉంటాయి. మీరు తీసుకున్న పాలసీలో ఇలాంటివి లేకుండా చూసుకోండి. ఉప-పరిమితులు, సహ- చెల్లింపులాంటివి ఎంచుకుంటే ప్రీమియం భారం తగ్గుతుంది. కానీ, అనుకోని పరిస్థితుల్లో బిల్లు మొత్తం పెరిగితే మీ డబ్బును ఖర్చు చేయాల్సి వస్తుంది.

(c) eenadu



లిపిడ్ అనేది జీవకణాల్లో అత్యంత ముఖ్యమైన జీవాణువుల్లో ఒకటి. లిపిడ్లు జల విరోధకాలు. అంటే ఇవి నీటిలో కరగవు. కొవ్వులు, నూనెలు, మైనం, ఫాస్ఫోలిపిడ్లు, స్టెరాయిడ్లు మొదలైనవి లిపిడ్లకు ఉదాహరణగా చెప్పవచ్చు. ఇవి క్లోరోఫాం, ఈథర్, బెంజీన్ లాంటి కర్బన ద్రావణాలు లేదా అధ్రువ ద్రావణాల్లో కరుగుతాయి. వీటిని సాధారణంగా మూడు రకాలుగా వర్గీకరిస్తారు. పోటీపరీక్షార్థులు లిపిడ్ల లక్షణాలు, రకాలు తదితరాలపై అవగాహన కలిగి ఉండాలి.



తోకకు జలంతో విరోధం.. తలకు మాత్రం సఖ్యత!

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

కెమిస్ట్రీ

లిపిడ్లు

లిపిడ్లు శక్తి నిల్వ పదార్థాలు, జీవ కణకవచ నిర్మాణంలో ప్రధాన భాగాలు. ఇవి శరీరానికి ముఖ్యమైన శక్తి వనరులు. ఇవి జంతువులు, మొక్కలు రెండింటిలోనూ ఉంటాయి.

✦ లిపిడ్లు కార్బన్ (C), హైడ్రోజన్ (H), ఆక్సిజన్ (O) మూలకాలను కలిగి ఉంటాయి. కొన్నిసార్లు ఫాస్ఫరస్ (P), నైట్రోజన్ (N) కూడా ఉంటాయి.

✦ లిపిడ్లలో కార్బన్, హైడ్రోజన్, ఆక్సిజన్ నిష్పత్తి కార్బోహైడ్రేట్ల కంటే ఎక్కువ. కాబట్టి ఇవి ఎక్కువ శక్తిని విడుదల చేస్తాయి.

✦ వెన్న, నెయ్యి, కొబ్బరి నూనె, పామాయిల్ మొదలైన వంట నూనెలు, జంతువుల కొవ్వులు, కొలెస్ట్రాల్ లాంటివి లిపిడ్లే.

లిపిడ్ల లక్షణాలు

లిపిడ్లు కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్ల మాదిరిగా పాలిమర్లు కావు. ఇవి కొవ్వు ఆమ్లాలు.

▮ ఫాస్ఫేట్లు, గ్లిసరాల్, ఆల్కహాల్ లాంటి కర్బన సమ్మేళనాలు సంయోగం చెందడం వల్ల ఏర్పడతాయి.

▮ నిర్మాణాత్మకంగా లిపిడ్లు కొవ్వు ఆమ్లాల ఎస్టర్ లింకేజ్‌లు.

$$R\text{-}COOH + R'\text{-}OH \longrightarrow R\text{-}CO\text{-}OR' + H_2O$$

(కార్బాక్సిలిక్ ఆమ్లం) (ఆల్కహాల్) (ఎస్టర్) (నీరు)

ఉదా: కొవ్వు ఆమ్లాలు గ్లిసరాల్‌తో చర్య జరిపి ట్రైగ్లిజరైడ్ అనే లిపిడ్‌ను ఏర్పరుస్తాయి.

కొవ్వు ఆమ్లాలు + గ్లిసరాల్ ⟶ లిపిడ్ + నీరు

▮ లిపిడ్లు సాధారణంగా జలవిరోధి/జలవికర్షణ స్వభావాన్ని కలిగి ఉంటాయి. ఇవి ధ్రువరహిత అణువులు. కాబట్టి నీటిలో కరగవు.

▮ ఫాస్ఫోలిపిడ్ల లాంటి కొన్ని లిపిడ్లు ఉభయధ్రువ స్వభావాన్ని ప్రదర్శిస్తాయి. వీటికి జలవిరోధి స్వభావం ఉన్న తోకలు, జలసఖ్యత/జలాకర్షణ స్వభావం ఉన్న తల భాగాలు ఉంటాయి.

లిపిడ్ల వర్గీకరణ

రసాయన నిర్మాణం ఆధారంగా లిపిడ్లను మూడు ప్రధాన వర్గాలుగా విభజించవచ్చు. అవి:

1) సరళ లిపిడ్లు 2) సంక్లిష్ట లిపిడ్లు 3) ఉత్పన్న లిపిడ్లు

సరళ లిపిడ్లు

కొవ్వు ఆమ్లాలు/ఫాటీ ఆమ్లాలు, ఆల్కహాల్ లేదా గ్లిసరాల్ కలయికతో ఏర్పడిన ఎస్టర్లను సరళ లిపిడ్లు అంటారు. వీటినే హోమోలిపిడ్లు అని కూడా అంటారు.

❖ ఇవి ఫాటీ ఆమ్లాలు, ఆల్కహాల్‌లతో మాత్రమే ఏర్పడతాయి. వీటిలో ఫాస్ఫరిక్ ఆమ్లం, నైట్రోజన్ బేసులు లేదా కార్బోహైడ్రేట్ల లాంటి ఇతర సమ్మేళనాలు ఉండవు.

❖ సరళ లిపిడ్లను తిరిగి మూడు వర్గాలుగా విభజించవచ్చు. అవి:

ఎ) కొవ్వులు బి) తైలాలు సి) మైనం

కొవ్వులు

కొవ్వులు ఫాటీ ఆమ్లాలు, గ్లిసరాల్ కలయికతో ఏర్పడిన ఎస్టర్లు.

☛ వీటిని రసాయనికంగా ట్రైగ్లిసరైడ్లు అని పిలుస్తారు.

☛ ఒక గ్లిసరాల్ అణువు మూడు ఫాటీ ఆమ్లాల అణువులతో కలిసి ఒక ట్రైగ్లిసరైడ్ అణువు ఏర్పడుతుంది.

గ్లిసరాల్ + 3 కొవ్వు ఆమ్లాలు ⟶ ట్రైగ్లిసరైడ్ (కొవ్వు) + $3H_2O$

☛ కొవ్వులు సాధారణంగా గది ఉష్ణోగ్రత వద్ద ఘనస్థితిలో ఉంటాయి.

☛ ఇవి ప్రధానంగా సంతృప్త ఫాటీ ఆమ్లాల ద్వారా ఏర్పడతాయి.

☛ నీటిలో కరగవు కానీ ఈథర్, క్లోరోఫాం, బెంజీన్ లాంటి కర్బన ద్రావణాల్లో కరుగుతాయి.

కొవ్వుల వనరులు: సాధారణంగా జంతువుల నుంచి లభిస్తాయి.

జంతు మూలం: వెన్న, చీజ్, నెయ్యి, జంతు కొవ్వు, పౌల్ట్రీ చర్మంలోని కొవ్వు, పాలలోని కొవ్వు.

మొక్కల మూలం: కొబ్బరి నూనె, పామాయిల్.

తైలాలు

తైలాలు కూడా ఫాటీ ఆమ్లాలు, గ్లిసరాల్ కలయికతో ఏర్పడిన ఎస్టర్లు. కాబట్టి ఇవి కూడా ట్రైగ్లిసరైడ్లే.

☛ తైలాల్లో ఉండే ఫాటీ ఆమ్లాలు ఎక్కువగా అసంతృప్త ఫాటీ ఆమ్లాలు. కాబట్టి సాధారణంగా గది ఉష్ణోగ్రత వద్ద ద్రవస్థితిలో ఉంటాయి.

గ్లిసరాల్ + అసంతృప్త ఫాటీ ఆమ్లాలు ⟶ ట్రైగ్లిసరైడ్ (తైలం) + నీరు

☛ ఇవి కూడా నీటిలో కరగవు కానీ కర్బన ద్రావణాల్లో (ఈథర్, క్లోరోఫాం, బెంజీన్) కరుగుతాయి.

☛ తైలాలు ఆక్సిజన్ లేదా గాలి సమక్షంలో క్రమంగా ఆక్సీకరణ చెంది ముక్కిపోతాయి.

తైలాల వనరులు: ఇవి మొక్కల నుంచి ప్రధానంగా లభిస్తాయి

మొక్కల మూలం: నువ్వుల నూనె, వేరుశెనగ నూనె, పొద్దు తిరుగుడు నూనె, ఆవ నూనె, ఆలివ్ నూనె.

జంతు మూలం: చేపల నూనె.

కొవ్వులు, తైలాల విధులు:

ఇవి శరీరానికి శక్తి నిల్వ పదార్థాలుగా పని చేస్తాయి.

● శరీర ఉష్ణాన్ని నియంత్రించడం, భౌతిక హాని నుంచి శరీర అవయవాలను రక్షించడం.

● కొవ్వులో కరిగే విటమిన్లు (A, D, E, K) శరీరంలోకి శోషితమయ్యేలా సహాయపడటం.

● తైలాలు చర్మం, జుట్టుకు తేమను ఇస్తాయి.

● తైలాలు ఆహార పదార్థాలకు రుచి, మెత్తదనం కల్పిస్తాయి.

● తగిన మోతాదులో కొవ్వులు, తైలాలు శరీరానికి అవసరం. ఎక్కువగా తీసుకుంటే అధిక బరువు, గుండె జబ్బులు, కొలెస్ట్రాల్ పెరగడం లాంటి సమస్యలు వస్తాయి.

మైనం

మైనం ఫాటీ ఆమ్లం, దీర్ఘ శృంఖల మోనో హైడ్రిక్ ఆల్కహాల్స్ కలయికతో ఏర్పడిన ఎస్టర్.

దీర్ఘ శృంఖల ఫాటీ ఆమ్లం + దీర్ఘ శృంఖల ఆల్కహాల్ ⟶ మైనం + నీరు.

ఉదా: పామిటిక్ ఆమ్లం + సిటైల్ ఆల్కహాల్ ⟶ సిటైల్ పామిటేట్ (మైనం)

☛ ఇవి సాధారణంగా ఘనస్థితిలో ఉంటూ, నీటిని నిరోధించే స్వభావం కలిగి ఉంటాయి.

☛ గది ఉష్ణోగ్రత వద్ద మెత్తగా, మెరుస్తూ ఉండే పదార్థాలుగా ఉంటాయి.

☛ వేడి చేస్తే కరిగి, చల్లబడితే ఘనరూపంలోకి వస్తాయి.

మైనాల వనరులు: ఇవి మొక్కలు, జంతువులు రెండింటి నుంచి లభిస్తాయి.

జంతు మూలం: తేనెటీగ మైనం, లానోలిన్

మొక్కల మూలం: కర్నౌబా మైనం, జోజోబా మైనం

మైనాల విధులు: మొక్కల ఆకులపై ఉండే మైనపు పొర నీటి నష్టాన్ని తగ్గిస్తుంది. వ్యాధికారకాల నుంచి రక్షిస్తాయి. జంతువుల చర్మం, పక్షుల ఈకలపై ఉండే మైనపు పొర నీటి నిరోధకతను అందిస్తుంది. ఇతర పర్యావరణ కారకాల నుంచి రక్షిస్తాయి. పరిశ్రమల్లో కొవ్వొత్తులు, పాలిష్‌లు, క్రీములు, కాస్మోటిక్స్, ఔషధాల తయారీలో మైనం ఉపయోగిస్తారు.



రచయిత
డా. పి. భానుప్రకాష్
అసిస్టెంట్ ప్రొఫెసర్

Word of the Day 858

Sacrosanct

Telugu meaning: ఉన్నతమైన, పవిత్రమైన

English meaning: The word sacrosanct (సాక్రోసాంక్ట్) is an adjective that describes something regarded as too important or holy to be interfered with or criticized.

Synonyms: Sacred, Holy; ***Antonyms:*** Ordinary, Disrespectful

Usage: **1.** In many families, the dinner hour is considered sacrosanct and free from all distractions.

2. The constitution is viewed as sacrosanct, and any attempt to alter it faces intense scrutiny.

నోటిఫికేషన్స్

ఇంటర్న్‌షిప్ పోస్టులు

న్యూదిల్లీలోని డీఆర్‌డీవో - సైంటిఫిక్ అనాలసిస్ గ్రూప్ (ఎస్ఏజీ) ఆరు నెలల కాలానికి యూజీ, పీజీ ఇంజినీరింగ్, సైన్స్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 30. అర్హులైన అభ్యర్థులు 2025, డిసెంబరు 19లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

టెక్నీషియన్ పోస్టులు

హైదరాబాద్ తార్నాకలోని సీఎస్ఐఆర్ - ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) వివిధ విభాగాల్లో టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 10. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసేందుకు చివరి తేదీ 30 డిసెంబరు 2025.

గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ పోస్టులు

నాసిక్‌లోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) గ్రాడ్యుయేట్, డిప్లొమా అప్రెంటిస్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 55. అర్హులైన అభ్యర్థులు 2025, డిసెంబరు 15, 17 తేదీల్లో ఇంటర్వ్యూకు హాజరుకావొచ్చు.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (డిసెంబరు 12) చివరి తేదీ

☛ ఈసీహెచ్ఎస్-విశాఖలో 14 మెడికల్ ఆఫీసర్ ఉద్యోగాలు. ఎంబీబీఎస్, ఎండీ, ఎంఎస్, బీఫార్మసీ, డిప్లొమా, ఎనిమిదో తరగతి ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

☛ ఎన్ఐటీ వరంగల్‌లో 45 ప్రొఫెసర్ పోస్టులు. బీటెక్/బీఈ, ఎంఈ/ఎంటెక్, ఎంఎస్సీ, ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

☛ ఎయిమ్స్ దిల్లీలో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాలు. డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.


☛ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ప్రాజెక్ట్ సైంటిస్ట్ పోస్టులు. పీహెచ్‌డీ ఉత్తీర్ణులు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ఉడుపి రామచంద్ర రావు (యూఆర్ రావు)

శాస్త్రవేత్తలు విశేషాలు

ఈయన భారత్‌కు చెందిన ప్రఖ్యాత అంతరిక్ష శాస్త్రవేత్త. మన దేశంలో స్పేస్ టెక్నాలజీ, శాటిలైట్ ప్రోగ్రాం అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. యూఆర్ రావు ఇస్రోకు ఛైర్మన్‌గానూ వ్యవహరించారు. ఈయన హయంలో స్వదేశీ కమ్యూనికేషన్స్, రిమోట్ సెన్సింగ్, వాతావరణ సేవలు అందించే ఉపగ్రహాలను రూపొందించి, ప్రయోగించారు. భారతదేశ మొట్టమొదటి ఉపగ్రహమైన ఆర్యభట్ట ప్రయోగానికి మార్గదర్శకత్వం వహించారు. దేశ శాస్త్ర సాంకేతికత అభివృద్ధిలో ముఖ్య భూమిక పోషించిన యూఆర్ రావు జీవితంలోని ముఖ్య విశేషాల గురించి తెలుసుకుందాం..!



బాల్యం - వృత్తి జీవితం

ఉడుపి రామచంద్ర రావు 1932, మార్చి 10న కర్ణాటకలోని అడమారు గ్రామంలో జన్మించారు. అనంతపురంలోని ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల నుంచి 1952లో బీఎస్సీ డిగ్రీ పొందారు. యూపీలోని బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం నుంచి 1954లో ఎంఎస్సీ పట్టా అందుకున్నారు. ఆయన అహ్మదాబాద్ (గుజరాత్) వెళ్లి ఫిజికల్ రిసెర్చ్ ల్యాబొరేటరీలో చేరారు. అక్కడ విక్రమ్ సారాభాయ్ మార్గదర్శకత్వంలో అనేక విషయాలు నేర్చుకున్నారు.

చివరగా..

ప్రస్తుతం భారత్ అంతరిక్ష విజ్ఞానంలో సాధించిన గణనీయమైన ప్రగతికి నాడు యూఆర్ రావు వేసిన పునాదే కారణం. ఆయన సాధించిన విజయాలు, నాయకత్వం ఇస్రో అభివృద్ధికి ఎంతగానో దోహదం చేశాయి. ప్రస్తుతం ఇది ప్రపంచంలోని అగ్రగామి అంతరిక్ష సంస్థల్లో ఒకటిగా ఉంది. రావు 2017, జులై 24న బెంగళూరులో మరణించారు.

ఎవరి పిలుపు మేరకు యూఆర్ రావు ఇండియాకి తిరిగి వచ్చారు? ఏయే పదవులు నిర్వహించారు? ఆయన రచనలు తదితర పూర్తి సమాచారం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - సైన్స్ అండ్ టెక్నాలజీ

జీవ సాంకేతికత - వ్యవసాయ రంగం

వ్యవసాయ రంగంలో జీవ సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించడం వల్ల అనేక విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. పంటలను చీడ-పీడల నుంచి రక్షించేందుకు, అధిక దిగుబడికి, నాణ్యమైన వంగడాల రూపకల్పనకు ఇది ఎంతగానో తోడ్పడుతోంది. పశుసంరక్షణ కార్యక్రమాలు, ఫుడ్ ప్రాసెసింగ్‌లోనూ దీన్ని వినియోగించి మంచి ఫలితాలు సాధిస్తున్నారు.



పశు సంరక్షణలో జీవసాంకేతికత

పశు సంరక్షణ కార్యక్రమాల్లో జీవ సాంకేతికతను ఉపయోగించి మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు.

✦ జీవాల నిర్వహణ, అధిక పాలను ఇచ్చే పశు సంపద సృష్టి, అత్యంత త్వరగా పెరిగే చేపలు మొదలైనవన్నీ జీవ సాంకేతికత ఫలితాలే.

ఫుడ్ ప్రాసెసింగ్‌లో జీవ సాంకేతికత

ఆహార తయారీ పరిశ్రమలో జీవ సాంకేతికత గణనీయమైన మార్పులను తీసుకొచ్చింది. ప్లాంట్ బ్రీడింగ్ విధానాల ద్వారా మానవాళి ఆకలి తీరుస్తూ, ఆరోగ్యాన్ని కల్పిస్తూ, జీవన ప్రమాణ స్థాయిని పెంచడంలో సహాయపడింది.

✦ ఆహార పదార్థాలకు పోషక విలువలను, రుచిని, మెరుగైన స్వరూపాన్ని అందించడంలో జీవ సాంకేతికత కీలకపాత్ర పోషిస్తుంది.

బయో ఫెర్టిలైజర్స్ - వర్గీకరణ, ప్రయోగాలు - ఫలితాలు, వర్మీ కంపోస్ట్ మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Bhadla Solar Park is located in..

Current Affairs

1. Which organisation has qualified the first AI tool to accelerate liver disease detection?
A) World Health Organization
B) US Food and Drug Administration (US FDA)
C) Centers for Disease Control and Prevention (CDC)
D) National Institutes of Health (NIH)

2. Andrej Babis was recently sworn in as the new Prime Minister of which country?
A) Slovakia B) Poland
C) Czech Republic D) Hungary

3. Which country recently declared a State of Emergency due to balloon incursions from Belarus?
A) Latvia B) Lithuania
C) Estonia D) Poland

4. What is the primary purpose of India's newly launched DHRUVA digital platform?
A) To provide citizens with online grievance-redressal services
B) To digitise government financial transactions
C) To create a national database for Aadhaar authentication
D) To offer a unified digital hub for Reference and Unique Virtual Addresses

5. The Central Excise (Amendment) Bill 2025, recently passed by the Lok Sabha, relates primarily to reforms in which area?
A) Agricultural subsidy regulation
B) Central excise duties and taxation framework
C) Labour welfare and social security codes
D) Digital transactions and cyber regulations

6. Which international event was inaugurated by India's Finance Minister?
A) Global Summit on Digital Trade
B) World Tax Cooperation Assembly
C) International Conference on Fiscal Transparency
D) 18th Plenary Meeting of the Global Forum on Tax Information Exchange

7. Which airport has become India's first water-positive airport?
A) Kempegowda International Airport
B) Indira Gandhi International (IGI) Airport, Delhi
C) Rajiv Gandhi International Airport, Hyderabad
D) Chhatrapati Shivaji Maharaj International Airport, Mumbai

SSC Exams Special

General Awareness

General Knowledge

8. Rattan Mohan Sharma, an acclaimed Indian classical vocalist, is best known by which honorary title?
A) Badshah-e-Tarana B) Sultan-e-Khayal
C) Ustad-e-Ragas D) Sur Samrat

9. The famous Kailasa Temple at Ellora, carved out of a single rock, was constructed during the reign of which ruler?
A) Dantidurga B) Govinda III
C) Amoghavarsha I D) Krishna I

10. Muhammad Yunus, who won the 2006 Nobel Peace Prize, is best known for his contribution to:
A) Establishing South Asia's largest commercial bank
B) Founding Grameen Bank and pioneering microfinance for poverty alleviation
C) Leading Bangladesh's central banking reforms
D) Introducing digital payment systems in rural Bangladesh

11. Sangeet Darpan is a classical Indian musical text authored by whom?
A) Sharangadeva
B) Damodar Pandit C) Narada
D) Pt. Vishnu Narayan Bhatkhande

Geography

12. Where does the Ramganga River ultimately join the Ganga?
A) Near Kannauj B) Near Haridwar
C) Near Varanasi D) Near Prayagraj

13. Where is the Bhadla Solar Park, one of the world's largest solar parks, located?
A) Barmer district, Rajasthan
B) Jodhpur district, Rajasthan
C) Bikaner district, Rajasthan
D) Jaisalmer district, Rajasthan

14. What is meant by the term Demographic Dividend?
A) Increase in population due to high fertility rates
B) Population decline due to migration
C) Government subsidies given to low-income households
D) Economic growth potential arising when the working-age population becomes larger than dependents

General Science

15. Which of the following statements correctly describes the Golgi apparatus?
A) It is the site of energy production and contains its own DNA
B) It was discovered by Camillo Golgi and is often large in secretory cells
C) It is the main location for protein synthesis in ribosomes
D) It stores genetic material and controls all cellular activities

16. Fluoride is important for dental health because it:
A) Helps in whitening teeth naturally
B) Strengthens tooth enamel and increases resistance to acid attacks
C) Helps in the growth of gums
D) Removes plaque completely from teeth

Scan the QR code for Key

These model questions were prepared by subject experts.

(c) eenadu

కరెంట్ అఫైర్స్ — మాదిరి ప్రశ్నలు



◆ ప్రతిష్ఠాత్మక కెంటన్ ఆర్.మిల్లర్ అవార్డు అదుకున్న మొదటి భారతీయురాలిగా ఇటీవల ఎవరు వార్తల్లో నిలిచారు? (కాజిరంగా జాతీయ ఉద్యానవనానికి ఈమె మొదటి మహిళా డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈక్వెడార్‌కు చెందిన రోక్ సైమన్ సెవిల్లా లారియాతో కలిసి ఈ పురస్కారాన్ని స్వీకరించారు.) **జ:** డాక్టర్ సోనాలి ఘోష్

◆ భారత్‌కు చెందిన ఏ నటుడు ఇటీవల బిలియనీర్ క్లబ్‌లో చేరి వార్తల్లో నిలిచారు?(హురున్ ఇండియా ప్రకటించిన రిచ్‌లిస్ట్(నటీనటుల విభాగం)లో తొలిస్థానంలో నిలిచారు. ఈయన ఆస్తి నికర విలువ రూ.1.4 బి.డా. అంటే రూ.12,490 కోట్లు.) **జ:** షారుఖ్ ఖాన్

◆ తల్లి నుంచి బిడ్డకు హెచ్ఐవీ, హెపటైటిస్ బీ, సిఫిలిస్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా నిరోధించిన (ట్రిపుల్ ఎలిమినేషన్) తొలి దేశంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏ దేశాన్ని గుర్తించింది? **జ:** మాల్దీవులు

◆ 2026-28కి ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలి (యూఎన్‌హెచ్‌ఆర్‌సీ)కి భారత్ ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఇలా భారత్ యూఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఎన్నిక కావడం ఇది ఎన్నోసారి? (ఆసియా-పసిఫిక్ గ్రూప్ నుంచి ఏ దేశం పోటీ చేయలేకపోవడంతో భారత్ ఏకగ్రీవంగా ఎన్నికైంది.) **జ:** ఏడోసారి

మరింత సమాచారం




దరఖాస్తు చేశారా?

☛ సెయిల్‌లో మేనేజ్‌మెంట్ ట్రెయినీ (టెక్నికల్) ఖాళీలు (124)
చివరి తేదీ: 15.12.2025

☛ ఎన్‌హెచ్‌పీసీలో స్టెనోగ్రాఫర్ ఉద్యోగాలు (84)
చివరి తేదీ: 15-12-2025

SENIOR INTER Zoology — Digestion and Absorption



Final Exams-2026 IMPORTANT Q & A

1. **What is auto-catalysis? Give two examples.**

A: Trypsinogen is activated by the enzyme enterokinase into active trypsin. This Trypsin activate trypsinogen into trypsin, it is called autocatalysis. Another such example is Pepsin.

2 Marks

2. **What is Chyme?**

A: The partially digested food, which is semisolid form and acidic in nature, formed in stomach by gastric juice is called Chyme.

3. **Name the different types of salivary glands of man, and their locations in the human body.**

A: There are 3 pairs of salivary glands of Man.
a) Parotid glands - present below the pinna and inner surface of cheeks.
b) Submandibular glands - located at the angles of lower jaw.
c) Sublingual glands - present below the tongue.

4. **What is the hardest substance in the human body? What is its origin?**

A: The hardest substance in the body is enamel, which is secreted by ameloblasts of ectodermal origin.


5. **Name different types of papillae present on the tongue of man.**

A: The different types of papillae present on the tongue of Man are
a) fungi form b) filiform
c) circumvallate papillae.

4 Marks

1. **Draw a neat labelled diagram of LS of tooth.**

A:



L.S. of tooth

More Imp Q & A




Writer: K. Ravicharan

ఆవేశిత కణాల అద్భుత చలనాలు!

జనరల్ స్టడీస్ భౌతికశాస్త్రం

విద్యుత్తు లేకపోతే భూగోళం స్తంభించి పోతుంది. అరచేతిలోని మొబైల్ నుంచి అంతరిక్షంలోకి దూసికెళ్లే రాకెట్ల వరకు, అత్యంత వేగంతో ప్రయాణించే రైళ్లు మొదలు ఇంటర్‌నెట్ ద్వారా ప్రపంచాన్ని కలిపే సర్వర్ల దాకా అన్ని అద్భుతాలకూ మూలం ఒకటే, అదే ప్రవాహ విద్యుత్తు. కంటికి కనిపించని ఆవేశాలు నిర్దిష్ట గమ్యానికి చేరడానికి చేసే ప్రయత్నం. భౌతికశాస్త్రంలో ప్రవాహ విద్యుత్తు అనేది తీగల ద్వారా కదిలే ఆవేశాల లెక్క మాత్రమే కాదు, నిరంతర శక్తి ప్రవాహాన్ని, కదలికలను అధ్యయనం చేసే ప్రక్రియ. ఇందులోని ఓమ్‌నియమం అనే తలుపులను తెరిస్తే కరెంటును నియంత్రించే నిరోధకత్వం కనిపిస్తుంది. వెలిగే బల్బు, విద్యుత్తు వలయాల వెనుక ఉన్న పలు నియమాలు అర్థమవుతాయి. నిత్యం ఉపయోగించే అనేక పరికరాల్లో దాగి ఉండే ఈ ప్రవాహశక్తి గొప్పదనాన్ని, ప్రాధాన్యాన్ని పోటీ పరీక్షల అభ్యర్థులు తెలుసుకోవాలి. ఆ శక్తి ప్రసార వాహకాలు, నిరోధకాలు, కరెంటు సామర్థ్యాన్ని కొలిచే పరికరాలు, అవి పనిచేసే నియమాలు, ప్రత్యేక పరికరాల్లో వాడే లోహాలపై శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి.



ప్రవాహ విద్యుత్తు

చలనంలో ఉన్న ఆవేశాలు, వాటి ఫలితాల అధ్యయనమే 'ప్రవాహ విద్యుత్తు'. ఎలక్ట్రాన్‌ల ప్రవాహమే విద్యుత్తు ప్రవాహం. పదార్థాల్లో విద్యుత్తు ప్రసరించడం ద్వారా ఎలక్ట్రాన్‌ల బదిలీ జరుగుతుంది. పదార్థాల్లో ఉండే కణాల్లో విద్యుత్తు ప్రసారానికి ప్రధానమైనవి వాహక ఎలక్ట్రాన్లు. వీటినే స్వేచ్ఛా ఎలక్ట్రాన్‌లు అని కూడా అంటారు. వాటి సంఖ్య ఆధారంగా పదార్థాలను వివిధ రకాలుగా వర్గీకరించారు.

విద్యుత్తు వాహకాలు

విద్యుత్తును తమ ద్వారా ప్రసరింపజేసే పదార్థాలను విద్యుత్తు వాహకాలు అంటారు. వీటి ద్వారా ఆవేశాలు ప్రసరిస్తాయి. ఈ పదార్థాల్లో వాహక ఎలక్ట్రాన్‌ల సంఖ్య చాలా ఎక్కువ (సుమారు 10^{35}/మీ.^{3}). దాంతో అవి వాహకత్వాన్ని ప్రదర్శిస్తాయి. వాహకత్వం అంటే విద్యుదావేశం అనే శక్తిని ప్రసరింపజేసే గుణం.

✦ వాహకాలకు ఉదాహరణ: లోహాలు, మానవ శరీరం, తడిచెక్క (కర్ర), తడి దుస్తులు.

✦ ఉత్తమ విద్యుత్తు వాహకాలు వెండి, రాగి, అల్యూమినియం, బంగారం మొదలైనవి.



విద్యుత్తు బంధకాలు



విద్యుత్తును తమ నుంచి ప్రసరింపజేయని పదార్థాలను విద్యుత్తు బంధకాలు అంటారు. ఇవి వాటి ద్వారా ప్రసరించే ఆవేశాల వేగాన్ని వ్యతిరేకిస్తాయి. ఈ పదార్థాల్లో స్వేచ్ఛా ఎలక్ట్రాన్‌లు చాలా తక్కువ (సుమారు 10^{17}/మీ.^{3}). (**ఉదా:** వజ్రం, పీవీసీ, ప్లాస్టిక్, రబ్బరు, గాజు, స్వచ్ఛమైన నీరు (స్వేదజలం).

ఉత్తమ బంధకాలు: పొడికర్ర, పొడి దుస్తులు, సాధారణ పీడనం వద్ద గాలి, నూనెలు, పెట్రోల్, డీజిల్, తేనె, పంచదార నీరు, గ్లూకోజ్ నీరు మొదలైనవి.

◆ పరిశుభ్రమైన నీరు (స్వేదజలం) విద్యుత్తు బంధకంగా పని చేస్తుంది. దీనికి లవణాలు కలిపితే అది మామూలు నీరుగా మారి విద్యుత్తు వాహకం అవుతుంది.

◆ విద్యుత్తు బంధకాన్ని అధిక తీవ్రతతో ఉండే విద్యుత్తు క్షేత్రంలో ఉంచితే అది వాహకంగా మారుతుంది. ◆ ఒక విద్యుత్తు బంధకం వాహకంగా మారకుండా ఉండగలిగే గరిష్ఠ విద్యుత్తు క్షేత్రాన్ని 'నిరోధకత్వం' అంటారు.

విద్యుత్తు ప్రవాహం (I)



ప్రమాణ మధ్యచ్ఛేద వైశాల్యం ఉన్న వాహకం నుంచి ప్రవహించే ఎలక్ట్రాన్ ప్రవాహరేటును 'విద్యుత్తు ప్రవాహం' అంటారు. ప్రమాణ కాలంలో ప్రసరించే విద్యుదావేశాన్ని 'కరెంట్' అంటారు.

$$\text{విద్యుత్తుప్రవాహం(I)} = \frac{\text{విద్యుదావేశం}}{\text{కాలం}} = \frac{q}{t}$$

$$\text{దీనికి ప్రమాణం} = \frac{\text{కూలుంబ్}}{\text{సెకన్}} = \text{ఆంపియర్}$$

✦ విద్యుత్తు ప్రవాహాన్ని 'అమ్మీటర్'తో కొలుస్తారు. అమ్మీటర్‌ను వలయంలోని శ్రేణిలో కలుపుతారు. ఆదర్శ అమ్మీటర్ నిరోధం శూన్యం.

రకాలు: విద్యుత్తు ప్రవాహం రెండు రకాలు. అవి..

1) **ఏకాంతర విద్యుత్తు (AC):** విద్యుత్తు ప్రవాహదిశ ధనాత్మకం నుంచి రుణాత్మకానికి, రుణాత్మకం నుంచి ధనాత్మకానికి మారుతూ ప్రసరిస్తే 'ఏకాంతర విద్యుత్తు' అంటారు. దీని పౌనఃపున్య విలువ సుమారు 50Hz. ఇది ప్రమాదకరమైన విద్యుత్తు. పవర్ స్టేషన్లలో మాత్రమే ఉత్పత్తి అవుతుంది. **ఉదా:** జల విద్యుత్తు కేంద్రం, పవన, సౌర, అణు, థర్మల్ విద్యుత్తు కేంద్రాలు. AC కరెంటును DCగా మార్చేది రెక్టిఫయిర్ (ఏకదిక్కారి).

2) **ఏకముఖ విద్యుత్తు (DC):** వలయంలో విద్యుత్తు ఒకే దిశలో ప్రయాణిస్తే అది ఏకముఖ విద్యుత్తు అంటారు. **ఉదా:** బ్యాటరీలు, ఇన్వర్టర్లు (DCని ACగా మార్చే పరికరం).

వివిధ వాహకాలు



విద్యుత్తు వాహకాలు ఓమీయ, అఓమీయ వాహకాలని రెండు రకాలు.

1) **ఓమీయ వాహకాలు:** ఓమ్ నియమాన్ని పాటించే వాహకాలను ఓమీయ వాహకాలు అంటారు. స్థిర ఉష్ణోగ్రత వద్ద ఒక వాహకం ద్వారా ప్రసరిస్తున్న విద్యుత్తు దాని చివరల పొటెన్షియల్ తేడాకు విలోమానుపాతంలో ఉంటుంది. దీనినే ఓమ్ నియమం అంటారు. **ఉదా:** లోహాలు. ఈ వాహకాలకు పొటెన్షియల్ భేదం (V), విద్యుత్తు ప్రవాహం (I)లను గ్రాఫ్ తీస్తే అది సరళరేఖ మాదిరి (రేఖీయం) ఏర్పడుతుంది. అందుకే వీటిని రేఖీయ వాహకాలు అంటారు.

2) **అఓమీయ వాహకాలు:** ఓమ్ నియమాన్ని పాటించని వాహకాలను 'అఓమీయ వాహకాలు' అంటారు. వీటిని వక్రవాహకాలు అని కూడా పిలుస్తారు.వీటిలో V, Iకి గ్రాఫ్ గీస్తే అది వక్రరేఖను చూపుతుంది. వీటికి **ఉదా:** ట్రాన్సిస్టర్లు, అర్ధవాహకాలు, ఎల్ఈడీలు, విద్యుత్తు విశ్లేష్యాలు.

అర్ధవాహకాలు



పదార్థాల్లో వాహక ఎలక్ట్రాన్‌ల సంఖ్య మధ్యస్థంగా ఉండే పదార్థాలే 'అర్ధ వాహకాలు'. వీటిలో వాహక ఎలక్ట్రాన్‌ల సంఖ్య సుమారుగా 10^8/మీ.^{3}. ఇవి వాహకాలకు, బంధకాలకు మధ్యస్థంగా ఉంటాయి. **ఉదా:** సిలికాన్, జర్మేనియం. ఆధునిక ఎలక్ట్రానిక్ పరికరాలకు ఈ అర్ధవాహకాలే మూలాధారం. వీటిని జంక్షన్ డయోడ్, ట్రాన్సిస్టర్, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్‌లలో ఉపయోగిస్తారు. గాలియం ఆర్సెనైడ్ లాంటి సమ్మేళనాలు అర్ధవాహకాలుగా ప్రవర్తిస్తాయి. వీటిలో ఉష్ణోగ్రత పెంచుతూపోతే నిరోధ లక్షణం తగ్గుతుంది. వీటిలో కాంతికి, ఉష్ణానికి ప్రతిస్పందించడం లాంటి మంచి లక్షణం ఉంటుంది.

విద్యుత్తు పొటెన్షియల్ (V) (విద్యుత్తు శక్మం)

అనంత దూరం నుంచి ఏకాంక ధనావేశాన్ని విద్యుత్తు క్షేత్రంలో ఒక బిందువు వద్దకు, క్షేత్ర వికర్షణకు వ్యతిరేకంగా పనిచేస్తూ తీసుకురావడానికి చేసిన పనిని ఆ బిందువు వద్ద విద్యుత్తు పొటెన్షియల్ అంటారు.★విద్యుదావేశాన్ని తీసుకురావడంలో జరిగిన పని 'W' అయితే

$$\text{విద్యుత్తు పొటెన్షియల్ (V)} = \frac{\text{పని (W)}}{\text{విద్యుదావేశం (q)}}$$ ★ $$\text{దీనికి ప్రమాణం} = \frac{\text{జౌల్}}{\text{కూలుంబ్}} = \text{వోల్ట్}$$

★ విద్యుత్తు ఎల్లప్పుడూ అధిక పొటెన్షియల్ నుంచి అల్ప పొటెన్షియల్‌కి ప్రయాణిస్తుంది. ★ కొలిచే పరికరం - వోల్ట్‌మీటర్. ★ ఆదర్శవంతమైన వోల్ట్‌మీటర్ యొక్క నిరోధం అనంతం. ★ ఎలక్ట్రాన్‌లను కలిపినా, తీసివేసినా భూమి పొటెన్షియల్‌లో తేడా ఉండదు. ★ ఒక విద్యుత్తు వలయంలో ఏవైనా రెండు బిందువుల మధ్య పొటెన్షియల్‌ల తేడానే పొటెన్షియల్‌భేదం లేదా శక్మాంతరం.




రచయిత: ఎస్ వై. నాయుడు

కేరళలో వెల్లాయణి.. గుజరాత్‌లో కన్‌కారియా!

జనరల్ స్టడీస్ - జాగ్రఫీ

భారతదేశానికి నదులే జీవధారలు, జీవనాధారాలు. అనాదిగా వ్యవసాయం, తాగునీరు, రవాణా, ఇతర మౌలిక అవసరాలను తీరుస్తూ సామాజికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. ఉత్తరాన హిమాలయ నదులు, దక్షిణాన ద్వీపకల్ప నదులు, వాటి ఉపనదులు దేశాన్ని సస్యశ్యామలం చేస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న ప్రధాన నదులు, ఉపనదులు, వాటికి ఉన్న స్థానిక పేర్లు, ప్రవాహ మార్గాలు, పరీవాహక ప్రాంతాలు, రాష్ట్రాలవారీగా వాటిపై నిర్మించిన భారీ, ముఖ్యమైన ప్రాజెక్టులపై పోటీ పరీక్షలు రాసే వారికి సమగ్ర పరిజ్ఞానం తప్పనిసరి. నదులు ఏర్పరిచే పెద్ద సరస్సులు, జలపాతాలు, దీవులు, నదీ తీర పట్టణాలు, నగరాలతో పాటు వివిధ రాష్ట్రాల ఉమ్మడి, వివాదాస్పద ప్రాజెక్టుల గురించీ తెలిసి ఉండాలి.



నదీ వ్యవస్థ

1. కిందివాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.



ఎ) కావేరి నది కర్ణాటకలోని నందిదుర్గ కొండల్లో జన్మించి తమిళనాడు ద్వారా ప్రవహిస్తూ బంగాళాఖాతంలో కలుస్తుంది.
బి) పెన్నా నది కర్ణాటకలోని బ్రహ్మగిరి కొండల్లో జన్మించి, ఆంధ్రప్రదేశ్ ద్వారా ప్రవహిస్తూ బంగాళాఖాతంలో కలుస్తుంది.
సి) మహానది ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యం వద్ద సిహావా ప్రాంతంలో జన్మించి, ఒడిశా ద్వారా ప్రవహిస్తూ బంగాళాఖాతంలో కలుస్తుంది.
డి) భారత్ నుంచి ప్రవహిస్తూ అరేబియా సముద్రంలో కలిసే నదుల్లో పొడవైనది సింధూ.


1) ఎ, బి, సి 2) బి, సి
3) ఎ, బి 4) సి, డి

2. కిందివాటిని జతపరిచి సమాధానం గుర్తించండి.

నదులు	ప్రాజెక్టులు
ఎ) చినాబ్	1) సట్లెజ్
బి) బియాస్	2) తెయిన్
సి) రావి	3) సలాల్
డి) భాక్రా	4) పోంగ్

1) ఎ-3, బి-4, సి-2, డి-1 2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-1, బి-2, సి-3, డి-4 4) ఎ-1, బి-4, సి-3, డి-2

3. కింది వాక్యాలు సరిచూడండి.



ఎ) సింధూ నది పరీవాహక ప్రాంతం దాదాపుగా 3,21,300 చ.కి.మీ. వరకు ఉంటుంది.
బి) షిగార్, గిర్తాంగ్ హూంజ్, ఖుర్రం మొదలైనవి సింధూ నదికి ప్రధాన కుడివైపు ఉపనదులు.
సి) మన దేశంలో ఏకైక అగ్నిపర్వత సంబంధిత సరస్సు మహారాష్ట్రలోని లోనార్ సరస్సు.
డి) ప్రాణహిత, పెన్‌గంగా, వెన్‌గంగా, వార్ధా మొదలైనవి గోదావరి ఎడమ వైపు ఉపనదులు.

1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు
2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు
3) ఎ, బి, సి, డి సరైనవి
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు

4. కిందివాటిని జతపరిచి సమాధానాలు గుర్తించండి.

నది	పరీవాహక ప్రాంతం (సరాసరి)
ఎ) కావేరి	1) 1,95,000 చ.కి.మీ.
బి) నర్మదా	2) 65,200 చ.కి.మీ.
సి) తపతి	3) 99,000 చ.కి.మీ.
డి) బ్రహ్మపుత్ర	4) 82000 చ.కి.మీ.

1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-1, బి-2, సి-3, డి-4
3) ఎ-3, బి-4, సి-2, డి-1 4) ఎ-4, బి-1, సి-2, డి-3

5. గోదావరి నదికి సంబంధించిన కిందివాక్యాలు సరిచూడండి.



ఎ) గోదావరి ఆంధ్రప్రదేశ్‌లో అల్లూరి సీతారామరాజు, ఏలూరు, తూర్పుగోదావరి, కోనసీమ, పశ్చిమ గోదావరి, కాకినాడ జిల్లాల ద్వారా ప్రవహిస్తుంది.
బి) మంజీరా, మానేరు, కిన్నెరసాని, ప్రవర, మూల అనేవి కుడివైపు ప్రధాన ఉపనదులు.
సి) ఆంధ్రప్రదేశ్‌లో దాదాపుగా 215 కి.మీ., తెలంగాణాలో 560 కి.మీ. ప్రవహిస్తుంది.
డి) పరీవాహక ప్రాంతం మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో విస్తరించి ఉంది.

1) ఎ, బి సరైనవి; సి, డి సరికావు
2) ఎ, బి, సి, డి సరైనవి
3) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు

6. కిందివాటిని జతపరిచి సమాధానం గుర్తించండి.

జలపాతం	నది
ఎ) కుంచికల్	1) మహానది
బి) జెర్సోప్పా	2) కావేరి
సి) శివసముద్రం	3) వారాహి
డి) కెప్లీ	4) శరావతి

1) ఎ-1, బి-2, సి-3, డి-4 2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-1, బి-4, సి-2, డి-3 4) ఎ-3, బి-4, సి-2, డి-1

7. భాక్రానంగల్ ప్రాజెక్టుకు సంబంధించి కింది వాక్యాలు సరిచూడండి.



ఎ) భాక్రానంగల్‌తో లబ్ధి పొందుతున్న రాష్ట్రాలు పంజాబ్, రాజస్థాన్, హరియాణా, హిమాచల్‌ప్రదేశ్.
బి) ప్రాజెక్టు కారణంగా గోవింద్ సాగర్ అనే మానవ నిర్మిత సరస్సు ఏర్పడింది.
సి) దాదాపుగా 27.5 లక్షల హెక్టార్లకు నీరు అందిస్తుంది.
డి) జవహర్‌లాల్ నెహ్రూ 1962, అక్టోబరు 22న ఈ ప్రాజెక్టును ప్రారంభించారు.

1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు
2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు
3) ఎ, బి, సి, డి సరైనవి
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు

8. కిందివాటిని జతపరిచి సమాధానం గుర్తించండి.

ప్రాజెక్టు	రాష్ట్రం
ఎ) బలిమెల	1) కర్ణాటక
బి) నాథ్ పాజక్రి	2) పశ్చిమ బెంగాల్
సి) ఫరక్కా	3) ఒడిశా
డి) కబిని	4) హిమాచల్‌ప్రదేశ్

1) ఎ-3, బి-4, సి-2, డి-1 2) ఎ-1, బి-2, సి-3, డి-4
3) ఎ-1, బి-4, సి-3, డి-2 4) ఎ-1, బి-3, సి-4, డి-2

9. కింది వాక్యాలు సరిచూడండి.

ఎ) భారతదేశంలో అత్యధికంగా వరదలకు కారణమవుతున్న నది బ్రహ్మపుత్ర. దీన్ని భారతదేశ దుఃఖదాయని అంటారు.
బి) దామోదర నది ప్రవాహంతో పశ్చిమ బెంగాల్ అధికంగా వరదలకు గురవుతోంది. దీన్ని బెంగాల్ దుఃఖదాయని అంటారు.
సి) కోసి నదిని సప్తకోసి అని పిలుస్తారు. దీని కారణంగా బిహార్ అధికంగా వరదలకు గురవుతోంది. ఈ నదిని బిహార్ దుఃఖదాయని అంటారు.
డి) బ్రహ్మపుత్ర నది అస్సాం లోయలో మజూలి అనే నదీ ఆధారిత దీవిని ఏర్పరుస్తుంది. ఇది దేశంలోనే అతిపెద్ద నదీ ఆధారిత దీవి.

1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు
2) ఎ, బి, సి, డి సరైనవి
3) ఎ, బి సరైనవి; సి, డి సరికావు
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు

10. కిందివాటిని జతపరిచి సమాధానం గుర్తించండి.

సరస్సులు	రాష్ట్రాలు
ఎ) నాకో	1) కేరళ
బి) కన్‌కారియా	2) పశ్చిమ బెంగాల్
సి) మిరిక్	3) గుజరాత్
డి) వెల్లాయణి	4) హిమాచల్‌ప్రదేశ్

1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-1, బి-2, సి-3, డి-4
3) ఎ-1, బి-4, సి-3, డి-2 4) ఎ-1, బి-3, సి-4, డి-2

11. కింది వాక్యాలు సరిచూడండి.

ఎ) తెహ్రీ ప్రాజెక్టు ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, దిల్లీల ఉమ్మడి ప్రాజెక్టు.
బి) ఇందిరా సాగర్ ప్రాజెక్టు మధ్యప్రదేశ్, గుజరాత్‌ల ఉమ్మడి ప్రాజెక్టు.
సి) సర్దార్ సరోవర్ ప్రాజెక్టు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్‌ల ఉమ్మడి ప్రాజెక్టు.
డి) రిహంద్ ప్రాజెక్టుతో ఉత్తర్‌ప్రదేశ్‌లో గోవింద్ వల్లభ్ పంత్ సాగర్ సరస్సు ఏర్పడింది.

1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు
2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు
3) ఎ, బి, సి, డి సరైనవి
4) ఎ, సి, డి సరైనవి; బి సరికాదు

12. కిందివాటిని జతపరిచి సమాధానం గుర్తించండి.

ప్రాజెక్టులు	నది
ఎ) రాంగంగా	1) నర్మదా
బి) ఇదుక్కి	2) సింధూ
సి) చుటక్	3) ఉత్తరాఖండ్
డి) ఓంకారేశ్వర్	4) పెరియార్

1) ఎ-2, బి-1, సి-4, డి-3 2) ఎ-3, బి-4, సి-2, డి-1
3) ఎ-4, బి-3, సి-2, డి-1 4) ఎ-1, బి-4, సి-3, డి-2

13. కింది వాక్యాలు సరిచూడండి.

ఎ) సింధూ నది ఉపనదుల్లో పెద్దది చినాబ్. దీన్నే చంద్రభాగ నది అంటారు.
బి) యమునా ఉపనది అయిన బెట్వా నదిని నేత్రావతి అంటారు. సాంచి, విదిశా ఈ నది ఒడ్డున ఉన్నాయి.
సి) సోన్ నది మధ్యప్రదేశ్, ఝార్ఖండ్, బిహార్‌లో ప్రవహిస్తుంది. దీన్నే సువర్ణ నది అంటారు.
డి) చంబల్ ఉప నది అయిన కెన్ నదిని కర్ణావతి నది అంటారు.

1) ఎ, బి, సి, డి సరైనవి
2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు
3) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు
4) ఎ, సి, డి సరైనవి; బి సరికాదు

14. కిందివాటిని జతపరిచి సమాధానం గుర్తించండి.

సరస్సులు	రాష్ట్రాలు
ఎ) పాంగాంగ్‌త్సో	1) తెలంగాణ
బి) దాల్	2) రాజస్థాన్
సి) పిచోల	3) జమ్ము-కశ్మీర్
డి) పాకాల	4) లద్దాఖ్

1) ఎ-1, బి-2, సి-3, డి-4 2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-1, బి-4, సి-3, డి-2 4) ఎ-3, బి-4, సి-2, డి-1

15. కింది వాక్యాలు సరిచూడండి.

ఎ) పోలవరం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్, తమిళనాడుల మధ్య వివాదాస్పద ప్రాజెక్టు.
బి) మాతాటిల్ల ప్రాజెక్టు ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్‌ల ఉమ్మడి ప్రాజెక్టు.
సి) గండక్ ప్రాజెక్టు బిహార్, ఉత్తర్‌ప్రదేశ్‌ల ఉమ్మడి ప్రాజెక్టు.
డి) హొగ్గెనెక్కల్ ప్రాజెక్టు తమిళనాడు, కర్ణాటకల వివాదాస్పద ప్రాజెక్టు.

1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు
2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు
3) ఎ, బి, సి, డి సరైనవి
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు

16. కిందివాటిని జతపరిచి సమాధానం గుర్తించండి.

నదీతీర పట్టణాలు	నది
ఎ) పుణె	1) సట్లెజ్
బి) మధురై	2) దామోదర్
సి) బర్ధమాన్	3) వైగై
డి) రోపార్	4) ముఠా

1) ఎ-4, బి-3, సి-1, డి-1
2) ఎ-1, బి-2, సి-3, డి-4
3) ఎ-4, బి-1, సి-2, డి-3
4) ఎ-1, బి-4, సి-3, డి-2



రచయిత: బండ్ల శ్రీధర్

సమాధానాలు

1-4; 2-1; 3-3; 4-1; 5-2; 6-4; 7-3; 8-1; 9-2; 10-1; 11-3; 12-2; 13-1; 14-2; 15-3; 16-1.

(c) eenadu

తాలిబన్ ప్రభుత్వంతో ఆచరణాత్మక సంబంధాలు కొనసాగించాలి

• ఐక్యరాజ్య సమితి వేదికగా భారత్ పిలుపు

ఐరాస: తాలిబన్ ప్రభుత్వంతో ఐక్యరాజ్య సమితి, అంతర్జాతీయ సమాజం ఆచరణాత్మక సంబంధాలను కొనసాగించాలని భారత్ పిలుపునిచ్చింది. శిక్షలు విధించడం వల్ల పరిస్థితుల్లో మార్పు రాదని, సానుకూల చర్యలకు ప్రోత్సాహకాలు ఉండే విధానాలను అవలంబించాలని ఐక్యరాజ్య సమితిలో (ఐరాస) భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ పేర్కొన్నారు. ఐరాస భద్రతా మండలిలో బుధవారం అఫ్గానిస్థాన్‌పై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అఫ్గానిస్థాన్‌పై పాకిస్థాన్ వైమానిక దాడులకు పాల్పడటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. 'ఐక్యరాజ్య సమితి చార్టర్, అంతర్జాతీయ చట్టాలను భారత్ గౌరవిస్తుంది. అమాయకులైన పౌరుల రక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. చాలా ఏళ్లుగా బలహీన పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రజలపై ఇలాంటి దాడులు చేయడం సరికాదు. క్లిష్ట పరిస్థితుల నుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తున్న అఫ్గాన్‌పై బహిరంగ బెదిరింపులు, యుద్ధ చర్యల వంటివి అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించడమే. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం' అని పేర్కొన్నారు.

థాయ్‌లాండ్‌లో గోవా నైట్‌క్లబ్ యజమానుల అరెస్టు

పనాజీ: గోవాలో అగ్ని ప్రమాదం జరిగిన నైట్ క్లబ్ 'బిర్చ్ బై రోమియో లేన్' యజమానులు, సోదరులైన సౌరభ్ లూథ్రా, గౌరవ్ లూథ్రాలను థాయ్‌లాండ్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భారత ప్రభుత్వ అభ్యర్థన మేరకు ఇంటర్‌పోల్ బ్లూ నోటీసు జారీ చేయడంతో ఈ చర్యలు తీసుకున్నారు. మరోవైపు వారి ట్రాన్సిట్ యాంటిసిపేటరీ బెయిలు పిటిషన్లను దిల్లీ కోర్టు తిరస్కరించింది. ప్రమాదం జరిగిన కొద్ది గంటల్లోనే వారిద్దరూ థాయ్‌లాండ్‌లోని పుకెట్‌కు పారిపోయారు. దేశంలోకి తిరిగి రాగానే అరెస్టు చేయకుండా నాలుగు వారాల ఉపశమనం ఇవ్వాలని లూథ్రా సోదరులు చేసిన విజ్ఞప్తిని జడ్జి వందన తోసిపుచ్చారు.

■ సిలిండర్ పేలుడుకు బాణసంచా తోడు కావడంతో గోవా నైట్ క్లబ్‌లో ప్రమాద తీవ్రత పెరిగింది. ఈ ఘటనలో 25 మంది మరణించారు.

రూ.45 కోట్ల విలువైన బంగారం, వజ్రాలు, డ్రగ్స్ స్వాధీనం

ముంబయి విమానాశ్రయంలో 12 మంది అరెస్టు

ముంబయి: మహారాష్ట్ర రాజధాని ముంబయిలోని ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు రూ.45 కోట్ల విలువైన గంజాయి, బంగారం, వజ్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 3 నుంచి 10 వరకు నిర్వహించిన తనిఖీల్లో వీటిని స్వాధీనం చేసుకున్నట్లు గురువారం అధికారులు వెల్లడించారు. మొత్తం 12 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఇందులో 9 మంది నుంచి రూ.37.26 కోట్ల విలువైన హైడ్రోపోనిక్ గంజాయి పట్టుకున్నారు. కొంత మత్తు పదార్థాన్ని ట్రాలీ బ్యాగుల్లో దాయగా, మరికొంత చింతపండు ముద్దలా మార్చి దాచినట్లు గుర్తించారు. మరో ఆపరేషన్‌లో రూ.6 కోట్ల విలువైన 6 కేజీల గంజాయిని పట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. రూ.1.51 కోట్ల విలువైన బంగారాన్ని నలుగురు ప్రయాణికుల నుంచి, రూ.87.75 లక్షల వజ్రాలను మరో వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భారత్, చైనాలపై మెక్సికో 50% సుంకాలు

మెక్సికో సిటీ: తమ దేశంతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం లేని దేశాల నుంచి దిగుమతి చేసుకునే ఎంపిక చేసిన వస్తువులపై సుంకాలను భారీగా పెంచేందుకు మెక్సికో ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలకు అక్కడి సెనెట్ ఆమోదం తెలిపింది. దీనివల్ల చైనా, భారత్‌సహా పలు ఆసియా దేశాలకు చెందిన దాదాపు 1,400 వస్తువులపై సుంకాలు 50 శాతం వరకు పెరిగే అవకాశాలున్నాయి. వచ్చే జనవరి 1 నుంచి ఇవి అమల్లోకి రానున్నాయి.

మణిపుర్‌లో నిరాశ్రయులను కలిసిన రాష్ట్రపతి

ఇంఫాల్: మణిపుర్‌లో నిరాశ్రయులుగా మారి సహాయక శిబిరాల్లో తలదాచుకుంటున్న వారిని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కలిశారు. రాజధాని ఇంఫాల్‌లోని లోక్ భవన్‌లో కొద్ది మందితో ఆమె భేటీ అయ్యారు. అన్ని వేళలా వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. ఇళ్లకు రక్షణతోపాటు జీవనాధారం కల్పించడం, పిల్లలకు చదువుల వంటి అంశాల్లో కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. శుక్రవారం ఆమె నాగా ఆదివాసులోని సేనాపతి జిల్లాలో పర్యటించనున్నారు.

పాక్ ఎఫ్-16ల ఆధునికీకరణకు అమెరికా ఆమోదం

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌కు అత్యాధునిక ఎఫ్-16 యుద్ధవిమాన సాంకేతికత, దానికి మద్దతు ఇచ్చే వ్యవస్థల విక్రయానికి అమెరికా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ రక్షణ ఒప్పందం విలువ 686 మిలియన్ డాలర్లు(భారత కరెన్సీలో రూ.6వేల కోట్లకు పైనే) ఉంటుందని యూఎస్ రక్షణ, భద్రత సహకార సంస్థ(డీఎస్‌సీఏ) కాంగ్రెస్‌కు అధికారికంగా తెలియజేసింది. ఈ రక్షణ ఒప్పందంలో భాగంగా అమెరికా, పాకిస్థాన్‌కు లింక్-16 వ్యవస్థలు, క్రిప్టోగ్రాఫిక్ పరికరాలు, ఏవియానిక్స్ అప్‌డేట్లు, పైలట్లకు శిక్షణ, సమగ్ర తోడ్పాటు ఇస్తుంది. పాకిస్థాన్‌కు ఇచ్చిన ఎఫ్-16 విమానాలను ఆధునికీకరించడం, వాటి భద్రతా సమస్యలను పరిష్కరించడం కూడా ఈ విక్రయ ఒప్పందం లక్ష్యమని డీఎస్‌సీఏ తన లేఖలో పేర్కొంది.

మయన్మార్‌లో ఆసుపత్రిపై వైమానిక దాడి.. 34 మంది మృతి

బ్యాంకాక్: మయన్మార్‌లో రెబల్స్ ఆధిపత్యంలో ఉన్న రఖైన్ ప్రాంతంలోని మ్రౌక్-యూ ఆసుపత్రిపై మిలిటరీ ప్రభుత్వం వైమానిక దాడి చేసింది. బుధవారం రాత్రి జరిగిన ఈ దాడిలో 34 మంది రోగులు, సిబ్బంది మరణించారు. 80 మంది గాయపడ్డారు. మిలిటరీ ప్రభుత్వం దీనిపై ఎటువంటి అధికారిక ప్రకటన వెలువరించలేదు. మరణించిన వారిలో 17 మంది మహిళలున్నారు. ఈ దాడిలో ఆసుపత్రి పూర్తిగా ధ్వంసమైంది. పార్కు చేసి ఉన్న ట్యాక్సీలు, ద్విచక్ర వాహనాలు కాలిపోయాయి.

ట్రంప్ విధానాలతో భారత్‌తో సంబంధాలపై ప్రభావం

• భారత సంతతి చట్టసభ సభ్యుల ఆందోళన



ప్రమీలా జయపాల్

వాషింగ్టన్: ప్రతీకార సుంకాలు, హెచ్1బీ వీసాలపై ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుతో అమెరికాలో వ్యాపారాలు, భారత్, అమెరికా ప్రజల మధ్య సంబంధాలు దెబ్బతింటున్నాయని అమెరికా చట్టసభ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. అదనపు సుంకాలతో అమెరికాలోని వ్యాపార సంస్థలు, వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారని అమెరికా ప్రతినిధుల సభ సభ్యురాలు ప్రమీలా జయపాల్ పేర్కొన్నారు. 'భారత్-అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యం: స్వేచ్ఛాయుత, అందరికీ అవకాశాలిచ్చే ఇండో-పసిఫిక్' అనే అంశంపై అమెరికా ప్రతినిధుల సభలోని దక్షిణాసియా, మధ్య ఆసియా వ్యవహారాల ఉప కమిటీ నిర్వహించిన చర్చలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.

నేను ప్రాతినిధ్యం వహిస్తున్న వాషింగ్టన్ రాష్ట్రానికి చెందిన ఒక ఉదాహరణను ఈ సభకు చెబుతాను. అక్కడ ఒక కుటుంబం 5 తరాలుగా వ్యాపార రంగంలో ఉంది. ఆ కుటుంబ కంపెనీ భారత్ నుంచి వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకుని అమెరికాలో విక్రయిస్తుంటుంది. గత వారమే నేను వాళ్లతో మాట్లాడా. భారీ దిగుమతి సుంకాలవల్ల అమెరికా మార్కెట్ అవసరాలకు తగిన స్థాయిలో భారత్ నుంచి వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకోలేకపోతున్నామని వారు వివరించారు. వ్యవసాయ ఉత్పత్తుల ధరలను పెంచి అమ్మాల్సి వస్తోందని తెలిపారు. గత 120 ఏళ్లలో తొలిసారిగా తమ వ్యాపారం సంక్షోభాన్ని చవిచూస్తోందని వెల్లడించారు. దిగుమతులను తగ్గించడం, విదేశాల్లో ఉత్పత్తుల సేకరణ/తయారీ ప్రక్రియను నిర్వహించడం మినహా మరో మార్గం తమకు కనిపించడం లేదని ఆ కుటుంబం వాపోయింది' అని ప్రమీలా జయపాల్ వివరించారు.

'రెండు దేశాల ఆర్థిక, భౌగోళిక ప్రయోజనాల దృష్ట్యా మరింత దగ్గరి సంబంధాలను కోరుకుంటున్నాం' అని మరో ప్రతినిధి అమీ బెరా స్పష్టం చేశారు. భారతీయ ప్రజలూ ఇదే కోరుకుంటున్నారని తెలిపారు. హెచ్1బీ వీసాలపై లక్ష డాలర్ల ఫీజువల్ల అమెరికా కంపెనీలు నష్టపోతాయని వివరించారు. భారత ప్రధాని మోదీ.. చైనా, రష్యా అధ్యక్షులతో భేటీ కావడం పట్ల అమెరికా కాంగ్రెస్ తీవ్ర ఆందోళనలో ఉందని తెలిపారు.

భారత్‌ను కోల్పోయిన అధ్యక్షుడిగా ట్రంప్ నిలిచిపోతారు: సిడ్నీ కమలాగర్



భారత్‌ను కోల్పోయిన అధ్యక్షుడిగా ట్రంప్ నిలిచే నిర్ణయాలు ప్రస్తుతం అమెరికాలో అమలవుతున్నాయని ప్రతినిధుల సభలో సభ్యురాలు సిడ్నీ కమలాగర్ డోవ్ అభిప్రాయపడ్డారు. 'దిగుమతి సుంకాల బాదుడు, వీసా ఫీజుల పెంపు, వ్యక్తిగత ప్రయోజనాల కోసం భారత్‌కు అమెరికాను ట్రంప్ దూరం చేస్తున్నారు. రక్షణ, ఇంధన రంగాలు, ఏఐ, స్పేస్ టెక్నాలజీల్లో అమెరికాకు భారత్ చాలా ముఖ్యమైంది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో అమెరికా ప్రయోజనాల పరిరక్షణ కోసం భారత్ సహకారం తప్పక అవసరం. క్వాడ్ కూటమిలో సభ్యత్వం కలిగిన భారత్‌కు అమెరికా సముచిత ప్రాధాన్యత ఇవ్వాల్సిందే. ఒకప్పుడు క్వాడ్ కూటమి బలోపేతంలో ట్రంప్ కీలక పాత్ర పోషించారు. ఇప్పుడు ఆయన దేశ ప్రయోజనాల కంటే వ్యక్తిగత ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. ట్రంప్ విధానాలవల్ల రష్యాకు చేరువగా భారత్ వెళ్తోంది. రష్యా నుంచి చమురును కొంటున్నందుకు భారత్‌పై అమెరికా అదనంగా 25 శాతం దిగుమతి సుంకాన్ని విధించింది. ఈ నిర్ణయం ఫలితంగానే ఈ ఏడాది జరగాల్సిన క్వాడ్ కూటమి సదస్సు వాయిదా పడింది. అమెరికాలో టెక్ ఆవిష్కరణలకు, సాఫ్ట్‌వేర్ రంగానికి పట్టుగొమ్మలుగా భారతీయులున్నారు. అలాంటి వాళ్లను వీసా ఫీజుల పెంపుతో ట్రంప్ వేధించారు. ఈ పరిణామాలను చైనా తనకు అనుకూలంగా మార్చుకుంటోంది' అని డోవ్ పేర్కొన్నారు.

చైనాకు చెక్ పెట్టాలంటే భారత్ సహకారం ఉండాల్సిందే: బిల్ హుయిజెంగా



ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సుస్థిరత కోసం భారత్‌తో అమెరికాకు మంచి సంబంధాలు అవసరమని అమెరికా ప్రతినిధుల సభలో సభ్యుడు బిల్ హుయిజెంగా తెలిపారు. 'ఇరు దేశాలు ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేసుకోవాలి. భారత ఆర్థిక వ్యవస్థ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. చాలా అమెరికా కంపెనీలు భారత్‌లో కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవాలి. ఇరుదేశాల సంబంధాలను తిరిగి గాడినపెట్టాలి. చైనాకు అమెరికా చెక్ పెట్టాలంటే భారత్ సహకారం ఉండాల్సిందే' అని హుయిజెంగా వ్యాఖ్యానించారు.

వందేమాతరానికీ జాతీయగీతం స్థాయి కల్పించాలి

• ఆ మేరకు దేశం ఒక నిర్ణయం తీసుకోవాలి • రాజ్యసభలో జె.పి.నడ్డా



దిల్లీ: దేశభక్తితో ముడిపడిన వందేమాతరం గేయాన్ని కూడా జాతీయ గీతంతో సమానంగా గుర్తించడానికి దేశం ఒక నిర్ణయం తీసుకోవాలని భాజపా అధ్యక్షుడు, రాజ్యసభాపక్ష నేత జె.పి.నడ్డా అభిప్రాయపడ్డారు. స్వాతంత్ర్యానికి ముందు, తర్వాత కూడా వందేమాతరం ప్రాధాన్యాన్ని కాంగ్రెస్ పార్టీ తగ్గించిందని ఆయన ఆరోపించారు. బుజ్జగింపు రాజకీయాలే దానికి కారణమన్నారు. వందేమాతరంపై ప్రత్యేక చర్చ ముగింపు సందర్భంగా గురువారం రాజ్యసభలో ఆయన 50 నిమిషాలు మాట్లాడారు. "వందేమాతరం అంటే దేశాన్ని ఐక్యంగా ఉంచే మంత్రం. అది బ్రిటిష్‌వారిని భయపెట్టింది. దేశ చరిత్ర రికార్డును సరిచేయడమే తప్పిస్తే తొలి ప్రధాని నెహ్రూను కించపరచడం ఈ చర్చ ఉద్దేశం కాదు. ఒక పరిణామం జరిగినప్పుడు అప్పుడు అధికారంలో ఉన్న నాయకులు దానికి బాధ్యత వహించాలి. ఈ విషయంలో కాంగ్రెస్‌ది ఎప్పుడూ అవకాశవాదం. ప్రారంభం నుంచి కూడా దేశ సంస్కృతి, విలువలు, ఆలోచనల్లో ఆ పార్టీ రాజీపడుతూ వస్తోంది. మాకు మాత్రం దేశమే ప్రధానం. వందేమాతరాన్ని ఆలపించకపోయినా, అగౌరవపరిచినా చర్య తీసుకునే నిబంధన సంబంధిత చట్టంలో లేదు" అని చెప్పారు. చర్చ నెహ్రూపైనా, వందేమాతరంపైనా అని విపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. నెహ్రూ దృక్కోణాన్ని నడ్డా వక్రీకరిస్తున్నారని ఆరోపించారు. వందేమాతరం, జనగణమనలకు సమాన హోదా ఎప్పటికీ ఉంటుందని కాంగ్రెస్ సభ్యుడు జైరాంరమేశ్ చెప్పారు.

సర్కారు చేతిలో ఈసీ కీలుబొమ్మ: మాకన్

ఎన్నికల సంస్కరణలపై రాజ్యసభలో చర్చను కాంగ్రెస్ సభ్యుడు అజయ్ మాకన్ ప్రారంభిస్తూ- ప్రభుత్వం చేతిలో తోలుబొమ్మలా ఎన్నికల సంఘం మారిందని విమర్శించారు. సమానావకాశాలు, పారదర్శకత, ఎన్నికల ప్రక్రియపై విశ్వసనీయత లేకుండా ప్రజాస్వామ్యం ఎలా మనుగడ సాగిస్తుందని ప్రశ్నించారు. ఎంపైరే మ్యాచ్‌ఫిక్సింగ్ చేస్తే ఆటగాళ్లు ఏం చేయగలరన్నారు. ఇతర పార్టీలకు నిధులు రాకుండా ఆదాయపు పన్ను శాఖ, ఈడీలను ప్రభుత్వం వాడుకుంటోందని ఆరోపించారు. నిధుల్లో సింహభాగం అధికార పార్టీకే వస్తే విపక్షాలకు అవకాశం ఎక్కడ ఉంటుందన్నారు. సాయంత్రం 4 గంటలకు సభ వాయిదా పడింది. ఎన్నికల సంస్కరణలపై శుక్రవారం చర్చ కొనసాగనుంది.

సోనియా, రాహుల్‌లది భారీ అవినీతి: దుబె

లోక్‌సభలో భాజపా సభ్యుడు నిశికాంత్ దుబె మాట్లాడుతూ- కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ భారీస్థాయి అవినీతికి పాల్పడుతున్నారని, కేవలం రూ.50 లక్షలతో అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్‌కు చెందిన రూ.2,000 కోట్ల ఆస్తుల్ని గుప్పిటపట్టారని ఆరోపించారు. దానిపై కాంగ్రెస్ నుంచి తీవ్రస్థాయిలో వ్యక్తమైన నిరసనలతో సభ శుక్రవారానికి వాయిదాపడింది. అంతకుముందు భాజపా సభ్యుడు అనురాగ్ ఠాకుర్ మాట్లాడుతూ- తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ ఒకరు గత కొన్నిరోజులుగా లోక్‌సభలోనే ఈ-సిగరెట్ వాడుతున్నారని ఆరోపించారు. దీనిపై రాతపూర్వక ఫిర్యాదు ఇస్తే చర్యలు తీసుకుంటామని స్పీకర్ ఓం బిర్లా తెలిపారు.

జమిలిపై కమిటీకి గడువు పెంపు

జమిలి ఎన్నికలపై బిల్లుల్ని పరిశీలించడానికి ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీకి విధించిన గడువును పెంచాలని లోక్‌సభ నిర్ణయించింది. 2026 బడ్జెట్ సమావేశాల్లో చివరి వారంలో తొలిరోజు వరకు గడువు పెంచాలని కమిటీ ఛైర్మన్ పి.పి.చౌధరీ ప్రతిపాదించిన తీర్మానానికి మూజువాణి ఓటుతో ఆమోదం లభించింది.

✦ లోక్‌సభ విపక్షనేత రాహుల్‌గాంధీ ఓ పలాయన నేతగా మారారని భాజపా విమర్శించింది. అయోమయాన్ని సృష్టించి, తప్పుడు ప్రచారం చేసేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని భాజపా అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా విలేకరుల సమావేశంలో ఆరోపించారు.

ఈసీ.. ఓటర్లను సందేహించే పోలీస్ కారాదు

• సుప్రీంకోర్టులో 'సర్'ను సవాల్ చేసిన పిటిషనర్ల వాదన

దిల్లీ: పౌరసత్వానికి సంబంధించి దేశంలో స్పష్టమైన చట్టాలున్నందున ఓటర్లను అనుమానించే దృష్టితో చూడాలని బూత్ స్థాయి అధికారుల(బీఎల్‌వో)ను ఎన్నికల సంఘం(ఈసీ) ఆదేశించడం తగదని 'సర్'ను సవాల్ చేసిన పిటిషనర్లు పేర్కొన్నారు. ఓటర్లను సందేహించే పోలీస్ పాత్రను ఈసీ పోషించరాదన్నారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది రాజు రామచంద్రన్ గురువారం సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చితో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ముందు వాదనలు వినిపించారు. పౌరులకు ఓటు హక్కు కల్పించడం ఈసీ రాజ్యాంగ విధి అని తెలిపారు. తాను నిర్వర్తించే విధిని ప్రతికూల భావనతో స్వయంగా సందేహించుకుంటున్నట్లుగా ఉందన్నారు. 'వలసదారు' అనే పదానికి ప్రస్తుత సామాజిక, రాజకీయ పరిస్థితుల్లో 'అక్రమ వలసదారు', లేదా ఇతర దేశాల నుంచి భారీగా తరలివస్తున్న ప్రజలు అనే అర్థం వస్తోందన్నారు. మన దేశంలోనూ ఉపాధి కోసం ప్రజలు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి భారీగా తరలుతున్న దృశ్యాలను మనం చూస్తున్నామని జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి తెలిపారు. బిహార్ నుంచి పంజాబ్ వెళ్లిన కూలీలు అక్కడే స్థిరపడుతున్న సందర్భాలెన్నో ఉన్నాయని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ గుర్తు చేశారు. 'సర్ కసరత్తును విధానపరమైన దృష్టితో తీక్షణంగా చూడొద్దు. 20ఏళ్ల తర్వాత ఈసీ ఈ కసరత్తు చేపట్టిందనే విషయాన్ని గుర్తించాలి. ప్రతి ఏడాదీ నిర్వహించేదేమీ కాదు. అందువల్ల మితిమీరిన సాంకేతిక కోణంలో మనం దానిలో జోక్యం చేసుకోవడం తగదు' అని సీజేఐ పేర్కొన్నారు. సర్ కసరత్తుపై దాఖలయ్యే పిటిషన్లను ఇకపై అనుమతించవద్దని సుప్రీంకోర్టు రిజిస్ట్రీని ఆదేశించారు. ఈ నెల 16న విచారణ కొనసాగనుంది.



దివ్యాంగుల హక్కుల చట్టం పరిధిలోకి యాసిడ్ బాధితులనూ తీసుకురండి

• కేంద్రానికి సుప్రీంకోర్టు సూచన

దిల్లీ: కర్కశ నేరగాళ్ల దాష్టీకానికి గురైన యాసిడ్ బాధితులకు దివ్యాంగుల చట్టంలో పొందుపరిచిన సంక్షేమ పథకాలు వర్తించేలా చేయాలని కేంద్ర ప్రభుత్వానికి గురువారం సుప్రీంకోర్టు సూచించింది. దీని కోసం దివ్యాంగుల హక్కుల చట్టానికి సవరణలు చేసే అంశాన్ని పరిశీలించాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం తెలిపింది. బలవంతంగా యాసిడ్ తాగించిన ఘటనల్లో శరీరంలోని అంతర్గత భాగాలు తీవ్రంగా దెబ్బతిన్న బాధితులు జీవన్మరణ సమస్యను ఎదుర్కొంటున్నారని పేర్కొంది. వారికి సరైన పరిహారం చెల్లించాలని, వైద్య సదుపాయాలతో పాటు ఇతర ఉపశమనాలను కల్పించాలని తెలిపింది. బాధితురాలు షహీన్ మాలిక్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై విచారణలో భాగంగా ఈ ఆదేశాలిచ్చింది. చట్టంలో మార్పులు చేసే విషయాన్ని కేంద్రం పరిశీలిస్తుందని సొలిసిటర్ జనరల్ తుషార్‌మెహతా వెల్లడించారు. తదుపరి విచారణ ఆరు వారాలకు వాయిదాపడింది.



దీపావళికి యునెస్కో గుర్తింపు దక్కిన సందర్భంగా గురువారం కోల్‌కతాలో 'జ్యోతి మార్చ్' నిర్వహించారు. అందులో భాగంగా పశ్చిమ బెంగాల్ గవర్నర్ ఆనంద్ బోస్ గుర్రపు బగ్గీపై వెళ్తూ ప్రజలకు అభివాదం చేశారు

ఆ వైద్యులు పీఎంజీకేవై బీమా పరిహారానికి అర్హులే:సుప్రీం

దిల్లీ: కొవిడ్ మహమ్మారి విజృంభించిన సమయంలో రోగులకు చికిత్సలు అందించే విధులు నిర్వర్తిస్తూ ప్రాణాలు కోల్పోయిన వైద్యులు...ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ యోజన-పీఎంజీకేవై కింద లభించే బీమా పరిహారానికి అర్హులేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బాధిత వైద్యుల కుటుంబాలకు రూ.50లక్షల బీమా పరిహారాన్ని అందజేయాలని జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఆర్.మహదేవన్ ధర్మాసనం గురువారం తీర్పు వెలువరించింది. పీఎంజీకేవై బీమా పరిహారానికి ప్రైవేటు వైద్యులు అర్హులుకారంటూ బాంబే హైకోర్టు 2021లో ఇచ్చిన తీర్పును కొట్టివేసింది.

మధ్యప్రదేశ్‌లో లొంగిపోయిన ఇద్దరు నక్సలైట్లు

బాలాఘాట్: మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లాలో ఇద్దరు నక్సలైట్లు గురువారం భద్రతా దళాల ఎదుట లొంగిపోయారు. వీరిపై సంయుక్తంగా రూ.43 లక్షల రివార్డు ఉంది. దీపక్, రోహిత్ అనే ఇద్దరు నక్సలైట్లు కోర్కాలోని సీఆర్‌పీఎఫ్ క్యాంపులో లొంగిపోయారని పోలీసులు వెల్లడించారు. పాలాగొండికి చెందిన దీపక్‌పై రూ.29 లక్షల రివార్డు.. రోహిత్‌పై రూ.14 లక్షల రివార్డు ఉంది. వీరిద్దరూ తుపాకులు వదిలిపెట్టి జనజీవన స్రవంతిలో కలిశారని అధికారులు వెల్లడించారు.

రాజస్థాన్‌లో బీఎల్‌వో ఆకస్మిక మరణం

జైపుర్: రాజస్థాన్‌లోని కోట్‌పుత్లీ-బహ్రోడ్ జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) విధుల్లో ఉన్న విజయ్ గుర్జార్ (42) అనే బూత్ స్థాయి అధికారి (బీఎల్‌వో) ఆకస్మికంగా మృత్యువాతపడ్డారు. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం- గుర్జార్ బుధవారం విధులు ముగించుకొని ఇంటికి వస్తుండగా రోడ్డుపై ఆకస్మాత్తుగా కుప్పకూలారు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు.

వాషింగ్టన్ రాష్ట్రంలో అత్యవసర పరిస్థితి

మౌంట్ వెర్నాన్: అమెరికాలోని వాషింగ్టన్ రాష్ట్రంలో కుండపోత వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. నదులు పొంగి పొర్లుతున్నాయి. హైవేల మీదకు బురద చేరడంతో రవాణా స్తంభించిపోయింది. చాలా మంది వరదల్లో చిక్కుకుపోయారు. వేల మందిని ఖాళీ చేయించాల్సి వచ్చింది. దీంతో రాష్ట్రంలో అత్యవసర పరిస్థితిని ప్రభుత్వం ప్రకటించింది. గురువారం ఉదయమూ కుండపోత వర్షాలు కురిశాయి. సియాటిల్, వాంకూవర్ మధ్య యామ్‌ట్రాక్ రైళ్లను అధికారులు నిలిపివేశారు.



బస్తర్ జిల్లాలోని జగదల్‌పుర్‌లో ప్రియదర్శిని ఇందిరా స్టేడియంలో గురువారం బస్తర్ ఒలింపిక్స్ ప్రారంభించిన సందర్భంగా ఫుట్‌బాల్ ఆడుతున్న ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్‌సాయ్

ఉక్రెయిన్‌లో శాంతి కోసం.. రష్యాకు ట్రంప్ ఆఫర్లు

ఇంటర్నెట్ డెస్క్: ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పడం కోసం రష్యాకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొన్ని ఆఫర్లు ఇచ్చినట్లు తెలుస్తోంది. వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం ప్రకారం- ఇటీవల ఐరోపా దేశాలకు అందజేసిన శాంతి ప్రణాళికకు అనుబంధంగా ట్రంప్ తాజా ప్రతిపాదనలు ఉన్నాయి. ఐరోపా దేశాలకు రష్యా నుంచి ఇంధన సరఫరాను పునరుద్ధరించాలనేది అందులో ఒకటి. ఆ దేశంలోని అరుదైన ఖనిజ రంగాల్లో పెట్టుబడులు పెట్టడంతో పాటు.. స్తంభింపజేసిన రష్యా ఆస్తుల విడుదల వంటి పలు ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. మరోవైపు- అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో జర్మనీ ఛాన్స్‌లర్ ఫ్రెడ్రిచ్ మెర్జ్, బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ మాట్లాడారు. జెలెన్‌స్కీ వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాలని వారితో ట్రంప్ అన్నారు. ఈ వారాంతంలో అమెరికా, ఐరోపా, ఉక్రెయిన్ నేతల సంయుక్త సమావేశం జరగొచ్చని పేర్కొన్నారు.



యువతకు సాంస్కృతిక కేంద్రంగా 'పీజీ'

ఈటీవీ భారత్: నగరాల్లో విద్యార్థులు, ఒంటరి ఉద్యోగులు నివసించే పేయింగ్ గెస్ట్ (పీజీ) కేంద్రాలు ఉన్నచోట ఇరుగు పొరుగు ఫిర్యాదులతో తరచూ వివాదాలు తలెత్తటం సాధారణంగా జరుగుతూ ఉంటుంది. గుజరాత్‌లోని జునాగఢ్ నగర హౌసింగ్‌బోర్డు ప్రాంతంలో గల 'పీజీ' మటుకు చాలా ప్రత్యేకం. నిర్వాహకుడైన డాక్టర్ డి.పి.సావలియా ఈ పీజీని ఓ సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దారు. ఇందులో ఉండే 'చెల్లింపు అతిథులు' నిత్యం తీరిక వేళల్లో వివిధ వాయిద్య పరికరాలతో సంగీత సాధన చేస్తారు. ఫోన్లు పట్టుకొని గంటల తరబడి కూర్చోవడం, అశ్లీలమైన రీల్స్ చూడటం వంటి వ్యసనాలు ఇక్కడ నిషిద్ధం. డ్రగ్స్ లాంటి చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలంటే సంగీతం మంచి ప్రత్యామ్నాయం అంటూ ఈ పీజీలో అన్నిరకాల వాయిద్య పరికరాలు అందుబాటులో ఉంచారు.

మానవీయ కారుణ్యాలు చట్టపరమైన కనీస దండనను తగ్గించలేవు

• గంజాయి కేసులో మహిళ జైలు శిక్షను తగ్గించటానికి నిరాకరిస్తూ సుప్రీంకోర్టు వ్యాఖ్య

దిల్లీ: మానవీయ, కారుణ్యపరమైన పరిశీలనాంశాలు చట్టంలో నిర్దేశించిన కనీస శిక్షలను అధిగమించేలా చేయలేవని సుప్రీంకోర్టు పేర్కొంది. గంజాయితో పట్టుబడిన మహిళకు హైకోర్టు విధించిన జైలు శిక్షలో జోక్యం చేసుకోవడానికి నిరాకరిస్తూ జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ విపుల్ ఎం.పంచోలి ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. 2019లో ఓ మహిళ, ఆమె భర్త 23.5 కిలోల గంజాయిని వాహనంలో తరలిస్తూ పట్టుబడ్డారు. మాదక ద్రవ్యాల నిరోధక చట్టం కింద వారిని దోషులుగా తేల్చిన ట్రయల్ కోర్టు.. పదేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధించింది. మద్రాస్ హైకోర్టు ఈ శిక్షను ఖరారు చేసింది. నేరం జరిగే నాటికి తాను 24ఏళ్ల మహిళనని, పసిబిడ్డకు తల్లినని, గతంలో ఎలాంటి కేసులు తనపై లేవని చెబుతూ శిక్షాకాలాన్ని తగ్గించాలని కోరుతూ ఆమె సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. విచారణ జరిపిన జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ విపుల్ ఎం.పంచోలి ధర్మాసనం ఆమె అభ్యర్థనను తోసిపుచ్చింది. చట్టంలో నిర్దేశించిన కనీస శిక్షలను తగ్గించే అధికారం న్యాయస్థానానికి లేదని పేర్కొంది. ఉపశమనం లేదా శిక్ష కాల వ్యవధి తగ్గింపు అంశం కార్యనిర్వాహక వ్యవస్థ పరిధిలోకి వస్తుందని తెలిపింది. చట్టబద్ధమైన ఉపశమనం కోసం సంబంధిత అధికార యంత్రాంగానికి విజ్ఞప్తి చేసుకునే స్వేచ్ఛ ఆమెకు ఉంటుందని పేర్కొంది.

పాక్ ఐఎస్ఐ మాజీ చీఫ్‌కు 14 ఏళ్ల జైలు శిక్ష

ఇస్లామాబాద్: పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ మాజీ చీఫ్ ఫైజ్ హమీద్‌కు 14 ఏళ్ల జైలు శిక్ష పడింది. అధికార రహస్యాల చట్ట ఉల్లంఘన, రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనడం వంటి అభియోగాల్లో ఆయన దోషిగా తేలాడు. పాక్‌లోని మిలిటరీ కోర్టు ఆయనకు కఠిన కారాగార శిక్ష విధించింది. పాక్‌లో ఐఎస్ఐ మాజీ చీఫ్ స్థాయి అధికారి దోషిగా తేలడం, శిక్ష పడటం ఇదే తొలిసారి. ఐఎస్ఐ డైరెక్టర్ జనరల్‌గా ఫైజ్ హమీద్ 2019 నుంచి 2021 వరకు పని చేశాడు. ఆర్మీ చీఫ్‌గా ఆసిం మునీర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత 2022 డిసెంబరులో ఆయన ముందస్తు పదవీ విరమణ చేశాడు. మునుపటి సైనికాధిపతి జనరల్ కమర్ బజ్వాకు హమీద్ సన్నిహితుడిగా పేరుంది. హమీద్ భూకబ్జాకు పాల్పడటంతోపాటు ఓ ప్రైవేటు హౌసింగ్ సొసైటీలో సోదాల సమయంలో విలువైన వస్తువులు తస్కరించాడనే ఆరోపణలొచ్చాయి.



అభిమానులకు అభివాదం చేస్తున్న మచాడో

అజ్ఞాతం వీడిన మచాడో

• 11 నెలల తర్వాత ప్రజల ముందుకు నోబెల్ గ్రహీత

ఓస్లో: వెనెజువెలా ప్రతిపక్ష నాయకురాలు, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మరియా కరోనా మచాడో (58) 11 నెలల అజ్ఞాత వాసాన్ని వీడి ప్రజల ముందుకొచ్చారు. నార్వేలో జరిగిన నోబెల్ బహుమతుల ప్రదాన కార్యక్రమానికి హాజరు కాలేకపోయినా.. కొన్ని గంటల తర్వాత రాజధాని ఓస్లోలోని ఓ హోటల్‌లో ఆమె ప్రత్యక్షమయ్యారు. దీంతో భారీ సంఖ్యలో ఆమె మద్దతుదారులు అక్కడికి చేరుకుని 'స్వేచ్ఛ.. స్వేచ్ఛ.. ధన్యవాదాలు.. ధన్యవాదాలు' అంటూ నినాదాలు చేశారు.



ఉర్దూ అకాడమీ స్వర్ణోత్సవాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి ఫరూక్, అకాడమీ ఛైర్మన్ ఫారూఖ్ షిబ్లీ తదితరులు

'సరూర్ ఎ ఉర్దూ మహోత్సవ్' పోస్టర్లను ఆవిష్కరించిన సీఎం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఆవిర్భవించి 50 సంవత్సరాలైన సందర్భంగా నిర్వహిస్తోన్న స్వర్ణోత్సవాల ప్రచార పోస్టర్లను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో చంద్రబాబును గురువారం మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఫరూక్, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ ఫరూక్ షిబ్లీ కలిశారు. 'సరూర్ ఎ ఉర్దూ మహోత్సవ్' నిర్వహణ వివరాలను సీఎంకు వారు వివరించారు. వేడుకల్ని ఘనంగా నిర్వహించాలని సీఎం సూచించారు.

ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ల నియామకం

ఈనాడు, అమరావతి: ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు నామినేటెడ్ డైరెక్టర్లుగా 13 మందికి అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నియామకం పొందిన తేదీ నుంచి రెండేళ్లపాటు వారు అధికారంలో ఉంటారని పేర్కొంది. బండారు రవి కాంత్(తెనాలి), అంబటి బాలకృష్ణ(గన్నవరం, తూర్పుగోదావరి జిల్లా), వెంకట నారాయణ(రాప్తాడు), చిన్నరాజు గుడిపూడి(పెదకూరపాడు), జగన్నాధరావు రావుల(చిన్న కొండ), కౌషిక్ వాయుగండ్ల(కర్నూలు), మురళీమోహన్(చంద్రగిరి), వీర ప్రసన్న కుమార్(కాకినాడ రూరల్), విజయానందరెడ్డి(విశాఖపట్నం), విజయరాం(శ్రీకాకుళం), రాజారావు(విశాఖపట్నం తూర్పు), వీరేందర్ కుమార్(కోవూరు), వి.వి.సత్యనారాయణమూర్తి(పాలకొల్లు)లను డైరెక్టర్గా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఈహెచ్ఎస్ సమస్యల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) అమలులో ఎదురవుతున్న సమస్యలను పరిశీలించి, వాటికి పరిష్కార మార్గాలు సూచించడానికి ప్రభుత్వం ఏడుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసింది. ఎనిమిది వారాల్లో సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని పేర్కొంది. అక్టోబరు 18న నిర్వహించిన సమావేశంలో సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సీఎస్ ఈ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. సభ్యులుగా జీఏడీ విభాగంలోని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి/ముఖ్య కార్యదర్శి/కార్యదర్శి. ఆర్థిక శాఖలోని వ్యయ విభాగం-హెచ్ఆర్ కార్యదర్శి. వైద్యారోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి. ఏపీ నాన్ గెజిటెడ్-గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఉంటారు. మెంబర్ కన్వీనర్‌గా ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ సీఈవో ఉంటారని పేర్కొన్నారు.

'పాస్టర్లకు గౌరవ వేతనాలు విడుదల చేయాలి'

ఈనాడు, అమరావతి: పాస్టర్లకు ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలు విడుదల చేయాలని ఏపీ యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ బిషప్ జయప్రకాశ్ కోరారు. ఈ మేరకు ఆయన తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందించారు. త్వరలో వాటి విడుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి వారికి హామీ ఇచ్చారు.

విధుల్లో చేరిన గనులశాఖ అధికారులకు పోస్టింగ్‌లు

ఈనాడు, అమరావతి: దాదాపు 13 నెలలపాటు సెలవులో ఉండి, ఇటీవలే విధుల్లో చేరిన గనులశాఖ అధికారులకు పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వు జారీచేసింది. ఇద్దరు ఉప సంచాలకులు, నలుగురు సహాయ సంచాలకులకు గతంలో వారు పనిచేసిన స్థానాల్లో పోస్టింగ్‌లు ఇచ్చినప్పటికీ, వర్కింగ్ ఎరేంజ్‌మెంట్ కింద ఇతరచోట్ల విధులు అప్పగిస్తూ మెమో జారీ చేసింది. దీంతో మరికొందరికి స్థానచలనం కలిగింది. ఉప సంచాలకుల్లో బి.జగన్నాథరావుకు విశాఖపట్నం పోస్టింగ్ ఇచ్చినా, కాకినాడలో విధులు కేటాయించారు. ఇ.నరసింహారెడ్డికి విశాఖపట్నంలో విధులు అప్పగించారు. కర్నూలు డీడీగా ఉన్న రవిచంద్‌కు.. సంచాలకుడి కార్యాలయంలో మెరిట్‌లో విధులు కేటాయించారు. ఇప్పటి వరకు మెరిట్‌లో డీడీగా ఉన్న జి.వెంకటేశ్వర్లకు కర్నూలు డీడీగా విధులు అప్పగించారు. అన్నమయ్య జిల్లా గనుల శాఖ అధికారి (రాయచోటి) ఆర్.రాజేశ్, పల్నాడు జిల్లా గనులశాఖ అధికారి (నరసరావుపేట) వి.నాగిణిలకు సంచాలకుడి కార్యాలయంలో విధులు కేటాయించారు. సాయిరామ్‌సింగ్‌కు రాయచోటిలో ఏడీగా విధులు అప్పగించారు. ఏడీ రవిప్రసాద్‌కు మార్కాపురం డివిజనల్ గనులశాఖ అధికారిగా విధులు కేటాయించారు.

ఎస్సీలకు రాయితీ రుణాల పథకానికి నిధులు

ఈనాడు, అమరావతి: ఎస్సీలకు రాయితీ రుణాల మంజూరుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకాలకు రాష్ట్ర వాటా నిధుల్ని ప్రభుత్వం విడుదల చేసింది. జాతీయ ఎస్సీ ఆర్థికాభివృద్ధి సంస్థ పథకానికి రూ.23 కోట్లు, జాతీయ సఫాయి కర్మచారీ ఆర్థికాభివృద్ధి సంస్థ (ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ) పథకానికి రూ.13.50 కోట్లు విడుదల చేసింది.

విద్యుత్తు సబ్సిడీ కింద రూ.1,357 కోట్లు: డిస్కంలకు ప్రభుత్వం చెల్లించాల్సిన విద్యుత్తు సబ్సిడీ కింద రూ.1,357.93 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

'డ్రగ్స్ దందాలోని వ్యక్తి చిన్నపిల్లాడా?'

ఈనాడు, అమరావతి: డ్రగ్స్ కేసులో ఈగల్ బృందానికి వైకాపా విద్యార్థి విభాగం నాయకుడు కొండారెడ్డి పట్టుబడితే ఏదో చిన్నపిల్లాడు.. తెలియక చేశాడు అని జగన్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని తెదేపా అధికార ప్రతినిధి విజయశేఖర్‌రెడ్డి ధ్వజమెత్తారు. రూ.వేల కోట్ల డ్రగ్స్ దందాలో ఉన్న కొండారెడ్డిని చిన్నపిల్లాడు అనడం, పరకామణిలో చోరీని చిన్న విషయం అనడం, కల్తీ నెయ్యి వ్యవహారంలో వైవీ సుబ్బారెడ్డి మాజీ పీఏ అప్పన్నకు సంబంధం లేదని జగన్ చెప్పడం చూస్తే ఆశ్చర్యం వేస్తోందని అన్నారు. తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు.

ఖైదీల ఫిర్యాదులు, వినతుల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థ

- జైళ్ల అభివృద్ధి మండలి ఏర్పాటు..
- ఖైదీలు మొబైల్ ఫోన్లు, నిషేధిత వస్తువులు వినియోగిస్తే.. సిబ్బందికీ శిక్ష
- ఖైదీలు, సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం
- బ్రిటిష్ కాలం నాటి చట్టాలకు చెల్లుచీటీ..
- వాటి స్థానంలో కొత్త చట్టానికి ప్రతిపాదన
- ముసాయిదా బిల్లుకు ఆమోదం తెలిపిన మంత్రివర్గం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని జైళ్లల్లో మొబైల్ ఫోన్లు సహా ఇతర నిషేధిత వస్తువులు వినియోగించే ఖైదీలు, వారికి సహకరించే సిబ్బందికి శిక్షలు విధించేలా ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకురానుంది. ఖైదీల ఫిర్యాదులు, వినతుల పరిష్కారం కోసం ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయనుంది. జైళ్ల అభివృద్ధి మండలి నెలకొల్పనుంది. ఖైదీల పట్ల సిబ్బంది వ్యవహార శైలి, వైఖరిలో మార్పులు ప్రతిపాదించింది. ఖైదీలకు వృత్తి విద్య కోర్సులతో పాటు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ ఇవ్వనుంది. వారు జైలు నుంచి విడుదలయ్యాక సత్ప్రవర్తనతో సమాజంలో భాగస్వాములయ్యేలా తీర్చిదిద్దనుంది. ఖైదీలు, సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యమివ్వనుంది. ఈ మేరకు బ్రిటిష్ కాలం నాటి చట్టాలకు చెల్లుచీటి పలికి దాని స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఆంధ్రప్రదేశ్ ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ చట్టం-2025 తీసుకొస్తోంది. హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి జి.విజయ్‌కుమార్, జైళ్ల శాఖ గుంటూరు రేంజి డీఐజీ డా.ఎం.వరప్రసాద్, న్యాయశాఖ అదనపు కార్యదర్శి వి.సునీతతో కూడిన నిపుణుల కమిటీ రూపొందించిన ముసాయిదా బిల్లును రాష్ట్ర మంత్రివర్గం గురువారం ఆమోదించింది. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఈ బిల్లు ప్రవేశపెట్టనున్నారు.

◆ ప్రస్తుతం రాష్ట్రంలోని జైళ్లు, ఖైదీల నిర్వహణంతా బ్రిటిష్ కాలం నాటి చట్టాల ఆధారంగా జరుగుతోంది. వాటి స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కారాగార పరిపాలనను పూర్తిగా ఆధునికీకరించటం, ఖైదీలను సంస్కరించటం లక్ష్యంగా ఈ కొత్త చట్టాన్ని తీసుకొస్తున్నారు. మంత్రివర్గం ఆమోదించిన ముసాయిదా బిల్లులోని ప్రధానాంశాలివి.

కొత్త ప్రతిపాదనలివి..


◆ కారాగారాల పరిపాలనలో పారదర్శకత కోసం విస్తృతంగా సాంకేతికత వినియోగానికి వీలుగా కొత్త నిబంధనలు. ◆ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఖైదీలను న్యాయస్థానాల ఎదుట హాజరుపరిచేందుకు వీలు.

◆ హై సెక్యూరిటీ జైళ్లు, ఓపెన్ జైళ్లు, సెమీ ఓపెన్ జైళ్ల ఏర్పాటు, వాటి నిర్వహణ అంశాలు.

◆ కరడుగట్టిన నేరగాళ్లు, పదేపదే నేరాలకు పాల్పడేవారి నుంచి సమాజ రక్షణకు చర్యలు.

◆ ఖైదీలకు న్యాయ సహాయం, పెరోల్ మంజూరు నిబంధనలు, సత్ప్రవర్తన కలిగిన ఖైదీల ముందస్తు విడుదలకు వీలు. ◆ ఖైదీలకు వృత్తి విద్యా, నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ అందించడం. ◆ మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు వేర్వేరుగా వసతి కల్పన.

మారిన పరిస్థితులకు అనుగుణంగా కొత్త చట్టం



ఎం.వరప్రసాద్, జైళ్ల శాఖ డీఐజీ

ప్రస్తుతం జైళ్ల శాఖ బ్రిటిష్ హయాంలో రూపొందించిన చట్టాలకు లోబడి పనిచేస్తోంది. అనంతర కాలంలో అనేక మార్పులు వచ్చాయి. ప్రధానంగా ఖైదీల సంస్కరణ, పునరావాసం, జైలు నుంచి బయటకొచ్చాక వారిని సమాజంలో భాగస్వాముల్ని చేయటానికి ప్రాధాన్యం పెరిగింది. కారాగారాల భద్రత, నిర్వహణలో బయోమెట్రిక్స్, సీసీటీవీ, స్కానింగ్ పరికరాలు, ఆర్ఎఫ్ఐడీ, వీడియో కాన్ఫరెన్సింగ్, వీడియో కాలింగ్ వంటి ఆధునిక సాంకేతికతలు విస్తృత వినియోగంలోకి వచ్చాయి. పాత చట్టాలు ఈ అవసరాలను తీర్చేలా లేవు. ఈ నేపథ్యంలో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ సిఫార్సు చేసిన 'మోడల్ ప్రిజన్స్ అండ్ కరక్షనల్ సర్వీసెస్ యాక్ట్-2023'ను పరిశీలించి.. రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా మార్పులతో కొత్త బిల్లుకు ప్రతిపాదనలు రూపొందించాం.

–ఎం.వరప్రసాద్, జైళ్ల శాఖ డీఐజీ, నూతన చట్టం రూపకల్పన కమిటీ సభ్యుడు

దస్త్రాల పరిష్కారానికి.. కలెక్టర్లకు సగటు సమయం 2 రోజులు

- నలుగురు కలెక్టర్లు ఒక రోజులోపే.
- మరో నలుగురు 8 నుంచి 11 రోజుల పైనే

ఈనాడు, అమరావతి: దస్త్రాల పరిష్కారానికి రాష్ట్రంలోని సగం జిల్లాల కలెక్టర్లు రెండు రోజుల్లోపే తీసుకుంటున్నారు. మిగిలిన సగం మందికి 2-11 రోజుల్లో పరిష్కరిస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబరు 9 నుంచి డిసెంబరు 9 వరకు కలెక్టర్లు పరిష్కరించిన దస్త్రాలు, ఒక్కో దస్త్రానికి తీసుకున్న సగటు సమయాల్ని ప్రభుత్వం తయారుచేసింది. నలుగురే ఒక రోజులోపు దస్త్రాల్ని పరిష్కరించారు. మరో నలుగురు 8-11 రోజులకు పైగా తీసుకున్నారు. అధిక దస్త్రాలున్నచోట త్వరితగతిన పరిష్కారం అవుతుండగా.. తక్కువగా ఉన్నచోటే ఎక్కువ సమయం తీసుకుంటున్నట్లు ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

15.07.2024 నుంచి 9.12.2025 వరకు ముఖ్యమంత్రి, మంత్రులు పరిష్కరించిన దస్త్రాలు, ఒక్కో దస్త్రానికి తీసుకున్న సగటు సమయం వివరాలు

జిల్లా	కలెక్టర్	పరిష్కరించిన దస్త్రాలు	సగటు సమయం
కృష్ణా	డీకే బాలాజీ	1,469	14.42 గంటలు
ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు	హిమాంశు శుక్లా	626	17.05 గంటలు
విజయనగరం	రామసుందర్‌రెడ్డి	791	18.13 గంటలు
నంద్యాల	జి.రాజకుమారి	1,169	22.14 గంటలు
పల్నాడు	కృతిక శుక్లా	73	1 రోజు 3.39 గంటలు
చిత్తూరు	సుమిత్ కుమార్	1,421	1 రోజు 6.37 గంటలు
బాపట్ల	వి.వినోద్‌కుమార్	664	1 రోజు 9.24 గంటలు
గుంటూరు	తమీమ్ అన్సారియా	770	1 రోజు 11.45 గంటలు
కర్నూలు	అట్టాడ సిరి	714	1 రోజు 14.07 గంటలు
ఏలూరు	కె.వెట్రి సెల్వి	1,029	1 రోజు 14.18 గంటలు
శ్రీసత్యసాయి	ఎ.శ్యామ్‌ప్రసాద్	536	1 రోజు 14.34 గంటలు
తిరుపతి	ఎస్.వెంకటేశ్వర్	740	1 రోజు 20.16 గంటలు
తూర్పుగోదావరి	కీర్తి చేకూరి	680	1 రోజు 21.12 గంటలు
పశ్చిమగోదావరి	సి.నాగరాణి	409	2 రోజుల 3.03 గంటలు
శ్రీకాకుళం	స్వప్నిల్ దినకర్	703	2 రోజుల 7.19 గంటలు
వైఎస్సార్ కడప	సీహెచ్ శ్రీధర్	466	2 రోజుల 7.54 గంటలు
అన్నమయ్య	నిషాంత్ కుమార్	482	2 రోజుల 9.11 గంటలు
విశాఖపట్నం	హరేంధిర ప్రసాద్	329	2 రోజుల 16.44 గంటలు
అనకాపల్లి	కె.విజయ	549	3 రోజుల 14.15 గంటలు
అల్లూరి సీతారామరాజు	దినేశ్‌కుమార్	145	3 రోజుల 17.40 గంటలు
అంబేడ్కర్ కోనసీమ	ఆర్.మహేశ్‌కుమార్	178	4 రోజుల 13.18 గంటలు
అనంతపురం	ఆనంద్	862	5 రోజుల 22.60 గంటలు
ఎన్టీఆర్	జి.లక్ష్మీశ	581	8 రోజుల 5.04 గంటలు
ప్రకాశం	పి.రాజబాబు	356	9 రోజుల 8.32 గంటలు
పార్వతీపురంమన్యం	ఎన్.ప్రభాకర్‌రెడ్డి	113	9 రోజుల 22.10 గంటలు
కాకినాడ	సగిలి షణ్మోహన్	42	11 రోజుల 16.44 గంటలు

లోకేశ్ కలిసిన అమెరికా కంపెనీల గేట్ పాసులూ వైకాపాకు ఇవ్వరు

గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు ఎద్దేవా

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు 75 ఏళ్ల వయసులోనూ సమీక్షలు నిర్వహిస్తూ.. రాష్ట్రాభివృద్ధి, పెట్టుబడుల సాధనే లక్ష్యంగా పనిచేస్తుంటే.. వైకాపా నాయకులు ఆయన కృషిని ప్రశంసించాల్సింది పోయి విమర్శిస్తున్నారని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు ధ్వజమెత్తారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైకాపా ప్రభుత్వం రాష్ట్రాన్ని రావణ కాష్టంలా మారిస్తే.. గాడిన పెట్టడానికి చంద్రబాబు కృషిచేస్తున్నారని పేర్కొన్నారు. అమెరికా పర్యటనలో మంత్రి లోకేశ్ మూడు రోజుల్లో 18 ప్రపంచ దిగ్గజ కంపెనీల సీఈవోలు, ప్రతినిధులతో సమావేశమై రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు ప్రయత్నిస్తుంటే.. జీర్ణించుకోలేక వైకాపా నాయకులు విమర్శిస్తున్నారని అన్నారు. లోకేశ్ కలిసిన అమెరికా కంపెనీల గేట్ పాసులు కూడా తెచ్చుకునే పరపతి వైకాపా నాయకులకు లేదని ఎద్దేవా చేశారు. గుడివాడ ప్రజలు ఓడించారనే కక్షతో కొడాలి నాని ఏడాదిపాటు ఆ నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడలేదని, ప్రజాతీర్పును గౌరవించకుండా దాక్కున్నారని ఎమ్మెల్యే వెంకటరావు ఎద్దేవా చేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్పించేందుకే బోరుగడ్డను బయటకు తెచ్చారు

- తెదేపా అధికార ప్రతినిధి మహాసేన రాజేశ్ ధ్వజం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలనే ఆలోచనతోనే బోరుగడ్డ అనిల్ లాంటి వారిని మాజీ ముఖ్యమంత్రి జగన్ జైలు నుంచి బయటకు తెచ్చారనే అనుమానాలు వస్తున్నాయని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి మహాసేన రాజేశ్ ధ్వజమెత్తారు. జగన్ న్యాయబృందమే తనకోసం పనిచేసిందని అనిల్ గొప్పగా చెప్పడమే దీనికి నిదర్శనమన్నారు. '2019 నుంచి 2024 వరకు గూండాలు, కొందరు పోలీసులు ఏకమై జగన్ కోసం పనిచేశామని నేరస్థులే బహిరంగంగా చెబుతున్నారు. ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ సీతారామాంజనేయులును కూడా బెయిల్‌పై బయటకు తీసుకొచ్చారు. పోలీసుల్ని కూడా ఆయన ఎలా ఉపయోగించుకుంటారో చెప్పేందుకు ఇవే నిదర్శనం' అని విమర్శించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 'రాజధాని అమరావతిని ఎలా తీర్చిదిద్దాలి? పోలవరం ఎలా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆలోచిస్తున్నారు. లోకేశ్ అమెరికాలో దిగ్గజ పారిశ్రామికవేత్తల్ని కలుస్తూ పెట్టుబడులు తెస్తున్నారు. జగన్ మాత్రం గూండాలను రాష్ట్రంపైకి వదులుతున్నారు. అనిల్ గతంలో మాట్లాడిన మాటల్ని జగన్ తన కుటుంబ సభ్యులకు వినిపించగలరా? రాష్ట్రానికి ఏం మేలు చేశాడని జగన్ తన న్యాయబృందంతో అనిల్‌ను బయటకు తెచ్చారు? ఎవర్ని చంపాలని?' అని నిలదీశారు.

రూ.7,387 కోట్ల నాబార్డు రుణం తీసుకునేందుకు సీఆర్‌డీఏకు అనుమతి

ఈనాడు, అమరావతి: అమరావతి అభివృద్ధి కోసం నాబార్డు నుంచి రూ.7,387.70 కోట్ల రుణం తీసుకునేందుకు సీఆర్‌డీఏకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రుణ ఒప్పందాలు, ఇతరత్రా చర్యలు తీసుకోవాలని సీఆర్‌డీఏ కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

ఏటీఎస్‌లకు చెల్లింపులపై తేలని పంచాయితీ

ఈనాడు, అమరావతి: వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు చేస్తున్న ఆటోమెటిక్ టెస్టింగ్ స్టేషన్ల (ఏటీఎస్) నిర్వాహకులకు ఆ ఫీజులు దక్కేలా ఆదేశాలిచ్చే దస్త్రం ఊగిసలాడుతోంది. ఏడాది క్రితం ఏటీఎస్‌లు ఏర్పాటు కాగా ఇప్పటి వరకు వాటికి చెల్లింపులు చేయకపోవడంతో నిర్వాహకులు ఆర్థికశాఖ, రవాణాశాఖ చుట్టూ తిరుగుతున్నారు. ఇటీవల ఆర్థికశాఖ ఈ దస్త్రానికి క్లియరెన్స్ ఇచ్చినా సరే, రవాణాశాఖ ఇంకా నిర్ణయం తీసుకోకుండా పెండింగ్‌లో పెట్టింది. వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు కేవలం ఆటోమెటెడ్‌గా జరగాలని ఏటీఎస్‌లను తీసుకొచ్చారు. జిల్లాలకు ఒకటి చొప్పున రాష్ట్రంలోని ఇప్పటి వరకు 18 జిల్లాల్లో ఏటీఎస్‌లు ఏర్పాటు చేశారు. ఫిట్‌నెస్ పరీక్ష కోసం వాహనదారులు చెల్లించే ఫీజు.. తొలి రెండేళ్లు ఏటీఎస్‌ల నిర్వాహకులకు నేరుగా దక్కేలా ఒప్పందం ఉంది. అయితే ప్రస్తుతం ఆ ఫీజు ప్రభుత్వ ఖజానాలో జమవుతోంది. ఆ ఫీజులు తమ ఖాతాల్లో జమయ్యేలా చూడాలని ఏటీఎస్‌ల నిర్వాహకులు కోరుతున్నారు. ఇప్పటి వరకు నిర్వహించిన ఫిట్‌నెస్ పరీక్షలకు చెందిన ఫీజుల బకాయిలు దాదాపు రూ.20 కోట్లు కూడా చెల్లించాలని అడుగుతున్నారు. ఉత్తర్వు జారీ చేయడంలో జాప్యమవుతోందంటూ ఏటీఎస్‌ల నిర్వాహకులు నేరుగా సీఎం కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని భావిస్తున్నారు.

ఆ ఆరు జిల్లాల్లోనూ మాన్యువల్ వద్దు..

విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, పశ్చిమగోదావరి, ఏలూరు, తిరుపతి, బాపట్ల జిల్లాల్లో ఇంకా ఏటీఎస్‌లు ఏర్పాటు కాలేదు. ఈ ఆరు జిల్లాలో మాన్యువల్‌గా ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించొద్దని, ఆ జిల్లాల్లోని వాహనాలను పొరుగు జిల్లాల్లోని ఏటీఎస్‌లకు పంపేలా చర్యలు తీసుకోవాలని ఇటీవల కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ (మోర్త్) ఆదేశాలు జారీ చేసింది. అలా చేయడంవల్ల కొన్ని జిల్లాల వాహనాలు ఫిట్‌నెస్ పరీక్షలకు చాలాదూరం వెళ్లాల్సి ఉంటుందని, దీనికి మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర రవాణాశాఖ కేంద్రాన్ని కోరనుంది. 3 నెలల్లో పూర్తిగా ఏటీఎస్‌లు అందుబాటులోకి తెస్తామని విజ్ఞప్తి చేయనుంది.

పరిశ్రమలకు భూముల కేటాయింపులు ఇలా...

ఈనాడు, అమరావతి: రాష్ట్ర మంత్రిమండలి గురువారం రూ.16,060 కోట్ల విలువైన 30 కొత్త ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. క్యాబినెట్ నిర్ణయాలను మంత్రి కొలుసు పార్థసారథి విలేకర్లకు వెల్లడించారు.

◆ నెల్లూరు జిల్లాలో మల్టీ మోడల్ రైల్ కార్గో టెర్మినల్ స్థాపనకు చేవూరులో 153.77 ఎకరాలు రామాయపట్నం కార్గో రిసెప్షన్ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయింపు

◆ నెల్లూరు జిల్లా బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో 29.58 ఎకరాల భూమి సాగర్ డిఫెన్స్ ఇంజినీరింగ్ లిమిటెడ్‌కు కేటాయింపు

◆ వైఎస్సార్ కడప జిల్లాలో మూడు చోట్ల మొత్తం 45 ఎకరాల భూమిని లీజు ప్రాతిపదికన 27 మెగావాట్ల పవన విద్యుత్తు ప్రాజెక్టు ఏర్పాటుకు హైదరాబాద్‌కు చెందిన ఎన్ఆర్ఈడీసీఏపీ, హెటిరో విండ్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు బదిలీ చేసే ప్రతిపాదనకు ఆమోదం.

◆ విశాఖపట్నం పరదేశిపాలెంలో 0.24 ఎకరాల ప్రభుత్వ భూమి, 0.50 ఎకరాల హౌసింగ్ బోర్డు భూమిని మొత్తం 0.74 ఎకరాలు ఆమోద పబ్లికేషన్స్‌కు కేటాయించే ప్రతిపాదనకు ఆమోదం. అదే గ్రామంలో మరోచోట ఉన్న 0.64 ఎకరాల భూమి హౌసింగ్ బోర్డుకు మార్చే ప్రతిపాదనకు ఆమోదం.

◆ ఏలూరు అర్బన్ మండలం శనివారపుపేటలో 36.41 ఎకరాల ప్రభుత్వ భూమిని మధ్యతరగతి ఇళ్ల నిర్మాణం కోసం పట్టణ పరిపాలనశాఖకు ఎకరా రూ.కోటి చొప్పున బదిలీ చేసేందుకు ఆమోదం.

◆ అనంతపురం జిల్లా కనేకల్, బొమ్మన్‌హల్లి గ్రామాల్లో 152 మెగావాట్ల పవన, 300 మెగావాట్ల విండ్ సోలార్ హైబ్రిడ్ పవర్ ప్రాజెక్టు కోసం గనేకో త్రి ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయింపు

◆ శ్రీ సత్యసాయి జిల్లాలో ఎనర్జీ స్టోరేజ్ ప్రాజెక్టు కోసం చింతా గ్రీన్ ఎనర్జీ ప్రతిపాదనకు ఆమోదం. ఇక్కడ రెవెన్యూ భూములు లీజు ప్రాతిపదికన 30 ఏళ్ల కాలానికి ఎకరానికి రూ.31 వేల చొప్పున రెండేళ్లకు 5% పెంపుతో ఇచ్చేందుకు అనుమతి.

◆ చిత్తూరు జిల్లా కుప్పం మండలంలో కృష్ణదాసపల్లిలో శ్రేష్ఠ రెన్యువబుల్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కంప్రెస్ట్ బయోగ్యాస్ కేటాయింపులకు, ఆ సంస్థకు ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు ఆమోదం.

◆ బలిమెల డ్యామ్ టో పవర్‌హౌస్, జాలాపుట్టి డ్యామ్ టో పవర్ హౌస్‌లను ఒడిస్సా పవర్ కన్సార్షియం లిమిటెడ్‌కు కేటాయించేందుకు ఆమోదం.



18% వరకు తేమ ఉన్నా పత్తి కొనేలా సీసీఐని ఆదేశించండి

- లోక్‌సభలో కేంద్రానికి ఎంపీ లావు విజ్ఞప్తి

ఈనాడు, దిల్లీ: పత్తి కొనుగోళ్ల విషయంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) విధించిన కఠిన నిబంధనల కారణంగా రైతులు విధిలేని పరిస్థితుల్లో తమ పంటను తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోందని, అందువల్ల 18% తేమ ఉన్నా కొనుగోలు చేసేలా నిబంధనల నుంచి మినహాయింపు ఇవ్వాలని తెలుగుదేశం పార్లమెంటు పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఆయన గురువారం లోక్‌సభ జీరో అవర్‌లో దీనిపై మాట్లాడారు. "పత్తి కొనుగోలు చేయాలంటే అందులో తేమశాతం 8-12%కి మించకూడదన్న నిబంధన రైతులకు గుదిబండగా మారింది. రాష్ట్రంలో వాతావరణ పరిస్థితుల కారణంగా తీరప్రాంతంలో తేమశాతం దీనికంటే ఎక్కువగా ఉంటుంది. రైతులకు ఎల్1/ఎల్2/ఎల్3 జిన్నింగ్ మిల్లులు కేటాయించడం వల్ల వాళ్లు తమ సమీపంలో ఉన్న మిల్లులను ఎంచుకొనే వీల్లేకుండా పోతోంది. దానివల్ల వారు తక్కువ ధరలకే దళారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. అందువల్ల ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సీసీఐ నిబంధనలను సడలించాలి. అదే సమయంలో అన్ని జిన్నింగ్ మిల్లులను తెరిచి 18% వరకు తేమ ఉన్న పత్తిని కొనుగోలుచేసి ఆ నిష్పత్తి ప్రకారం కనీస మద్దతు ధర చెల్లించేలా నిర్దేశించాలి. వర్షం నీరు తాకిన, రంగుమారిన పత్తిని ప్రత్యేక కేటగిరీ కింద తగిన ధరకు కొనుగోలు చేయాలి. రాష్ట్ర రైతులు ఇప్పటికే పలు వైపరీత్యాలతో ఇబ్బందులు పడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో నిబంధనలతో వారి కష్టాలను రెట్టింపు చేయడం భావ్యం కాదు. వ్యవసాయదారుల జీవనోపాధిని రక్షించి, రాష్ట్రంలో పత్తిసాగును కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని రైతులను ఆదుకోవాలి. దేశంలో అత్యధికంగా పత్తి సాగుచేసే తొలి ఐదు రాష్ట్రాల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ యేటా 20 లక్షల బేళ్లు అందిస్తోంది. 2025-26 ఖరీఫ్ సీజన్‌లో 5.39 లక్షల హెక్టార్లలో పంట సాగైంది. సుమారు 8 లక్షల టన్నుల దిగుబడి వచ్చింది. అయితే మొంథా తీవ్రతుపాను కారణంగా 1.08 లక్షల హెక్టార్లలో పంట దెబ్బతింది. సుమారు 1.25 లక్షల టన్నుల పత్తి రంగుమారింది. తీరప్రాంతంలోని ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని రైతులు తీవ్ర ప్రభావానికి గురయ్యారు" అని లావు పేర్కొన్నారు.

ఏపీలో ఈ-చలాన్ల బకాయిలు రూ.126 కోట్లు

- దేశవ్యాప్తంగా రూ.9 వేల కోట్లు

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై 2024లో 44,24,135 ఈ-చలానాలు జారీ అయినట్లు కేంద్ర రహదారి, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. వీటి ద్వారా రూ.102.13 కోట్ల మొత్తం వసూలైందని, ఇంకా రూ.126.51 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఆయన గురువారం లోక్‌సభలో వైకాపా ఎంపీ గుమ్మ తనూజారాణి అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. దేశవ్యాప్తంగా 8.18 కోట్ల చలానాలు జారీ కాగా రూ.3,834 కోట్లు వసూలయ్యాయని, ఇంకా రూ.9,097 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. అత్యధికంగా ఉత్తర్‌ప్రదేశ్‌లో 1.53 కోట్ల చలానాలు జారీ చేయగా రూ.2,386 కోట్లు వసూలు కావాల్సి ఉందని పేర్కొన్నారు. దిల్లీలో 78.19 లక్షల చలానాలు జారీకాగా రూ.2,247 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు.

అనంతపురం, విశాఖలలో లాజిస్టిక్స్ పార్కుల ప్రతిపాదన

ఏపీలోని అనంతపురం, విశాఖలలో మల్టీమోడల్ లాజిస్టిక్స్ పార్కుల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చినట్లు గడ్కరీ తెలిపారు. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. దీని కోసం అనంతపురం ఏపీఐఐసీ ద్వారా 204.92 ఎకరాల భూమి అందుబాటులో ఉందని చెప్పారు. డీపీఆర్‌కూడా పూర్తయిందని, ప్రస్తుతం మదింపు దశలో ఉందని వివరించారు. విశాఖపట్నంలోనూ తగిన భూమి అందుబాటులో ఉందని చెప్పారు. ఫీజబిలిటీ రిపోర్ట్/డీపీఆర్ కోసం కన్సల్టెంట్‌ను నియమించినట్లు వివరించారు.

ఎంఎస్ఎంఈ యూనిట్లకు రూ.21 వేల కోట్ల క్రెడిట్ గ్యారెంటీ

గత ఆరేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లోని 6.91 లక్షల ఎంఎస్ఎంఈ యూనిట్లకు రూ.21,702 కోట్ల క్రెడిట్ గ్యారెంటీ ఇచ్చినట్లు కేంద్ర ఎంఎస్ఎంఈ సహాయ మంత్రి శోభాకరంద్లాజే తెలిపారు. లోక్‌సభలో తెదేపా ఎంపీ బస్తిపాటి నాగరాజు, బీకే పార్థసారథి అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానం ఇచ్చారు.

◆ ఆంధ్రప్రదేశ్‌లో రోజువారీగా తలసరి 55 లీటర్ల నీరు అందని నివాస ప్రాంతాలు 19,115 ఉన్నట్లు జలశక్తిశాఖ సహాయమంత్రి వి.సోమన్న తెలిపారు. లోక్‌సభలో వైకాపా సభ్యులు మిథున్‌రెడ్డి, అవినాష్‌రెడ్డిలు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు.

రూ.5,739 కోట్ల పనులు పూర్తి

ఆంధ్రప్రదేశ్‌లో స్మార్ట్‌సిటీ పథకం కింద ఎంపికయిన 4 నగరాల్లో రూ.5,739 కోట్ల విలువైన 249 ప్రాజెక్టులు పూర్తయినట్లు కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ సహాయమంత్రి టోకన్‌సాహు తెలిపారు. ఇంకా రూ.850 కోట్ల విలువైన 31 ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని చెప్పారు.

స్మార్ట్‌సిటీ పనుల స్వరూపం ఇదీ

నగరం	మొత్తం		పూర్తయింది		జరుగుతున్నవి	
	ప్రాజెక్టులు	రూ.కోట్లలో	ప్రాజెక్టులు	రూ.కోట్లలో	ప్రాజెక్టులు	రూ.కోట్లలో
అమరావతి	19	903	14	746	5	157
కాకినాడ	92	1,908	80	1,731	12	177
తిరుపతి	104	2,083	92	1,649	12	433
విశాఖపట్నం	65	1,695	63	1,613	2	82

చిన్న పురపాలికలకు రూ.5 కోట్ల చొప్పున రుణం

ప్రయోగాత్మకంగా పది పట్టణాల ఎంపిక

ఈనాడు, అమరావతి: లక్ష కంటే తక్కువ జనాభా కలిగిన పురపాలక సంఘాలకు ఆర్థిక సంస్థల నుంచి ప్రభుత్వం రూ.5 కోట్ల చొప్పున రుణం అందించనుంది. క్రెడిట్ ఎన్‌హాన్స్‌మెంట్ స్కీం (సీఈఎస్) కింద పది పురపాలక సంఘాలను ప్రయోగాత్మకంగా ఎంపిక చేసింది. బ్యాంకులు అందించిన రుణాన్ని ఆయా పట్టణాల్లోని ఖాళీ స్థలాల్లో షాపింగ్ కాంప్లెక్స్‌లు, మార్కెట్‌లు, ఇతర వాణిజ్య సంబంధిత కార్యకలాపాల కోసం వినియోగించుకోవాలి. చిన్న పురపాలక సంఘాల ఆర్థిక పరిపుష్టికి దోహదం చేసేలా ఈ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించాయి. చిన్న పురపాలక సంఘాలకు ఆస్తి పన్ను, పన్నేతర ఆదాయం తక్కువగా ఉన్నందున వాటి నిర్వహణ కష్టమవుతోంది. నిధుల కొరతతో అభివృద్ధి పనులు చేపట్టలేకపోతున్నారు. ఇలాంటి పురపాలక సంఘాల కోసం 25 ఏళ్ల క్రితం నాటి కేంద్ర ప్రభుత్వం సమగ్ర చిన్న, మధ్య తరహా పట్టణాల అభివృద్ధి (ఐడీఎస్ఎంటీ) పేరుతో ప్రత్యేక కార్యక్రమం అమలుచేసింది. ఇదే తరహాలో తాజాగా సీఈఎస్‌ను ప్రవేశపెట్టారు. హడ్కో గ్యారంటీతో వివిధ జాతీయ బ్యాంకుల నుంచి మున్సిపాలిటీలకు రుణాలు అందించనున్నారు. ఈ ప్రతిపాదనలకు నెలాఖరులోగా కేంద్రం ఆమోదం లభిస్తుందని అధికారులు ఆశిస్తున్నారు.

మళ్లీ వైకాపా గూటికి ఐదుగురు నెల్లూరు కార్పొరేటర్లు

ఈనాడు, అమరావతి: నెల్లూరు నగరపాలక సంస్థ కార్పొరేటర్లు ఐదుగురు గురువారం తిరిగి వైకాపా గూటికి చేరారు. వైకాపా నుంచే గెలిచిన వీరు గతంలో తెదేపాలో చేరారు. తాజాగా వారు గురువారం వైకాపా అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి వైకాపాలోకి ఆహ్వానించారు. ఈ కార్పొరేటర్లలో మద్దినేని మస్తానమ్మ, ఓబుల రవిచంద్ర, కాయల సాహితి, వేనాటి శ్రీకాంత్ రెడ్డి, షేక్ ఫమిదా ఉన్నట్లు జగన్ కార్యాలయం ప్రకటించింది. ఈ కార్పొరేటర్లను వైకాపా ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి, మాజీ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ తాడేపల్లికి తీసుకువచ్చారు.

(c) eenadu